www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 23-2-2018 | పేజీలు: 20 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 224 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.44 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక మ. 12.43 తదుపరి రోహిణి; వర్జ్యం: రా. 3.53-5.24; దుర్ముహూర్తం: ఉ. 9.01-9.47 వరకు మ. 12.52-1.39; అమృతఘడియలు: ఉ. 10.24-11.56; రాహుకాలం: మ. 10.30-12.00; సూర్యోదయం: 6.42, సూర్యాస్తమయం: 6.17 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

తిష్ఠ వేసిన భ్రష్టాచారం

ఎక్కడి అవినీతి అక్కడే!.. నీతిమంతమైన దేశాల్లో భారత్‌కు 81వ ర్యాంకు

2016 కన్నా దిగజారిన స్థానం.. రెండేళ్లుగా నలభై మార్కుల్లోనే

ఫలించని అవినీతి వ్యతిరేక పోరాటం.. మెరుగైన స్థితిలో భూటాన్, చైనా

ఇక్కడ ఎదురొడ్డి పోరాడితే ప్రమాదం.. మాల్దీవులు, ఫిలిప్పీన్స్‌కు తీసిపోం

14

పెద్ద నోట్ల రద్దు.. జీఎస్టీ అమలు.. నేతల అవినీతిపై ఉక్కుపాదం మోపే చట్టాలు... అవినీతి అధికారులపై ఊపిరి సలపని దాడులు... ప్రభుత్వాలు విప్లవాత్మకంగా భావిస్తున్న ఈ చర్యలేవీ అవినీతి సమస్యను తీర్చలేకపోయాయి. దేశంలో అవినీతి తిష్ఠ వేసిందని, గత రెండేళ్లలో ఎలాంటి కదలికా లేదని టీఐ సర్వేలో తేలింది.

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ర్యాంకుల వెల్లడి

భారత్ ర్యాంకింగ్

	మార్కులు	ర్యాంకు
2017	40	81
2016	40	79
2015	38	76
2014	38	85
2013	36	94
2012	36	94



రైతు సమన్వయ సమితులపై గురువారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్; చిత్రంలో మంత్రులు, నేతలు

గిట్టుబాటే లక్ష్యం

కార్పొరేషన్‌గా తెలంగాణ రైతు సమన్వయ సమితి ఏర్పాటు

విధివిధానాలు విడుదల.. నేడు రిజిస్ట్రేషన్

ఒక చైర్మన్, 14 మంది డైరెక్టర్లు

అందులో 10 మంది రైతులు

రూ.150 కోట్ల మూలధనం

5 వేల ఎకరాలకో రైతు వేదిక

మండల సమితులదే నిర్వహణ

మండల సమితుల్లో 51 శాతం బీసీలు, మహిళలకు: కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకుగాను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేసింది. రైతుకు గిట్టుబాటు ధర అందించడమే లక్ష్యంగా పని చేయనున్న ఈ సమితిని శుక్రవారం కంపెనీల చట్టం కింద కార్పొరేషన్‌గా రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఈ కార్పొరేషన్ లాభాపేక్ష లేని సంస్థలా పనిచేస్తుందని సీఎం కేసీఆర్

మిగతా 8వ పేజీలో...

కొత్త పథకాల్లేవ్!

అమల్లో ఉన్న వాటికే బడ్జెట్‌లో ప్రాధాన్యం

పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి

మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సీఎం ఆదేశం

బడ్జెట్ సమావేశాల తర్వాత నేతలు ప్రజల్లోకి

అభివృద్ధి పథకాలను ప్రచారం చేయాలి

ప్రభుత్వ వేదికలు వాడుకోవాలని సీఎం ఆదేశం

8



స్తుతి విశేషం



స్తవ్యస్తవ ప్రియ స్తోత్రం స్తుతస్తోతారణ ప్రియః..

విష్ణు సహస్ర నామ 'స్తోత్రం'లో ఉన్న ఈ శ్లోక భాగం ఎంతో విశేషమైంది. మనం సామాన్యంగా స్తుతి, స్తోత్రం, స్తవం అనే పదాలతో ఉన్న స్తోత్ర సాహిత్యాన్ని చూస్తున్నాం. చదువుతున్నాం. కానీ వీటన్నిటికీ అర్థాలు వివిధ రీతులుగా ఉన్నాయి. వీటిల్లో 'స్తవం' అనేది భగవంతుని వర్ణించినప్పుడే సార్థకం అవుతుంది. ఎందుకంటే అది భగవత్ గుణవర్ణనం కాబట్టి. సమగ్ర గుణ సంపన్నుల విషయంలోనే 'స్తవం' యోగ్యమైంది. దీనికి భగవంతుని మించిన వారెవరు? అందుకే ఆయన్ను స్తుతః అన్నారు. మనుష్య లోకంలో మహర్షులు మొదలైనవారు స్తుతించటానికి తగిన శక్తి గల వారే అయినా భగవత్ వైభవాన్ని సంపూర్ణంగా స్తుతించేవారని మాత్రం భావించరాదు. యామునాచార్యుల వారు తమ స్తోత్రరత్నంలో చెప్పిన విధంగా.. నదిలో లేదా సముద్రంలో మునగడానికి అణువు, పర్వతం రెండూ సమానమే (కోమజ్జతోరణుకులాచల యోర్విశేషః) కాబట్టి దైవస్తుతి చేయడానికి మనం ఎంతో మునులు కూడా అంతే అని భావం. భగవంతుడు కూడా తనను స్తుతించే వారిని 'మీరెంతో గొప్పవారు' అని స్తుతిస్తాడట. దీనికి ఒక ఉదాహరణ.. ఒకసారి కైలాసానికి వెళ్లిన శ్రీకృష్ణుడిని ప్రస్తుతిస్తూ శివుడు ఎదురుగా వచ్చి నమస్కరించాడు. దీని ఫలం.. ఉభయులూ పరస్పరం వరాలను ఇచ్చుకుంటారు. ఇక్కడ కృష్ణుడు శివుని స్తుతించడం వల్ల 'స్తోతా' అని వ్యవహరిస్తారు. అందుకే స్తుతి, స్తోత్రం శబ్దాలను కూడా దైవేతరుల గూర్చి ప్రయోగించడం తగదు. వీటిని సులభ శబ్దాలుగా భావించరాదు.

Paramjyothi పరంజ్యోతి

- శ్రీ రంగాచార్య

'బాలశ్రీ' పోటీలకు శుభాన్విత



హైదరాబాద్, ఫిబ్రవరి 22: నగరానికి చెందిన శుభాన్విత జాతీయస్థాయిలో జరిగే 'బాలశ్రీ' పోటీలకు ఎంపికయ్యారు. ఏప్రిల్ 21 నుంచి 24 వరకు న్యూఢిల్లీలో జరిగే ఈ పోటీల్లో 'సృజనాత్మక నృత్యం' విభాగంలో ఆమె పాల్గొననున్నారు. శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న శుభాన్విత గతంలో 'బాలరత్న' అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా 300 ప్రదర్శనలు ఇచ్చి, ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 2015లో రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. దూరదర్శన్ నిర్వహించిన 'అందెల రవళి' పోటీల్లో భరతనాట్యం, కూచిపూడి విభాగాల్లో మొదటి బహుమతి పొందారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించారు. 2014లో సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ (సీసీఆర్‌టీ) స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఉత్తర సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు గీతా గణేశన్ వద్ద శుభాన్విత నృత్యంలో శిక్షణ పొందుతున్నారు.

గోవర్ధన గిరిధారిగా నారసింహుడు



గోవర్ధన గిరిధారిగా యాదాద్రి నారసింహుడు



శ్రీకృష్ణుడి అలంకారణలో ఉన్న నారసింహుడిని ఊరేగిస్తున్న అర్చకులు


ప్రకృతి బీభత్సము నుంచి ప్రజలను కాపాడే గోవర్ధనగిరిధారి రూపంలో యాదాద్రి నారాసింహుడిని చూసి భక్తజనం పులకించి పోయారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాదాద్రి క్షేత్రంలో స్వామివారిని గురువారం గోవర్ధనగిరిదారిగా అలంకరించారు. రుత్వికుల చతుర్వేద పారాయణాలు, మూలమంత్ర జపాలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య నారసింహుడిని బాలాలయ మండపంలో ఊరేగించారు. సాయంత్రం దివ్యవాహన సేవలో భాగంగా సింహ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

-ఆంధ్రజ్యోతి, యాదాద్రి

రేపటి నుంచే టీఆర్టీ

అన్ని ఏర్పాట్లు పూర్తి.. ఈ నెల 24నుంచి మార్చి 4వరకు రాత పరీక్షలు

- **కొన్నింటికి ఆన్‌లైన్‌లో.. మరికొన్నింటికి ఆఫ్‌లైన్‌లో..**
- **అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో 'మాక్ టెస్టు' సదుపాయం**
- **8792 పోస్టులు... 2,48,216 మంది అభ్యర్థులు**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ)కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి మార్చి 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 8792 పోస్టులకుగానూ 48 సబ్జెక్టుల్లో రాత పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఏ రోజు ఏ పరీక్ష, పరీక్ష విధానం(ఆన్‌లైన్, ఆఫ్‌లైన్), సెంటర్ల కేటాయింపు వివరాలను కమిషన్ సెక్రటరీ ఎ.వాణీప్రసాద్ గురువారం వెల్లడించారు. ఓఎమ్మార్ (ఆఫ్‌లైన్) విధానంలో రాత పరీక్ష నిర్వహించే ఎస్జీటీ పోస్టుల కోసం హెచ్‌ఎండీఏ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా.. ఇదే విధానంలో రాత పరీక్ష నిర్వహించే స్కూల్ అసిస్టెంట్ తెలుగు మీడియం బయాలజికల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ పోస్టుల కోసం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హెచ్‌ఎండీఏ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఈనెల 24న సీబీఆర్టీ (ఆన్‌లైన్) విధానంలో ప్రారంభమయ్యే ఎస్జీటీ తెలుగు మీడియం పరీక్షకు సంబంధించి మాక్ టెస్టును కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, వాటిల్లో తప్పులు ఉన్నట్లు భావిస్తే హెల్ప్‌డెస్క్‌కు ఫోన్ చేసి.. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. కాగా, టీఆర్టీకి 2,48,216 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు 21,724 మంది, పీడీ పోస్టులకు 1494 మంది, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 1,27,230, ఎస్జీటీ పోస్టులకు 83,656 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు 14,112 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అభ్యర్థులకు సూచనలు

- అభ్యర్థులు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పరీక్షా కేంద్రంలో ఉండాలి. పరీక్షా సమయం 150 నిమిషాలు ఉంటుంది.
- హాల్‌టికెట్‌తోపాటు ఏదైన ఫొటో గుర్తింపు కార్డును విధిగా తమ వెంట తెచ్చుకోవాలి. పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదైనా ఒకటి కలిగి ఉండాలి. లేదంటే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- పరీక్షా కేంద్రంలోపల భద్రత నిమిత్తం అభ్యర్థి ఫొటో, ఎడమ చేతి బొటన వేలి ముద్రను తీసుకుంటారు.
- హాల్‌టికెట్‌లో అభ్యర్థి ఫొటో సరిగా కనిపించనట్లయితే సంబంధిత అభ్యర్థి 2పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కేంద్రానికి హాజరుకావాలి.
- కేటాయించిన కంప్యూటర్‌పై అభ్యర్థి వ్యక్తిగత వివరాలు, ఫొటో కనిపిస్తుంది. వివరాల్లో తేడాలు ఉంటే ఇన్విజిలేటర్ దృష్టికి తేవాలి.
- మొబైల్ ఫోన్, ట్యాబ్, బ్ల్యూ టూత్, వాచ్, క్యాలిక్యులేటర్, లాగ్ పట్టికలు, పర్స్, నోట్ పుస్తకాలు, విడి పేపర్లు, రికార్డింగ్ వంటివి అనుమతించరు.
- అభ్యర్థుల చేతులకు, పాదాలకు మెహెందీ, ఇంక్ ఉండకూడదు. బయోమెట్రిక్ సేకరణ సమయంలో వేలి ముద్రల సమస్యను నివారించడానికే ఇది.



టీఆర్టీ సబ్జెక్టులు.. విధానాలు..

- ఈ నెల 24న ఎస్జీటీ తెలుగు మీడియం పరీక్ష సీబీఆర్టీ(ఆన్‌లైన్) విధానంలో నిర్వహించనున్నారు. దీనికి హెచ్‌ఎండీఏ, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- 25న ఎస్జీటీ ఇంగ్లిష్, తెలుగు మీడియంల పరీక్ష ఓఎమ్మార్ (ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించనున్నారు. ఉదయం జరిగే పరీక్షకు హెచ్‌ఎండీఏ పరిధిలోని 86 పరీక్షా కేంద్రాలు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు హెచ్‌ఎండీఏ పరిధిలోనే 38 కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- 26న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, మాథ్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. వీటికి హెచ్‌ఎండీఏ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- 27న ఉదయం స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుకు, మధ్యాహ్నం లాంగ్వేజ్ పండిట్ ఉర్దూ, మరాఠీ, హిందీ సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. హెచ్‌ఎండీఏ పరిధిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- 28న పీఈటీ (అన్ని మీడియంలు) పోస్టులకు ఆన్‌లైన్‌లో రాత పరీక్ష ఉంటుంది. అభ్యర్థుల కోసం హెచ్‌ఎండీఏ, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇదేరోజు స్కూల్ అసిస్టెంట్ హిందీ, కన్నడ, తమిళ్, ఉర్దూ పోస్టులకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. ఈ అభ్యర్థులకు హెచ్‌ఎండీఏ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- మార్చి 2న ఎస్జీటీ బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళ్ మీడియం పోస్టులకు ఆన్‌లైన్‌లో హెచ్‌ఎండీఏ పరిధిలోని కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఎస్ఏ ఫిజికల్ సైన్స్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.
- 3న ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, మ్యాథ్స్, సోషల్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులకు హెచ్‌ఎండీఏ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- మార్చి 4న పీఈటీ ఇంగ్లిష్ మీడియం పోస్టులకు ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షకు హెచ్‌ఎండీఏ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- మార్చి 4న స్కూల్ అసిస్టెంట్ తెలుగు మీడియం బయోసైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ పోస్టులకు ఆఫ్‌లైన్ విధానంలో రాత పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆదిలాబాద్, కరీంనగర్ వరంగల్, ఖమ్మం, హెచ్‌ఎండీఏ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

జేసీజే అభ్యర్థులకు 27, 28న మౌఖిక ఇంటర్వ్యూలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) పోస్టులకు గతేడాది నవంబర్‌లో నిర్వహించిన రాతపరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఫిబ్రవరి 27, 28 తేదీల్లో మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హులైన వారికి ఇప్పటికే కాల్‌లెటర్లు పంపినట్లు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు ఆయన వివరించారు.

ఆదిలాబాద్ అభ్యర్థికి హైదరాబాద్‌లో ఆఫ్‌లైన్ 'పరీక్ష'!

- **ఎంచుకున్న చోట కాకుండా మరోచోట కేంద్రం కేటాయింపు**



ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కృష్ణ ఎస్జీటీ కోసం దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ ఫాం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఆర్టీ.. నిజంగానే తమకు 'పరీక్ష'లా తయారైందని కొందరు అభ్యర్థులు వాపోతున్నారు. ఎంచుకోని ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీఎస్‌పీఎస్సీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కృష్ణ ఎస్జీటీ ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష కోసం ఆదిలాబాద్‌తోపాటు పక్కనే ఉన్న కొమురం భీం, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ఆప్షన్ ఇచ్చాడు. ఆయనకు ఇప్పుడు హైదరాబాద్ శివారు కోకాపేట సమీపంలోని ఓ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. ఇప్పటివరకు హైదరాబాద్ రాని తాను అడ్రస్ వెతుక్కునేదెలా అని ప్రశ్నిస్తున్నాడు. ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షలు రాసే అభ్యర్థులకు వారు ఎంచుకున్న జిల్లాల్లోనే పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఇటీవల టీఎస్‌పీఎస్సీ ప్రకటించిందని ఆయన అన్నాడు. హాల్‌టికెట్లలో మాత్రం తాను ఎంచుకోని చోట పరీక్షా కేంద్రం కేటాయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నాడు.

అమరుల నివాళికే 'ప్రమిద'

- **వారి స్ఫూర్తిని చాటిచెప్పేలా స్మృతి చిహ్నం**
- **వెయ్యేళ్లు దాటినా చెక్కు చెదరకుండా నిర్మాణం**
- **మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్, కన్వెన్షన్ హాల్**
- **తెలంగాణ చరిత్రను చాటిచెప్పేలా మ్యూజియం**
- **వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు**
- **'ఆంధ్రజ్యోతి'తో స్మృతి చిహ్నం రూపకర్త ఎంవీ రమణారెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మృతులకు నివాళి అర్పించే సమయంలో సాధారణంగా ప్రమిదలను పట్టుకుంటారు. అలాంటపుడు ఒక ప్రమిద రూపంలోనే స్మృతి చిహ్నం ఎందుకు ఉండకూడదు? అమర వీరుల స్మృతి చిహ్నాన్ని ప్రమిద రూపంలో నిర్మిస్తే ఎలా ఉంటుంది? ఇవీ.. ప్రముఖ చిత్ర, శిల్పకారుడు.. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి మదిలో మెదిలిన ఆలోచనలట! అనుకున్నదే తడవుగా పలు డిజైన్లను సిద్ధం చేసి, సీఎం కేసీఆర్‌కు పంపానని.. వాటిలోంచి ఒకదానిని ఆయన ఆమోదించారని రమణారెడ్డి చెప్పారు. రాష్ట్ర సాధన కోసం అమరులైన వారిని స్మరించుకుని, ఉద్యమ చరిత్రను భవిష్యత్తు తరాలు తెలుసుకునేలా ఈ స్మృతి చిహ్నం ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఉద్దేశమన్నారు. అందరూ తమ కుటుంబంతో వచ్చి అమరులను స్మరించుకునేలా ఉండాలని ఆయన భావించారని, అందుకు తగ్గట్టుగా అమరుల స్మృతి చిహ్నాన్ని రూపొందించానని చెప్పారు. తెలంగాణ చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించేందుకూ ఈ నిర్మాణం దోహదపడుతుందన్నారు. అమర వీరుల స్మృతి చిహ్నం నిర్మాణానికి సంబంధించిన విశేషాలను రమణారెడ్డి గురువారం 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే..

వెయ్యేళ్లయినా చెక్కుచెదరకుండా..

తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది బలిదానాలు చేశారు. వారి త్యాగాల స్ఫూర్తి అందరికీ అర్థం అయ్యేలా.. కొత్తగా కనిపించేలా కళాత్మకంగా అమరుల స్మృతి చిహ్నం ఉండాలి. అదే సమయంలో నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలతో చేయాలి. ఇలా ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రమిద రూపంలో డిజైన్ రూపొందించాను. ఈ నిర్మాణం వెయ్యేళ్లకు పైగా చెక్కు చెదరకుండా ఉండేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో కట్టేలా డిజైన్ చేశాను. సెల్లార్‌ను మినహాయించి పైభాగంలో ఉండే మూడు అంతస్థులను దాదాపు స్టెయిన్‌లెస్ స్టీల్‌తోనే నిర్మిస్తారు. నాకు తెలిసి ఆసియాలోనే ఇలాంటి నమూనాతో కూడిన నిర్మాణం లేదు. సెల్లార్‌లోని రెండు అంతస్థులను పార్కింగ్ కోసం కేటాయిస్తారు. 400కు పైగా కార్లు, 300కు పైగా టూవీలర్లు పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇక మూడో అంతస్థు పాక్షికంగా సెల్లార్‌లో, బేస్‌మెంట్‌లో కలిసి ఉంటుంది. ప్రమిద రూపం వచ్చేందుకు ఇలా ఏర్పాటు చేశాం. నిర్మాణానికి సంబంధించిన విద్యుత్తు సరఫరా, స్టోరేజ్ అవసరాల కోసం ఈ అంతస్థును వాడుకుంటారు. నీటి పక్కనే ఈ నిర్మాణం ఉంటుంది. ఈ నిర్మాణంపై ఇంజనీరింగ్‌లో పలు విభాగాలకు చెందిన నిపుణులతో ఎన్నో సంప్రదింపులు జరిపాను. నిర్మాణం చేపట్టే స్థలంలోని భూసార పరీక్ష కూడా నిర్వహించాం. 200 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినా నిర్మాణానికి ఇబ్బందులు రాకుండా రూపల్పన చేశాను.

మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్, భారీ స్థూపం

నిర్మాణం ముందు గ్రౌండ్ లెవెల్లో పార్కు ఉంటుంది. అక్కడ మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ నిర్మిస్తారు. ఫౌంటేన్ ముందు భాగంలో 40 అడుగుల ఎత్తులో ఒక స్థూపం ఉంటుంది. దానిపై తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. స్థూపం చుట్టూ 12 వరకు చిన్న స్తంభాలు ఉంటాయి. రామప్ప దేవాలయంలోని సింహాల శిల్పాలను పోలిన వాటిని ఈ స్తంభాలపై ఏర్పాటు చేస్తాం. వాటి చుట్టూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా చిహ్నాలు, ఉంటాయి. సందర్శకుల కోసం వేర్వేరుగా మెట్ల నిర్మాణం ఉంటుంది. ఫౌంటేన్‌కు రెండు పక్కలా ఒక్కోవైపు అయిదు విగ్రహాలు ఏర్పాటు చేస్తాం.



నా జన్మధన్యమైంది

"ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. వారికి నివాళులర్పించేందుకు ఒక స్మృతి చిహ్నాన్ని రూపొందించడం నా అదృష్టంగా భావిస్తున్నా. నా జన్మ ధన్యమైంది. వృత్తిరీత్యా చాలా కాలం యూరోప్‌లో ఉండాల్సి వచ్చింది. 2007లో తెలంగాణకు వచ్చాను. అప్పటికే ఉద్యమం ఉధృతమైంది. నా వంతు బాధ్యతగా ఉద్యమంలో పాల్గొన్నా. నాకు తెలిసిన కళనే ఉద్యమ అస్త్రంగా మార్చుకుని అనేక ఆర్ట్ క్యాంపులను నిర్వహించాను. కళాకారులను సమన్వయం చేస్తూ... ప్రజలకు తెలంగాణ ఉద్యమం గురించి అవగాహన పెంచేందుకు ప్రయత్నం చేశాను. తెలంగాణ ఉద్యమం, విద్యార్థులు, నిరుద్యోగుల బలిదానాలు దగ్గరగా చూశాను. ఉద్యమ సమయంలో నిర్వహించిన కార్యక్రమాల కోసం పోస్టర్లు, టీ-షర్ట్‌లపై డిజైన్లు చేసి ఇచ్చేవాడిని. ఢిల్లీ పరేడ్‌కి పంపిన రాష్ట్ర ప్రభుత్వ శకటాన్ని రూపొందించే అవకాశం కూడా నాకు దక్కింది. తెలంగాణ అమరుల స్మృతి చిహ్నాన్ని రూపొందించే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, ఆయన ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్‌కు ఎప్పటికీ కృతజ్ఞుడను"

-రమణారెడ్డి



గ్రౌండ్ ఫ్లోర్‌లో మ్యూజియం

స్మృతి చిహ్నం నిర్మాణంలో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో మ్యూజియం ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన నేపథ్యం, జరిగిన తీరు, అమరుల వివరాలు.. ఇలా అన్ని అంశాలు ఈ మ్యూజియంలో పొందుపరచాలని భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఆడియో, వీడియో రూపంలో ప్రెజెంట్ చేసే అవకాశం కూడా ఇక్కడ కల్పిస్తారు. ఉద్యమ ఘట్టాలకు సంబంధించి డాక్యుమెంటరీలు, ఆడియో రికార్డులు, ఇక్కడ నిక్షిప్తం చేస్తారు. ఇండిపెండెంట్ స్క్రీన్లు ఇరవై వరకు ఏర్పాటు చేస్తారు. మెయిన్ హాల్‌లో మరో స్క్రీన్ ఉంటుంది. దాంట్లో ఉద్యమ సినిమాలను ప్రదర్శిస్తారు. గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి పైకి వెళ్లేందుకు లిఫ్టులు ఉంటాయి. అక్కడి నుంచి మొదటి అంతస్థుకు వెళ్లొచ్చు. అక్కడ దాదాపు 700 మందికి పైగా కూర్చునే సదుపాయంతో ఒక కన్వెన్షన్ హాల్ ఉంటుంది. కట్టడం పర్యవేక్షణ కోసం మొదటి అంతస్థులో ఒక కార్యాలయం కూడా ఉంటుంది. ఇక టెర్రస్‌లోని ఒక పోర్షన్‌లో రెస్టారెంట్ ఉండేలా రూపకల్పన చేశాం. మ్యూజియం, కన్వెన్షన్‌హాల్‌తోపాటు అన్నింటిని చూసి వచ్చేసరికి దాదాపు 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. అలాంటి సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా రెస్టారెంట్‌లోనే తినొచ్చు. ప్రమిద వెలిగే భాగం ఈ టెర్రస్ నుంచి ప్రారంభం అవుతుంది. రెండో అంతస్తులో ప్రత్యేకించి ఏమీ ఉండవు. ప్రస్తుతానికి అందుకు సంబంధించి ఏదీ అనుకోలేదు.


లోకం తీరు



ఓట్ల కోసం ఉన్న డబ్బంతా పంచి పెట్టవయ్యా... వాళ్లు మళ్లీ దాచుకునేది బ్యాంకుల్లోనే కదా!!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.1	16.7
ఖమ్మం	36.0	19.0
హైదరాబాద్	33.5	19.8
నల్లగొండ	32.4	20.6
రామగుండం	35.8	21.0



ప్రధాని పదవిని ఆశించిన సోనియా!

వాజపేయి సర్కారు పడిపోయిన తర్వాత 1999లో సోనియాగాంధీ ప్రధాని పదవిని ఆశించారు. అందుకే అప్పుడు కాంగ్రెస్ నుంచి తప్పుకొన్నా. ప్రధాని పదవికి నేను లేదా మన్మోహన్‌సింగ్ మాత్రమే అర్హులం. భారతీయ జనతా పార్టీకి కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం. ఇటీవలి కాలంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీలో ఎంతో మార్పు వచ్చింది. దేశమంతా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలనుకోవడం, నేర్చుకోవాలనే తపన వంటివి ఆయనలో కనిపిస్తున్నాయి. ఇటీవల లోక్‌సభలో ప్రధాని మోదీ తన ప్రసంగంలో నెహ్రూ, కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని వ్యక్తిగత విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదు. దేశాన్ని నడపడమంటే ఓ టీం వర్క్. ప్రస్తుత నాయకత్వానికి అది లోపించింది. ముంబై, పుణెల్లో గుజరాతీయుల ప్రాబల్యం పెరిగిపోతోంది. ముంబైలో కొన్ని ప్రాంతాల్లో గుజరాతీ భాషలో సైన్‌బోర్డులు చూశాను. ఇది ఓ రకంగా చొరబాటే. మహారాష్ట్ర నుంచి ముంబైను ఎవరూ వేరు చేయలేరు.

- ఎన్సీపీ అధినేత శరద్‌పవార్

(ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్‌ఠాక్రే ఇంటర్వ్యూలో...)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.92	పాత ధర 67.67
కొత్త ధర రూ.75.83	కొత్త ధర 67.59
తగ్గింది : 00.09 పైసలు	తగ్గింది : 00.06 పైసలు



ఈ-సిగరెట్లలో విష లోహాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: మామూలు సిగరెట్‌కు ప్రత్యామ్నాయంగా ధూమపాన ప్రియుల కోసం సృష్టించిందే ఈ-సిగరెట్. దీనిలో పొగాకుకు బదులు నికోటిన్ గుళికలు, నీటితో నిండిన చిన్న పైప్ ఉంటాయి. పరికరం వేడెక్కడం ద్వారా నీరు ఆవిరిగా మారి, నికోటిన్‌తో కలిసి పొగ బయటకు వస్తుంది. దాన్ని పీల్చుతూ పొగరాయుళ్లు మామూలు సిగరెట్ తాగిన అనుభూతి పొందుతారు. దానివల్ల ఎలాంటి అనారోగ్యాలు రావని అనుకుంటారు. కానీ, అవి కూడా ప్రమాదమేనంటున్నారు అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఈ-సిగరెట్ ఆవిరిలో విష లోహాలున్నాయని చెబుతున్నారు. పరికరం వేడెక్కినపుడు వెలువడే పొగలో సీసం, క్రోమియం, మాంగనీసు లాంటి విష లోహాలు ఉంటున్నాయని, ఆ ఆవిరిని పీల్చితే ఊపిరితిత్తులు, కాలేయం, రోగ నిరోధక వ్యవస్థ, మెదడు, గుండె దెబ్బ తింటాయని, కేన్సర్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

కార్బన్ మోనాక్సైడ్‌తో యాంటీబయాటిక్స్ పని మెరుగు

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: కార్బన్ మోనాక్సైడ్ ఆరోగ్యానికి హానికరం. ఇది వాతావరణంలో 35పీపీఎం కంటే మించి ఉంటే ప్రమాదం. కానీ, ఈ వాయువు యాంటీ బయాటిక్స్ పనితీరు మెరుగుపర్చడంలో బాగా పనిచేస్తుందని అమెరికాలోని జార్జియా స్టేట్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. మెట్రోనైడజోల్ యాంటీ బయాటిక్ ఔషధానికి కార్బన్ మోనాక్సైడ్ జతచేసినపుడు 'హెచ్ పైలోరీ' అనే బ్యాక్టీరియాను సమర్థవంతంగా ఎదుర్కొని నాశనం చేసినట్లు తమ పరిశోధనల్లో తేలిందని వెల్లడించారు. తాజా పరిశోధన యాంటీ బయాటిక్ నిరోధకాల భరతం పట్టేందుకు ఉపయోగపడుతుందని వివరించారు.

అడవి మాయం!

5000 ఎకరాల అటవీ భూమికి టెండర్.. అడవిలో చెరువు తవ్వకానికి నిర్ణయం

- పరిహారంగా కోటికిపైగా కొట్టేసేందుకు స్కెచ్
- 500 ఎకరాలు అసైన్ చేసేసిన ఆర్డీవో
- మరో 500 ఎకరాల అమ్మకానికి ఎత్తులు
- ఆసిఫాబాద్ జిల్లా గిరివెల్లిలో భూమాయ


అడవి మధ్యలో నిర్మించిన చెరువు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అది దట్టమైన అడవి! అక్కడ సాగు భూముల్లేవు! అయినా, అడవి మధ్యలో చెరువు తవ్వాలని నిర్ణయించారు! తద్వారా, కోటి రూపాయల పరిహారం నొక్కేయాలని స్కెచ్ వేశారు! దానితోపాటు ఇప్పుడు ఏకంగా 5వేల ఎకరాల అటవీ భూమికి టెండర్ పెట్టారు! వాటిలో 500 ఎకరాలను అమ్మకానికి పెట్టారు. కబ్జాలో ఉన్న రైతులకే ఎకరా 10-20 వేలకు అమ్ముతున్నారు. ఏకంగా ఏడెనిమిది కోట్ల రూపాయలు నొక్కేసేందుకు స్కెచ్ వేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గిరివెల్లి పంచాయతీ పరిధిలోని కర్జీ గ్రామంలో జరుగుతున్న భూమాయ ఇది. ప్రభుత్వ, అటవీ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూమిని మధ్యలో అక్రమార్కులు తెగ నమ్ముకుంటున్నారు. ఈ అక్రమ విక్రయాల పై 'ఆంధ్రజ్యోతి' తీగ లాగితే డొంక కదులుతోంది. ల్యాండ్ సర్వే ఇన్‌స్పెక్టర్లు కొలతలు వేసి, అవి ప్రభుత్వ భూములని తేల్చి ఇచ్చిన పంచనామాను ఆర్డీవో బుట్టదాఖలు చేసి 500 ఎకరాలకు లావుణి పట్టాలిచ్చేశారు.రిజర్వు ఫారెస్టులో చెరువు తవ్వకానికి నిరభ్యంతరపత్రం ఇచ్చేశారు.

కుటుంబ గొడవలతో వెలుగులోకి..

కర్జీ శివారులోని 4708.30 ఎకరాల భూమికి సంబంధించి అటవీ శాఖ వద్ద స్పష్టమైన రికార్డులు ఉన్నాయి. అటవీ విస్తీర్ణానికి సంబంధించిన మ్యాప్ కూడా ఉంది. ఇదే భూమి రెవెన్యూ వద్ద పోరంబోకుగా నమోదై ఉంది. ఈ వివాదాస్పద భూమిలో 2009-10లో చెరువు తవ్వాలని మధ్యతరహా నీటి పారుదల శాఖ నిర్ణయించింది. నిజానికి, అప్పటికి ఇక్కడ ఎకరా సాగులో లేదు. కానీ, భూములను మింగేసేందుకు అప్పట్లోనే పెద్ద వ్యవహారం నడిపారు. దాంతో, భూమి పై కొత్తగా పట్టాదారులు పుట్టుకొచ్చారు. మంచిర్యాల జిల్లాకు చెందిన కొంతమంది పేరు మీద ఒక్కొక్కరికి 50 ఎకరాలపైనే బై నంబర్ సృష్టించి మరీ రెవెన్యూ అధికారులు 500 ఎకరాలను ధారాదత్తం చేశారు. వారిలో 8మంది కి లావుణి పట్టాలు ఇచ్చారు. ఇందులో నుంచి 53.56 ఎకరాలను చెరువు తవ్వకానికి భూ సేకరణ చేసినట్లు రెవెన్యూ అధికారులు చూపించారు. ఈ క్రమంలో భూ సేకరణకు సంబంధించి అప్పటి కలెక్టర్ జగన్మోహన్‌రావు రూ.1.12 కోట్ల పరిహారం మంజూరు చేశారు. రూ.1.12 కోట్ల పరిహారాన్ని ఒకే కుటుంబానికి మంజూరు చేస్తూ అవార్డు ప్రకటించారు. అక్రమానికి ఇక్కడే అడ్డుకట్ట పడింది. సదరు పట్టేదారుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారిలో ఒకరు మరణించడంతో పరిహారం ఒక కొడుకుకే దక్కేలా పావులు కదిపారు. రికార్డుల్లోనూ అతని పేరే రాయించారు. దాంతో, మరణించిన కొడుకు భార్య అధికారులను ఆశ్రయించారు. పరిహారంలో తనకు వాటా ఇవ్వాలంటూ గత కలెక్టర్ చంపాలాల్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో, పరిహారం చెల్లింపు నిలిచిపోయింది. అప్పటి నుంచి వివాదం కొనసాగుతోంది.

చుట్టూ భూములు మాయం

మంచిర్యాలకు చెందిన సదరు అక్రమార్కులు ఇప్పుడు మొత్తం అడవిపైనే కన్నేశారు. గతంలో ఆర్డీవో లావుణీ పట్టాలు ఇచ్చిన 500 ఎకరాలకు ఇటీవలి భూ సర్వేలో పట్టాలు సృష్టించుకోవడానికి పావులు కదిపారు. మిగతా అటవీ ప్రాంతాన్ని గుప్పిట పడుతున్నారు. గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి, ఇద్దరు బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. అవి తమ పట్టా భూములేనని, ఎకరాకు 20వేలు చెల్లిస్తే మీకు పట్టా చేయిస్తామని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల సహాయంతో అసైన్ చేసేలా చూస్తున్నారు.

రికార్డులు లేకపోవడమే కారణం

దహెగాం రెవెన్యూ కార్యాలయంపై 2009-10 ఆర్థిక సంవత్సరంలో నక్సలైట్లు దాడి చేశారు. రికార్డులను దహనం చేశారు. ఇది అక్రమార్కులకు వరమైంది. పెత్తందారులు, రెవెన్యూ అధికారులు కలిసి ఇక్కడ అక్రమాలకు తెరతీశారు. గతంలో పని చేసిన ఆర్డీవోతోపాటు రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కయ్యారని అంటున్నారు. ఇవి ప్రభుత్వ భూములే అనుకున్నా.. నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలకే ఒక్కో కుటుంబానికి ఐదెకరాలు అసైన్ చేయాలి. కానీ, అప్పటి ఆర్డీవో నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరికి 83 ఎకరాలు కట్టబెట్టారు. ఇందులో అప్పట్లో అటవీ సెటిల్‌మెంట్ అధికారిగా పని చేసిన అధికారి పాత్ర కూడా కీలకమని చెబుతున్నారు. ఇటీవల జరిగిన సమగ్ర భూ సర్వేలో ఆర్డీవో కాగితాలపై ఇచ్చిన 500 ఎకరాలకు పక్కా పట్టాలు సృష్టించుకునే పనిలో తలమునకలయ్యారు. ఈ భూముల ధారాదత్తం వ్యవహారంలో తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు అందరి పాత్రపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పరిహారం జాబితా నుంచి పేరు తొలగించారు



కర్జీ చెరువు నిర్మాణం కోసం 323 సర్వే నంబర్‌లో మా తాతముత్తాతల నుంచి వస్తున్న పొలాన్ని పోగొట్టుకున్నాం. పరిహారం ఇస్తామన్నారు. ఇంతవరకు ఇవ్వలేదు. అధికారులను అడిగితే మీ పేరే లేదంటున్నారు. కాళ్లు అరిగేలా తిరుగుతున్నా స్పందించడం లేదు. ఆర్థికంగా ఆదుకోకపోతే మాకు చావే దిక్కు.

-గుండయ్య, రైతు, కర్జీ

రికార్డులన్నీ గందరగోళం



గిరివెల్లి పరిధిలోని 4708.30 ఎకరాలు ప్రభుత్వ భూమిగానే నమోదై ఉంది. ఇందులో 500 ఎకరాలు 323/1తో వేరే వ్యక్తులకు పట్టాలు చేశారు. ఇందుకు సంబంధించి పాత రికార్డులు అందుబాటులో లేవు. గతంలో నక్సలైట్లు రికార్డులను దహనం చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. సంయుక్త సర్వే నిర్వహిస్తే మొత్తం విస్తీర్ణం ఎంతనేది తేలుతుంది.

-బిక్షర్ణదాస్, తహసీల్దార్, దహెగాం

భూముల లెక్క తేలుస్తాం



కర్జీ అటవీ భూములకు సంబంధించి ఒక్క ఎకరా కూడా అన్యాక్రాంతం కానివ్వం. రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా సర్వే జరిపి భూముల లెక్క తేలుస్తాం. కలెక్టర్‌తో మాట్లాడి త్వరలోనే సర్వే ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ భూముల్లో అడవులు ఉన్నా వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

-లక్ష్మణ్ రంజిత్ నాయక్, జిల్లా అటవీ శాఖాధికారి


గాంధీభవన్‌లో కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పాల్గొన్న ఖుంటియా, చిత్రంలో ఉత్తమ్ తదితరులు

ఆ నలుగురే బాగుపడ్డారు!

- టీఆర్ఎస్ సర్కారుకిదే చివరి బడ్జెట్
- బస్సుయాత్రతో జనంలోకి వెళతాం: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఏ ఒక్కరూ ఆనందంగా లేరని, సీఎం కేసీఆర్ కుటుంబంలోని ఆ నలుగురు తప్ప ఎవరూ బాగు పడలేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ విధానాల వల్ల అన్నివర్గాలూ తీవ్రంగా నష్టపోయాయన్నారు. గురువారమిక్కడి ఇందిరాభవన్‌లో సేవాదళ్ ఒక రోజు సమావేశం జరిగింది. సేవాదళ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తమ్ ప్రసంగిస్తూ.. టీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే బడ్జెటే చివరిదన్నారు. నాలుగేళ్లలో రూ.5లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినా రైతులకు మద్దతు ధరలు ఇవ్వలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవంటున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి భారీగా నిధులు కేటాయిస్తున్నారని.. కేసీఆర్ పాలనలో అవినీతి, అప్పులే కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజా చైతన్య యాత్ర పేరుతో ఈ నెల 26న కాంగ్రెస్ పార్టీ జనంలోకి వెళుతోందని గుర్తుచేశారు. టీఆర్ఎస్ అరాచకాలు, అన్ని వర్గాలను మోసం చేసిన తీరును ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏం చేస్తామో కూడా తెలియజేస్తామన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సేవాదళ్ పోరాటం అనిర్వచనీయమని కొనియాడారు. సేవాదళ్‌కు పూర్వ వైభవం తెస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం కల్పిస్తామని, పార్టీ అధ్యక్షుడు రాహుల్ ఈ విషయంపై ఇప్పటికే స్పష్టత ఇచ్చారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ ఖుంటియా అన్నారు.

20 మంది కువైత్ బాధితులకు సాయం: ఖుంటియా

కువైత్‌లో ఇబ్బందులు పడుతున్న భారతీయులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఖుంటియా ఆరోపించారు. వీహెచ్, పార్టీ ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్ కుమార్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కువైత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించినప్పటికీ చాలా మంది స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాళ్లకి ప్రభుత్వాలు సహకరించడం లేదని ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ నేతలు కువైత్ వెళ్లి అక్కడి భారత ఎంబసీ అధికారులతో మాట్లాడారన్నారు. మరో 2 నెలల పాటు క్షమాభిక్ష పథకాన్ని కొనసాగించేలా ప్రయత్నించామని, 20 మందికి విమాన ప్రయాణ ఖర్చులకు ఆర్థిక సాయం అందించామని తెలిపారు.

15 రోజుల్లో పాదయాత్రలెలా?

ఒకేసారి ముగ్గురి యాత్రలతో ఉపయోగమెంత?

- మీడియాలో ప్రచారమూ కష్టమే!
- కాంగ్రెస్ నేతల తర్జనభర్జన
- వీహెచ్ రథయాత్రా లేనట్టే?



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాదయాత్రలపై కాంగ్రెస్ నేతలు తర్జనభర్జనలు పడుతున్నారు. అధిష్ఠానం కేవలం 15 రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో యాత్రలు ఎక్కడ ప్రారంభించి ఎక్కడ ముగించాలో అర్థం కాక సతమతమవుతున్నారు. కాంగ్రెస్ నేతలు ఈ నెల 26 నుంచి తొలి దశ బస్సు యాత్ర ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. దీన్ని మార్చి 9 వరకు కొనసాగించి బడ్జెట్ సమావేశాల అనంతరం రెండో దశ యాత్రను ప్రారంభించాలని నిర్ణయించారు. రెండో దశ యాత్ర మే నెలఖారుకు పూర్తి చేయాల్సి ఉంది. ఎందుకంటే జూన్ 1న పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభ జరగనుంది. అప్పటికల్లా యాత్రలు ముగించాలని పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మే 15 నుంచి ముగ్గురు నేతల పాదయాత్రలకు, ఓ నేత రథయాత్రకు అధినాయకత్వం అనుమతి ఇచ్చింది. అయితే యాత్రలకు అనుమతి లభించిందని సంతోషించాలో.. 15 రోజులే సమయం ఉండడంతో బాధపడాలో తెలియడం లేదని నేతలు వాపోతున్నారు. యాత్రలు చేస్తామని వీరంతా ఏఐసీసీకి చాలాకాలం క్రితమే దరఖాస్తులు పెట్టుకున్నారు. వారికి ఇప్పుడు హఠాత్తుగా అనుమతి రావడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క 6 నెలల కిందట అర్జీ పెట్టుకుంటే ఇప్పుడు అనుమతి వచ్చింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర స్థాయి పర్యటన చేయాలని భావిస్తే ఇతరులతోపాటు సాధారణ యాత్రకు అనుమతి ఇవ్వడంపై అసంతృప్తితో ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. పాదయాత్రను ఆయన నియోజకవర్గం లేదా ఖమ్మం జిల్లాకు మాత్రమే పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇక రేవంత్‌రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లాలో మొదలుపెట్టి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి వరకు పర్యటించనున్నట్లు సమాచారం. ఆయనకు 15 రోజులు సరిపోతాయా అనే సందేహంలో ఉన్నారు. పొన్నం ప్రభాకర్ బాసరలో మొదలుపెట్టి నిజామాబాద్, కరీంనగర్‌లలో కొనసాగించాలని అనుకుంటున్నట్లు సమాచారం. యాత్రల విషయంలో నేతలందరికీ కొంత సందిగ్ధత ఉన్నట్లు వారి మాటలను బట్టి స్పష్టమవుతోంది. సమయాభావంతోపాటు ఒకేసారి పర్యటనల వల్ల మీడియా ప్రచారంరాదనే సందేహం ఉన్నట్లు తెలుస్తోంది. రథయాత్రకు అనుమతి పొందిన వి.హనుమంతరావు బస్సు యాత్రతో సరిపెట్టుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పాదయాత్రలు, రథయాత్రలు జరుగుతాయో లేదోననే అనుమానాలు పార్టీలో నెలకొన్నాయి.

అలంపూర్ నుంచి అరుణ..

మాజీ మంత్రి డీకే అరుణ తాను కూడా పాదయాత్ర చేపడతానని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.ఖుంటియాకు అర్జీ పెట్టుకున్నట్లు తెలిసింది. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు పాదయాత్ర చేయతలపెట్టినట్లు సమాచారం. ఆమె ఏప్రిల్ తర్వాత యాత్ర చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

జైపాల్‌రెడ్డే అసలు విలన్

- ఉత్తమ్ కూడా ఆయనకు సహకరిస్తున్నారు.. నాగం జనార్దన్‌రెడ్డి వస్తే కాంగ్రెస్‌కు నష్టమే
- అరుణతోనే పాలమూరులో కాంగ్రెస్ బతికింది.. మీడియాతో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో అసలైన విలన్ జైపాల్‌రెడ్డేనని ఆ పార్టీ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ఆరోపించారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా జైపాల్‌రెడ్డికి సహకరిస్తున్నారని విమర్శించారు. గురువారం సీఎల్‌పీలో ఆయన 'విలేకరులతో - ఇష్టాగోష్ఠి'లో మాట్లాడారు. జిల్లాలో డీకే అరుణ కేడర్‌ను దెబ్బతీయాలని ఉత్తమ్, జైపాల్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జైపాల్‌రెడ్డి, నాగం ఇద్దరూ కోవర్టులని దుయ్యబట్టారు. అవసరం తీరాక ఎవరినీ పట్టించుకోని వ్యక్తిత్వం నాగం జనార్దనరెడ్డిదని విమర్శించారు. నాగంను పార్టీలో చేర్చుకోవద్దని డీకే అరుణ, ఎంపీ నంది ఎల్లయ్యతో కలిసి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో సర్వే చేయించి పార్టీలోకి ఏ నేతను తీసుకున్నా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు నాగం.. కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్టానం జైపాల్‌రెడ్డి చేతిలో ఉందని, నాగం ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వచ్చినా ఓట్లు పడే అవకాశం లేదన్నారు. నాగంకు టికెట్ ఇచ్చినా గెలిచే పరిస్థితులు లేవన్నారు. తన పుట్టుకే కాంగ్రెస్‌కు వ్యతిరేకం అని ప్రకటించిన నాగంను.. పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తుందో చెప్పాలని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

13న తెలంగాణ బంద్

- కేంద్రం జాప్యానికి నిరసన: మందకృష్ణ



సోమాజిగూడ/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించటంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న జాప్యానికి నిరసనగా మార్చి 13న సంపూర్ణ తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లోనే ఎస్సీవర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు మద్దతు తెలపాల్సిందిగా అన్ని రాజకీయపార్టీలకు, వర్గాలకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ కోరుకున్న వర్గీకరణ సూత్రానికి అంత్యోదయ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఎస్సీవర్గీకరణ చేస్తామని బీజేపీ చేసిన వాగ్దానం నీటిమూటగానే మిగిలిపోయిందన్నారు. బంద్‌కు మద్దతు తెలపాల్సిందిగా టీఆర్ఎస్‌తోపాటు అన్ని పార్టీల నేతలను కలుస్తామన్నారు. కాగా, మంద కృష్ణమాదిగ గురువారం తెలంగాణ భవన్‌కు వెళ్లారు.

కమల్ పార్టీ

దక్షిణాది సినిమారంగంలో విలక్షణమైన అభినయానికి, కొత్త ప్రయోగాలకు మారుపేరుగా నిలిచి, జాతీయస్థాయిలో కూడా ఉత్తమశ్రేణి నటుడిగా గుర్తింపు పొందిన కమల్ హాసన్ ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించి, బుధవారం నాడు 'మక్కళ్ నీది మయ్యమ్' (ప్రజాన్యాయవేదిక) అనే పార్టీని ప్రారంభించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన సభలో, పెద్ద ఎత్తున హాజరైన అభిమానుల మధ్య, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సమక్షంలో రాజకీయ పార్టీని జెండాను కమలహాసన్ విడుదల చేశారు. జెండా మీద చిప్పిన దక్షిణ భారతదేశంలోని (పుదుచ్చేరితో కలుపుకుని) ఆరు రాష్ట్రాలను, వాటి మధ్య ఐక్యతను సూచిస్తోంది. కొత్తగా అవతరించిన ఈ పార్టీ ఎటువంటి విజయాలను సాధించగలదో కొంత ప్రయాణం తరువాత మాత్రమే అంచనాకు అందుతుంది.

జయలలిత మరణం తరువాత తమిళనాడు రాజకీయాలలో కనీసం ఒక పెద్ద ఖాళీ ఏర్పడింది. ఆమెకు నిర్వివాదమైన వారసత్వం లేకపోవడం, ఆమె పార్టీలో ఏర్పడిన గందరగోళ వాతావరణాన్ని అనువు చేసుకుని ప్రాబల్యం పెంచుకోవాలని భారతీయ జనతాపార్టీ భావించడం రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులను సృష్టించాయి. జయలలిత వారసత్వానికి ఎంతో కొంత గుర్తుగా కనిపించే శశికళ, అవినీతి కేసులో జైలుపాలై రంగం నుంచి వెలి అయ్యారు. ఆమె అనుయాయి, బంధువు అయిన దినకరన్ జయ నియోజకవర్గంలో గెలుపొందినా, రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మద్దతు పొందగలడో తెలియదు. కేంద్రం ధోరణికి జడిసి అతను ఆచితూచి మాత్రమే అడుగులు వేస్తున్నాడు. పన్నీర్ సెల్వం, పళనిస్వామి వర్గాలకు కేంద్రం దన్ను తప్ప ప్రజాభిమానం ఉన్నదన్న సూచన కనిపించడం లేదు. ఈ పరిస్థితుల మధ్యనే రజనీకాంత్, కమల్‌హాసన్ రాజకీయాల్లోకి వస్తున్న సూచనలు చేశారు. కమల్ కంటె ముందే, హడావుడి చేసిన రజనీకాంత్‌లో ఇంకా స్పష్టత వచ్చినట్టు లేదు. ఆయనను తమ మనిషిగా రాజకీయాలలోకి దింపాలని బీజేపీ భావిస్తున్నదన్న వార్తలు బలంగానే ఉన్నాయి. ఈ లోగా, రాష్ట్ర వ్యవహారాల విషయంలో బీజేపీ చూపిస్తున్న అత్యుత్సాహాన్ని తాము హర్షించడం లేదన్న సంకేతాన్ని తమిళ ప్రజలు రకరకాలుగా ఇస్తూ వచ్చారు. కమలం పార్టీతో ఏ రకంగా సన్నిహితంగా ఉన్నా అది ద్రావిడ స్ఫూర్తికి అపచారమేనన్న భావన బలంగా ఉన్నదని గ్రహించిన కమల్ హాసన్ స్పష్టంగా తన మొగ్గు వామపక్షవైపేనని ప్రకటించారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్‌ను కలిసి సలహాలు తీసుకోవడం, దేశంలోని అసహన, మతతత్వ ధోరణులను బాహాటంగా ఖండించడం– కమల్ హాసన్ రాజకీయ వైఖరి ఎట్లా ఉండబోతోందో సూచించాయి. అయితే, ఆయన అభిప్రాయాలలో నిలకడ లేని తనం కనిపించి, రాజకీయ అపరిపక్వత వ్యక్తమవుతోంది. అవసరమైతే బీజేపీతో అయినా కలుస్తామని ఒకసారి మాట జారి తరువాత నాలిక కరుచుకున్నారు. వామపక్షం వైపు మొగ్గు అని చెప్పినవారు, ఇప్పుడు తాను కుడి, ఎడమ కాకుండా మధ్యేమార్గం అంటున్నారు. రాజకీయాలు మాట్లాడడం మొదలుపెట్టిన తొలిరోజుల్లో కమల్ హాసన్ దక్షిణాది వాదాన్ని ప్రస్తావించలేదు. మధ్యలో ఆయన ఆ అభిప్రాయాలను కూడా స్వీకరించారు. ద్రావిడ, దక్షిణాది తరహా అస్తిత్వాలను మాట్లాడే కమల్‌హాసన్ తన పార్టీ పేరులో ద్రావిడ పదానికి చోటివ్వలేదు. అవినీతి, సత్పరిపాలన వంటి అంశాలలో 'ఆమ్ ఆద్మీ పార్టీ' సిద్ధాంతాలంటే ఆయన అభిమానిస్తున్నారు. చంద్రబాబు అంటే కూడా తనకు అభిమానం అని కమల్ హాసన్ చెప్పారు. టీఆర్ఎస్ నేతలను కూడా ఆయన ఆహ్వానించారు. బిహార్ ముఖ్యమంత్రి రావలసి ఉండింది కానీ, ఆయన వెనకడుగు వేసినట్టున్నారు.

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి, కమల్ హాసన్ నటనలో లోకనాయకుడే కానీ, జనరంజక నాయకుడు అన్నది సందేహమే. ముఖ్యంగా రజనీకాంత్‌తో పోలిస్తే, కమల్‌కు సాధారణ ప్రజాభిమానం తక్కువ. సినిమారంగం వారు రాజకీయాలలో రాణించడం తమిళనాడులో కొత్తేమీ కాదు కానీ, తమిళతనం, ద్రావిడవాదంతో పోటీ వస్తే, ఎంతటి సినీ ఆకర్షణ కూడా అక్కడ నెగ్గలేదు. అటువంటి అనుభవం గతంలో రజనీకాంత్‌కు, విజయకాంత్‌కు కూడా ఎదురయింది. పుట్టుకతో తమిళుడు కాకపోవడం, బీజేపీతో సంబంధాలు పెట్టుకోవాలనుకోవడం రజనీకాంత్‌కు ప్రతికూల అంశాలవుతాయి. ఇక తమిళనాడు రాజకీయాలలోని మరో ప్రధానశక్తి డీఎంకె ఇంకా సజీవంగానూ, బలంగానూ ఉన్నది. దానిని ఎదుర్కొనగలిగిన శక్తి కమల్‌హాసన్ వంటివారికి ఉంటుందా, లేదా, బీజేపీని నిలువరించడానికి ఎన్నికల ముందో, తరువాతో డీఎంకెతో కలిసి నడవవలసి వస్తుందా, చూడవలసి ఉంది.

దక్షిణాది భావన ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో కూడా ఇటీవల వినిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీల అమలులో కేంద్రం వివక్ష కనబరచడం బీజేపీపై వ్యతిరేకతను పెంచుతోంది. కర్ణాటకలో లౌకిక–మతతత్వ శక్తుల పోరాటం సామరస్య జీవన ఆకాంక్షను పెంచుతోంది. ఉత్తరాదిలో కనిపిస్తున్న దారుణమైన పరిస్థితులకు, దక్షిణాది సాంస్కృతిక విలువలకు ఎంతో వ్యత్యాసం ఉండడం వల్ల, ఒక ప్రత్యేకతాభావన ఏర్పడుతున్నది. అయితే, ఇదేదీ వేర్పాటువాదం కాదు, ప్రాంతీయ శక్తులను, స్థానిక సంస్కృతులను కబళించి, ఏకఛత్రాధిపత్యం సాధించాలనుకునే ధోరణులను ఎదుర్కొనే క్రమంలో దక్షిణాది రాష్ట్రాల్లో ఈ రకమైన ఆలోచనలు రావడం సహజం. అందులో భాగమే కమల్ హాసన్ వంటి వారి ప్రయత్నం కూడా. అద్భుతాలు సాధిస్తుందని ఆశించక పోయినా, ఒక ఆరోగ్యకరమైన రాజకీయశక్తిగా నాలుగు కాలాల పాటు ఆయన పార్టీ నిలబడుతుందేమో చూడాలి.

నిర్వీర్యం కానున్న ప్రభుత్వ బొగ్గు సంస్థలు

ప్రైవేటు కంపెనీలు సైతం వాణిజ్య అవసరాల కోసం బొగ్గు ఉత్పత్తి చేసి విక్రయించేందుకు అనుమతినివ్వాలని మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక శతాబ్దానికి పైగా ప్రభుత్వరంగంలోని బొగ్గు సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. కార్మిక సంఘాలకు వాయిస్ లేకుండా చేస్తుంది. ఇటీవల బొగ్గు గని కార్మికుల జీతాలను పెంచిన తీరు సైతం దేశంలోని మూడున్నర లక్షల మంది బొగ్గు కార్మికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. బొగ్గుసంస్థల్లో ఉపాధి అవకాశాలు లేకుండా చేయడానికి గని ఉద్యోగి మరణించినా లేదా మెడికల్ అన్‌ఫిట్ అయినా ఆ కుటుంబానికి ఉద్యోగం బదులు రూ.7.5 లక్షలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇంకా ఈ సమస్యల పరిష్కారం కాలేదు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌ను ఈపీఎఫ్‌లో విలీనం చేయడానికి సిద్ధమైంది. బొగ్గుసంస్థల్లో సంస్కరణల పేరిట సంక్షేమానికి కోత విధించే ప్రయత్నం చేసింది. కార్మిక సంఘాల ఆందోళన ఫలితంగా పైవిషయాలు ఇంకా అమలు కాకుండా నిలిచిపోయాయి.

తెలంగాణలోని సింగరేణి 1928 నుంచే ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగుతుండగా కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు 1973 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలుగా కొనసాగుతున్నాయి. దాదాపు 20 ఏండ్లుగా ఇటు సింగరేణి, 18 సంవత్సరాలుగా కోల్ ఇండియా లాభాలలోనే ఉన్నాయి. బొగ్గు అవసరాలకు తగిన విధంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తున్నాయి. కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల నుంచి ప్రతి ఏటా డివిడెంట్‌లు, పన్నులు, రాయల్టీల పేరిట రూ. 12 వేల నుంచి రూ. 13 వేల వరకు కేంద్రం తీసుకుంటుంది. క్లీన్ ఎనర్జీ సెస్ కింద టన్ను బొగ్గుకు రూ. 400 చొప్పున తీసుకోవడం జరుగుతుంది. ఇదే కాకుండా సింగరేణి కేంద్రానికి రూ.1800 కోట్లు అలాగే టన్ను బొగ్గుకు క్లీన్ ఎనర్జీ సెస్ కింద రూ.400 చెల్లించడం జరుగుతుంది. ఇప్పటికే కోల్ ఇండియాలో 20 శాతం పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దాదాపు 20 సంవత్సరాలుగా బొగ్గు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నయా పైసా కేటాయించిన దాఖలా లేదు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తిరిగి బొగ్గు సంస్థలకు మొండి చేయే చూపించారు. అటు కోల్ ఇండియా, ఇటు సింగరేణి ఈ ఆర్థిక సంవత్సరంలో పెడుతున్న పెట్టుబడిని (ప్రణాళికా వ్యయాన్ని) కేటాయింపుగా పేర్కొనడం జరిగింది తప్పా కేంద్రం ఇచ్చిందేమీ లేదు. ప్రతీ ఏటా ఇది జరుగుతున్నదే. కార్మికుల కృషితో పద్దెనిమిది సంవత్సరాలుగా వచ్చిన లాభాల నుంచి పన్నులు, రాయల్టీలు ప్రభుత్వాలకు చెల్లిస్తూనే కొత్త ప్రాజెక్టులను నిర్మించుకోవడం జరుగుతుంది. మంచిర్యాల జిల్లాలోని జైపూర్ వద్ద నిర్మించిన 1200మె.వా థర్మల్

కార్పొరేట్ కంపెనీలు తొలుత బొగ్గు ధర తగ్గించి అమ్ముతాయి. తక్కువ జీతాలకు కార్మికులను, ఉద్యోగులను తీసుకుంటాయి. ప్రభుత్వ రంగంలోని బొగ్గు బావులు ఈ పోటీ ఎదుర్కోలేక నష్టాల్లోకి వెళ్తాయి. అనంతరం మళ్లీ కార్పొరేట్‌లు బొగ్గు ధర పెంచేస్తాయి. కేంద్రం తాజా నిర్ణయం ఫలితంగా ఇదే జరగబోతుంది.

విద్యుత్ కేంద్రానికి రూ.8700కోట్ల వ్యయంలో రూ.6వేల కోట్లకు పైగా అప్పులు తీసుకునే నిర్మించారు. ఇప్పుడు రూ.5700 కోట్లతో నిర్మిస్తున్న 800మె.వా క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి కూడా సింగరేణి అప్పులు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఇప్పటి వరకు సంస్థకు నయా పైసా అందకపోగా ప్రతీ ఏడాది రూ. 2 వేల కోట్లదాకా రాష్ట్ర ప్రభుత్వం పన్నుల, రాయల్టీల పేరిట తీసుకుంటుండడం కొసమెరుపు. బొగ్గు గనుల నుంచి ప్రతి సంవత్సరం ఇన్‌కమ్‌ట్యాక్స్ ద్వారా దేశవ్యాప్తంగా రూ.3,500 కోట్లు చెల్లిస్తున్నారు. మూడున్నర లక్షల మంది బొగ్గుగని కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ మాఫీచేయాలని దశాబ్దాలుగా పోరాడుతున్నా కనీసం ప్రత్యేక స్లాబ్‌నుకూడా నిర్ణయించలేని పరిస్థితి. బొగ్గుద్వారానే దేశవ్యాప్తంగా 70 శాతం థర్మల్ పవర్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. 2020 నాటికి దేశం మొత్తంలో కనీసం 600 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడానికి విదేశాల నుంచి దిగుమతి అవుతున్న 200 మిలియన్ టన్నుల వరకు బొగ్గు దిగుమతిని నియంత్రించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కార్మికుల సంఖ్య తగ్గుతున్నా లక్ష్యాలు 20 సంవత్సరాలలో రెండింతలయ్యాయి. యాంత్రీకరణ పెరిగింది. ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో మరింతగా పెట్టుబడిదారులకు దోచి పెట్టడం కోసం కేంద్రం బొగ్గు విక్రయాలలోకి కార్పొరేట్‌లను ప్రవేశపెడుతుంది. 1993 నుంచి ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన 214 బొగ్గు గనులను బీజేపీ ప్రభుత్వం 2014లో రద్దు చేసింది. కేటాయింపుల్లో పారదర్శకత, జవాబుదారీతనం కొరవడడాన్ని నివారించడానికిగాను కోల్ మైన్స్ స్పెషల్ ప్రొవిజెన్స్ బిల్లు– 2015కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. 2015లో ఇది చట్టంగా మారింది. బొగ్గు విక్రయానికి అనుమతి ఇస్తూ గనులను వేలం ద్వారా కట్టబెట్టేందుకు ఈ చట్టం అనుమతిస్తోంది. వాస్తవానికి అప్పట్లో తీసుకున్న గనుల్లో పది శాతం కూడా ప్రైవేటు వారు ప్రారంభించలేదు. దీంతో 2014 అనంతరం వేలంలో తీసుకున్న చాలా బొగ్గు బావుల నుంచి 50 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తి రాలేదు. అయితే ఇప్పుడు మెగా గనులతో పాటు చిన్న, మధ్యతరహా బొగ్గు గనులను సైతం ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయనున్నారు. దీని వల్ల కోల్ ఇండియా, సింగరేణి కంపెనీలు నిర్వీర్యం కానున్నాయి. కార్పొరేట్ కంపెనీలు తొలుత బొగ్గు ధర తగ్గించి అమ్ముతాయి. తక్కువ జీతాలకు కార్మికులను, ఉద్యోగులను తీసుకుంటాయి. ప్రభుత్వ రంగంలోని బొగ్గు బావులు ఈ పోటీని ఎదుర్కోలేక నష్టాల్లోకి వెళ్తాయి. అనంతరం మళ్లీ కార్పొరేట్‌లు బొగ్గు ధర పెంచేస్తాయి. కేంద్రం తాజా నిర్ణయం ఫలితంగా ఇదే జరగబోతుంది. ఒక కుక్కను చంపాలంటే ముందు దానికి పిచ్చి కుక్క అని పేరు పెట్టాలి. అప్పుడు దాన్ని చంపితే ఎవరూ అడగరు. అదే విధంగా ఈ రోజు ప్రభుత్వ రంగంలో అద్భుతమైన లాభాలు సాధిస్తున్న బొగ్గు సంస్థలను నిర్వీర్యం చేసి ఆ తర్వాత ఉన్న ఇతర కంపెనీలను కూడా ప్రైవేట్ పరం చేసే కుట్రకు కేంద్రం తెరలేపింది.

■ ఎండీ. మునీర్

వందేళ్ల క్రితమే 'స్వచ్ఛభారత్'ను కలగన్న గాడ్గే



బాపూజీ కలను సాకారం చేయడానికి మన ప్రధాని మోదీ 2014, అక్టోబర్ 2న ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్‌ను జాతిపిత 150వ జయంతి నాటికి అంటే అక్టోబర్ 2, 2019 లోగా సాధించాలని సంకల్పించారు. ఈ స్వచ్ఛభారత్‌ను వందేళ్ల క్రితమే (1907) కలగన్న అసామాన్యుడు గాడ్గే మహరాజ్/ గాడ్గే బాబా. దేశంలోనే గర్వించదగ్గ 19వ శతాబ్దపు గొప్ప సంఘ సంస్కర్త ఈ బాబా. మనుషులను ప్రేమించి మట్టి మనుషులను తట్టిలేపిన ఈ సాధు పుంగవుడు జీవితాంతం సమానత్వాన్ని ప్రబోధించాడు. మహారాష్ట్రలో అమరావతి జిల్లాలోని షేన్‌గావ్‌లో 1876, ఫిబ్రవరి 23న సక్కుబాయి, జింగ్రాజీలకు జన్మించిన గాడ్గే బాబా పూర్తి పేరు దేవూజీ జింగ్రాజి జనార్కర్.

దేవూజీ అంటే మరాఠీలో మట్టి చిప్ప. చేతిలో చీపురు, తలపై మట్టి చిప్ప, ఒంటిపై రంగురంగుల గుడ్డ పేలికలతో కూడిన దుస్తులు ధరించడం ఇతని ఆహార్యం. చీపురుపట్టి చిద్విలాసంగా ఫోటోలకు ఫోజులివ్వడం తెలియదు. కాని చీపురుతో వీధులను శుభ్రం చేయడంలో భాగంగా చీపురును తన ఆహార్యంలో భాగంచేసుకుని దానితో సహవాసం చేశాడు. అంబేడ్కర్ గాడ్గేబాబాను తన గురువుగా ప్రకటించుకున్నారు. జ్యోతిరావు పూలే అతని సంఘ సేవను చూసి అభినందించారు.

గాడ్గేబాబా తన 30వ ఏట భార్యా పిల్లలను వదలి దేశాటనకు బయలుదేరి సంచార సాధువుగా మారాడు. ఏ ఊరికి వెళ్ళినా తను మొదటగా చేసేది వీధులు ఊడ్చటం, దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరచటం. బాబా గుడిలో కీర్తనలు పాడితే జనం కిక్కిరిసి పోయేవారు. మూఢ నమ్మకాలు పాటించవద్దనీ, సాటి మనిషిని కులం పేరిట చిన్న చూపు చూడవద్దని బోధించాడు. కుల, మత, లింగ బేధం లేకుండా మనుషులందరూ సమానమన్న ఆయన మాటలు, చేతల్లోని నిజాయితీ జనాలను కట్టిపడేసింది. అనాథాశ్రమాలు, బాలికా సదనాలు, పాఠశాలలు, వసతి గృహాలు, ధర్మశాలలు... ఇలా మొత్తం 150 నిర్మాణాలను ప్రజల స్వచ్ఛంద సహకారంతో చేపట్టి పూర్తి చేశాడు. ఒక్క పైసా కూడా చందా అడగకుండానే– వీటిని చేపట్టడంతో మహారాష్ట్రలో ఎందరో ప్రముఖులు, సామాన్యులు ఆయన అభిమానులుగా మారారు.

మహారాష్ట్రను సోషలిస్ట్ భావాల వేదికగా చేసింది గాడ్గే బాబాయే అని ప్రముఖ మరాఠా రచయిత ఆత్రే ప్రశంసించారు. ఆ రోజుల్లో ఏ పొలం పనో, మట్టి పనో, కుమ్మరి పనో చేసి రెండు రొట్టెలు సంపాదించి ఆరగించేవాడు. పాడుబడ్డ గోడల మాటునో దేవాలయంలోనో తలదాచుకునేవాడు. రోడ్డు మీద తిని, రోడ్ల పక్కనే జీవించి, చివరికి రోడ్డు పక్కనే 1956 డిసెంబర్ 20న గాడ్గే బాబా తనువు చాలించాడు. ఆనాడే కులరహిత సమాజాన్ని నిర్మించి, స్వచ్ఛ భారత్‌ను కలగన్న మహనీయుడు ఆయన. గాడ్గే బాబాకు జ్ఞాపికగా మహారాష్ట్రలోని అమరావతిలో 'సెయింట్ గాడ్గే బాబా యూనివర్సిటీ'ని 1983లో స్థాపించారు. గాడ్గే బాబా చూపిన బాటలో మన పాలకులు ప్రజలు నడిస్తే స్వచ్ఛ భారత్ కల సాకారమవుతుంది. అదే మనం ఆయనకు అర్పించే ఘన నివాళి అవుతుంది.

■ గుమ్మడి లక్ష్మీనారాయణ

(నేడు గాడ్గే బాబా 142వ జయంతి)

బార్డోలీ: భారత రైతు జయపతాక



మహాత్ముని మార్గనిర్దేశంలో, సర్దార్ పటేల్ సారథ్యంలో తొంభై సంవత్సరాల క్రితం బార్డోలీలో భారతీయ రైతులు సత్యం తమ పక్షాన ఉన్నదని నిరూపించారు. సహనం, సంయమనమే తమ ఆయుధాలుగా ఉద్యమించి, తిరుగులేని అజేయ శక్తిగా నిలిచి ఒక మహా సామ్రాజ్యాన్ని గడగడలాడించారు.

సామాన్యులు సమైక్యమయితే సామ్రాజ్యాలూ కుదేలవుతాయి. 1928 ఫిబ్రవరిలో ప్రారంభమైన బార్డోలీ సత్యాగ్రహమే ఇందుకొక నిదర్శనం, భారత జాతీయోద్యమంలో ఒక ప్రధాన ఉదంతమైన ఈ సత్యాగ్రహం సర్దార్ వల్లభ్ భాయి పటేల్‌కు ఎనలేని పేరు ప్రతిష్ఠలను తెచ్చింది. ఆయనకు జాతీయ నాయకుడిగా గుర్తింపు నిచ్చింది. అంతేకాదు, చౌరీచౌరా సంఘటనతో మహాత్మాగాంధీలో అడుగంటిన సమరోత్సాహాన్ని పునరుద్ధరించింది.

బార్డోలీ (గుజరాత్‌లోని సూరత్ జిల్లాలో 600 చదరపు కిలో మీటర్ల వైశాల్యంలో 137 గ్రామాలతో, 87 వేల జనాభా ఉన్న ఒక తాలూకా) సత్యాగ్రహం నెలల తరబడి పగటి పూట గ్రామాలను నిర్మానుష్యం చేసి, సూర్యాస్తమయం తరువాత ఆ పల్లెలను ఊపిరిసలపని రాజకీయ కార్యకలాపాలకు నెలవులుగా మార్చి వేసింది. బార్డోలీ సత్యాగ్రహం మహాత్ముని దండి యాత్రకు దారి చూపిన ఆందోళన అనడంలో సందేహం లేదు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కుదిపివేసిన ఉద్యమం ఉప్పు సత్యాగ్రహం. 'అర్ధనగ్న ఫకీరు' అనే అధిక్షేపణకు గురవుతున్న మహాత్ముడు తన అనుయాయులతో సముద్రతీర దండి గ్రామానికి వెళ్ళి స్వయంగా ఉప్పు తయారు చేసి వలస పాలకులను గడగడలాడించిన ఉద్యమమది.

బార్డోలీ సత్యాగ్రహం నేపథ్యాన్ని నిశితంగా తరచి చూస్తే ఒక నగ్న సత్యం స్పష్టమవుతుంది. భారత ప్రజల సామాజిక–ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి గాక తమ సొంత ఖజానాను మరింతగా నింపుకునేందుకు తోడ్పడే మార్గాలను కనుగొనడానికే బ్రిటిష్ వలస పాలకులు అగ్ర ప్రాధాన్యమిచ్చారన్నదే ఆ కఠోర సత్యం. 1896లో స్థిరపరచిన భూమి శిస్తును ఏ మేరకు అధిక స్థాయికి సవరించవచ్చనే విషయమై బాంబే ప్రొవిన్షియల్ సివిల్ సర్వీస్‌లోని భారతీయ అధికారి ఒకరు రూపొందించిన నివేదిక ఒకటి బార్డోలీ పోరాటాన్ని పురిగొల్పింది. ముంబై ప్రెసిడెన్సీ గవర్నర్ ఆదేశం మేరకు ఆ అధికారి ఆ నివేదికను రూపొందిచారు. అప్పటికి అమలులో ఉన్న భూమి శిస్తును 30 శాతానికి పైగా పెంచాలని ఆ నివేదికను రూపొందించిన ఎమ్. ఎస్. జయకర్ సిఫారసు చేశారు.

బార్డోలీ తాలూకాలోని వ్యవసాయదారులు జయకర్ నివేదిక సిఫారసులను ధిక్కరించారు. ఇందుకు రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది– బొంబాయి ప్రెసిడెన్సీలో రైత్వారీ విధానం అమలులో ఉన్నది. ఈ విధానంలో రైతులు తాము సాగుచేసుకొనే భూములకు యజమానులు. ప్రభుత్వం వివిధ సర్వేల ఆధారంగా నిర్ణయించే భూమి శిస్తును వారు చెల్లిస్తారు. రెండవది– మహాత్ముడు 1922లో బార్డోలీలో శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే చౌరీ చౌరా సంఘటనతో ఆ నిర్ణయాన్ని త్యజించారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ బార్డోలీ ప్రాంతంలో తన రాజకీయ కార్యకలాపాలను ముమ్మరంగా కొనసాగించింది. స్థానిక ప్రజలు, నాయకులలో రాజకీయ చైతన్యాన్ని బాగా పెంపొందించింది. బార్డోలీ ప్రాంతపు హిందువులలో నాలుగు ప్రధాన వర్గాల– పాటీదార్లు, బ్రాహ్మణులు, బనియాలు, కలీపరాజ్ (వెనుకబడిన వర్గాలు)– వారితోనూ పటిష్ఠ రాజకీయ సంబంధాలను ఏర్పరచుకొంది. వీరితో పాటు పార్సీలు, ముస్లింలను కూడా బాగా ప్రభావితం చేసింది. సాంఘిక సంస్కరణలు, రాజకీయ కార్యకలాపాలు బార్డోలీలో ఒక జీవన విధానంగా రూపొందాయి. భూమి శిస్తు పెరుగుదలను బార్డోలీ రైతులు తీవ్రంగా వ్యతిరేకించడానికి ఆ సామాజిక, రాజకీయ జాగృతి ఎంతైనా దోహదం చేసింది.

వలస పాలకుల చర్యను నిరసిస్తూ బార్డోలీ రైతులు సమష్టిగా ఉద్యమించారు. ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడానికి తమ తరఫున ఒక ప్రతినిధి బృందాన్ని పంపారు. అయితే ప్రజా ప్రతినిధులకు ఇవ్వాల్సిన మర్యాదను ఆ బృందం సభ్యులకు అధికారులు ఇవ్వలేదు. దీనిపై రైతులు ఆగ్రహించారు. జాతీయోద్యమ పత్రికలు, మరీ ముఖ్యంగా మహాత్మా గాంధీ సొంత పత్రిక 'యంగ్ ఇండియా' బార్డోలీ రైతుల ఉద్యమానికి మద్దతునిచ్చాయి.

జయకర్ నివేదిక సిఫారసులను ప్రజల కోణం నుంచి పరిశీలించడానికి ప్రభుత్వం విముఖత చూపింది వ్యవసాయ ఉత్పత్తుల ధరల ఆధారంగా గాక , రెవెన్యూ శాఖ జూనియర్ అధికారులు లెక్కకట్టిన భూమి కౌలు, అద్దెల ప్రాతిపదికన భూమి శిస్తును వసూలు చేస్తామని 1927జూలైలో ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం తమ మొర పట్టించుకోకపోవడంతో భూమి శిస్తు చెల్లింపును నిలిపివేయాలని బార్డోలీ రైతులు నిర్ణయించుకున్నారు. జాతీయవాదులలోని మితవాదులు రైతుల తరఫున ప్రభుత్వాధికారులతో జరిపిన సంప్రదింపులు ఎటువంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. దీంతో వారు సర్దార్ పటేల్ సహాయాన్ని కోరారు. అప్పటికే నాగపూర్, ఖేడా, బొర్సాద్ సత్యాగ్రహాలకు నాయకత్వం వహించిన అనుభవమున్న పటేల్ బార్డోలీ రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించడానికి అంగీకరించారు.

1928 ఫిబ్రవరి 4న (పెంచిన పన్ను మొదటి విడత వసూళ్ళ ప్రారంభానికి ముందు రోజు) బార్డోలీలో జరిగిన రైతుల సమావేశానికి సర్దార్ పటేల్ అధ్యక్షత వహించారు. పెంచిన పన్ను ఉపసంహరించుకోవాలని కోరుతూ ముంబై గవర్నర్‌కు పటేల్ లేఖ రాశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. ఇదిలావుండగా శిస్తు చెల్లింపునకు ఫిబ్రవరి 15ను గడువుగా నిర్ణయించారు. ఆ తేదీలోగా శిస్తుచెల్లించని రైతుల భూములు, పశువులను స్వాధీనం చేసుకొనేందుకు స్థానిక అధికారులకు అనుమతినిచ్చారు.

బార్డోలీ తాలూకా వ్యవసాయదారులు ఫిబ్రవరి 12న మరోసారి సమావేశమయ్యారు. పెంచిన పన్నును చెల్లించే ప్రసక్తే లేదన్న రైతుల నిర్ణయాన్ని ఆ సమావేశం పునరుద్ఘాటించింది. కట్టాల్సిన పన్నును తాజాగా అంచనా వేయడానికి ప్రభుత్వం ఒక స్వతంత్ర ట్రిబ్యునల్‌ను నియమించాలని లేదా గతంలో కట్టిన మొత్తాన్నే పూర్తి చెల్లింపుగా అంగీకరించాలని ఆ సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాలు ఆమోదించిన తరువాత రైతులు ఖురాన్ సురాలను, రామాయణ శ్లోకాలను, ఇతర హిందూ ప్రార్థనా గీతాలను పఠించారు. భారతదేశ చారిత్రక సమ్మేళనం, సర్దార్ పటేల్ సమ్మిళిత జాతీయవాదానికి ప్రతీకగా మార్మిక కవి కబీర్ పాటల ఆలాపనతో సత్యాగ్రహం ప్రారంభమయింది. పటేల్ ప్రోద్బలంతో బార్డోలీ ప్రజలు పెద్ద సంఖ్యలో సత్యాగ్రహంలో భాగస్వాములయ్యారు. ప్రభుత్వ ఒత్తిడికి కొంత మంది బనియాలు లొంగిపోయినప్పటికీ రైతుల ఉద్యమం చివరివరకూ సమైక్యంగాఉన్నది. సూర్యాస్తమయం తరువాత అరెస్టులు జప్తులు చేయకూడదనే నిబంధన ఉండడంతో రాత్రి పూట మాత్రమే ప్రజలు చురుగ్గా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనేవారు. సాయంత్రం ఐదు తరువాత మాత్రమే సర్దార్ పటేల్ దినసరి కార్యకలాపాలు ప్రారంభమయ్యేవి. తెల్లవారుజామువరకు ఆయన గ్రామాల్లో పర్యటిస్తూ వుండేవారు. సత్యాగ్రహుల కార్యకలాపాలను సైనిక పద్ధతుల్లో పటేల్ నిర్వహించేవారు. ఉద్యమానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పత్రికలకు అందజేయడానికి ఆయన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పటేల్ నాయకత్వ పటిమ, సంస్థాగత నిర్వహణా సామర్థ్యం బార్డోలీ ఉద్యమంలో రుజువయ్యాయి. 'బార్డోలీలో సర్దార్ తన వల్లభ్ (దేవుడు)ను కనుగొన్నారని' మహాత్ముడు వ్యాఖ్యానించారు. బార్డోలీ సత్యాగ్రహం సంపూర్ణంగా జరిగింది. సర్దార్ పటేల్ బార్డోలీలో బోల్షివిక్ పరిపాలనను నెలకొల్పారని, ఆయనే ఆ పాలనా వ్యవస్థ లెనిన్ అని ముంబైనుంచి వెలువడే ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక వ్యాఖ్యానించింది.

ప్రజలు మొక్కవోని దీక్షతో చేస్తున్న ఉద్యమం ప్రభుత్వంలోని వారిని కూడా ఆలోచింపచేసింది. బొంబాయి గవర్నర్ వైస్రాయితో సమావేశమయ్యారు. ఆ సమావేశమనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 'చట్టబద్ధ పాలనను పరిరక్షించడానికి వైస్రాయి కృతనిశ్చయంతో ఉన్నారని' పేర్కొంటూ ప్రజలను పెద్ద ఎత్తున కష్టనష్టాలకు గురిచేయడం తమ అభిమతంకాదని, వారి సంక్షేమం విషయంలో తన విధ్యుక్త ధర్మాన్ని తప్పకుండా నిర్వహిస్తానని తెలిపారు. అయితే తనను కలిసిన సర్దార్ పటేల్‌కు తాజాగా అంచనా వేసిన పన్నును మాత్రమే వసూలు చేస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరిని బ్రిటిష్ యాజమాన్యంలోని స్టేట్స్‌మన్ లాంటి పత్రికలు కూడా తీవ్రంగా నిరసించాయి. పరిస్థితి మరింతగా విషమించడంతో గవర్నర్ కౌన్సిల్‌లో కీలక సభ్యుడైన చునీలాల్ మెహతా ఒక పరిష్కారాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం ప్రభుత్వం భూమి శిస్తును ఏ మేరకు పెంచాలనే విషయమై తాజాగా అంచనా వేయడానికి ఒక కమిటీనినియమించింది. భూమి శిస్తును 5.7శాతం మాత్రమే పెంచాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూములను, జప్తు చేసిన ఇతర ఆస్తులను వారికి తిరిగి ఇచ్చివేయాలని కూడా సిఫారసు చేసింది. ప్రభుత్వం ఈ సిఫారసులను ఆమోదించింది. అంతేగాక సత్యాగ్రహులకు సంఘీభావంగా ప్రభుత్వోద్యోగాలకు రాజీనామా చేసిన వారిని తిరిగి ఉద్యోగాలలోకి తీసుకోవడం జరిగింది. ఆసేతు హిమాచలం బార్డోలీ సత్యాగ్రహ విజయాన్ని కొనియాడారు. మహాత్ముని మార్గనిర్దేశంలో, సర్దార్ పటేల్ సారథ్యంలో తొంభై సంవత్సరాల క్రితం బార్డోలీలో భారతీయ రైతులు సత్యం తమ పక్షాన ఉన్నదని నిరూపించారు. సహనం, సంయమనమే తమ ఆయుధాలుగా ఉద్యమించి, తిరుగులేని అజేయ శక్తిగా నిలిచి ఒక మహా సామ్రాజ్యాన్ని వారు గడగడలాడించారు.


■ నీలాంజన్ ముఖోపాధ్యాయ

రచయిత, పాత్రికేయుడు

(ది వైర్ సౌజన్యం)

మన మూలాలు, ఆనవాళ్లు

■ తెలకపల్లి రవి




గమనం

పట్టుపట్టరాదు పట్టి విడవరాదు పట్టెనేని బిగియపట్టవలయు అన్నాడు వేమన్న అచ్చ తెలుగులో. అంతకు ముందే భర్తృహరి ఆరంభించరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై.. అంటూ రాశాడు. ఏ పనైనా మొదలెట్టాక మధ్యలో ఆపేయడం ధీర లక్షణం కాదు. ఈ సూక్తినీ స్ఫూర్తినీ మనసారా నమ్మిన ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ (ఇప్పటికీ ఒకటిగానే కొనసాగుతున్నది) నిష్ణాతులు పెద్దలు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ సారథ్యంలో ఏడువేల ఏళ్ల తెలుగు భాషా ప్రజల సమగ్ర చరిత్ర క్రీపూ.5000 నుంచి క్రీశ 1990ల వరకూ వెలువరించేందుకు గత ఇరవయ్యేళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తూనే వచ్చింది. ఆంధ్ర ప్రదేశ్ రెండుగా విడిపోయినా చరిత్రకారులూ ఇతర నిపుణులూ అనుకున్న ప్రకారమే ఒక్కతాటిపై నిలబడి సంకల్పం పూర్తి చేశారు. 2016లో ఎనిమిదవ సంపుటం వెలువడటంతో ఆ ఘట్టం ముగిసింది. అయితే ఈ సంపుటాలలోని చరిత్ర రచనకు ఆకరాలుగా నిలిచిన పుస్తకాలు పత్రాలు ఆధారాలు కూడా అందజేస్తే తెలుగు జాతికి మహోపకారం జరుగుతుందని జిజ్ఞాసులే గాక పరిశోధకులూ అభ్యర్థించారు. అప్పటికే ఈ ప్రణాళిక అమలులో అలసి సొలసివున్న ఆచార్య రామకృష్ణ తన జీవితంలోనూ చరిత్ర రచనలోనూ సహధర్మచారిణి లలితగారిని కోల్పోయిన స్థితి. అయినా అంతటి బాధను దిగమింగి ఆచార్యులుగా అనుసంధానకుడిగా కర్తవ్యం నిర్వహించారు. వేల ఏళ్ల తెలుగు చరిత్ర ఆధారాల గురించిన నికరమైన నిగ్గుతేలిన ఆధారాల జాబితాలతో వివరాలతో వేయి పుటల మరో పెన్నిధికి సంపాదకత్వం వహించారు. ఇంత విస్తృత స్థాయిలో ఇలాటి పుస్తక రూపకల్పన ప్రచురణ దేశంలోనే ఇదే ప్రథమం కావడం తెలుగువారికి గర్వకారణం. 200 మందికి పైగా చరిత్రకారులు నిపుణులు కలసికట్టుగా పని చేసి తీసుకొచ్చిన ఈ బృహత్ సంపుటం చరిత్ర కాంగ్రెస్ ఇరవయ్యేళ్ల కృషికి పతాక సన్నివేశం. భావి పరిశోధకులకూ పండితులూ పఠితలకు చరిత్ర విజ్ఞాన సులభ సంధర్శిని.

నిన్నటి ఆ చరిత్ర లేనిదే నేడూ లేదు రేపూ సరిగ్గా వుండదు. గత చరిత్ర మరిస్తే భవిష్యత్తు వుండదని అందుకే హెచ్చరిస్తుంటారు. అయితే చరిత్ర రచన, వీక్షణ ఎప్పుడూ కత్తి మీద సామే. తెలుగు రాష్ట్ర విభజనకు ముందూ వెనక జరిగిన వాదోపవాదాలు, పద్మావతి చిత్రంపై పగలూ పంతాలూ ఇంకా కళ్ల ముందు చూస్తున్న అనేక వాద ప్రతివాదాలు చూస్తే చరిత్ర రచన ఎంత కష్టమో తెలుస్తుంది. అందుకే 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' అని ఈసడించిన మహాకవి 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు' అంటూ 'రుద్రమాంబ భద్రకాళి లోచనోజ్వల రోచులేవీ?' అని ప్రశ్నించారు. 'చారిత్రిక విభాత సంధ్యల మానవ కథ వికాసమెట్టి'దని అడిగారు. ఇందుకు సమాధానం ఒక్క ముక్కలోనో ఒక్క బుక్కులోనో చెప్పడం కుదిరేపని కాదు గనకే ఇన్ని సంపుటాలు అవసరమైనాయి. పరస్పర సంబంధం చూపిస్తూ ప్రామాణిక సమాచారంతో కాల క్రమణికను పాటిస్తూ ఏకసూత్ర కథనం తయారు కావాలి. పరస్పరం సంఘర్షించిన శక్తులతో చరిత్ర ఎలా పుట్టిందో చెప్పగలగాలి. రాజకీయార్థిక విషయాలే గాక సామాజిక సాహిత్య కళాంశాల పరిణామం పట్టి చూపాలి. చాలా విషయాలకు సరైన సంతృప్తికరమైన సమాధానాలు అందించే ఆధారాలుండవు. మరికొన్ని సందర్భాల్లో అపారమైన సమాచారవనరులుంటాయి గాని వాటిలోని సమాచారం మధ్య పొంతన కూడా వుండదు.

ఉదాహరణకు రాతియుగం గురించి స్వల్పంగా ఆధారాలుంటే, రాయలవారి యుగంలో మహాకవుల రచనలతో సహా అధికారిక పత్రాలూ వున్నాయి. కాని వాటిలోని సమాచారం సమన్వయం చేయడం కష్టంతో కూడుకున్న పని. విజయనగర స్థాపన ఏ పరిస్థితిలో జరిగింది, దాన్ని స్థాపించిన హరిహర బుక్కరాయలు ఎవరి ఆస్థానం నుంచి వచ్చారు? కొన్ని ఆధారాలు వారి కాకతీయుల దగ్గర వుండేవారంటే మరికొన్ని ఆకరాలు వారి మూలాలు హోయసల రాజ్యంలో చూపిస్తాయి. కర్నూలు జిల్లాలోని వెలుగోటి ప్రభువులు తెలంగాణలోని రాచకొండ దేవరకొండల్లో కాకతీయుల సామంతులుగా వుండి వారి పతనానంతరం స్వతంత్రం ప్రకటించుకున్నారు. కొద్ది కాలంలోనే మొదట బహమనీలకూ తర్వాత విజయనగర రాజులకూ లోబడిపోయారు. పానగల్ యుద్ధంలో వారు విజయనగర రాజులను బలపర్చడంతో బహమనీలు క్రమంగా దెబ్బతిన్నాక వెలుగోడుకు చేరుకున్నారు. ఇదంతా అనేక ముందు వెనకల పరిణామ క్రమం. 'ఆ రాణి ప్రేమపురాణం ఈ ముట్టడికైన ఖర్చులూ మతలబులూ కైఫీయతులూ' ఇదే చరిత్ర సారం కారాదు గనక సామాజిక చరిత్ర కూడా రూపొందిస్తుండాలి. శాసనాలూ అప్పటి పరికరాల అవశేషాలు, చిత్రాలు శిల్పాలూ, కళా సాహిత్యాలూ జానపదాలు ఇంకా మిగిలివున్న గిరిజన తెగల ఆచారాలు, ఒక దశ తర్వాత నాణేలు అధికార పత్రాలు, విదేశీ పర్యాటకుల కథనాలు, ఇలాంటివన్నీ కలిపి విమర్శనాత్మకంగా బేరీజు వేసి చూడాలి. ఏ ఒక్క నిష్ణాతుడూ అన్ని సమస్యలూ అర్థం చేసుకోవడం సాధ్యం కాదనే దృష్టితోనే సంపాదకులు అనేక రకాల బాధ్యతల నిర్వహణ కోసం చరిత్ర బోధకులతో పాటు వివిధ రంగాల నిపుణులను కూడా కలుపుకుని పనిచేశారు. అందుకే ఈ చరిత్ర ప్రణాళిక గతంలో తెలుగులో గాని మరే చోట గాని జరగనంత విస్తృతంగా నడిచింది. ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తలపెట్టిన ఈ పథకానికి భారత చరిత్ర పరిశోధనా మండలి (ఐసిహెచ్‌ఆర్), తెలుగు విశ్వ విద్యాలయాల సహకారం లభించింది. కొంతకాలం స్వంతంగానూ తర్వాత ప్రముఖ ప్రచురణ సంస్థలతో కలసి సంపుటాలను వెలువరించారు. ఇందులో పెద్దపాత్ర పోషించిన ఎమెస్కో సంస్థ ఇప్పుడు ఈ ఆకరాల కూర్పునూ ప్రచురించి అభినందన పాత్రమైంది.



'సోర్సెస్ ఆఫ్ హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ తెలుగు స్పీకింగ్ పీపుల్, బిసి 5000 – ఎడి 2016' (తెలుగు భాషా ప్రజల చరిత్ర, సంస్కృతి ఆకరాలు) అనే ఈ పుస్తకం ఒక దారి దీపం లాంటిది. ఇందులోని 16 అధ్యాయాలు ఒక్కో యుగం లేదా రంగం పరిణామాన్ని పట్టుకునే పద్ధతులేంటో, పుస్తకాలు పత్రాలు శాసనాలు ఏవేవివున్నాయో సూటిగా సుసంపన్నంగా వివరిస్తాయి. చరిత్ర దశలతోపాటు కళా సాహిత్యాలు, జానపద కళలు, నిర్మాణ కౌశలం వంటివి విడివిడిగా రాయడం సముచితంగా వుంది.

'సోర్సెస్ ఆఫ్ హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ తెలుగు స్పీకింగ్ పీపుల్, బిసి 5000 – ఎడి 2016' (తెలుగు భాషా ప్రజల చరిత్ర సంస్కృతి ఆకరాలు) అనే ఈ పుస్తకం ఒక దారి దీపం లాంటిది. ఇందులోని 16 అధ్యాయాలు ఒకో యుగం లేదా రంగం పరిణామాన్ని పట్టుకునే పద్ధతులేంటో, పుస్తకాలు పత్రాలు శాసనాలు ఏవేవివున్నాయో సూటిగా సుసంపన్నంగా వివరిస్తాయి. చరిత్ర దశలతోపాటు కళా సాహిత్యాలు జానపద కళలు, నిర్మాణ కౌశలం వంటివి విడివిడిగా రాయడం సముచితంగా వుంది. రాసిన వారందరూ ఆరితేరిన వారే. ఆధారాలు ఇవ్వడమే గాక వాటిని ఎలా అర్థం చేసుకోవాలో కూడా వివరణ లభిస్తుంది. ఒకో అధ్యాయానికి చివర ఒకో పేజీకి 15 నుంచి 20 వరకూ వుండే సూచికల్లో వందల వందల గ్రంథాలు పరిశోధనా పత్రాలు శాసనాలు, శిల్ప చిత్ర సంకేతాలు తెలుసుకుంటాం.

ఈ సమయంలో గుర్తు చేసుకోవలసిన మహోన్నత చరిత్రకారులు ఎందరో. చరిత్ర పూర్వపు దశ అయిన క్రీపూ.5000 కాలంపై వెలుగు ప్రసరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశపు చరిత్రపూర్వ రాజధాని అని వర్ణించిన హెచ్.డి. సంకాలియా ఈ జాబితాలో ప్రథములుగా వుంటారు. నిత్య స్మరణీయులుగా వెలుగొందుతున్న చిలుకూరి నారాయణ రావు, చిలుకూరి వీరభద్రరావు, కొమర్రాజు లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరి వెంకట రమణయ్య, సురవరం ప్రతాపరెడ్డి వంటివారి అడుగుజాడల్లో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ కృషి కొనసాగిస్తున్నదంటూ ప్రవర చెప్పుకుని ప్రారంభించారందుకే. ఆ దీటైన వారసత్వంతో సాధకబాధకాలు కష్టాలు కడగండ్లు ఖాతరు చేయకుండా పదండి ముందుకు అంటూ నడిపించిన వకుళాభరణం, ఆయనతో అడుగులు వేసిన అధ్యయన తత్పరులూ, అండనిచ్చిన విజ్ఞానాభిలాషులూ చరిత్ర విద్యార్థులూ ప్రశంసా పాత్రులవుతున్నారు. తెలుగు రాష్ట్రాలు బహువచనమైనా తెలుగు భాషా ప్రజల చరిత్ర కలివిడిగానే వుంటుంది. దాని సారాంశాన్ని సందేశాన్ని తెలుసుకోవడం ఉభయ రాష్ట్రాలకూ ఉపయుక్తమే గాక ఉత్తేజకారణమూ అవుతుంది. ■

మిర్చి రైతుల కన్నెర్ర



ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సిబ్బందిని నిలదీస్తున్న మిర్చి రైతులు

ఖమ్మం మార్కెట్ యార్డులో ఆందోళన.. భువనగిరికి పోటెత్తిన కందులు

▸▸ నల్లగొండ మార్కెట్‌లో కోమటిరెడ్డి నిరసన

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: గిట్టుబాటు ధర కావాలంటూ మిర్చి రైతులు ఆందోళనకు దిగారు. ఖమ్మం మిర్చి మార్కెట్ యార్డులో గురువారం జెండాపాట రూ.9700గా నిర్ణయించారు. అయితే జెండాపాట కంటే తక్కువగా కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు ఆగ్రహించారు. క్వింటాలుకు రూ.7వేల నుంచి రూ.8వేల వరకు నాణ్యమైన మిర్చికి ధర ఇస్తుండటంతో రైతులు కొనుగోళ్లను నిలిపేశారు. ఇదే నాణ్యత కలిగిన మిర్చి బుధవారం రూ.9వేలకు కొనుగోలు చేశారని, ఒకే రోజులో క్వింటాకు వెయ్యి నుంచి రూ.2వేల ధర తగ్గించి కొనుగోలు చేయడంతో తాము నష్టపోతామంటూ ఆగ్రహించిన రైతులు మార్కెట్ కమిటీ గేట్లకు తాళాలు వేసి మార్కెట్ కార్యదర్శి, సూపర్‌వైజర్‌ను నిర్బంధించారు. అక్కడికి చేరుకున్న సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, టీడీపీ నాయకులు రైతులతో కలిసి ధర్నాకు దిగారు. సుమారు 6గంటల ఆందోళన అనంతరం కొనుగోలుదారులు ఉదయం రూ.7వేల నుంచి రూ.8900కు కొనుగోలు చేసిన మిర్చికి క్వింటాకు అదనంగా రూ.200ధరను తక్‌పట్టీలో ఇచ్చి కొనుగోలు చేసేందుకు అంగీకరించారు. ఈ రోజు మిర్చి కొనుగోలు చేయబోయే మిర్చికి నాణ్యతను బట్టి క్వింటాకు 8 నుంచి 9వేలకుపైగా ధర పెట్టి కొనుగోలు చేస్తామని అంగీకారం తెలిపారు. దీంతో కొనుగోళ్లు జరిగాయి. కాగా, రైతులను దోపిడీ చేసేందుకు కమీషన్ ఏజెంట్లు సిద్ధమయ్యారు. మిర్చి దిగుమతులు పెరిగిపోతుండడంతో కొందరు కమీషన్ ఏజెంట్లు రింగ్ అవుతున్నారు. వారం రోజుల్లో మిర్చి ధరలు క్వింటాల్‌కు దాదాపు రూ.4వేలకు పడిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మలక్‌పేట, బేగంబజార్, బోయిన్‌పల్లి మార్కెట్లలో మిర్చికి తగిన ధర రాక రైతులు నిరాశకు గురవుతున్నారు. ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో మొదటి రకం క్వింటాల్‌కు రూ.8500 నుంచి రూ.10,500 పలుకుతుండగా, హైదరాబాద్ మార్కెట్‌లో 7వేల నుంచి రూ,8500కే పలుకుతోంది. దీంతో ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ మార్కెట్‌లో రైతులు ఆందోళనలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులోని కందుల కొనుగోలు కేంద్రానికి గురువారం కందులు పోటెత్తాయి. వారం రోజులుగా కొనుగోళ్లు నిలిపివేసి బుధవారం తిరిగి ప్రారంభించిన భువనగిరి కొనుగోలు కేంద్రంలో బుధవారం 118మంది రైతుల నుంచి 1,034 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశారు. గురువారం ఒక్కరోజే 170మంది రైతుల నుంచి 1,206 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. నల్లగొండ వ్యవసాయ మార్కెట్‌లో కందుల కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిరసన వ్యక్తంచేశారు. గన్నీ బ్యాగుల కొరత, సకాలంలో కాంటా వేయకపోవడాన్ని ఎమ్మెల్యే తప్పు పట్టారు. మార్కెట్‌లో రెండు రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడారు. అంతకుముందు కందుల కొనుగోలు చేయాలని రైతులు రాస్తారోకో చేశారు. ఆదిలాబాద్‌లోని మార్కెట్ గోదాంలలో అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీ కందుల గుట్టు రట్టయింది. మార్క్‌ఫెడ్ బస్తాల్లో కల్తీ కందులను నింపుతున్నారనే సమాచారంతో అధికారులు దాడులు చేపట్టారు. మార్కెట్ యార్డులోని గోదాంలలో నిల్వ ఉంచిన దాదాపు 2,500 క్వింటాళ్ల కందులను సీజ్ చేశారు. నల్లగొండ జిల్లా చండూరు మార్కెట్ యార్డులోని ట్రేడర్ల గోదాముల్లో అక్రమంగా నిల్వ చేసిన 764 బస్తాల కందులను అధికారులు పట్టుకున్నారు. చండూరులోని కందుల కొనుగోలు కేంద్రానికి గురువారం ఆకస్మిక తనిఖీ కోసం వచ్చిన జేసీ నారాయణరెడ్డికి పలువురు రైతులు, నాయకులు గోదాముల్లోని అక్రమ నిల్వలపై ఫిర్యాదు చేశారు.





భువనగిరి కొనుగోలు కేంద్రానికి వచ్చిన కందులు, నల్లగొండ వ్యవసాయ మార్కెట్‌లో బైఠాయించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఎర్రజొన్నల కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపు

▸▸ ఉత్తర్వులు జారీ చేసిన మార్క్‌ఫెడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లాలో కొత్తగా మరో ఐదు ఎర్రజొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ మార్క్‌ఫెడ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మూరు డివిజన్ డొంకేశ్వర్, ఆలూర్, ఖుద్వాన్ పూర్, పిప్రి, గోవిందపేటలలో శుక్రవారం నుంచి కొత్త కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతుండగా.. కొత్త మరో ఐదింటితో కలిసి మొత్తం పది కేంద్రాల ద్వారా ఎర్రజొన్నల కొనుగోళ్లు జరుగనున్నాయి.

5 నుంచి రైతు పాదయాత్ర: జస్టిస్ చంద్రకుమార్



సోమాజిగూడ/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ జస్టిస్ బి చంద్రకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల కోసం వచ్చేనెల 5 నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రకటించారు. ఐదు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మార్కెట్‌ను పరిశీలించినప్పుడు రైతుల అవస్థలను స్వయంగా చూశామని, లంచాలు ఇచ్చి మరీ వాళ్లు తమ పంటను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటు బ్యాంకు రాజకీయాలతో బీసీలకు నష్టం

▸▸ బీజేపీ శాసన మండలి నేత రాంచందర్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుండడంతో బీసీలు నష్టపోతున్నారని బీజేపీ శాసన మండలి నేత ఎన్ రాంచందర్‌రావు ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాల్లో వారికే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహయాదవ్ అధ్యక్షతన జరిగిన ఒక రోజు కార్యశాలలో రాంచందర్‌రావు ప్రారంభోపన్యాసం చేశారు. బీసీ కమిషన్‌కు రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తిని చైర్మన్‌గా నియమించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో ఆ నిర్ణయం అమలు చేయలేదని ఆరోపించారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు వ్యక్తిగతంగా తనకు మంచి మిత్రుడని చెప్పారు. బీజేపీ శాసన సభాపక్ష నేత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించడం సిగ్గుచేటు అన్నారు.



అడుగంటుతున్న భూగర్భ జలాలు!

రాబోయే రోజుల్లో మరింత తగ్గే అవకాశం

▸▸ ఈ ఏడాది తక్కువగా నమోదైన వర్షపాతం

▸▸ బోరు బావులతో నీటిని తోడేస్తున్న రైతులు

▸▸ ప్రభుత్వానికి భూగర్భ జల విభాగం నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ తగ్గుదల మరింత వేగంగా ఉంటుందని భూగర్భ జల విభాగం అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవడంతో భూగర్భ నీటిమట్టం పెరగడానికి అవకాశం లేకపోయిందని, ఉన్న నీటిని కూడా వేగంగా తోడేయడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలిపారు. గత డిసెంబరుతో పోలిస్తే జనవరిలో భూగర్భ జలాలు సగటున 0.86 మీటర్ల మేరకు పడిపోయినట్లు పేర్కొన్నారు. ఇక గత ఏడాది జనవరితో పోలిస్తే సగటున 0.68 మీటర్ల మేరకు పడిపోయినట్లు వెల్లడించారు. భూగర్భ జల విభాగం నివేదిక ప్రకారం.. మేడ్చల్, హైదరాబాద్, గద్వాల, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో సాధారణం కంటే కొంత ఎక్కువ వర్షపాతం నమోదైంది. మరో 17 జిల్లాలో మాత్రం సాధారణ స్థాయిలోనే వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, మెదక్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, కుమ్రం భీం జిల్లాల్లో సాధారణం కంటే 20 నుంచి 59 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

వరిసాగు పెరగడం వల్లే..!

రాష్ట్రంలో వరిసాగు పెరగడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. గతంలో విద్యుత్తు కొరత, భూగర్భ జలాల లభ్యత ఆధారంగా పరిమితంగా వరిసాగు చేసే రైతులు.. ఇప్పుడు విద్యుత్తుకు కొరత లేకపోవడంతో గతం కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కానీ, నవంబరు నుంచి భారీ వర్షాలు లేకపోవడం, బోరుబావుల ద్వారా నీళ్లను తోడేస్తుండడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయని అంటున్నారు. రానున్నది వేసవి కాలం కావడంతో వరికి తడులు ఎక్కువగా పెట్టాల్సి ఉంటుంది. దీంతో మరింత వేగంగా పడిపోయే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

జిల్లాల వారీగా భూగర్భ నీటి మట్టాల వివరాలు (నీటి మట్టాలు మీటర్లలో)

జిల్లా పేరు	డిసెంబరు 2016	డిసెంబరు 2017
మహబూబ్‌నగర్	13.27	10.42
నాగర్‌కర్నూలు	15.14	12.29
వనపర్తి	8.36	6.24
గద్వాల	6,95	5.96
రంగారెడ్డి	14.42	10.82
మేడ్చల్	7.26	7.67
వికారాబాద్	9.72	11.74
మెదక్	12.45	14.78
సంగారెడ్డి	10.92	12.01
సిద్దిపేట	11.72	12.42
నిజామాబాద్	7.10	10.01
కామారెడ్డి	9.77	6.99
ఆదిలాబాద్	5.31	7.65
నిర్మల్	6.39	9.58
మంచిర్యాల	4.36	6.51
కుమ్రం భీం	6.84	8.46
కరీంనగర్	7.53	9.10
పెద్దపల్లి	7.14	9.20
జగిత్యాల	5.37	7.05
సిరిసిల్ల	8.29	13.36
వరంగల్ (అర్బన్)	5.66	5.71
వరంగల్ (రూరల్)	7.15	7.27
భూపాలపల్లి	8.76	9.86
మహబూబాబాద్	6.13	6.06
జనగాం	9.37	9.60
ఖమ్మం	6.27	5.76
భద్రాద్రి	8.93	8.74
నల్లగొండ	9.15	9.17
సూర్యాపేట	7.94	8.82
యాదాద్రి	9.59	10.31
హైదరాబాద్	6.37	6.99
మొత్తం	8.50	9.05

సాగులో సగానికిపైగా వరే: వ్యవసాయశాఖ

రబీ సాగులో సగానికి పైగా వరే ఆక్రమించింది. వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఇప్పటికి 7.41 లక్షల హెక్టార్లలో వరినాట్లు వేశారు. ఇది సీజన్ సాధారణం కంటే 20 శాతం ఎక్కువ. అన్ని పంటలూ కలిపి రబీలో ఇంత వరకు 12.56 లక్షల హెక్టార్ల మేర సాగులోకి రాగా.. ఇందులో వరి సాగు వాటానే 59 శాతం మేరకు ఉంది. అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరగడం, వివిధ ప్రాజెక్టుల కింద సాగుకు నీళ్లు వదలడం నేపథ్యంలో వరిసాగు గణనీయంగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇప్పటివరకు సాగైన వరిలో ఎక్కువగా బోరుబావుల కిందనే ఉన్నట్లు చెబుతున్నారు. వరిసాగులో ఇదే వేగం కొనసాగితే గతేడాది రబీ సీజన్‌లో సాగైన 8.66 లక్షల హెక్టార్ల మార్కును దాటే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

ఈ ఏడాది 2.5 మి.మీ వర్షపాతం

రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే 76 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ తెలిపింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు సాధారణంగా 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 2.5 మిల్లీ మీటర్ల మేర మాత్రమే వర్షపాతం నమోదైంది.

'తెలంగాణ'పై పరిశోధనలు జరగాలి

▸▸ సాహిత్య అకాడమీ చైర్మన్ సిధారెడ్డి

▸▸ మన సాహిత్యాన్ని పునర్నిర్మించుకోవాలి

▸▸ ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్



సదస్సులో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె. శ్రీనివాస్

బర్కత్‌పుర/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): త్యాగాల పునాదుల మీద ఆవిర్భవించిన తెలంగాణలో అనేక అంశాలపై విస్తృతమైన పరిశోధనలు జరగాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. సత్యాలను శోధించి, సాహిత్యానికి అనుసంధానం చేసినప్పుడే తెలంగాణ వంటి రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. నిజాం కళాశాల ఆడిటోరియంలో నిజాం కళాశాల, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో 'తెలంగాణ, దక్షిణ భారత సాహిత్య ఉద్యమాల సమాలోచన' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న యూజీసీ అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరిగినన్ని సాహిత్య ఉద్యమాలు మరెక్కడా జరగలేదన్నారు. అక్షరాలతో ఏదైనా సాధ్యమవుతుందని తెలంగాణ ఉద్యమం నిరూపించిందని గుర్తు చేశారు. అక్షరం అవసరమైతే విగ్రహాలను పడగొడుతుంది, లేకపోతే నిలబెడుతుందనేది ఉద్యమంలో నిరూపితమైందని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యం, చరిత్రకు సంబంధించి అనేక అంశాలకు పూర్తి స్థాయిలో ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి మన సాహిత్యాన్ని పునర్నిర్మించుకోవాలని అన్నారు. తెలంగాణ కావ్యాన్ని ప్రాంతీయ దృక్పథంతో పరిశోధించాలని చెప్పారు. తెలంగాణ భాష, మాండలికాన్ని చారిత్రకంగా ఆవిష్కరించి, ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి భాషను వాడారో దానిపై పదకోశాలను రూపొందించాలని పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి వెలువడిన నీలగిరి, గోల్కొండ పత్రికల పూర్తి కాపీలు అందుబాటులో లేవని, వాటి ఆధారాలన్నింటినీ చేర్చితేనే తెలంగాణ సాహిత్యానికి సమగ్రత వస్తుందన్నారు. శ్రమతో కూడుకున్న పరిశోధనలు చేయడానికి తెలంగాణ విద్యార్థులు సిద్ధం కావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం భాషపైన ఏర్పడిందని అన్నారు. తెలంగాణ మట్టికి సంబంధించి పరిశోధనలు సరిగా జరగడంలేదని, ఈ పరిశోధనలను పునర్నిర్మించుకోవాలని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి ఆటా పాటా ఊపిరి పోసిందని గుర్తు చేశారు.

గోదారమ్మ ఒడిలో వలస జీవులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని గోదావరి ఒడ్డున నివాసం ఏర్పరుచుకున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీలు వీరు. ఇక్కడ మిర్చి పంట ఎక్కువగా పండుతుండడంతో కూలీ పనుల కోసం వారానికి సరిపడా సరుకులతో వచ్చారు వీరంతా. కొత్తపల్లి సమీపంలో ఎర్ర తివాచీ పరిచినట్లుగా ఆర బోసిన మిర్చి కాయలను ఏరుతూ కూలీ పనుల్లో నిమగ్నమయ్యారీ ఆదివాసీలు. -చర్ల

'భాగమతి'లో షార్ట్ సర్క్యూట్

▸▸ తప్పిన పెను ప్రమాదం

కేసముద్రం, ఫిబ్రవరి 22: భాగమతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12577)లో గురువారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. దర్భంగా నుంచి మైసూర్ వెళుతున్న భాగమతి రైలులో ఓ ప్రయాణికుడు సెల్ చార్జింగ్ కోసం అడాప్టర్ పెట్టి స్విచ్ వేశాడు. దీంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మెరుపులు, పొగలు ప్రారంభమయ్యాయి. మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె సమీపంలో ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరగగా, ప్రయాణికులు చైను లాగడంతో రైలు నిలిచిపోయింది. రైల్వే సిబ్బంది వచ్చి షార్ట్ సర్క్యూట్ అయిన ప్రాంతాన్ని పరిశీలించి రైలును నేరుగా కేసముద్రం రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో రైలు ఆగిన వెంటనే పొగలు వస్తున్న బోగీలో నుంచి ప్రయాణికులు దూకి ఫ్లాట్‌ఫాం పైకి పరుగెత్తారు. స్టేషన్‌లో రైల్వే సిబ్బంది మంటలను ఆర్పారు. ఈ ఘటనతో రైలు సుమారు 30 నిమిషాలు ఆగింది. డోర్నకల్‌లో బోగీకి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశాక, రైలు వెళ్లిపోయింది.

చెల్లెళ్లకు బతుకునిచ్చి.. బిచ్చమెత్తుకొని..

ఓ వృద్ధురాలి దయనీయ గాథ

ముంబైలో అమితాబ్, దేవానంద్ ఇళ్లలో పాచిపని

▸▸ వచ్చిన డబ్బుతో చెల్లెళ్ల పిల్లలకు ఘనంగా పెళ్లిళ్లు

▸▸ అవసరాలు తీరాక ఇంట్లోంచి వెళ్లగొట్టిన తోబుట్టువులు

▸▸ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిపాలు.. ఆదుకున్న టీఆర్ఎస్ నేత

ముషీరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆమె తోబుట్టువులనే తన కుటుంబం అని భావించింది. పిల్లలు పుట్టడం లేదని భర్త వదిలేస్తే చెల్లెళ్లు, వారి పిల్లల కోసమే ప్రతిపైసా ఖర్చుచేసింది. చక్కని ఇల్లు కూడా కట్టించింది. చెల్లెళ్ల పిల్లలందరికీ ఉన్నంతలో ఘనంగా పెళ్లిళ్లు చేసింది.. వారు మాత్రం ఆమెను డబ్బును సమకూర్చే యంత్రంగానే చూశారు. చేతిలో డబ్బులన్నీ అయిపోయి, వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను నిర్దాక్షిణ్యంగా ఇంటి నుంచి గెంటేశారు! అందరూ ఉన్నా ఇప్పుడామె బుక్కెడు బువ్వ కోసం బిచ్చమెత్తుకుంటోంది. యాదాద్రి జిల్లా మోత్కూరుకు చెందిన నర్సమ్మ (80) దయనీయ గాథ ఇది. ఆమెకు తమ్ముళ్లు బండయ్య, బుచ్చయ్య, యాదయ్య.. చెల్లెళ్లు యాదమ్మ, బండెమ్మలు ఉన్నారు. అప్పట్లో నర్సమ్మ వివాహం లింగాల వెంకటనర్సుతో జరిగింది. నర్సమ్మకు పిల్లలు పుట్టడం లేదనే కారణంతో భర్త మరో పెళ్లి చేసుకున్నాడు. ఒంటరైన నర్సమ్మ.. బాబాయి రామస్వామితో కలిసి ఉపాధి కోసం 1984లో ముంబై వెళ్లింది. అక్కడ కూలీ పనులు చేసుకుంటున్న ఆమెకు పంజాబ్‌కు చెందిన రత్నమ్మ పరిచయమైంది. నర్సమ్మను ఆమె.. సినీ నటులు దేవానంద్, అమితాబచ్చన్ ఇళ్లలో పాచి పని చేసేందుకు కుదిర్చింది. అక్కడే పనిచేస్తూ వచ్చిన డబ్బులను నర్సమ్మ తన చెల్లెళ్లకే పంపేది. పదేళ్ల పనిచేశాక కామెర్లు రావడంతో నర్సమ్మ ఆరోగ్యం దెబ్బతింది. అమితాబ్, దేవానంద్ ఆమెకు కొంత డబ్బిచ్చి ఊరికి పంపిచారు. ఆ డబ్బుతోనే నర్సమ్మ తన చెల్లెళ్ల కూతుళ్ల వివాహాలను ఘనంగా జరిపించింది. ఆమె వద్ద డబ్బులన్నీ అయిపోవడంతో చెల్లెళ్లు ఆమెను సూటిపోటి మాటలతో వేధించారు. కొద్దిరోజులకు ఇంట్లో నుంచే వెళ్లగొట్టారు. తీవ్ర మనస్తాపంతో హైదరాబాద్‌కు చేరుకున్న నర్సమ్మ.. కవాడిగూడలో తెలిసిన వారి వద్ద ఉంటూ చిన్న చిన్న పనులు చేస్తూ బతికేది. వృద్ధాప్య సమస్యలతో తన పనులు తాను చేసుకోలేని స్థితిలో ఉప్పల్‌లో ఉంటున్న చెల్లెలు యాదమ్మ ఇంటికి ఎన్నోసార్లు వెళ్లింది. అయితే, ఎప్పటికప్పుడు వారు ఆమెను చీదరించుకున్నారనే తప్ప దగ్గరకు తీయలేదు. చివరకు ఆమె యాచకురాలిగా మారింది. కవాడిగూడలో రోడ్లపై బిచ్చమెత్తుకుంటూ బతుకుతోంది. వృద్ధాప్యంతో నర్సమ్మ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆమె దయనీయ స్థితిని చూసి చలించిన కవాడిగూడ గాంధీనగర్‌కు చెందిన టీఆర్ఎస్ నేత శ్రీశైలంయాదవ్ నర్మద ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన కుటుంబసభ్యులు దగ్గరుండి ఆమెకు సేవలు అందించారు. విషయాన్ని ఉప్పల్‌లోని నర్సమ్మ బంధువులకు తెలిపినప్పటికీ వారు తమకేమీ సంబంధం లేదని తేల్చారు. దీంతో ఆస్పత్రిలో చికిత్సకు అయిన బిల్లును శ్రీశైలం యాదవ్ చెల్లించారు. అనంతరం ఆమెను తన ఇంట్లోనే ఓ గదిలో ఉంచి బాగోగులు చూస్తున్నారు.

బంధువులు వెళ్లగొట్టారు

డబ్బంతా బంధువుల కోసమే ఖర్చు చేశాను. ఇప్పుడు ముసలితనంలో నన్నెవరూ పట్టించుకోవడం లేదు. ఉప్పల్‌లో ఉంటున్న చెల్లెలు నన్ను వెళ్లగొట్టింది. కవాడిగూడకు వచ్చి శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద బిచ్చమెత్తుకుంటూ బతుకుతున్నాను. పది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుంటే స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు.

- నర్సమ్మ



నర్సమ్మకు మందులు వేస్తున్న టీఆర్ఎస్ నాయకుడు శ్రీశైలం యాదవ్



ప్రపంచీకరణ నేపథ్యంలో మేనేజ్‌మెంట్ కెరీర్ స్వభావం మారుతోంది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో వస్తున్న మార్పులు, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. సబ్జెక్టు పరిజ్ఞానం, ఆచరణకుతోడు మానవీయ కోణం మేనేజ్‌మెంట్‌లో చేరింది. విలువలు, బాధ్యతలు, కుటుంబం, గౌరవం, విధేయత... ఇలా కొత్త పరిభాషకు మేనేజ్‌మెంట్ కోర్సు, ప్రొఫెషన్‌లో ప్రాధాన్యం పెరుగుతోంది. కంపెనీలు కూడా ఈ కోణంలో నైపుణ్యాలు ఉన్నవారికి నియామకాల్లో పెద్దపీట వేస్తున్నాయి.

జాబ్ ట్రెండ్స్

మేనేజ్‌మెంట్‌లో... మానవీయం

మేనేజ్‌మెంట్ విద్యార్థుల నుంచి భారతీయ సంస్థలు ఆశిస్తున్న ముఖ్య నైపుణ్యాలు.. నాలెడ్జ్ కాంపోనెంట్ (సంబంధిత రంగంపై అవగాహన), ప్రాక్టీస్ కాంపోనెంట్ (పని చేయడం, చేయించడంలో సమర్థత), బీయింగ్ హ్యూమన్ కాంపోనెంట్ (నైతిక విలువలు, దృక్పథం, కెరీర్, బాధ్యతల మధ్య సమన్వయం సాధించడం వంటివి). ఈ మూడు లక్షణాలు ఉంటే చాలు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కంపెనీలు రెడ్ కార్పెట్‌తో స్వాగతం చెబుతున్నాయి.

సబ్జెక్టు తెలివితేటలు

సబ్జెక్టు తెలివితేటలు (నాలెడ్జ్ కాంపోనెంట్) అంటే కేవలం సంబంధిత రంగంపై పరిజ్ఞానం ఉంటే చాలు అనుకుంటే పొరపాటే. ఎంబీఏ విద్యార్థులు ప్రతి విషయాన్ని ఆచరణాత్మక, వాస్తవిక దృక్పథంతో చూడగలగాలి. ఈ రెండూ కలిస్తే.. మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్‌గా మంచి కెరీర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

- దీనికి తరగతి గది పాఠాలు, పుస్తకాలు సరిపోవు. ప్రాపంచిక దృక్పథం.. వాస్తవ పరిస్థితులపై అవగాహన.. కంపెనీల కొత్త పోకడలు.. ఇలా ఎన్నో అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తద్వారా ఎంబీఏ పట్టాతో పాటు.. భవిష్యత్తు మేనేజ్‌మెంట్ నాయకులుగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుంది. అత్యంత ప్రాధాన్యం ఉన్న, ప్రాథమిక ఆవశ్యకత ఇది. ప్రతి విషయాన్ని పరిస్థితులకు అన్వయించే దృక్పథంతో వ్యవహరించగల నేర్పు ముఖ్యం.

ఆచరణాత్మక దృక్పథం

ఆచరణాత్మక దృక్పథం (ప్రాక్టీస్ కాంపోనెంట్)తో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సమర్థంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకు టీమ్ వర్క్, పీపుల్ మేనేజ్‌మెంట్ వంటి నైపుణ్యాలు అవసరమవుతాయి. ఇవి క్యాంపస్‌లో కాకుండా ఇంటర్న్‌షిప్ వంటి క్షేత్ర స్థాయి అధ్యయనాల ద్వారా అలవడుతాయి. కొద్ది రోజుల పాటు వాస్తవ పని వాతావరణం, పరిస్థితుల గురించి అనుభవపూర్వకంగా తెలుసుకోవడం, అవసరమైన నైపుణ్యాలపై అవగాహన పొందడం ఇంటర్న్‌షిప్ ద్వారా సాధ్యమవుతుంది. కోర్సు పూర్తయ్యే నాటికి ఇండస్ట్రీ రెడీగా తీర్చిదిద్దుకునేందుకు ఇంటర్న్‌షిప్ మంచి వేదిక. కాబట్టి మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను నిర్లక్ష్యం చేయకూడదు. ఏఐసీటీఈ కూడా మేనేజ్‌మెంట్ పాఠ్యప్రణాళికలో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది.

మానవ కోణం (బీయింగ్ హ్యూమన్)

బిజినెస్ స్కూల్స్ విద్యార్థులకు అనలిటికల్ స్కిల్స్ పెంపొందించడంలో ముందంజలో ఉంటున్నాయి. అంటే సంబంధిత రంగంపై అవగాహన కల్పించడం, ఆ రంగానికి అవసరమైన సిద్ధాంతాలను పరిచయం చేయడం, విశ్లేషించడం వంటి అంశాలను నేర్పిస్తున్నాయి. కానీ ప్రాక్టికల్ మేనేజ్‌మెంట్‌కు ఎంతో కీలకమైన 'బీయింగ్ హ్యూమన్' అంశాన్ని పట్టించుకోవడం లేదు.

- మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించేటప్పుడు కేవలం వ్యాపార సూత్రాలు, సిద్ధాంతాలే కాదు, వాటిని పాటించే క్రమంలో ఎన్నో నైతిక విలువలు, కెరీర్, కుటుంబం, బాధ్యతల విషయంలో సమన్వయం సాధించడం, పని చేస్తున్న సంస్థ పట్ల విధేయతతో ఉండటం, సహోద్యోగులను గౌరవించడం వంటి ఎన్నో అంశాలు ఇమిడి ఉంటాయి. వీటిని సరిగా ఆచరించినప్పుడే మంచి ప్రొఫెషనల్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది. విభిన్నంగా ఆలోచించడం, పని చేసేందుకు సంసిద్ధత, పాజిటివ్ ఆటిట్యూడ్ వంటివీ 'బీయింగ్ హ్యూమన్'లో ఇమిడి ఉంటాయి.

గుర్తించిన బి - స్కూల్స్

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు భవిష్యత్ కోణంలో నైపుణ్యాల అవసరాన్ని గుర్తించిన కొన్ని బిజినెస్ స్కూల్స్ ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాయి. ముఖ్యంగా మేనేజ్‌మెంట్ విద్యార్థులకు భవిష్యత్తులో విధుల నిర్వహణ పరంగా అత్యంత ఆవశ్యకమైన సహజ నైపుణ్యం 'నలుగురితో కలిసి పనిచేయడం', 'భిన్న నేపథ్యాలున్న క్లయింట్లతో సంప్రదించడం'. దీన్ని గుర్తించిన బి-స్కూల్స్.. ఇటీవల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌ను కూడా సమర్థంగా నిర్వహిస్తున్నాయి.

- క్యాంపస్ ఫెస్టివల్స్, సంబంధిత అంశాల్లో ఒక్కోదానికి ఒక్కో విద్యార్థి బృందాన్ని నియమిస్తున్నాయి. తద్వారా విద్యార్థులకు వారికి కేటాయించిన అంశాన్ని / ఈవెంట్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించే నైపుణ్యం లభిస్తుంది. వీటిని కూడా విద్యార్థులు సమర్థంగా వినియోగించుకోవాలి.
- ప్రముఖ బిజినెస్ స్కూల్స్.. విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంచేందుకు ఇటీవల చేపడుతున్న వినూత్న విధానం గ్రూప్ టాస్క్. విద్యార్థులను బృందాలుగా విభజించి.. ఒక్కో బృందానికి ఒక వాస్తవిక సమస్యను కేటాయించి.. పరిష్కార మార్గాలు కనుగొనాలని నిర్దేశిస్తున్నాయి. ఈ క్రమంలో బృందానికి ఒక ప్రొఫెసర్ పర్యవేక్షకుడిని నియమిస్తున్నాయి. ఫలితంగా సమస్యను విశ్లేషించి పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం లభిస్తుంది. బృందాన్ని నడిపించే లక్షణాలతో పాటు అందరితో కలిసి పనిచేసే సంస్కృతి సైతం అలవడుతుంది.

ఎందుకు కీలకం అంటే..

బీయింగ్ హ్యూమన్ అనే కాన్సెప్ట్‌ను కంపెనీలు ఎందుకు కీలకంగా భావిస్తున్నాయి అంటే.. సాధారణంగా ఉద్యోగంలో చేరిన 5 - 6 ఏళ్ల తర్వాత మేనేజ్‌మెంట్ నిపుణులు సీనియర్ / లీడర్ స్థాయికి చేరుకుంటారు. అంటే సంస్థను నడిపించే నాయకుడిగా ఎదుగుతారు. అప్పుడు సమర్థంగా విధులు నిర్వహించాలంటే మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తోపాటు బీయింగ్ హ్యూమన్ కాన్సెప్ట్ కూడా అవసరం. అందరం సమాజంలో భాగం. ఏ రంగమైనా సమాజాన్ని కాదని మనుగడ సాధించలేదు. ఈ నేపథ్యంలో వ్యాపార రంగంలో సామాజిక కోణాన్ని అన్వయించడానికి 'బీయింగ్ హ్యూమన్' చాలా అవసరం. బాధ్యతలను నిర్వహించేటప్పుడు నైతిక విలువలను పాటిస్తూ, సహోద్యోగుల్లో స్ఫూర్తి నింపుతూ, జట్టుగా పని చేసే విధంగా చూడటం, మంచి పని సంస్కృతిని నెలకొల్పేందుకు కృషి చేయటం.. ఇవన్నీ అవసరం. ప్రస్తుతం భారతీయ కార్పొరేట్ కంపెనీలు ఈ విషయంలో నిబద్ధతతో ఉంటున్నాయి. అందుకే నియామకాల్లో బీయింగ్ హ్యూమన్ భావనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

"నిజ జీవిత అనుభవాలే అతనికి స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితోనే కార్పొరేట్ కంపెనీల నుంచి ఆఫర్లు వచ్చినా కాదనుకొని సివిల్స్ దిశగా ప్రయత్నం ప్రారంభించాడు. తన పట్టుదలకు నిపుణుల ప్రోత్సాహం తోడవ్వడంతో ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 438.4 మార్కులు సాధించి ఎస్సీ కేటగిరీలో టాప్ స్థానంలో నిలిచాడు... **ఎద్దుల ఓబులేసు.** ఈ విజయ ప్రస్థానం అతని మాటల్లోనే.."

టాపర్స్ వాయిస్

సివిల్స్ స్ఫూర్తితో... గ్రూప్-1లో నెగ్గాను



ప్రస్తుత ఫలితాల్లో 438.4 మార్కులు వచ్చాయి. ఎస్సీ విభాగంలో టాపర్‌ని, ఓవరాల్‌గా చూస్తే నాది 15వ ర్యాంక్. ఈ మార్కులతో మున్సిపల్ కమిషనర్ లేదా డీఎస్పీ పోస్టు రావచ్చు. మున్సిపల్ కమిషనర్ పోస్టు మాత్రం పక్కాగా వస్తుందని భావిస్తున్నాను.

సన్నద్ధత ఇలా

సివిల్స్ కోసం గత ఐదేళ్లుగా ప్రిపరేషన్ సాగిస్తున్నాను. అదే క్రమంలోనే 2011లో గ్రూప్-1 పరీక్ష రాశాను. 2013లో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అయితే ఆ నోటిఫికేషన్ రద్దయింది. గ్రూప్స్ కోసం ప్రత్యేకంగా ఎటువంటి కోచింగ్ తీసుకోలేదు. సివిల్స్‌కు మాత్రం ఏపీ స్టడీ సర్కిల్ నుంచి కోచింగ్ తీసుకున్నా. అది గ్రూప్స్ కోసం చాలా ఉపయోగపడింది. ప్రిపరేషన్‌లో భాగంగా ప్రాథమిక అంశాలపై పట్టు కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదివాను. అదేవిధంగా ఆయా సబ్జెక్టుల కోసం ప్రత్యేకంగా ఉండే స్టాండర్డ్ పుస్తకాలను ఫాలో అయ్యాను. మరికొన్ని సబ్జెక్టుల కోసం సొంతంగా నోట్స్ రూపొందించుకున్నాను. ఇవన్నీ గ్రూప్-1 విజయంలో చాలా తోడ్పాటును అందించాయి. ప్రస్తుత గ్రూప్-1 మెయిన్స్‌లో జనరల్ ఎస్సేలో ఎక్కువ మార్కులు, సైన్స్ అండ్ టెక్నాలజీలో తక్కువ మార్కులు వచ్చాయి.

నేపథ్యం

మా స్వస్థలం ప్రకాశం జిల్లా పామూరు మండలం ఎనిమర్ల గ్రామం. నాన్న ఎద్దుల నమ్మయ్య, అమ్మ నాంచారమ్మ. మేము ఐదుగురం. అందులో నేను చిన్న వాణ్ని. ఇద్దరు అన్నయ్యలు, ఇద్దరు అక్కలు. వారు వ్యవసాయం చేస్తారు. నేను ఎనిమర్లలోనే ఒకటి నుంచి మూడో తరగతి వరకు చదువుకున్నాను. నాలుగు నుంచి ఎనిమిది వరకు పామూరులో 9, 10 తరగతులను కనిగిరిలో పూర్తి చేశాను. 10వ తరగతిలో 507 మార్కులు వచ్చాయి. ఆ సమయంలో స్కూల్ టాపర్‌ని. మార్కాపూర్‌లో ఇంటర్మీడియెట్ చదివాను. తరువాత విజయవాడలోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్‌లో చేరాను. 2009లో బీటెక్ పూర్తి చేశాను.

లక్ష్యం కోసం

బీటెక్ చేస్తున్నప్పుడే క్యాంపస్ ఆఫర్లు వచ్చాయి. అయినా నా లక్ష్యం సివిల్స్ కోసం వాటిని వదులుకున్నా. హైదరాబాద్ వచ్చి పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. ఇప్పటికి ఐదు సార్లు సివిల్స్ రాశాను. మరో ఐదు అవకాశాలు ఉన్నాయి. వాటిని కూడా ఉపయోగించుకుంటా. సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నప్పుడే 2013లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యాను. అందులో భాగంగా 2014 నుంచి రెండున్నర సంవత్సరాల పాటు ఉత్తరప్రదేశ్‌లో పని చేశాను. ఆ సమయంలో ప్రిపరేషన్‌పై దృష్టి కేంద్రీకరించడం కోసం సెలవులు తీసుకుని ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ సమయంలో చేసిన ప్రిపరేషన్ గ్రూప్-1 రాయడానికి చాలా ఉపయోగపడింది.

మొదటి ప్రభుత్వోద్యోగిని

మా ఊరి నుంచి మొదటి గ్రాడ్యుయేట్‌ను, మొదటి ప్రభుత్వోద్యోగిని కూడా నేనే. మాది వ్యవసాయాధారిత కుటుంబం. అయినప్పటికీ నాన్నకున్న అవగాహన మేరకు కలెక్టర్ లేదా గ్రూప్-1 ఆఫీసర్ అయితే బాగుంటుందని వారు. అది కూడా నాకు స్ఫూర్తినిచ్చింది. 2009 నుంచి చూస్తే ఈ విజయం సాధించేవరకు చాలా సమయం పట్టింది. ఈ సమయంలో కుటుంబం నుంచి ఎలాంటి ఒత్తిడి రాలేదు. నా ప్రయత్నాలకు మద్దతుగా నిలిచారు.

నిజ జీవిత అనుభవాలే

నిజ జీవిత అనుభవాలే నన్ను సివిల్స్ దిశగా నడిపించాయి. నేను చిన్నప్పటి నుంచి, అంటే మూడో తరగతి నుంచి బీటెక్ వరకు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో ఎదురయ్యే సమస్యలపై విద్యార్థి సంఘాలు కలెక్టర్ల దగ్గర ప్రస్తావించినప్పుడు వారు స్పందించే గుణం బాగా ఆకట్టుకుంది. వారు తమ అధికారాలతో చేసే పనులు నన్ను ఆకర్షించి ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఇక్కడ ఒక సంఘటనను ప్రస్తావించాలి. విజయవాడలో బీటెక్ చదువుతున్నప్పుడు నేను ఉన్న హాస్టల్ చాలా అసౌకర్యంగా ఉండేది. చాలా పాత భవనం. కొంచెం వర్షం పడ్డా నీటితో నిండిపోయేది. కూర్చోవడానికి, నిలబడటానికి ఇబ్బందిగా ఉండేది. దీంతో ఆ సమస్యను అప్పటి కలెక్టర్ ప్రకాశ్ రెడ్డితో ప్రస్తావించాను. దాంతో ఆయన 24 గంటల్లో నూతన భవనంలోకి హాస్టల్‌ను మార్చారు. ఒక కలెక్టర్‌కు ఇంత అధికారం ఉంటుందా అనిపించింది. ఇవన్నీ నాలో స్ఫూర్తిని నింపాయి. సివిల్స్ సంకల్పాన్ని బలంగా నాటాయి.

కీలకం.. ప్రాథమిక అంశాలపై పట్టు

విజయం ఒక్కసారి అలస్యం కావచ్చు కానీ దక్కకుండా పోదు. కాబట్టి ఓపికతో ఉండాలి. పట్టుదలతో ప్రయత్నించాలి. నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా ప్రిపరేషన్ ప్రారంభించాలి. నిరంతరంగా కృషి చేస్తూనే ఉండాలి. ముందుగా ఆయా సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేందుకు ప్రయత్నించాలి. తద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. దాంతో ఎటువంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చు.

ఇంటర్వ్యూ కోసం...

గ్రూప్-1 ఇంటర్వ్యూకు ఎంపికైన తరవాత... డాక్టర్ పి.వి. లక్ష్మయ్య సార్ దగ్గర గైడెన్స్ తీసుకున్నాను. అది నాకు చాలా ఉపయోగపడింది. అదేవిధంగా మోహన్ కందా సార్ ఇచ్చిన సూచనలు కూడా ఇంటర్వ్యూలో బాగా చేయడానికి ఉపకరించాయి. ఇంటర్వ్యూ 15 నిమిషాలపాటు జరిగింది. గతంలో పోల్చితే ఇంటర్వ్యూలో నాణ్యత పెరిగింది. గతంలో ఇంటర్వ్యూ బోర్డులో 11 మంది సభ్యులు ఉంటే ప్రస్తుతం బోర్డులో నలుగురు సభ్యులు మాత్రమే ఉన్నారు. మంచి వాతావరణంలో ఇంటర్వ్యూ జరిగింది. కేంద్ర ప్రభుత్వ అధికారిగా ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహించడంతో దానిపై ఎక్కువ ప్రశ్నలు వేశారు. అక్కడి రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌తో పోల్చితే తూర్పు ఉత్తర ప్రదేశ్ వెనుకబడి ఉండటానికి కారణాలు, అదేవిధంగా హాబీస్, బయోడేటా ఆధారంగా కూడా ప్రశ్నలు వేశారు.

జాబ్ కార్నర్

కేంద్రీయ విద్యాలయ

హైదరాబాద్ శివరాంపల్లిలోని కేంద్రీయ విద్యాలయ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- విభాగాలు: ఇన్‌స్ట్రక్టర్స్, కంప్యూటర్, మ్యూజిక్, డ్యాన్స్, స్పోర్ట్స్, ఆర్ట్, డిజిటల్
- అర్హత: ఒకటి నుంచి ఐదో తరగతి టీచర్లకు డిఇడి, ఆరు నుంచి పన్నెండో తరగతి టీచర్లకు బిఇడి అర్హత ఉండాలి. పీజీటీలకు 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు సీటెట్ అర్హత పొంది ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్ పరిజ్ఞానంతోపాటు హిందీ & ఇంగ్లిష్ మాధ్యమాల్లో బోధనా సామర్థ్యం ఉండాలి. టీజీటీలకు సంబంధిత సబ్జెక్టుల్లో సెకండ్ క్లాస్ మార్కులతో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సు / జనరల్ డిగ్రీ చేసి ఉండాలి. పీజీటీలకు రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎమ్మెస్సీ కోర్స్ / సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేసి ఉండాలి. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు బీఈ / బీటెక్ / బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) / బీసీఏ / ఎంసీఏ / ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్/ఐటీ/ ఎలక్ట్రానిక్స్ - కంప్యూటర్ సైన్స్) / (డిగ్రీ/ పీజీ) (మేథమెటిక్స్ / సైన్స్ సబ్జెక్టులు) పూర్తిచేసి ఉండాలి. ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ స్పోర్ట్స్ / గేమ్స్ / ఆర్ట్ క్రాఫ్ట్ విభాగాల్లో అనుభవం ఉండాలి. యోగా టీచర్లకు డిగ్రీతోపాటు యోగా తరగతులకు సంబంధించి ఏదైనా ట్రైనింగ్ పొంది ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ / రాత పరీక్ష ద్వారా
- ఇంటర్వ్యూ: ఫిబ్రవరి 27న
- వేదిక: Kendriya Vidyalaya, NPA, Shivarampally, NPA Campus, Zoo Park Road, Hyderabad.
- వెబ్‌సైట్: kvsvpnpaap.org

పోలీస్ అకాడమీలో డ్రైవర్లు

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పోలీస్ అకాడమీ (ఎస్వీపీఎన్‌పీఏ) - డ్రైవర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

- వయసు: 26 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. హిందీ, తెలుగు భాషలు మాట్లాడడం తెలిసి ఉండాలి. బ్యాడ్జ్ నెం. సహా వ్యాలిడ్ హెచ్‌ఎంవీ / ఎల్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.
- వేతనం: రోజుకి రూ.523
- ఇంటర్వ్యూ: మార్చి 6న
- వేదిక: Academy MT Garrage Site A, Shivarampally, Hyderabad - 500052
- వెబ్‌సైట్: www.svpnpa.gov.in

సీఆర్ఐడీఏలో యంగ్ ప్రొఫెషనల్స్

ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ)- తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.



- ప్రాజెక్టు పేరు: నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లయిమేట్ రెజిలెంట్ అగ్రికల్చర్
- మొత్తం ఖాళీలు: **28**
- విభాగాలవారీ ఖాళీలు: అగ్రికల్చరల్ ఎకనామిక్స్ 2, బయో ఇన్ఫర్మాటిక్స్ 2, సాయిల్ సైన్స్ / ఆగ్రోనమీ / ఆగ్రో ఫారెస్ట్రీ 8, మెటరాలజీ 1, సాయిల్ & వాటర్ కన్జర్వేషన్ 1, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ 1, అగ్రికల్చర్ 1, ప్లాంట్ బయో కెమిస్ట్రీ 1, అగ్రికల్చరల్ మైక్రో బయాలజీ 2, అగ్రికల్చర్ బయో టెక్నాలజీ 2, కంప్యూటర్ సైన్స్ 3, ఈఆర్పీ 2, ఐటీ 1, ఆఫీస్ అసిస్టెంట్ (అకౌంట్స్ / ఇన్ఫర్మేషన్) 1
- అర్హత: పీజీ (అగ్రికల్చరల్ ఎకనామిక్స్ / ఎకనామిక్స్/ అప్లయిడ్ ఎకనామిక్స్ / బయో ఇన్ఫర్మాటిక్స్ / ప్లాంట్ పాథాలజీ / సాయిల్ సైన్స్ / ఆగ్రోనమీ / ఆగ్రో ఫారెస్ట్రీ / ఫారెస్ట్రీ / మెటరాలజీ / అగ్రికల్చరల్ మెటరాలజీ/ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ /అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ - (సాయిల్ & వాటర్ కన్జర్వేషన్)/ లాండ్ వాటర్ మేనేజ్‌మెంట్/ వాటర్ రిసోర్సెస్)/ రిమోట్ సెన్సింగ్/ జియోమాటిక్స్/ప్లాంట్ బయో కెమిస్ట్రీ/అగ్రికల్చర్ బయో కెమిస్ట్రీ/ ప్లాంట్ ఫిజియాలజీ/ బయో కెమిస్ట్రీ / అగ్రికల్చరల్ మైక్రో బయాలజీ/ మైక్రోబయాలజీ / ప్లాంట్ & పాథాలజీ/ అగ్రికల్చరల్ బయో టెక్నాలజీ / మాలిక్యులర్ బయాలజీ/ బయో టెక్నాలజీ / జెనెటిక్ ఇంజనీరింగ్) / (బీఇ / బీటెక్) (కంప్యూటర్ సైన్స్ / ఐటీ) / బీఎస్సీ (అగ్రికల్చర్/ కంప్యూటర్) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఇంటర్వ్యూ నాటికి 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది.
- వేతనం: గ్రేడ్‌ను అనుసరించి యంగ్ ప్రొఫెషనల్స్‌కు నెలకు రూ.15,000 / రూ.25,000; ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.15,000 ఇస్తారు.
- పోస్టింగ్: హైదరాబాద్
- ఇంటర్వ్యూ: మార్చి 12 నుంచి 14 వరకు
- వేదిక: ICAR - CRIDA, Santoshnagar, Saidabad PO, Hyderabad - 500059
- వెబ్‌సైట్: www.crida.in

మంగళూరు రిఫైనరీ

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలోని మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్) మేనేజ్‌మెంట్ కేడర్‌లో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **22**
- పోస్టులు: టేలరేటర్ సూపర్‌వైజర్ 7, ఇంజనీర్ (ఫైర్) 1, ఎగ్జిక్యూటివ్ (ఫైనాన్స్) 8, ఇంటర్నల్ ఆడిట్ 1), సీనియర్ మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) 1, అసిస్టెంట్ మేనేజర్ (సేఫ్టీ 2, మెడికల్ సర్వీసెస్ 2)
- అర్హత: సూపర్‌వైజర్లకు ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ - అనలిటికల్ కెమిస్ట్రీ / ఫిజికల్ కెమిస్ట్రీ / ఆర్గానిక్ కెమిస్ట్రీ / ఇనార్గానిక్ కెమిస్ట్రీ / అప్లయిడ్ కెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ / పాలిమర్ కెమిస్ట్రీ / పెట్రోలియం కెమిస్ట్రీ / ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ / ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ / అప్లయిడ్ ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ / జనరల్ కెమిస్ట్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీర్ పోస్టుకు బీఇ / బీటెక్ (ఫైర్ / ఫైర్ & సేఫ్టీ)/ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సీఏ / ఐసీడబ్ల్యుఏ / ఎంబీఏ (ఫైనాన్స్) పూర్తిచేసి ఉండాలి. సీనియర్ మేనేజర్‌కు ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు స్టేట్ మెడికల్ కౌన్సిల్ / మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉండాలి. మూడు నెలల ఇండస్ట్రియల్ హెల్త్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌తోపాటు కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. అసిస్టెంట్ మేనేజర్లకు సంబంధించి సేఫ్టీ విభాగానికి బీఇ / బీటెక్‌తోపాటు పీజీ డిప్లొమా (ఇండస్ట్రియల్ సేఫ్టీ) ఉండాలి. కనీసం నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. అదే మెడికల్ సర్వీసెస్ విభాగానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: పోస్టు నిబంధనల ప్రకారం 28 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ / గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో తదుపరి ప్రక్రియలకు అనుమతిస్తారు. రాత పరీక్షకు స్కోరుకు 85 శాతం, జీడీ / జీటీ & ఇంటర్వ్యూలకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు.
- రాత పరీక్ష వివరాలు: ఇందులో 150 ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. 3 గంటల పరీక్ష సమయంలో టీబీకె ఓఎంఆర్ షీట్ మీద బ్లాక్ / బ్లూ బాల్ పాయింట్ పెన్‌తో సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు 1 మార్కు కేటాయించారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), సంబంధిత విభాగం / సబ్జెక్టు నుంచి 100 ప్రశ్నలు (100 మార్కులు), ఆప్టిట్యూడ్ టెస్ట్ (రీడింగ్ & కాంప్రహెన్షన్, వెర్బల్ & నాన్ వెర్బల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ / క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్) నుంచి 20 ప్రశ్నలు (20 మార్కులు) ఇస్తారు. ప్రశ్నాపత్రం హిందీ & ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది.
- రాత పరీక్ష కేంద్రాలు: మంగళూరు, బెంగళూరు, ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 24
- దరఖాస్తు ఫీజు: రూ.750
- వెబ్‌సైట్: http://mrpl.co.in/careers

ఐఐఆర్ఆర్‌లో రీసెర్చ్ ఫెలోలు

ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్(ఐఐఆర్ఆర్) - తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

- మొత్తం ఖాళీలు: **22**
- పోస్టులు: సీనియర్ రీసెర్చ్ ఫెలో 3, జూనియర్ రీసెర్చ్ ఫెలో 1, గ్రేడ్ 2 యంగ్ ప్రొఫెషనల్ 5, గ్రేడ్ 1 యంగ్ ప్రొఫెషనల్ 2, ఫీల్డ్ ల్యాబ్ అసిస్టెంట్ 1, ఆఫీస్ అసిస్టెంట్ 1, టెక్నికల్ అసిస్టెంట్ 4, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 2, టెక్నికల్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ 1, ఫీల్డ్ వర్కర్/ హెల్పర్ 2
- వయసు: యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి. మిగిలిన పోస్టులకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో పీజీ / డిగ్రీ / పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- ఇంటర్వ్యూ: టెక్నికల్ అసిస్టెంట్‌కు మార్చి 12న, ఎస్‌ఆర్‌ఎఫ్‌లకు 13న, గ్రేడ్ 1 యంగ్ ప్రొఫెషనల్స్ & ఫీల్డ్ /ల్యాబ్ అసిస్టెంట్లకు 14న, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు 15న, జేఆర్ఎఫ్ & ఫీల్డ్ వర్కర్/ హెల్పర్లకు 16న, గ్రేడ్ 2 యంగ్ ప్రొఫెషనల్స్‌కు మార్చి 17, 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- వేదిక: Indian Institute of Rice Research, Rajendranagar, Hyderabad
- వెబ్‌సైట్: www.icar-iirr.org

ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు కిరణ్, సుష్మ దంపతులు. ఉద్యోగాలు సంతృప్తినివ్వకపోవడంతో స్వగ్రామం జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని కృష్ణాజీగూడెం చేరుకున్నారు. గొర్రెలు, మేకల ఫామ్ ఏర్పాటు చేశారు. మంచి లాభాలు గడిస్తూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మాంసం విక్రయాలు చేపట్టి వ్యాపారాన్ని మరింత విస్తరించాలని యోచిస్తున్న ఆ దంపతుల సక్సెస్ స్టోరీ.



మర్రిచెట్టు ఒకప్పుడు మహావృక్షం. ఇప్పుడది చిన్న ట్రేలో ఒదిగిపోయింది. రెండడుగుల మామిడి, దానిమ్మ, నిమ్మ, సపోటా చెట్లు విరగకాస్తూ మనకు సవాలు విసురుతూ వుంటాయి. ఆ మొక్కలను నాటి ఏళ్లు గడిచినా ఒకటి రెండు అడుగుల ఎత్తుకు మించకుండా ఇంటి అందాలను పదింతలు చేస్తూ వుంటాయి. ఆ మరుగుజ్జు మొక్కల విశేషాలు చూద్దాం రండి.

మరుగుజ్జు మహావృక్షాలు!

500 రకాల బోన్సాయ్‌లు

నగరాలు, పట్టణాల్లో పెద్ద చెట్లు పెంచుకునే అవకాశం తక్కువ. అందుకే బోన్సాయ్ వృక్షాల పెంపకం పట్ల ఆసక్తి పెరుగుతోంది. మూడు దశాబ్దాలుగా బోన్సాయ్ నర్సరీ నిర్వహిస్తున్నా. మా దగ్గర 500 రకాల బోన్సాయ్‌లు వున్నాయి. మా శ్రీ బోన్సాయ్‌కు జాతీయ స్థాయిలో బెస్ట్ బోన్సాయ్ అవార్డు కూడా దక్కింది. వరల్డ్ బోన్సాయ్ కాంటెస్ట్‌లో మా బోన్సాయ్ నర్సరీలోని 20 సంవత్సరాల బోన్సాయ్ చింతచెట్టుకు ప్రథమ బహుమతి లభించింది. ఆ మొక్కను రూ. 13 లక్షలకు విక్రయించా. బోన్సాయ్‌పై విద్యార్థులు, మొక్కల ప్రేమికుల్లో అవగాహన పెంపొందిస్తున్నాను. - గుత్తా లలితశ్రీ

చిటికెన వేలంత వుండే మర్రిచెట్టు, అడుగు ఎత్తులో వుండి రంగుల పూలను పరిచే మొక్కలు, రెండు అడుగుల ఎత్తులో వుండే నోరూరించే పండ్లు అందించే మామిడి, సపోటా, బొప్పాయి చెట్లు చూస్తే ఆశ్చర్యం కలుగకమానదు. ఈ మరుగుజ్జు మొక్కలు.. బోన్సాయ్ మొక్కలకు ఈ కాలంలో ఎంతో క్రేజ్ వుంది. బోన్సాయ్ మొక్కలు లేని ఎగువ మధ్యతరగతి, సంపన్నుల గృహాలు, కార్యాలయాలు వుండవంటే ఆశ్చర్యం లేదు. ఏళ్లతరబడి ఒకే ఆకారంలో వుంటూ పూలు, పండ్లు కాసే మొక్కలు చూస్తే మనసు మురిసిపోవడం ఖాయం. అందుకే బోన్సాయ్ మొక్కలకు అంతటి ఆదరణ. కుండీల్లో పెరిగే మహా వృక్షాలే బోన్సాయ్ చెట్లు. బోన్సాయ్ అనేది 2500 ఏళ్ల నాటి జపాన్ కళ. క్రమంగా అది ప్రపంచం అంతటా విస్తరించింది.


చిట్టి పూలచెట్టు

గృహ శోభ

బోన్సాయ్‌లో ఎన్నో రకాలు

బోన్సాయ్ మొక్కలు ప్రధానంగా ఆరు రకాలు. కాండం నిటారుగా వుండే ఫార్మల్ అప్ రైట్, కాండం కొంచెం ఒరిగి పెరిగే ఇన్‌ఫార్మల్ అప్‌రైట్, కాండం గుబురుగా పెరిగే బ్రూమ్ స్టయిల్, కాండం 45 డిగ్రీల్లో పెరిగే స్లాంటింగ్ స్టయిల్, ఒకే కాండానికి నాలుగైదు మొదళ్లు వచ్చే మల్టీ ట్రంక్ స్టయల్, కాండం వాలిపోయినట్లు వుండే క్యాసికెట్ స్టయిల్ బోన్సాయ్ రకాలు ప్రధానమైనవి. బోన్సాయ్ మొక్కలు వేర్వేరు సైజుల్లో వుంటాయి. కొన్ని మొక్కలు 6 నుంచి 12 అంగుళాల ఎత్తు మాత్రమే పెరుగుతాయి. మరికొన్ని బోన్సాయ్‌లు 12 నుంచి 24 అంగుళాల ఎత్తు పెరుగుతాయి. లార్డ్ బోన్సాయ్‌లు రెండడుగుల ఎత్తు పెరుగుతాయి. థంబ్ బోన్సాయ్ లేదా మ్యామీ బోన్సాయ్ కేవలం 2 నుంచి 4 అంగుళాల ఎత్తులో మాత్రమే పెరుగుతుంది.



వేళ్లను బట్టి వయసు..

బోన్సాయ్ మొక్కల్ని కుండీల్లో 60 శాతం సేంద్రియ ఎరువు, 20 శాతం ఎర్ర మట్టి, 20 శాతం ఇసుక వేసి పెంచుతారు. బోన్సాయ్ మొక్కల్ని ఒక సిరమిక్ కుండీలలో మనకు కావల్సిన పలు రకాల ఆకారాల్లో పెంచుకోవచ్చు. బోన్సాయ్ మొక్కల వేళ్లని బట్టి వాటి వయస్సును నిర్ధారించవచ్చు. బోన్సాయ్ మొక్కలు 500 నుంచి లక్ష రూపాయలకు పైగా ధర పలుకుతాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, హైదరాబాద్ సిటీ


13 ఏళ్ల చింతచెట్టు



విజయ గాథ



సాఫ్ట్‌వేర్ జంట సేద్యం బాట

400 గొర్రెల పెంపకంతో లాభాలు ... మాంసం విక్రయానికి సన్నాహాలు

కృష్ణాజిగూడెంలో పుట్టిన కిరణ్ వరంగల్‌లో చదువుకున్నాడు. బెంగళూరు, ముంబాయి, హైదరాబాద్‌లలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. భార్య సుష్మ కూడా ఉద్యోగిని, ఇద్దరికీ వారు చేస్తున్న ఉద్యోగాలు సంతృప్తినివ్వలేదు. ఇద్దరూ కలిసి స్వగ్రామం చేరుకున్నారు. మొదట 50 ఎకరాలు లీజుకు తీసుకుని వ్యవసాయం చేశారు. సేంద్రియ వ్యవసాయంలో అనుభవం లేకపోవడంతో లాభాలు రాలేదు. గొర్రెల ఫామ్ పెడితే లాభదాయకంగా వుంటుందని నిపుణులు సలహా ఇవ్వడంతో రెండెకరాల స్థలం కొనుగోలు చేసి గొర్రెల ఫామ్ నెలకొల్పారు. మొదటగా షెడ్ నిర్మించి 35 గొర్రెలతో ఫామ్ ప్రారంభించారు. ఒక్కో పొట్టేలును మూడు వేలకు కొనుగోలు చేసి వాటిని పెంచారు. మూడు నెలల్లో రెట్టింపు లాభాలు వచ్చాయి. ఆ ఉత్సాహంతో మరో నాలుగు షెడ్లు నెలకొల్పారు. ఇప్పుడు 400 గొర్రెలతో వారి ఫామ్ కళకళలాడుతోంది. గొర్రెలు, పొట్టేళ్ల కోసం నీటి తొట్లను, దాణా తినేందుకు ట్రేలను ఏర్పాటు చేశారు. వాటి పిల్లల కోసం వేరుగా ఒక షెడ్ ఏర్పాటు చేశారు. మేతకు అవసరమైన పచ్చి జొన్న చొప్పను సొంతంగా పండించుకుంటే లాభదాయకం అని భావించారు. పదెకరాల భూమిని లీజుకు తీసుకుని పచ్చిజొన్న పండించారు. దీంతో ఖర్చు తగ్గి, ఆదాయం పెరిగింది. గొర్రెలు, పొట్టేళ్లను పెంచేందుకు పెద్దగా శ్రమ వుండదు. అవసరమైన మేరకు పనివాళ్లను నియమించుకుని ఫామ్‌ను శ్రద్ధగా అభివృద్ధి చేస్తున్నారు ఆ దంపతులు. పొట్టేళ్ల విక్రయం మంచి లాభాలను తెచ్చి పెడుతుందంటున్నారు సుష్మ. ఖర్చులు పోగా ఏటా రెండు లక్షలకు పైగా లాభాలు ఆర్జిస్తున్నారు ఆ దంపతులు.

మాంసం విక్రయ కేంద్రాలు

కేవలం పొట్టేళ్ల విక్రయిస్తే లాభాలు పరిమితంగా వుంటాయి. అలా కాకుండా మంచి వాతావరణంలో పెంచిన గొర్రెలు, పొట్టేళ్ల మాంసాన్ని విక్రయిస్తే వినియోగదారులను ఆకట్టుకోవడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చని ఆలోచించారు కిరణ్, సుష్మ. ప్రస్తుతం మార్కెట్‌లో పొట్టేలు మాంసానికి మంచి డిమాండ్ ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.400 ఉంటే, పట్టణ ప్రాంతాల్లో రూ.600ల పైచిలుకు ధర పలుకుతోంది. త్వరలో గ్రామాల్లోనే కాక, పట్టణాల్లో కూడా మాంసం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి విక్రయించాలని ఆలోచిస్తున్నారు. దీనివల్ల గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ దంపతులు సన్నాహాలు చేస్తున్నారు.


- ఆంధ్రజ్యోతి వ్యవసాయ ప్రతినిధి, జగిత్యాల

స్వయం ఉపాధికి బెస్ట్

గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గొర్రెల ఫామ్ ఏర్పాటు చేసుకుంటే మంచి లాభాలు వస్తాయి. ఫాం కోసం ఎక్కువ మంది పనివారు అవసరం లేదు. ఖర్చు. శ్రమ కూడా తక్కువే. శ్రద్ధగా పనిచేస్తే ఉద్యోగానికి మించి ఆదాయం వస్తుంది. కొండంత సంతృప్తి మిగులుతుంది.

- కిరణ్, సుష్మ





ఖర్జూర అనగానే గుర్తొచ్చేది అరబ్ దేశాలు.. అధిక ఉష్ణోగ్రతల్లో పండే ఖర్జూరానికి గిరాకీ నానాటికీ పెరుగుతోంది. నాణ్యమైన ఖర్జూరాలు కావాలంటే దిగుమతి చేసుకోవాల్సిందే. ఈ పరిస్థితిని గమనించిన నల్లగొండ సమీపంలోని నర్సింగ్‌భట్ల గ్రామానికి చెందిన బండారు ఆగమయ్య ఖర్జూర సాగు చేపట్టారు. గణనీయంగా లాభాలు గడిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఖర్జూర సాగు.. లాభాలు బాగు

నల్లగొండ జిల్లా రైతు వినూత్న యత్నం

ఎడారి పంటగా పేరుబడిన ఖర్జూరను నల్లగొండలో పండించాలనే ఆలోచనే సాహసంతో కూడుకున్నది. కానీ ఆగమయ్య ఆ దిశగా ఆలోచించారు. తనకున్న రెండెకరాల భూమిలో 2012లో ఖర్జూరపంట వేసేందుకు సిద్ధమయ్యారు. ఖర్జూర మొక్కలను కొనుగోలు చేసేందుకు గుజరాత్‌కు వెళ్లి ఒక్కో మొక్కను రూ.3వేల చొప్పున కొనుగోలు చేశారు. రెండెకరాల భూమిలో 120 మొక్కలను నాటారు. దుబాయి నుంచి దిగుమతి చేసుకున్న టిష్యూ కల్చర్ ఖర్జూర మొక్కలను ఇందుకు వినియోగించారు. నిజానికి చౌడు నేలల్లో ఎలాంటి పంటలు పండవు. అలాంటి నేలల్లో ఖర్జూరం పండించాలి కాబట్టి సాధారణ రకాలు కాకుండా టిష్యూ కల్చర్ మొక్కలను నాటారు. రెండు అడుగుల మేరకు గుంతలు తీసి రెండు ఎకరాల్లో మొక్కలు నాటారు. పూర్తిగా చౌడు భూమి కావటంతో ఆ గుంతల్లో ఎర్రమట్టిని పోసి మొక్కలు పెంచారు. ఒక్కో పాదు మధ్య 20 అడుగుల దూరం ఉండేలా ఎకరాకు 60 మొక్కల చొప్పున రెండెకరాల్లో 120 మొక్కలను నాటారు. వీటికి బోరు ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో నీటిని అందిస్తున్నారు. అయితే వీటి కాత అంతా పరపరాగ సంపర్కం ద్వారా జరుగుతుంది. అందుకోసం ఎకరాకు 3 మగ ఖర్జూర చెట్లను నాటారు. ఈ మగ చెట్ల నుంచి వచ్చే కాయలను పొడి చేసి ఆ పొడిని ఆడ ఖర్జూర చెట్లకు వచ్చే గెలలపై చల్లుతారు. మొక్కలు కొనేందుకు ఖర్చు తప్ప ఖర్జూరం సాగుకు మిగిలిన ఖర్చులు తక్కువే. ఎకరానికి ఏడాదికి 10 వేల వరకు ఖర్చయిందన్నారు ఆ రైతు. కిలో ఖర్జూరను రూ. 120లకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోనే ఈ పంటను అమ్మేందుకు సరిపోతోంది. అదేవిధంగా యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ నుంచి కూడా కొంతమంది వ్యాపారులు వచ్చి ఖర్జూరను కొనుగోలు చేసి వెళ్తున్నారన్నారు ఆ రైతు. ఏటా జూలైలో పంట దిగుబడి వస్తుంది. ప్రతి చెట్టుకు మొదట్లో 20 కిలోల చొప్పున దిగుబడి రాగా ప్రస్తుతం సుమారు 80 కిలోల వరకు దిగుబడి వస్తోంది. తొలి ఏడాది 24 క్వింటాళ్లకు రూ. రెండు లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర క్వింటాకు సుమారు రూ.12వేలు పలుకుతున్నది. దీంతో రూ.10 లక్షల ఆదాయం లభిస్తుంది. ఈ రైతు స్ఫూర్తితో జిల్లాలో ఖర్జూరం సాగు ఊపందుకుంటుందంటున్నారు వ్యవసాయ నిపుణులు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

వైవిధ్యం





లాభాలకు ఢోకా లేదు

పత్తి, మిరప పంటలను సాగు చేసి నష్టపోవటం కంటే ఖర్జూర చెట్లను పెంచుకుంటే మేలు. లాభాలకు ఢోకా వుండదు. పండిన ఖర్జూరాన్ని ఎండు ఖర్జూరగా మార్చటానికి ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవటంతో కోసిన నాలుగైదు రోజుల్లోనే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు పాలు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- బండారు ఆగమయ్య, రైతు

మేలు చేసే మినీట్రాక్టర్

కలుపు తీసేందుకు, పురుగుల మందు చల్లేందుకు సకాలంలో కూలీలు దొరకక రైతులు చాలా సందర్భాల్లో నష్టపోతున్నారు. ఈ రెండు సమస్యలకు పరిష్కారం చూపే మినీ ట్రాక్టర్ రైతులకు వరంగా మారింది.

నాలుగు లక్షల రూపాయల ధర ఉన్న ఈ మినీ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసే రైతులకు ప్రభుత్వం లక్ష రూపాయల సబ్సిడీ ఇస్తున్నది. ముఖ్యంగా పత్తి, కంది, చెరుకు పంటలలో, మామిడి తోటలు పూల తోటలలో కలుపు తీస్తుంది. పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తుంది. అంతేగాక చిన్న ట్రాక్టర్‌కు వెనక ఉన్న తిరిగే పరికరం (పీ.టీ.వో) ద్వారా పంపు బిగించి, ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకున్న ట్యాంకుకు అనుసంధానిస్తున్నారు. దీని ద్వారా ఆయా పంట పొలాల్లో క్రిమిసంహారక మందును పిచికారీ చేసుకునే అవకాశం కూడా వుంది. ఈ ట్రాక్టర్ ద్వారా ఒక్క రోజుకు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో కలుపు తీయడం, క్రిమిసంహారక మందును పిచికారి చేసే వీలున్నది. ఈ పని చేసేందుకు నలభై మంది కూలీలు అవసరమవుతారు. అందుకోసం 12 వేల రూపాయల ఖర్చవుతుంది. మినీ ట్రాక్టర్‌తో పని వేగంగా జరగడంతో పాటు ఖర్చు కూడా తక్కువ. దీంతో రైతులు ఈ ట్రాక్టర్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. సొంతంగా ట్రాక్టర్‌ను కొనుగోలు చేయలేని రైతులు గంటకు నాలుగు వందల రూపాయల అద్దె చెల్లించి సేవలు పొందుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

నయా మాల్



భలే ప్రయోజనం




చిన్న ట్రాక్టర్ సన్న, చిన్నకారు రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంది. కూలీల కొరత ఉన్న ఈ పరిస్థితులలో చిన్న ట్రాక్టర్ రైతులను ఆదుకుంటుంది. వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీపై ఇస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుంది.

- బుచ్చిరెడ్డి, హత్నూర మండలం, బడంపేట

సమస్య - సమాధానం

రబీ వరికి దోమ కాటు



ఖరీఫ్‌లో దోమపోటుతో తీవ్రంగా నష్టపోయాం. అప్పుడు పంట చివరి దశలో దోమ సోకి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఇప్పుడు రబీ ప్రారంభ దశలో వరి కర్రల మీద, పొలంలోని నీటిలో దోమలు కనిపించడంతో మళ్లీ దోమపోటు వస్తుందేమోనని ఆందోళనగా ఉంది. ఖరీఫ్ అనుభవంతో సన్నరకం కాకుండా ఈసారి దొడ్డురకాన్నే సాగు చేస్తున్నాం. అయినా దోమలు కనిపించడంతో ఏం చేయాలో పాలుపోకుండా వుంది. - గుండేటి హన్మంతు, రైతు

తక్షణం జాగ్రత్తలు పాటించాలి



పొలం మళ్లలో దోమలు కనిపిస్తున్నాయంటే అది దోమపోటు సంకేతమే. ఇది ప్రారంభ దశ. ఈ సుడి దోమను నివారించేందుకు ప్రారంభ దశలో నివారణ చర్యలు పాటిస్తే పంటను రక్షించుకోవచ్చు. బుప్రోఫెజిన్, ఎసీఫేడట్, క్లోరీఫైరిపాస్ ఈ మూడింటి మిశ్రమాన్ని స్ప్రే చేస్తే చక్కటి ఫలితం కనిపిస్తుందన్నారు ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త విజయ్‌కుమార్.



వాతావరణంలో వేడి అధికం అవుతున్నప్పుడు, నత్రజని అధిక మోతాదులో వేస్తున్నప్పుడు, దోమను పట్టుకొనే రకాలను సాగు చేసినప్పుడు దోమపోటు అధికమవుతుంది. తొలిదశలోనే దోమపోటును గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి, లేదా హితోపెన్ ప్రాక్షి 20 మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు ఖానాపూర్ మండల వ్యవసాయ అధికారి ఆసం రవి.



విన్నపం

మద్దతు ధర మిధ్యేనా?

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ నెల ప్రారంభంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఒక ప్రతిపాదన చేశారు. వ్యవసాయానికి అయిన ఖర్చుకి 150% కనీస మద్దతు ధరగా నిర్ణయించాలన్నారు. ఆయా రాష్ట్రాలు, ఆయా ప్రాంతాలలోని వివిధ నిర్ధారిత పంటల సాగుబడికి అయ్యే ఖర్చుని వివిధ గణాంక పద్ధతుల ద్వారా మదింపు చేయించి భారత ప్రభుత్వంలోని కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (CACP) సంస్థకు పంపుతాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన డేటా ఆధారంగా CACP సంస్థ కనీస మద్దతు ధరను నిర్దేశించిన 30 వ్యవసాయ పంటలకు స్థిరపరుస్తుంది. 30 రకాల పంటలకు ఈ సంస్థ కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవసాయ శాఖ, చెరకు బోర్డు ఇత్యాది వ్యవస్థలు సహకరిస్తాయి. అయితే ప్రభుత్వం వారు ఇచ్చే మద్దతు ధర రైతులకు ఏ మాత్రం అక్కరకు రావడం లేదు. ఏ వస్తువుల ఉత్పత్తికి ఎంత ఖర్చువుతుందని సాధికారికంగా చెప్పగలిగే సంస్థ ఒకటి మనకి ఉన్నది. అది ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా. పార్లమెంట్ ఆమోదించిన చట్టం ద్వారా 1959లో ఏర్పాటైన ఈ సంస్థ 70 ఏళ్లుగా దేశంలోని అనేక వ్యాపార సంస్థలకు వారి వారి ఉత్పత్తులకు, సేవలకు అయ్యే ఖర్చుని మదింపు చేయటంలో, కంట్రోల్ చేయటంలోను తగిన సూచనలు ఇచ్చే సత్తా వున్న నిపుణులను మన దేశానికి అందిస్తున్నది. దేశానికి వెన్నెముక అయిన రైతును సంతోషంగా వుంచడంతో పాటు, వ్యవసాయ రంగం కళకళలాడేందుకు తోడ్పడే మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థ సహకారం ఎందుకు తీసుకోకూడదు? వివిధ పంటలకు శాస్త్రీయంగా మద్దతు ధర నిర్ణయించే విషయంలో నైపుణ్యం వున్న సంస్థల సహకారం తీసుకున్నప్పుడే రైతులకు ప్రభుత్వం నుంచి నిజమైన మద్దతు లభిస్తుంది.

- డి. జితేందర్‌రావు, దక్షిణ భారత ప్రాంతీయ మండలి సభ్యుడు, ఐసిఎఐ



కేసీఆర్‌కు గవర్నర్ పరామర్శ

▸▸ డయేరియాతో సీఎం సతీమణికి అస్వస్థత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సోదరి వియోగంతో బాధపడుతున్న సీఎం కేసీఆర్‌ను గవర్నర్ నరసింహన్ దంపతులు గురువారం ప్రగతి భవన్‌లో పరామర్శించారు. కేసీఆర్ సోదరి విమలమ్మ బుధవారం మృతిచెందిన విషయం తెలిసిందే. మరోవైపు, కేసీఆర్ సతీమణి శోభ బుధవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఆమె డయేరియాతో బాధపడుతున్నట్లు ఆస్పత్రివర్గాలు తెలిపాయి. గురువారం ఆస్పత్రికి వచ్చిన కేసీఆర్.. భార్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆరోగ్యం మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

కొత్త పథకాల్లేవ్!

అమల్లో ఉన్న వాటికే బడ్జెట్‌లో ప్రాధాన్యం.. పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి

▸▸ మంత్రులకు ముఖ్యమంత్రి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే బడ్జెట్‌లో కొత్త పథకాలు ఉండబోవని సీఎం కేసీఆర్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే ప్రకటించిన, అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికల ముందు ఇదే చివరి పూర్తి స్థాయి బడ్జెట్ అయినప్పటికీ కొత్త పథకాల జోలికి వెళ్లొద్దని సీఎం భావిస్తున్నారు. పలువురు మంత్రులు, టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలకు ఈ విషయం ఇప్పటికే సూచనప్రాయంగా చెప్పారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ తన మేనిఫెస్టోలో భాగంగా రైతులకు రుణ మాఫీ, పింఛన్ల మొత్తం పెంపు వంటి అనేక హామీలను ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ గత మూడున్నరేళ్లలో తమ ఎన్నికల మేనిఫెస్టోలోని మెజార్టీ హామీలను నెరవేర్చింది. మిగిలిన వాటిని కూడా నెరవేర్చే దిశగా సాగుతోంది. ఎలాంటి హామీ ఇవ్వకుండానే కొత్తగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతులకు వ్యవసాయ పెట్టుబడి పథకం వంటి వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇవన్నీ జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో 2018-19 వార్షిక బడ్జెట్‌లో కొత్తగా పథకాలు, కార్యక్రమాలు ప్రకటించాల్సిన అవసరం లేదని టీఆర్ఎస్ అధిష్ఠానం ముఖ్యులు అభిప్రాయపడుతున్నారు. 'ఇప్పటికే తెలంగాణ సమాజంలో అన్ని వర్గాలకు మేలుచేసే చాలా కార్యక్రమాలు అమల్లోకి తీసుకొచ్చాం. రైతు సమన్వయ సమితులు, రైతులకు వ్యవసాయ పెట్టుబడి పథకం, మరికొన్నింటిపైనా ప్రకటనలు చేసి, అమలుకు సిద్ధంగా ఉన్నాం. ఎన్నికలకు పట్టుమని 15 నెలల గడువు కూడా లేదు. బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఎన్నికల వాతావరణం వచ్చినట్టే. ఈ పరిస్థితుల్లో కొత్త పథకాలు ప్రకటించి, అమలుకు వ్యయప్రయాసలకు గురయ్యే బదులు అందరి మన్ననలు పొందుతున్న పథకాలను మరింత సమర్థంగా ప్రజలకు చేరిస్తే చాలు' అని టీఆర్ఎస్ ముఖ్య నేత వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు 2018-19 వార్షిక బడ్జెట్‌లో కొత్త పథకాలు, కార్యక్రమాల ప్రస్తావన లేకుండా, సాగునీటి రంగం, సంక్షేమం, విద్య, వైద్యానికి పెద్దపీట వేయాలని ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోందని సమాచారం.

పథకాల అమలులో లోపాలు సరిదిద్దాలి

ఈ ఏడాది మొత్తం.. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ఎక్కడైనా ప్రజలకు చేరువ కాకపోతే గుర్తించాలని నిర్దేశించారు. అటువంటి చోట్ల లోపాలను సరిదిద్దాలని, ప్రభుత్వం ఉద్దేశానికి అనుగుణంగా పథకాలు, కార్యక్రమాలు ఆయా వర్గాలకు అందేలా చూడాలని చెప్పారు. జనంకోసం తాము చేస్తున్న కార్యక్రమాలకు సభలు, సమావేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రభుత్వ వేదికలను వినియోగించుకోవాలని నిర్దేశించారు. తాను స్వయంగా ఈ పని చేస్తూ, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలకు మార్గదర్శిగా నిలవాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన ఈనెల 25న హైదరాబాద్‌లో, 26న కరీంనగర్‌లో జరిగే రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సుల్లో పాల్గొనబోతున్నారు. వీటికి ఆయా జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ ఛైర్‌పర్సన్లు హాజరు కావాలని ఆదేశించారు. మార్చి 11 నుంచి ప్రారంభమయ్యే కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలోనూ టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ విధిగా పాల్గొనాలని నిర్దేశించారు. అసెంబ్లీ, శాసన మండలి బడ్జెట్ సమావేశాలు ముగిశాక ఏప్రిల్ 20నుంచి రైతుకు పెట్టుబడి పథకం కార్యక్రమంలో భాగంగా టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రోజుకు నాలుగైదు గ్రామాలకు వెళ్లనున్నారు. ఈ రకంగా దాదాపు 25, 30రోజులపాటు పార్టీ ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించనున్నారు. ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు, కంటి పరీక్షల కోసం నిర్వహించే శిబిరాల్లోనూ ప్రజాప్రతినిధులు పాల్గొనబోతున్నారు. 'మిషన్ భగీరథ' ప్రారంభంకూడా కార్యక్రమంగా నిర్వహించి, టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనేలా సీఎం నుంచి ఆదేశాలున్నాయి.

కేంద్ర నిధులపై కొరవడిన స్పష్టత

▸▸ మార్చి 5 తర్వాత తేలుద్దామన్న సీఎం

సీఎం కేసీఆర్ గురువారం రాత్రి బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా వచ్చిన ప్రతిపాదనలు, కేటాయించాల్సిన నిధులపై చర్చించారు. అన్నిశాఖలు తమ ప్రతిపాదనలను పంపాయి.వీటిపై ఇదివరకే మంత్రి ఈటల, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సమీక్షలు నిర్వహించారు. తాజా సమీక్షలో సీఎం 2017-18 సంవత్సరంలో ఆయా శాఖల వ్యయాలను తెలుసుకున్నారు. తాజా ప్రతిపాదనలను పరిశీలించారు. ఈసారి బడ్జెట్‌పై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రావడం లేదు. కేంద్ర పథకాలు, గ్రాంట్స్-ఇన్-ఎయిడ్, పన్నుల వాటా రూపంలో వచ్చే నిధుల వివరాలు అందకపోవడంతో రాష్ట్ర బడ్జెట్‌పై ప్రభావం పడుతోంది. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఏ పథకం కింద ఏ రాష్ట్రానికి ఎంత మేర నిధులివ్వాలన్నది కేంద్ర బడ్జెట్‌లో స్పష్టం చేయలేదు. గతంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడే పథకాలవారీగా ఆయా రాష్ట్రాలకు నిధుల కేటాయింపు స్పష్టంగా ఉండేది. పార్లమెంటు ఆమోదించిన తర్వాతే కేంద్ర బడ్జెట్‌లోని వివరాలు తెలిసే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. మార్చి నెల 12న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. మార్చి 5 తర్వాత కేంద్రం నిధులపై స్పష్టతరాగానే పూర్తి స్థాయి కేటాయింపులు చేద్దామని సీఎం అన్నట్లు తెలిసింది. సాగునీటి పారుదల శాఖకు రూ.25 వేల కోట్ల మేర కేటాయించే అవకాశం ఉంది. ఇక పెట్టుబడి మద్దతు పథకం కొత్తది కావడంతో రూ.12 వేల కోట్ల మేర కేటాయింపులు చేయాల్సి ఉంది. బీసీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.20 వేల కోట్లకు పైగా కేటాయించే వీలుంది. మిగతా శాఖలకు 10-15% పెరుగుదల ఉంటుందని అంచనా.

కానిస్టేబుల్ కొలువులకు త్వరలో నోటిఫికేషన్

▸▸ 14,400 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఓకే

▸▸ 6 నెలల్లో 'కమాండ్ కంట్రోల్': నాయిని



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 14,400 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. నగరంలోని హోటల్ మారియట్‌లో గురువారం 'తెలంగాణ ఐటీ అసోసియేషన్' నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కానిస్టేబుళ్ల పోస్టులకు ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని, తెలంగాణ పోలీస్ నియామక బోర్డు ప్రకటన జారీ చేసే పనిలో ఉందన్నారు. 22 అంతస్తుల కమాండ్ కంట్రోల్ భవనాన్ని ఆరు నెలలో ప్రారంభిస్తామని, ఇలాంటి సెంటర్ దేశంలో ఎక్కడా లేదని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐటీ అసోసియేషన్.. జైకామ్ కంపెనీ 'సేఫ్ హైదరాబాద్, సేఫ్ తెలంగాణ'కు ఒక ఒప్పందం చేసుకున్నాయి.

నాన్నకు సేవతో డిగ్రీ ఆలస్యం

▸▸ మెడికల్ పట్టాపై మంత్రి లక్ష్మారెడ్డి



మిడ్జిల్, ఫిబ్రవరి 22: హోమియోపతి డిగ్రీ చేస్తుండగా తన తండ్రికి పక్షవాతం వచ్చిందని, ఆయనకు సేవ చేయాల్సి రావడం వల్లే తన మెడికల్ డిగ్రీని పూర్తి చేయడంలో ఒక ఏడాది ఆలస్యమైందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో గురువారం కృష్ణ మందిరం శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన మంత్రి విలేకరులతో మాట్లాడారు. తన హోమియోపతి డిగ్రీపై ఇటీవల కొందరు రాద్ధాంతం చేశారని, వారికి తాను వివరణ ఇవ్వాల్సిన అవసరం లేకున్నా ప్రజలకు బాధ్యతగా చెబుతున్నానన్నారు.తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరూ సేవ చేయాలని, తాను తన తండ్రికి సేవ చేయడం వల్లే ఈ స్థాయికి వచ్చానని చెప్పారు.

ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్‌కు పూర్తి నీరు

▸▸ పాలమూరులో పనులు యుద్ధప్రాతిపదికన సాగాలి

▸▸ పనిచేయని సంస్థలను తొలగించాలి: హరీశ్‌రావు

▸▸ నేడు, రేపు పాలమూరు జిల్లాలో మంత్రి పర్యటన



హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న నాలుగు ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఖరీఫ్ నాటికి నిర్ణీత ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు ఇవ్వాలని అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. తాను పాలమూరు జిల్లాలో శుక్ర, శనివారాల్లో పర్యటిస్తానన్నారు. మంత్రి గురువారం నాడిక్కడ జలసౌధలో పాలమూరులోని నాలుగు ప్రాజెక్టుల పురోగతిని ప్యాకేజీల వారీగా సమీక్షించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి మళ్లీ సమీక్ష నిర్వహిస్తానన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఇసుక రీచ్‌ల సమస్య తదితర సమస్యలను సమావేశంలో చర్చించనున్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భూసేకరణ పనులపై తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. నత్త నడకన పనిచేస్తున్న ఏజెన్సీలను టర్మినేట్ చేసి, పనులను ఇతర ఏజెన్సీలకు అప్పగించాలని కోరారు. కల్వకుర్తి నుంచి నీటి విడుదల కొనసాగుతున్నందున 3 నెలలుగా నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడిందని ఇరిగేషన్ ఇంజనీర్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నీటి విడుదలను ఈ నెలాఖరులో నిలిపేసి పనులను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. కల్వకుర్తి లిఫ్ట్-3లో నాలుగు పంపులు పనిచేస్తున్నాయని, 5వ పంపు బిగింపు పనులను వేగవంతం చేసి మార్చి చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. లిఫ్టు-2 నుంచి లిఫ్టు-3 వరకు తవ్విన టన్నెల్ లో 1.2 కిలో మీటర్ల లైనింగ్ పనులకు గడువు పెంచేది లేదని స్పష్టం చేశారు. కాలువల కట్ట 2 మీటర్ల ఎత్తునకు పెంచే చర్యలు చేపట్టాలన్నారు. కాలువలలో పూడిక, ఇతర శిథిలాల తొలగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. డి-82 కాలువ తవ్వకం పనులన్నీ జూలైలోపు పూర్తి చేయాలన్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పూర్తి ఆయకట్టుకు సాగునీరివ్వాలని హరీశ్‌రావు సూచించారు. 15 వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో తలపెట్టనున్న చంద్రసాగర్ కొనసాగింపు కెనాల్ నిర్మాణ పనుల ఆమోదానికి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.



తెలంగాణ మహిళా వర్సిటీగా కోఠి ఉమెన్స్ కాలేజీ

▸▸ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం: కడియం

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కోఠి ఉమెన్స్ కాలేజీని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా మార్చేందుకు అన్ని వసతులున్నాయని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. సీఎం కేసీఆర్ ఆమోదంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మహిళా విశ్వవిద్యాలయంగా మారుస్తామన్నారు. కోఠి ఉమెన్స్ కాలేజీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కడియం వసతులను పరిశీలించారు. బోధనా తీరు, విద్యావిధానం గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున 40 ఎకరాల్లో విస్తరించిన ఈ కాలేజీలో బోధనావసతులు బాగున్నాయని, కాలేజీ వాతావరణం విద్యార్థులకు అనుగుణంగా ఉందని కాలేజీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కాలేజీలో 42 యూజీ, పీజీ కోర్సులు నడుస్తున్నాయని, ఒక్క పరిశోధన కేంద్రం మాత్రమే లేదన్నారు. విశ్వవిద్యాలయంగా మారితే పరిశోధన కేంద్రం కూడా ప్రారంభమవుతుందన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై సీఎస్‌లకు నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశించింది. ఆత్మహత్యలను నివారించేందుకు ఏ చర్యలు తీసుకున్నారో నాలుగు వారాల్లో చెప్పాలని ఎన్‌హెచ్‌ఆర్సీ పదిరోజుల క్రితం నోటీసులు జారీ చేసింది. యాజమాన్య ఒత్తిళ్లతోనే చాలావరకు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గత ఏడాది డిసెంబరు 29న ఢిల్లీకి చెందిన న్యాయవాది శ్రావణ్‌కుమార్ జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు.

గిట్టుబాటే లక్ష్యం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. రైతులు స్వచ్ఛమైన, సురక్షితమైన వ్యవసాయ ఉత్పత్తులను అందించే కార్యక్రమాలను ఈ కార్పొరేషన్ ప్రోత్సహించనుంది. రైతులను సంఘటితపరచడంతో పాటు పంట కోతకు ముందు, తర్వాత వారికి చేదోడువాదోడుగా నిలవనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ విధివిధానాలను విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు సమితుల నిర్మాణం, విధులు, బాధ్యతలు, ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే మండల రైతు సమితుల ప్రాంతీయ సదస్సులపై ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి కృషి చేస్తుందని చెప్పారు. సంస్థకు సమకూరిన నిధులను లక్ష్యాల సాధన కోసమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. విత్తనం వేసిన దగ్గర నుంచి పంటకు మద్దతు ధర వచ్చే వరకు ప్రతి దశలోనూ రైతు సమితులు చురుకైన పాత్ర పోషించేలా వాటికి విధులు, బాధ్యతలుంటాయని పేర్కొన్నారు. ఈ సమితుల్లో కనీసం 51% మంది బలహీన వర్గాలు, మహిళలు ఉండేలా నిర్మాణం జరుగుతుందన్నారు. 25, 26 తేదీల్లో జరిగే సదస్సులకు మండల రైతు సమితి సభ్యులతో పాటు ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ ఛైర్మన్లు హాజరు కావాలని సీఎం సూచించారు. రైతులు పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకోవడానికి, నిరంతర అవగాహన సదస్సులు నిర్వహించుకోవడానికి 5 వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2,630 రైతు వేదికలు నిర్మించనున్నట్లు తెలిపారు. రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను మండల రైతు సమితులు తీసుకోవాలన్నారు. వీటి నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎంపిక చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం, ఈటల, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్క సుమన్, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో అధికారులు వెంటనే రాష్ట్ర రైతు సమితి విధివిధానాలను విడుదల చేశారు. కార్పొరేషన్ రిజిస్ట్రేషన్‌కు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రైతు ప్రతినిధులు పదిమందే..

కొత్తగా ఏర్పడే తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌కు ఛైర్మన్, 14 మంది డైరెక్టర్లు ఉంటారు. ఛైర్మన్‌ను ప్రభుత్వమే నామినేట్ చేస్తుంది. వ్యవసాయ, ఉద్యానవన శాఖల కమిషనర్లు, తెలంగాణ రాష్ట్ర రైతు వేదిక ఎండీ, ఆర్థికశాఖ నుంచి ఒక ప్రతినిధి డైరెక్టర్లుగా ఉంటారు. మిగిలిన పది స్థానాలకు రైతు ప్రతినిధులను ఎంపిక చేస్తారు. సమితి తొలి డైరెక్టర్‌గా వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్, రెండో డైరెక్టర్‌గా ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డిలు కొనసాగనున్నారు. ఒక్కో షేరు రూ.10 ముఖ విలువ కలిగి ఉండి రూ.150 కోట్ల మూలధనంతో కార్పొరేషన్‌ను ప్రారంభించనున్నారు. ఇందులో తొలి ఏడుగురు డైరెక్టర్లకు రూ.100 చొప్పున రూ.700 వాటా ఉంటే.. మిగిలిన మొత్తం వాటా రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా గవర్నర్‌కు ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర రైతు వేదికకు ఎండీని నియమించే వరకూ వ్యవసాయశాఖ కమిషనరే ఎండీగా కొనసాగనున్నారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితిని కంపెనీల చట్టం కింద కార్పొరేషన్‌గా రిజిస్ట్రేషన్ చేసేందుకు శుక్రవారం దరఖాస్తు చేయనున్నారు.

రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఏర్పాటు ప్రధాన ఉద్దేశాలివీ..

- వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలు, మార్క్‌ఫెడ్ తదితర ప్రభుత్వ సంస్థలు, ఉపాధి హామీ వంటి పథకాలను సమన్వయం చేసుకుంటుంది. వాటితో సంప్రదింపులూ జరుపుతుంది.
- రైతు నుంచి వినియోగదారుడి వరకూ ఉన్న పంపిణీ వ్యవస్థలో భాగంగా గిడ్డంగులు, శీతలగిడ్డంగులు, ప్యాకింగ్ హౌస్ తదితరాలను నిర్వహిస్తుంది. ఫుడ్ పార్కుల్లో ప్రైవేటు సంస్థలతో కలిసి పనిచేసే అంశాలనూ పరిశీలిస్తుంది.
- ఇతర రాష్ట్రాలు, దేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు లక్ష్యంగా పనిచేస్తుంది.
- అవసరమనుకుంటే సొంతంగా ఔట్‌లెట్లనూ ఏర్పాటు చేస్తుంది.
- వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ చేకూర్చే కార్యక్రమాలనూ నిర్వహిస్తుంది. ప్రత్యేక బ్రాండ్‌ను ఏర్పాటు చేసుకుని గ్రేడింగ్, ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్‌ను చూసుకుంటుంది.
- రైతులను సంఘటిత పరుస్తుంది. పంట కోతకు ముందు, తర్వాత చేపట్టే కార్యక్రమాలకు ప్రోత్సాహాన్ని అందిస్తుంది.
- పంటలకు అవసరమైన పెట్టుబడి అవసరాలను అంచనా వేస్తుంది.
- పంటల ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచేందుకు క్రాప్ కాలనీల ప్రణాళికా వేస్తుంది.
- రైతులకు శిక్షణా కార్యక్రమాలూ నిర్వహిస్తుంది.
- వ్యవసాయ యాంత్రీకరణను చిన్న రైతు వద్దకూ చేరుస్తుంది.
- వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో అవగాహనా ఒప్పందాలు చేసుకుంటుంది.



రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

▸▸ కెనడా సంస్థ ఆర్థిక సాయంతో రోడ్ల విస్తరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారులకు మహర్దశ పట్టనుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు కెనడా ఆర్థిక సహకారం అందించనుంది. తెలంగాణలోనూ రహదారుల అభివృద్ధికి కెనడాకు చెందిన పెన్షన్ ఫండ్స్ పీఎస్పీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ అంటారియో టీచర్ పెన్షన్ ప్లాన్ సంస్థ ప్రతినిధులు.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రహదారులు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో గురువారం చర్చలు జరిపారు. తమ ప్రాజెక్టుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటారని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీతో రహదారుల అభివృద్ధికి కెనెడియన్ పెన్షన్ ఫండ్ సంస్థ రూ.6 వేల కోట్లు వెచ్చించనుంది. ఈ నిధుల్లో ఎక్కువగా ఖమ్మం సహా ఉత్తర తెలంగాణలోని మరికొన్ని జిల్లాల్లో వ్యయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఓ నివేదికను సిద్ధం చేస్తోంది.

నేడు కాళేశ్వరానికి ఎమ్మెల్సీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎమ్మెల్సీలు శుక్ర, శనివారాల్లో ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌ల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్సీలు కాళేశ్వరం ప్రాజెక్టు టూర్‌కు సీఎం కేసీఆర్ ఓకే చెప్పారు. ఎమ్మెల్సీల టూర్ నేపథ్యంలో ప్రాజెక్టు పనుల పురోగతి, వేగం, అంతర్గత నిర్మాణ పనులు తదితర వివరాలు వివరించేందుకు నీటిపారుదల శాఖ అధికారులను సమాయత్తం చేశారు.

భగీరథ ట్రయల్ నిర్వహించండి: ఈఎన్‌సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథలో ప్రధాన పనులు పూర్తయిన చోట ట్రయల్‌రన్ నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఎర్రమంజిల్‌లోని కార్యాలయం నుంచి ఎస్ఈలు, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో అంతర్గత పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా తాగునీరు, పారిశుధ్యంపై ఆర్‌డబ్ల్యూఎస్ రూపొందించిన కరదీపికను సురేందర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఇసుక తవ్వకాల కేసు 14కు వాయిదా: ఎన్జీటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి రేలా స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను జాతీయ హరిత ధర్మాసనం(ఎన్జీటీ)మార్చి14కు వాయిదా వేసింది. జస్టిస్ రఘువేంద్ర ఎస్ రాథోడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం దీనిపై విచారణ చేపట్టింది. పూడికతీత పేరుతో చేపడుతున్న ఇసుక తవ్వకాలను ఎందుకు వినియోగిస్తున్నారో తెలియజేస్తూ అఫిడవిట్ సమర్పించాలని ఎన్జీటీ గతంలో ఆదేశాలిచ్చిందనీ, అయితే ఏపీ గనుల శాఖ ఇచ్చిన అఫిడవిట్ సమగ్రంగా లేదని పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావణ్‌కుమార్ ధర్మాసనానికి తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల్లో అక్రమ మైనింగ్‌పై పిటిషనర్ తరపు న్యాయవాదిని ధర్మాసనం అడిగింది. మార్చి14న ఇరుపక్షాల వాదనలు వింటామని పేర్కొంది.

'హౌసింగ్' వినతుల్ని పరిశీలించాలి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో హౌసింగ్ బోర్డులో పనిచేసి రిటైరైన ఉద్యోగులు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలించాలని రెండు రాష్ట్రాల హౌసింగ్ బోర్డు అధికారులను హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలందిన 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని, ఆ నిర్ణయాన్ని పిటిషనర్లకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర విభజనకు ముందు తాము హౌసింగ్ బోర్డులో పనిచేసి రిటైరయ్యామని, ఇంతవరకు డీఏ, సవరించిన పెన్షన్లు చెల్లించడం లేదంటూ బి. కుమార్‌స్వామి మరో ముగ్గురు హౌసింగ్ బోర్డు మాజీ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ చేపట్టిన ధర్మాసనం రిటైరైన ఉద్యోగుల విజ్ఞప్తిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని రెండు రాష్ట్రాల హౌసింగ్ బోర్డుల వీసీ అండ్ ఎండీలను ఆదేశించింది.

సీఈఓగా రజత్‌కుమార్: ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈఓ)గా రజత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఈఓగా నియమితులైన రజత్‌కుమార్.. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఎలాంటి అదనపు బాధ్యతలు చేయడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

'సీపీఎస్'పై ప్రభుత్వం పునఃసమీక్షించాలి: స్థిత ప్రజ్ఞ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న 'కాంట్రిబ్యూటరీ పింఛను విధానం (సీపీఎస్)' పై ప్రభుత్వం పునఃసమీక్షించాలని రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్థితప్రజ్ఞ, కల్వాల్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీపీఎస్ రద్దుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సమీక్షించడంతో పాటు, తీర్మానం చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు మార్చి 10న ఎన్టీఆర్ స్టేడియంలో సీపీఎస్ ఉద్యోగుల 'జనజాతర'ను నిర్వహించనున్నట్లు స్థితప్రజ్ఞ వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాలతో కేంద్రం భేటీ రద్దు

▸▸ 27న ఇద్దరు సీఎస్‌ల సమావేశం యథాతథం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అంశాలపై శుక్రవారం కేంద్రం నిర్వహించతలపెట్టిన సమావేశం రద్దయింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న ఈ భేటీ జరగాల్సి ఉండగా.. అది ఈనెల 23కి వాయిదా పడింది. మరోవైపు ఈనెల 27వ తేదీన తెలంగాణ సచివాలయంలో ఏపీ, తెలంగాణ సీఎస్‌ల సంయుక్త సమావేశం యథాతథంగా జరుగనుంది.

బాణం గుర్తు కేటాయించండి!: టీజేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కోదండరాం త్వరలో ఏర్పాటు చేయబోతున్న పార్టీకి బాణం గుర్తుని కేటాయించాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు టీజేఏసీ నేత ఒకరు తెలిపారు. ఇప్పటికే పార్టీకి సంబంధించి రెండు పేర్లను ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ చేశామని, ఇపుడు తాజాగా మరో పేరుతో దరఖాస్తు చేశామన్నారు. 'ఆమ్ ఆద్మీ' మాజీ నేత, స్వరాజ్ అభియాన్ నాయకుడు యోగేంద్రయాదవ్‌తో తమ నాయకులు మంతనాలు జరిపినట్లు కోదండరాం సన్నిహితుడొకరు తెలిపారు. కోదండరాం ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారని, ఆయన వచ్చాక పార్టీ నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని తెలిపారు.

రేషన్ అవినీతిపై ఐటీ తూటా

▸▸ రేషన్‌షాపుల్లో 'ఈ-పాస్' విజయవంతం: సీవీ ఆనంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అవినీతికి చిరునామాగా మారిన, నెలకు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మింగేస్తూ వచ్చిన రేషన్ షాపుల ప్రక్షాళన పూర్తయిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఆయన గురువారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యవస్థలో దశాబ్దాలుగా నాటుకుపోయిన అవినీతిని సాంకేతిక పరిజ్ఞానం(ఐటీ)తో పెకిలించగలిగామన్నారు. 2016 మార్చిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 1545 రేషన్ దుకాణాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన "ఈ-పాస్"(ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలను క్రమంగా రాష్ట్రమంతా అమలు చేసి విజయం సాధించామన్నారు. 17 వేల రేషన్ షాపుల్లో ఏర్పాటు చేసిన యంత్రాలతో నెలకు 12-15%, ఏడాదికి 2.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులుతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఏటా రూ.850 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం నుంచి కాపాడగలిగామన్నారు. రేషన్‌కార్డుదారులు జిల్లాలోని ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునే కొత్త విధానాన్ని మార్చి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తెస్తామని ఆనంద్ తెలిపారు. ఇక నుంచి రేషన్ షాపులకు సెలవు ఉండదని, ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీలోపు సరుకుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఒకే రోజు 91 వేల మంది ప్రయాణం

బెంగళూరు ఎయిర్‌పోర్టు సరికొత్త రికార్డు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రికార్డు నమోదు చేసింది. ఫిబ్రవరి 19న సోమవారం ఏకంగా 91,339 మంది ఇక్కడ నుంచి ప్రయాణించారు. ఆ రోజున 628 విమానాలు టేకాఫ్, లాండింగ్ అయ్యాయి. 2017 డిసెంబర్ 23వ తేదీన 87,815 ప్రయాణికులతో రికార్డు ఉండగా అది అధిగమించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. 2008లో ఎయిర్ పోర్టు ప్రారంభం కాగా ఏటా ప్రయాణీకుల వృద్ధి రేటు పెరుగుతోందన్నారు. దేశంలోనే అత్యధిక ప్రయాణికులు ఉపయోగించుకొనే 3వ అంతర్జాతీయ విమానాశ్రయం బెంగళూరే అన్నారు. అంతర్జాతీయ మార్గంలో బహ్రెయిన్, ఆమ్‌స్టర్‌డామ్‌లకు కొత్తగా విమాన సర్వీసులో ప్రారంభమైనట్టు చెప్పారు.

పదేళ్లలో లైఫ్‌సైన్సెస్ పరిశ్రమ రూ.6.5 లక్షల కోట్లు



2018 సంవత్సరానికి గాను జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును ప్రొఫెసర్ మైఖేల్ ఎన్ హాల్‌కు అందజేస్తున్న మంత్రి కెటిఆర్

తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం.. జినోమ్ వ్యాలీ విస్తరణ, ఇంక్యుబేటర్ల ఏర్పాటు.. ఐటి శాఖ మంత్రి కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలోని లైఫ్‌సైన్సెస్ ఏకోసిస్టమ్‌ను వచ్చే పదేళ్ల కాలంలో 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.6.5 లక్షల కోట్లు)కు పెంచాలన్న లక్ష్యంతో ఉన్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ 5,000 కోట్ల డాలర్లుగా ఉందని, 800కు పైగా కంపెనీలు ఈ రంగంలో పని చేస్తున్నాయని చెప్పారు. లైఫ్‌సైన్సెస్ ఇన్నోవేషన్, మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలపరంగా తెలంగాణ నాయకత్వ స్థాయి మరింత బలపడుతోందని, ఈ స్థాయిని మరింత పటిష్ఠ పరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. దేశ ఫార్మాసుటికల్ ఉత్పత్తిలో రాష్ట్ర వాటా 35 శాతం దాటిందని, దేశ వ్యాక్సిన్ కేంద్రంగా రాష్ట్రానికి గుర్తింపు లభించిందని చెప్పారు. ఇందులో హైదరాబాద్ శివారులోని జినోమ్ వ్యాలీ పాత్ర కీలకంగా ఉందన్నారు. ఆసియాలోని అతిపెద్ద లైఫ్‌సైన్సెస్ క్లస్టర్లలో జినోమ్ వ్యాలీ ఒకటని, దీన్ని నాయకత్వ స్థాయిని మరింతగా బలోపేతం చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా జినోమ్ వ్యాలీని విస్తరించనున్నామని (జినోమ్ వ్యాలీ 2.0), ఈ క్లస్టర్‌కు సంబంధించిన సమీకృత మాస్టర్ ప్లాన్‌ను రూపకల్పనను తక్షణమే ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో మూడు రోజుల పాటు జరిగే 15వ విడత బయోఏషియా సదస్సు గురువారం ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు ఉండటం, క్లస్టర్ విధానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత కారణంగా దేశ, విదేశాల్లోని లైఫ్‌సైన్సెస్ కంపెనీలను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు. జినోమ్ వ్యాలీతోపాటు ప్రతిపాదిత ఫార్మా సిటీ, మెడికల్ డివైజెస్ పార్క్‌ల ద్వారా ప్రపంచ లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు పూర్తి స్థాయి ఏకోసిస్టమ్ కలిగిన గమ్యస్థానంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. హైదరాబాద్ ఈ స్థాయిలో నిలిచేందుకు బయోఏషియా ఎంతగానో దోహదపడిందన్నారు.

రాష్ట్రంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే చర్యల్లో భాగంగా జినోమ్ వ్యాలీకి ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) హోదాను కట్టబెట్టామని, ఫలితంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు వేగవంతంగా లభించే అవకాశం ఏర్పడుతోందని చెప్పారు. జినోమ్ వ్యాలీలో ఇప్పటికే రెండు వందలకు పైగా కంపెనీలున్నాయని, వీటిలో పది వేల వరకు శాస్త్రసాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారని తెలిపారు. నోవార్టిస్, జిఎస్‌కె, సనోఫీ, డ్యూపాంట్ వంటి విదేశీ కంపెనీలతో పాటు అనేక దేశీయ కంపెనీలు కూడా ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. జినోమ్ వ్యాలీలో దేశంలోనే అతిపెద్ద యానిమల్ రీసోర్సెస్ కేంద్రాన్ని త్వరగా ఏర్పాటు చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామన్నారు. దీని వల్ల లైఫ్ సైన్సెస్ కంపెనీలకు అత్యధిక ప్రయోజనం ఉంటుందని, నూతన ఔషధాలను వేగవంతంగా మార్కెట్ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

స్టార్టప్‌లకు చేయూత

సమ్మిళిత వృద్ధికి, స్టార్టప్స్‌కు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు తగిన ఎకోసిస్టమ్‌ను సృష్టిస్తున్నట్టు కెటిఆర్ చెప్పారు. తెలంగాణ అకాడెమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వేలాది మందికి శిక్షణను అందిస్తున్నామని, ఫార్మాసుటికల్, బయోటెక్నాలజీ వంటి రంగాలు కూడా టాస్క్‌లో ప్రాధాన్యాన్ని కలిగి ఉన్నట్టు ఆయన తెలిపారు. లైఫ్‌సైన్సెస్ రంగానికి తగిన కోర్సులను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి పని చేయాలని సూచించారు.

నానో మెడిసిన్ కోసం ఇనిస్టిట్యూట్

ఇమ్యునోథెరపీ, పర్సనలైజ్డ్ మెడిసిన్, నానో మెడిసిన్ వంటి విభాగాలకు ప్రాధాన్యం పెరుగుతోందని ఈ నేపథ్యంలో వీటిపై దృష్టిసారించే ఇనిస్టిట్యూట్‌ను కూడా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని కెటిఆర్ చెప్పారు. దీనికోసం స్థానిక ఇన్‌స్టిట్యూషన్లు, పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. గత ఏడాది బయోఏషియాలో లైఫ్ సైన్సెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ను ప్రకటించామని, ఈ ఏడాది నుంచి ఫండ్ పెట్టుబడులు ప్రారంభం అవుతాయని కెటిఆర్ తెలిపారు. వచ్చే రెండుమూడేళ్ల కాలంలో లైఫ్‌సైన్సెస్ రంగంలో 3,000 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను సృష్టించడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. 19,000 ఎకరాల్లో హైదరాబాద్ ఫార్మా సిటీని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని, దీనికి త్వరలోనే పర్యావరణ అనుమతులు రానున్నాయని ఆయన చెప్పారు. ఫార్మాసిటీ ఇప్పటికే మంచి స్పందన లభిస్తోందన్నారు.

మెడికల్ డివైజెస్ సెక్టార్‌లో ఎన్నో అవకాశాలున్నాయని, ఇందులో అవకాశాలను పారిశ్రామికవేత్తలు పరిశీలించాలన్నారు. దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. సదస్సులో భారత్ బయోటెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ఎల్లా, బయోలాజికల్ ఇ ఎండి మహిమా దాట్ల, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పాల్గొన్నారు. సదస్సులో 52 దేశాలకు చెందిన 1600 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు.



లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, హెల్త్‌కేర్, మెడికల్ డివైజెస్ రంగాల్లో పరిశోధనా నిమిత్తం టిఎస్ఐఐసి, మలేషియాకు చెందిన సెంట్రల్ స్పెక్ట్రమ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. మంత్రి కెటిఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకుంటున్న టిఎస్ఐఐసి వైస్ ఛైర్మన్, ఎండి ఇ వెంకట నర్సింహా రెడ్డి, సెంట్రల్ స్పెక్ట్రమ్ ప్రతినిధులు

ఏటా ఒక కొత్త వ్యాక్సిన్ వచ్చేలా చర్యలు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కంపెనీలు ప్రపంచ దేశాలకు అత్యంత అందుబాటు ధరల్లోనే వ్యాక్సిన్లను అందిస్తున్నాయని, వీటిలో భారత్ బయోటెక్, బయోలాజికల్ ఇ, శాంతా బయోటెక్నిక్స్ కీలక పాత్ర పోషించాయని కెటిఆర్ అన్నారు. రాష్ట్రంలోని కంపెనీలు ఏటా ఒక కొత్త వ్యాక్సిన్‌ను విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇందులో భాగంగా జినోమ్ వ్యాలీలో వ్యాక్సిన్ అభివృద్ధి కోసం ఇంక్యుబేటర్లను తీసుకురానున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే లైఫ్‌సైన్సెస్ ఇంక్యుబేటర్లు పని చేస్తున్నాయని, ఈ ఇంక్యుబేటర్లలో వందకు పైగా లైఫ్‌సైన్సెస్ కంపెనీలున్నాయన్నారు. వీటిలోని కంపెనీలు సొంత మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, పరిశోధన, ఇన్‌స్టిట్యూషన్లు, కళాశాలు ఇందులో భాగం కానున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అటు ఐటి రంగంలో ఇటు లైఫ్‌సైన్సెస్ రంగంలో నాయకత్వ స్థాయిలో ఉన్నట్టు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని చెప్పారు. లైఫ్‌సైన్సెస్ పరిశ్రమ సామర్థ్యాలను రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ఇంజన్‌గా వినియోగించుకోవాలనుకుంటున్నామన్నారు. వచ్చే పదేళ్ల కాలంలో ఈ పరిశ్రమ ద్వారా 4 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నామని ఆయన చెప్పారు. వీటిలో అత్యధికం తయారీ రంగంలోనే అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

నోయిడాలో పల్సస్ గ్రూప్ సెంటర్

హైదరాబాద్ : ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో 1000 సీట్ల సామర్థ్యం కలిగిన గ్లోబల్ సైంటిఫిక్ లిటరేచర్ లాంగ్వేజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన పల్సస్ గ్రూప్ వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మద్దతుతో హిందీలో ఉన్న గ్లోబల్ సైంటిఫిక్, ఆరోగ్య సమాచారాన్ని ఇతర ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేయటంతో పాటు నైపుణ్యాల శిక్షణపై ఈ సెంటర్ దృష్టి సారించనుందని పల్సస్ గ్రూప్ తెలిపింది. ప్రస్తుతం సైంటిఫిక్, హెల్త్‌కేర్ సమాచారాన్ని ఇంగ్లీష్ నుంచి హిందీ, తెలుగు, మళయాళం, తమిళ్, గుజరాతీ, బెంగాలీ భాషల్లోకి తర్జుమా చేయటంపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపింది.

యూరప్‌కు ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ హవా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భారత్‌లో తయారైన రిటైల్, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను యూరప్‌కు ఎగుమతి చేయటంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయని సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫ్రైట్ ఫార్వార్డింగ్ సర్వీసెస్ సంస్థ డామ్కో వెల్లడించింది. 2017 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి యూరప్‌కు ప్రధానంగా ఫుట్‌వేర్ ఎగుమతులు జరిగాయని తెలిపింది. కాగా గుజరాత్ నుంచి హోమ్ బెడ్డింగ్, బాత్ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ నుంచి జర్మనీకి తమిళనాడు నుంచి నెదర్లాండ్స్‌కు అధికంగా ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని తెలిపింది.

ఎంతిస్తావ్.. ఎలా ఇస్తావ్?

నీరవ్ మోదీకి పిఎన్‌బి లేఖ



న్యూఢిల్లీ : సొమ్ము రికవరీకి అవకాశాలు లేకుండా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) తానే అన్ని మార్గాలను మూసేస్తోందంటూ 11, 400 కోట్ల రూపాయల భారీ స్కామ్ సూత్రధారి, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ చేసిన ఆరోపణలపై బ్యాంకు స్పందించింది. బకాయిపడిన మొత్తాన్ని బ్యాంకుకు తిరిగి ఎలా చెల్లిస్తారో స్పష్టమైన ప్రణాళికను వెల్లడించాలని నీరవ్ మోదీకి సూచించింది. కొంతమంది బ్యాంకు అధికారుల సహాయంతో మీరు అనధికారికంగా, మోసపూరితంగా ఎల్ఓయులను పొందారు. ఏ దశలోనూ మా బ్యాంకు మీకు చెందిన మూడు భాగస్వామ్య సంస్థలకు ఎల్ఓయులను తీసుకునే వెసులుబాటు అధికారికంగా కల్పించలేదు. బ్యాంకుకు జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తాననీ, సొమ్ము చెల్లిస్తానని లేఖ రాశారు. అయితే సొమ్ము ఏ విధంగా చెల్లిస్తారో స్పష్టమైన ప్రణాళికను మాత్రం వెల్లడించలేదు. మీ దగ్గర అటువంటి ప్రణాళిక ఉంటే వెంటనే తెలియజేయండి అని నీరవ్‌కు పంపిన ఒక ఇ-మెయిల్‌లో బ్యాంకు పేర్కొంది. పిఎన్‌బి ఇంటర్నల్ బ్యాంకిం గ్ డివిజన్ జిఎం అశ్వనీ వత్స్ ఈ లేఖను పంపారు. రెండు రోజుల క్రితం నీరవ్ మోదీ ఈ స్కామ్ విషయంలో సొమ్ము చెల్లించేందుకు తాను సిద్ధమేనని అయితే బ్యాంకు చేసిన రచ్చ వల్ల తన వ్యాపారం, బ్రాండ్ ఇమేజ్ సర్వనాశనం అయ్యాయని పేర్కొంటూ ఒక ఇ-మెయిల్ పంపారు. బ్యాంకు అత్యుత్సాహంతో వందల కోట్ల రూపాయల విలువైన తన ఆస్తులను సిబిఐ, ఇడి జప్తు చేసిందని పేర్కొన్నారు. తాను బకాయిలను చెల్లించలేని స్థితి బ్యాంకు కల్పించిందని ఆరోపించారు. ఈ లేఖకు స్పందనగా ఇప్పుడు బ్యాంకు ఇ-మెయిల్ పంపింది.

బ్యాంకు లేఖకు అర్థం ఏమిటో...

పిఎన్‌బి అత్యుత్సాహం, మీడియా రెచ్చిపోయి రాసిన రాతలతో తన వ్యాపారం కుప్పకూలిందనీ, బకాయిలు చెల్లించేందుకు ముందుకు వచ్చినా బ్యాంకు తన ఆఫర్‌ను పట్టించుకోకుండా రచ్చరచ్చ చేసిందని నీరవ్ మోదీ ఆరోపణ. తాజా పరిణామాల తర్వాత తాను చేతులెత్తేసినట్టేనని నీరవ్ మోదీ బ్యాంకుకు తేల్చిచెప్పారు కూడా. అయినప్పటికీ సొమ్ము ఎలా తెస్తారో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని సూచిస్తూ పిఎన్‌బి నీరవ్‌కు లేఖ రాయడం విస్మయం కలిగిస్తోందని పరిశీలకులు అంటున్నారు.

దిద్దుబాటు చర్యల్లో పిఎన్‌బి

నీరవ్ మోదీ స్కామ్ తర్వాత గ్లోబల్ పేమెంట్స్ నెట్‌వర్క్ స్విఫ్ట్ నిర్వహణకు సంబంధించిన విధానాల్లో పిఎన్‌బి మార్పులు చేపట్టింది. కోర్ బ్యాంకింగ్‌తో నిమిత్తం లేకుండా ఇద్దరు జూనియర్ స్థాయి అధికారులు యథేచ్ఛగా ఎల్ఓయులు జారీ చేసి బ్యాంకుకు 11,400 కోట్ల రూపాయల నష్టం తెచ్చిన విషయం తెలిసిందే. ఇకపై స్విఫ్ట్ మెసెజ్‌లను కనీసం ముగ్గురు అధికారులు ధృవీకరించాల్సి ఉంటుంది. ఈ మేరకు పిఎన్‌బి యాజమాన్యం అన్ని ప్రాంతీయ కార్యాలయాలకు నోటీసులు పంపినట్టు తెలిసింది.

దుకాణాలకు తాళం.. వీధిన పడిన ఉద్యోగులు

దేశవ్యాప్తంగా ఉన్న గీతాంజలి జెమ్స్, నీరవ్ మోదీ స్టోర్స్ మూతబడ్డాయి. రెండు సంస్థల ఉద్యోగులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. అత్యంత సంపన్నులు మాత్రమే సందర్శించే నీరవ్ మోదీ స్టోర్స్ గత వారం రోజులుగా వెలవెలబోతున్నాయి. ముంబైలోని నీరవ్ మోదీ ప్రధాన ఔట్‌లెట్ కాలాఘోడాలో ఉంది. అక్కడ ఇద్దరు ముగ్గురు చౌకిదార్లు తప్ప మరో వ్యక్తి కనిపించడం లేదు. బెంగళూరులోని లావెలె రోడ్‌లో ఉన్న స్టోర్ పరిస్థితి కూడా అంతే. గీతాంజలి స్టోర్స్ విషయంలో అయితే ఫ్రాంఛైజీ సంస్థల యజమానులు లబోదిబోమంటున్నారు. ఈ స్కామ్ బయటకు రాక ముందు నుంచే గీతాంజలి అధినేత చోక్సీతో ఫ్రాంఛైజీ సంస్థలకు గొడవలు మొదలయ్యాయి. డబ్బులు మింగి సరుకు సప్లయ్ చేయకుండా తమతో చెలగాటమాడుతున్నారని చోక్సీపై వారు ఆరోపణలు చేస్తున్నారు. ఈ గొడవలకు తోడుగా ఇప్పుడు ఇడి దాడులను, సిబిఐ దర్యాప్తును కూడా వారు ఎదుర్కోవాల్సి వస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 100 గీతాంజలి ఫ్రాంఛైజీలు ఉండగా వారంతా రెండు మూడేళ్లుగా చోక్సీతో గొడవల కారణంగా వ్యాపారాన్ని నిలిపివేశారు. దాదాపు 10-12 మంది కేసులు కూడా పెట్టారు. నిజానికి గత కొన్నేళ్లలో కంపెనీ తన సొంత ఔట్‌లెట్లను చాలామటుకు మూసేసినట్టుగా చెబుతున్నారు. పిఎన్‌బి స్కామ్‌తో గీతాంజలి, నీరవ్ మోదీ సంస్థల ఉద్యోగులు రోడ్డునపడ్డారు. హైదరాబాద్‌లోని గీతాంజలి జెమ్స్ సెజ్‌లో పనిచేస్తున్న దాదాపు 550 మంది కూడా ఉపాధి కోల్పోయారు.

ఈక్విరస్ క్యాపిటల్‌లో ఫెడరల్ బ్యాంక్‌కు 26 శాతం వాటా

ముంబై : ప్రైవేట్ రంగంలోని ఫెడరల్ బ్యాంక్.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లోకి అడుగుపెట్టింది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన ఈక్విరస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇసిపిఎల్)లో 26 శాతం వాటాలను చేజిక్కించుకోవటం ద్వారా ఫెడరల్ బ్యాంక్ ఈ విభాగంలోకి ప్రవేశించింది. ఈక్విరస్‌లో వాటా కొనుగోలుతో డెట్, ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్, స్ట్రక్చర్డ్ ఫైనాన్స్, క్యాపిటల్ మార్కెట్ ప్రొడక్ట్స్, అడ్వైజరీకి సంబంధించి సమగ్రమైన ఫైనాన్షియల్ సొల్యూషన్స్‌ను అందించే అవకాశం లభించనుందని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. దీంతోపాటు హెచ్ఎన్ఐ, ఎన్ఆర్ఐల కోసం వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలతో పాటు ఈక్విరస్ భాగస్వామ్యంతో పలు ఉత్పత్తులను ఆఫర్ చేయవచ్చని పేర్కొంది. హోల్‌సేల్, రిటైల్ కస్టమర్ల కోసం సర్వీసులను విస్తరించాలన్న లక్ష్యంతో ఈక్విరస్‌లో వాటాను కొనుగోలు చేసినట్లు ఫెడరల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గణేష్ శంకరన్ తెలిపారు. ఫెడరల్ బ్యాంక్ భాగస్వామ్యంతో మరింత మంది క్లయింట్లకు సేవలను అందించటంతో పాటు వ్యాపారాన్ని మరింత వృద్ధిపథంలోకి తీసుకువెళ్లే అవకాశం లభించనుందని ఈక్విరస్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ గార్గ్ అన్నారు.

ఆర్ఇన్‌ఫ్రాకు రూ.3,647 కోట్ల కాంట్రాక్టు

న్యూఢిల్లీ : తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టాన్‌జెడ్‌కో) నుంచి 3,647 కోట్ల రూపాయల కాంట్రాక్టును గెలుచుకున్నట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్ఇన్‌ఫ్రా) వెల్లడించింది. ఉప్పూర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఈ ఇపిసి ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిపింది. తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఉప్పూర్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు సూపర్ క్రిటికల్ బొగ్గు ఆధారిత ప్లాంట్‌కు సంబంధించి బ్యాలెన్స్ ఆఫ్ ప్యాకేజ్, సంబంధిత సివిల్ పనులను చేపట్టాల్సి ఉంటుందని ఆర్ఇన్‌ఫ్రా తెలిపింది.

వరంగల్‌లో మోనోరైల్

రూ.1,200 కోట్లతో నిర్మాణం.. త్వరలో ఎంఒయు

ఇంటమిన్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాంజ్ జుర్చర్

హన్మకొండ (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో మోనో రైలు ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటమిన్ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాంజ్ జుర్చర్ వెల్లడించారు. గురువారం సంస్థకు చెందిన ఏడుగురు ప్రతినిధుల బృందం వరంగల్‌లో పర్యటించి సమాచారాన్ని సేకరించింది. వరంగల్, కాజీపేట మధ్య 12 కిలోమీటర్ల పొడవున మోనో రైల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మోనో రైల్ వెళ్లే మార్గంలో భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, కేబుల్ వ్యవస్థల గురించి గ్రేటర్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైలు మార్గానికి ఇరువైపుల కనీసం నాలుగు చోట్ల స్టేషన్లు నిర్మించడానికి అందుబాటులో ఉన్న స్థలాలను కూడా పరిశీలించారు. కాగా శుక్రవారం హైదరాబాద్‌లో మున్సిపల్ శాఖ మంత్రి కె తారక రామారావుతో భేటీ కానున్నట్లు గ్లోబల్ స్పెక్ట్రమ్ సిఇఒ సునీత్ వర్మ చెప్పారు. మంత్రితో చర్చించిన అనంతరం మోనో రైల్ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయానికి వస్తామని, వీలైతే ఎంఒయు కుదుర్చుకునే అవకాశం ఉందన్నారు. తొలి దశలో 12 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని నిర్మిస్తామని, అవసరాన్ని బట్టి విస్తరించే అవకాశం లేకపోలేదని ఆయన తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయం 1,200 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు సునీత్ వర్మ చెప్పారు.

సర్కారు టెలికాం కంపెనీల విలీనం ఉండదు

న్యూఢిల్లీ : ప్రభుత్వం రంగంలోని టెలికాం సంస్థలు బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌ను విలీనం చేసే ప్రతిపాదన ఏదీ ప్రస్తుతానికి లేదని టెలికమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా స్పష్టం చేశారు. అయితే ఈ రెండు సంస్థల కార్యకలాపాల మధ్య మేళవింపును సాధించి ఉభయతారకంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదన మాత్రం ఉందని ఆయన చెప్పారు. టెలికామ్ శాఖ ఆధ్వర్యంలోని వివిధ సంస్థల మధ్య సమన్వయం, కార్యకలాపాల్లో మేళవింపు కోసం వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ప్రభుత్వ నియంత్రణలోని సంస్థల మధ్య సమన్వయాన్ని సాధిస్తే భూములు, భవనాలు, సిబ్బందిని గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకునే వీలుంటుందని ఆయన చెప్పారు. టెలికామ్ రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్ చర్యలపై ప్రైవేట్ టెలికామ్ సంస్థ నుంచి ఎదురవుతున్న నిరసన గురించి ప్రస్తావిస్తూ, ట్రాయ్ వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదని మంత్రి స్పష్టం చేశారు. ట్రాయ్ నిర్ణయాలు, చర్యలు జియోకు అనుకూలంగా ఉంటున్నాయన్న విమర్శలతో ప్రైవేట్ ఆపరేటర్లు ట్రాయ్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న విషయం తెలిసిందే.

భారత ఐటికి స్టార్టప్స్ దన్ను

కొత్త టెక్నాలజీతో మరిన్ని అవకాశాలు

ఎన్ఐఐటి ఛైర్మన్ రాజేంద్ర ఎస్ పవార్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగం రూపు రేఖలు మారిపోతున్నాయి. కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ వంటి కొత్త టెక్నాలజీలు ఈ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ ఐటి సదస్సులో ఈ మార్పులపైనే ప్రధానంగా చర్చలు జరిగాయి. భారత ఐటి రంగంపై ఈ మార్పుల ప్రభావంపై ఈ సదస్సుకు హాజరైన ఐటి కోర్సుల శిక్షణా సంస్థ ఎన్ఐఐటి ఛైర్మన్ రాజేంద్ర ఎస్ పవార్ 'ఆంధ్రజ్యోతి' బిజినెస్'తో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆ వివరాలు...

భారత ఐటి రంగ భవిష్యత్ ?

భారత ఐటి రంగం అభివృద్ధికి ఎలాంటి ఢోకా లేదు. ప్రస్తుతం వృద్ధి రేటు తగ్గినా అది తాత్కాలికమే. కొత్త టెక్నాలజీల ప్రవేశంతో ఈ రంగంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పులను సానుకూలంగానే చూడాలి. దీంతో మన ఐటి కంపెనీలకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ఇదివరకు దీర్ఘకాలిక ప్రాతిపదికన పెద్ద పెద్ద ప్రాజెక్టులు లభించేవి. ముందుముందు దీర్ఘకాలిక ప్రాజెక్టులకు బదులు స్వల్పకాలిక ప్రాజెక్టులే ఎక్కువగా లభిస్తాయి. మన ఐటి కంపెనీలు ఈ మార్పులకు తగ్గట్టు సన్నద్ధం కావాలి. ముఖ్యంగా క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేలా సిద్ధం కావాలి.

ఎలాంటి మార్పులు రావాలి?



ముఖ్యంగా మూడు విషయాల్లో మార్పులు రావాలి. కొత్త టెక్నాలజీలపై ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు కంపెనీలు చర్యలు తీసుకోవాలి. గతంలోలా దీర్ఘకాలిక ప్రాజెక్టులకు బదులు క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా స్వల్పకాలంలోనే అనేక ప్రాజెక్టులు పూర్తి చేసేలా వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి. కీలక స్థానాల్లో వ్యూహాత్మకంగా ఆలోచించే నిపుణులను నియమించుకోవాలి.

ఐటి ఉద్యోగాలపై కొత్త టెక్నాలజీల ప్రభావం ?

అందరూ అనుకుంటున్నట్టు ఈ టెక్నాలజీలతో ఉద్యోగాలు పోతాయనేది వట్టిమాట. కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులకు కొత్త టెక్నాలజీలపై పెద్దఎత్తున శిక్షణ ఇస్తున్నాయి. అయినా తాత్కాలికంగా కొన్ని ఆటుపోట్లు చోటు చేసుకుంటాయి. అవన్నీ త్వరలోనే సర్దుకుంటాయి. కాకపోతే ఉద్యోగాల కల్పన వృద్ధి రేటు గతంలో ఉన్నంత వేగంగా ఉండదు.

స్టార్టప్స్ పాత్ర ?

స్పష్టంగా చెప్పాలంటే స్టార్టప్స్ భారత ఐటి రంగానికి దన్నుగా నిలుస్తాయి. ఈ సంస్థలు అందించే వినూత్న టెక్నాలజీలు, సొల్యూషన్స్ భారత ఐటి కంపెనీల సత్తాను మరింత పెంచుతాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో మన ఐటి కంపెనీలకు మరిన్ని అవకాశాలు ఏర్పడతాయి.

కొత్త టెక్నాలజీలపై సరైన శిక్షణ అవకాశాలు అందుబాటులో ఉన్నాయా?

పూర్తిస్థాయిలో శిక్షణ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధాన ఇంజినీరింగ్ కాలేజీలతో పాటు ప్రధాన నగరాలన్నిటిలోనూ అనేక సంస్థలు ఈ టెక్నాలజీలపై శిక్షణా కోర్సులు నిర్వహిస్తున్నాయి. కాకపోతే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో మాత్రం ఇంకా ఈ సదుపాయాలు అంతగా అందుబాటులోకి రాలేదు. ఆ నగరాలు, పట్టణాల్లోని విద్యార్థులు కూడా ఆన్‌లైన్ ద్వారా కొత్త టెక్నాలజీలపై శిక్షణ పొందవచ్చు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33819.50	10382.70	30555	38315	65.04	65.50
↓ 25.36	↓ 14.75	↓ 300	↑ 135	↓	↑

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)



ఈ కారు ధర రూ. 9.50 కోట్లు

మార్కెట్‌లో రోల్స్‌రాయిస్ ఎనిమిదో తరం ఫాంటమ్

చెన్నై: లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్ రాయిస్ ఎనిమిదో తరం ఫాంటమ్ కారును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు ధర 9.50 కోట్ల రూపాయలు. దీనికి 6.75 లీటర్ ట్విన్ టర్బోచార్జ్‌డ్ వి12 ఇంజన్ అమర్చారు. ఈ ఇంజన్ 563 హార్స్‌పవర్ శక్తిని, 900 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. 5.4 సెకండ్లలోనే జీరో నుంచి వంద కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఈ కొత్త సీరీస్ కారు ఇప్పటివరకు మార్కెట్లో ఉన్న ఫాంటమ్‌లతో పోల్చితే 30 శాతం తక్కువ బరువు కలిగి ఉంది. రాత్రివేళల్లో కారు హెడ్‌లైట్లు 600 మీటర్ల వరకు కాంతిని విస్తరించడం వల్ల భద్రతాపరంగా మరింత సమర్థవంతంగా ఉంటుంది. స్టాండర్డ్ వీల్‌బేస్ ఉన్న కారు ధరను 9.50 కోట్ల రూపాయలుగాను, పెద్ద వీల్‌బేస్ ఉన్న కారు ధర 11.35 కోట్ల రూపాయలుగాను ప్రకటించింది. నాలుగు సంవత్సరాల సర్వీసు ప్యాకేజీ, రీజినల్ వారెంటీ కూడా ఈ ధరలో ఇమిడి ఉన్నాయి.

ఈ ఏడాది మరో ఐదు మోడల్స్

భారత్‌లో తమ ఉత్పత్తుల శ్రేణిని విస్తరించే ప్రణాళికల్లో భాగంగా ఈ కారును విడుదల చేసినట్టు రోల్స్ రాయిస్ ఆసియా పసిఫిక్ రీజినల్ డైరెక్టర్ పాల్ హారిస్ ప్రకటించారు. మరో లగ్జరీ కారు కలినన్ ఈ ఏడాది ద్వితీయార్థంలో మార్కెట్‌లోకి తీసుకువస్తామని, బ్లాక్‌బాడ్జ్‌తో పాటు ఏడాదిలో మరో ఐదు మోడళ్లు మార్కెట్లోకి వస్తాయని ఆయన చెప్పారు. వాటిలో ఫాంట్, ఘోస్ట్ పెద్ద వీల్ బేస్ కార్లు, రెత్, డాన్ ఉన్నాయని ఆయన చెప్పారు.

దక్షిణాదిలో పెరుగుతున్న ఆదరణ

చెన్నై, హైదరాబాద్‌లలో తమ అధీకృత డీలర్‌గా కున్ ఎక్స్‌క్లూజివ్‌ను నియమించినట్టు ఆయన చెప్పారు. దక్షిణాదిలో విలాసవంతమైన కార్లకు ఆదరణ పెరుగుతున్నదని, భారత ఆటోమొబైల్ మార్కెట్ పరంగా చూసినా చెన్నై ప్రధానమైన ఆటోమొబైల్ హబ్ అని చెబుతూ అందుకే ఈ కారును చెన్నైలో విడుదల చేశామని ఆయన అన్నారు. దక్షిణాదిలో ప్రస్తుతం తమకు ఐదు ఔట్‌లెట్లున్నాయని ఆయన చెప్పారు. 214 శాతం దిగుమతి సుంకం, జిఎస్‌టి కారణంగా కారు ధర అధికంగా ఉన్నదని పాల్ అన్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ మార్పులు చేశారని ఇది ఏ మాత్రం మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఆటోమోటివ్ పరిశ్రమ గత ఏడాది ఎలాంటి నిలకడ లేకుండా ఎగుడుదిగుడులుగా పయనించిందని, డీమానిటైజేషన్, జిఎస్‌టి ప్రభావం అధికంగా పడిందని ఆయన చెప్పారు.

బిడిఎల్, ఇరెడా ఇష్యూలకు గ్రీన్‌సిగ్నల్

BHARAT DYNAMICS LTD. (A Govt. of India Enterprise)

న్యూఢిల్లీ : మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి ప్రభుత్వ రంగంలోని భారత్ డైనమిక్స్, ఇరెడా పబ్లిక్ ఇష్యూలకు అనుమతి మంజూరు చేసింది. ఈ రెండు కంపెనీలు డిసెంబరు, జనవరి నెలల్లో ఇష్యూలకు అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేశాయి. ఇష్యూలో భాగంగా భారత్ డైనమిక్స్ సంస్థలో ఈక్విటీ వాటాలను ప్రభుత్వం విక్రయిస్తుంది. దాని వల్ల స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అయ్యే అవకాశం కంపెనీకి కలుగుతుంది. 1970లో ఏర్పాటైన ఈ సంస్థ రక్షణ రంగానికి అవసరమైన గైడెడ్ క్షిపణులు, అనుబంధ ఉత్పత్తులను బిడిఎల్ తయారుచేస్తుంది. 2017 చివరి నాటికి కంపెనీ నికర విలువ 2,212.46 కోట్ల రూపాయలుంది. ఎస్‌బిఐ క్యాపిటల్ మార్కెట్స్, ఐడిబిఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, యస్ సెక్యూరిటీస్ ఇష్యూను నిర్వహిస్తాయి.

IREDA

పునర్ వినియోగ ఇంధన వనరుల రంగంలోని ఇరెడా ఇష్యూలో భాగంగా 13.90 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తుంది. వాటిలో 6.95 లక్షల ఈక్విటీ షేర్లను అర్హులైన ఉద్యోగుల కోసం కేటాయించారు. కంపెనీ మూలధనం పెంపునకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు ఇష్యూ ద్వారా సేకరించే నిధులు ఉపయోగించుకోనున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ లిస్టింగ్‌తో కంపెనీ పెయిడప్ షేర్ క్యాపిటల్ 784 కోట్ల రూపాయల నుంచి 923 కోట్ల రూపాయలకు పెరుగుతుంది.

వెన్నాడిన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల భయాలు

మళ్లీ నష్టాల్లోకి జారుకున్న మార్కెట్

ముంబై : ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలహీనపడి మూడు నెలల కనిష్ఠ స్థాయికి దిగజారడం, ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం తీర్మానాల ద్వారా వెలువడిన ద్రవ్యోల్బణం ముప్పు సంకేతాలతో పాటు అమెరికాలో వడ్డీ రేట్లు పెరగవచ్చునన్న భయాలు, విదేశీ మార్కెట్ల బలహీనత గురువారం దేశీయ మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టాయి. ఫిబ్రవరి కాంట్రాక్టుల్లో సెన్సెక్స్ 2230.94 పాయింట్లు, నిఫ్టీ 686.95 పాయింట్లు దిగజారాయి. స్వల్ప సమయం పాటు ఇండెక్స్‌లు కాస్తంత పాజిటివ్‌గా మారినట్టు కనిపించినా ఆ లాభం నిలబడలేదు. సెన్సెక్స్ 25.36 పాయింట్లు నష్టంతో 33819.50 పాయింట్లు, నిఫ్టీ 14.75 పాయింట్ల నష్టంతో 10382.70 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి.

- 2.19 శాతం దిగజారి నష్టపోయిన షేర్లలో డాక్టర్ రెడ్డీస్ అగ్రస్థానంలో నిలిచింది. ఒఎన్‌జిసి, పవర్‌గ్రిడ్, టాటా మోటార్స్, మారుతి సుజుకీ, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఆటో, ఎన్‌టిపిసి ఏషియన్ పెయింట్స్, భారతి ఎయిర్‌టెల్, ఆర్ఐఎల్, టిసిఎస్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి.
- సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్, కోటక్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా, యస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టి, కోల్ ఇండియా లాభపడ్డాయి.
- ఎక్స్ఛేంజీల వద్ద గణాంకాల ప్రకారం బుధవారం నాడు ఎఫ్‌పిఐలు 1,214.18 కోట్ల రూపాయల విలువ గల షేర్లు విక్రయించగా దేశీయ సంస్థలు 1,375.48 కోట్ల రూపాయల విలువ గల షేర్లు కొనుగోలు చేశాయి.

28 పైసలు నష్టపోయిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరో పెద్ద క్షీణతను నమోదు చేసింది. డాలర్ మారకంలో 28 పైసలు దిగజారి 65.04 వద్ద ముగిసింది. నవంబరు 20 తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. ఇంట్రాడేలో రూపాయి 34 పైసల వరకు నష్టపోయి 65.11 వరకు కూడా దిగజారింది.



ఏడు రోజుల్లో గీతాంజలి 58 శాతం డౌన్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వెలువడిన నాటి నుంచి ఆ బ్యాంకుతో పాటు గీతాంజలి జెమ్స్ రెండు షేర్లలోనూ పతనం కొనసాగుతూనే ఉంది. గీతాంజలి షేరు వరుసగా ఏడో రోజు కూడా ఒత్తిడిని ఎదుర్కొని 4.92 శాతం నష్టపోయి 26.10 రూపాయల వద్ద ముగిసింది. ఈ షేరు వరుసగా ఏడు సెషన్లలో 58.5 శాతం నష్టపోయింది. భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా పిఎన్‌బి షేరు మరో రెండు శాతం దిగజారింది. బిఎస్ఇలో 2.09 శాతం క్షీణతతో 114.65 రూపాయల వద్ద, ఎన్ఎస్ఇలో 2.30 శాతం నష్టంతో 114.60 రూపాయల వద్ద క్లోజయింది.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,450	---	31,470	31,300	30,540
క్రితం ముగింపు	31,480	---	31,470	30,250	30,580
22 క్యారెట్లు	29,120	---	28,750	28,980	29,090
క్రితం ముగింపు	29,150	---	28,950	28,980	29,120
వెండి (కిలో)	39,600	---	39,600	39,500	41,400
క్రితం ముగింపు	39,400	---	39,400	39,400	41,300

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	72.00
కర్నూలు	75.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	80.00	అనంతపురం	75.00
గోదావరి	78.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	363.00	నమక్కల్	380.00
గోదావరి	363.00	బెంగళూరు	395.00
విశాఖపట్నం	365.00	ముంబై	400.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.20	68.64
పౌండ్	82.32	95.47
యూరో	72.67	84.29
ఆస్ట్రేలియా డాలర్	46.14	53.40
బహ్రెయిన్ దినార్	160.31	183.71
కువైట్ దినార్	179.54	223.51
ఒమని రియాల్	156.99	179.60
సౌదీ రియాల్	15.74	18.66
సింగపూర్ డాలర్	44.68	52.92
యుఎఇ దిరమ్	16.11	18.83

10430 పైన మైనర్ అప్‌ట్రెండ్

టెక్ వ్యూ

నిఫ్టీ మరింత బలహీనతలో ప్రారంభమై 10350 వద్ద రికవరీ సాధించింది. తదుపరి నిలకడగా కదులుతూ చివరికి 15 పాయింట్ల నష్టంతో ముగిసినా డే గరిష్ఠ స్థాయిలో ముగియడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత కొద్ది రోజులుగా 10350 వద్ద బాటమ్ ఏర్పడింది. ఇక్కడ మద్దతు కనిపిస్తున్నా బలమైన కదలిక లేదు. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఆ కదలిక అవసరం. స్వల్పకాలిక ఓవర్ సోల్డ్ స్థితి కూడా కనిపిస్తున్నందు వల్ల రికవరీకి ఆస్కారం ఉంది.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10430 **మద్దతు :** 10300

- మరింత అప్‌ట్రెండ్ కోసం 10430 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు, టార్గెట్లు 10500, 10700.
- 10300 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ మరోసారి కీలక స్థాయి 25000 కన్నా దిగువన ముగిసింది. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది.

■ వి.సుందర్ రాజా

ప్రారంభ సెషన్ మెరుగు

తిథి : ఫాల్గుణ శుద్ధ అష్టమి **నక్షత్రం :** కృత్తిక, రోహిణి ఆర్ద్ర, స్వాతి, శతభిషం, పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, మిథున, తుల రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10382.70 (-14.75)

ట్రెండ్ మార్పు వేళలు : 12.41; 1.40

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 9.30 నుంచి 12.45 వరకు మెరుగ్గా ట్రేడవుతూ తదుపరి 3.15 వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్ లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

ఆస్ట్రో వ్యూ

నిరోధం : 10425, 10460

మద్దతు స్థాయిలు : 10340, 10305

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

మహారాష్ట్రలో ఐకియా రూ.3,000 కోట్ల పెట్టుబడులు

రెండు నెలల్లో హైదరాబాద్ స్టోర్ ప్రారంభం



ముంబై: స్వీడిష్ ఫర్నీచర్ దిగ్గజం ఐకియా.. మహారాష్ట్రలో 3,000 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. మల్టీ ఫార్మాట్ స్టోర్లతో పాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల కోసం దీర్ఘకాలం పాటు ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు ఐకియా డిప్యూటీ కంట్రీ మేనేజర్ పాట్రిక్ ఆంటోనీ వెల్లడించారు. ఐకియాకు మహారాష్ట్ర కీలకంగా ఉండనుందని, ఇక్కడ వ్యాపారాభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో నిధులను కేటాయించనున్నట్లు ఆయన చెప్పారు. త్వరలోనే ముంబైలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా 2025 నాటికి 10,500 కోట్ల రూపాయల పెట్టుబడితో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆంటోనీ పేర్కొన్నారు. కాగా పుణెలో తొలి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కోసం వచ్చే రెండు మూడేళ్లలో 750 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌లో తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో త్వరలో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ స్టోర్‌ను ప్రారంభించాలని భావించామని, అయితే కార్మికుల రక్షణ, నిర్మాణంలో నాణ్యత వంటి అంశాల కారణంగా జాప్యం ఏర్పడిందని, ఏదిఏమైనా రానున్న కొద్ది నెలల్లో ఈ స్టోర్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ప్రోయుగ నుంచి వర్చువల్ రియాల్టీ క్రికెట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రోయుగ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన వర్చువల్ రియాల్టీ క్రికెట్ స్పోర్ట్ (విస్పోర్ట్).. ఐబి క్రికెట్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ లాంఛనంగా విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రపంచవ్యాప్తంగా ఐబి క్రికెట్ అందుబాటులోకి రానుందని సంస్థ సిఇఒ త్రివిక్రమ్ రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా 25 వేల ఫ్రాంఛైజీలను ప్రారంభించటం ద్వారా లక్ష మంది సభ్యులకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మేకిన్ ఇండియా, స్టాండప్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా ప్రోయుగ ను అభివృద్ధి చేసినట్లు ఆయన చెప్పారు.

బజాజ్ ఆటో అవెంజర్ స్ట్రీట్ 180

ధర రూ.83,171

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : బజాజ్ ఆటో మార్కెట్లోకి 180 సిసి అవెంజర్ స్ట్రీట్‌ను విడుదల చేసింది. అవెంజర్ స్ట్రీట్ 150 స్థానంలో సరికొత్త 180 సిసి సామర్థ్యంతో దీన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది. ఈ బైక్ ధర 83,171 రూపాయలు (తెలంగాణ ఎక్స్‌షోరూమ్), 84,755 రూపాయలు (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌షోరూమ్). క్లాసిక్ బైక్ విభాగంలో స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే ఉద్దేశంతో మరింత పవర్‌ఫుల్ ఇంజన్, సరికొత్త ఫీచర్లతో అవెంజర్ స్ట్రీట్ 180ని రూపొందించినట్లు తెలిపింది. ఎబోనీ బ్లాక్, స్పైసీ రెడ్ రంగుల్లో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు బజాజ్ ఆటో వెల్లడించింది.



వోల్వో నుంచి వి60 వెర్సటైల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : వోల్వో కార్స్.. మార్కెట్లోకి వి60 వెర్సటైల్ ఫ్యామిలీ ఎస్టేట్‌ను తీసుకువచ్చింది. ఫైవ్ డోర్, మిడ్ సైజ్ ప్రీమియం ఎస్టేట్, సరికొత్త డిజైన్ వి60 ప్రత్యేకతలని వోల్వో తెలిపింది. టు ప్లగ్ ఇన్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ ఆప్షన్లతో వి60ని తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఇందులో టి6 ట్విన్ ఇంజన్ ఎడబ్ల్యుడి పెట్రోల్ ప్లగ్ ఇన్ హైబ్రిడ్ కారు 340 హెచ్‌పి సామర్థ్యాన్ని కలిగి ఉండగా టి8 ట్విన్ ఇంజన్ ఎడబ్ల్యుడి పెట్రోల్ ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ కారు 390 హెచ్‌పి సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపింది. డి3, డి4 ఇంజన్లతో డీజిల్ వేరియంట్‌ను కూడా తీసుకువచ్చినట్లు వోల్వో వెల్లడించింది.



ఆధార్‌తో మొబైల్ నెంబర్ అనుసంధానం మార్చి 31 వరకే

BSNL

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : వినియోగదారులు తమ మొబైల్ నెంబర్లను మార్చి 31 నాటికి ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) తెలిపింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఇప్పటికే మొబైల్ నెంబర్ అనుసంధాన ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొంది. వినియోగదారులు సమీపంలోని సిఎస్‌సి, ఫ్రాంఛైజీ, రిటైలర్ వద్ద ఈ ఆధార్ అనుసంధాన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. అలాగే ఐవిఆర్ఎస్ నంబరు 14546కు డయల్ చేసి కూడా వినియోగదారులు తమ మొబైల్ నెంబరును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవచ్చని బిఎస్ఎన్ఎల్ వెల్లడించింది.

ఆఫ్రికా దేశాల పారామెడికల్ సిబ్బందికి అపోలో శిక్షణ

Apollo HOSPITALS TOUCHING LIVES

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆఫ్రికాలోని తొమ్మిది దేశాలకు చెందిన పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వెల్లడించింది. అపోలో హాస్పిటల్స్ ఇప్పటికే ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లోని హాస్పిటల్స్‌లో 24 ఆఫ్రికా దేశాలకు చెందిన 100 మంది డాక్టర్లకు శిక్షణనిచ్చింది. ఆఫ్రికా మానవ వనరులను మరింత పటిష్ఠం చేసే ఉద్దేశంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆఫ్రికన్ ప్రభుత్వాలు, అపోలో హాస్పిటల్స్ ఈ కార్యక్రమాలను చేపడుతున్నాయి. తొలి విడతలో ఆఫ్రికా దేశాలైన కెన్యా, మలావి, నైజీరియా, సావో టోమ్, సీషెల్స్, సూడాన్, దక్షిణ సూడాన్ దేశాలకు చెందిన 25 మంది పారామెడికల్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ప్రెసిడెంట్ కె హరిప్రసాద్ తెలిపారు.

భారత మహిళా పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ అవార్డులు

ఒక్కొక్కరికి రూ.19.5 లక్షల నగదు పురస్కారం



లండన్ : అవసరాలే వ్యాపార ఆలోచనలకు పునాది. అనేక మందిని వేదిస్తున్న మధుమేహం, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న సాధారణ శానిటరీ నాప్‌కిన్స్‌కు సరైన ప్రత్యామ్నాయ ఉత్పత్తులు తయారు చేస్తూ ఇద్దరు భారత ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. స్టీవియా అనే మొక్క ద్వారా పంచదారకు ప్రత్యామ్నాయంగా సహజ సిద్ధమైన తీపి పదార్థాలు తయారు చేస్తున్న అర్బోరియల్ ఆగ్నో ఇన్నోవేషన్స్ అధినేత స్వాతి పాండే, అరటి నారతో శానిటరీ నాప్‌కిన్స్ తయారు చేస్తున్న సాతి ఇంక్ అధినేత క్రిస్టిన్ కాజెస్టుకు కార్టియర్ ఉమెన్ ఇనిషియేటివ్ అవార్డులు లభించాయి. ఈ అవార్డుల కింద వీరిరువురికి ఒక్కొక్కరికి 30,000 డాలర్లు (సుమారు రూ.19.5 లక్షలు) లభిస్తాయి. 130 దేశాల నుంచి వచ్చిన 2,800 అప్లికేషన్లను పరిశీలించి వీరితో పాటు మొత్తం 18 మందికి ఈ అవార్డులకు ఎంపిక చేశారు. వీరందరికీ ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సింగపూర్‌లో వారం రోజుల పాటు వ్యాపార మెలుకువలపై ప్రత్యేక వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఏప్రిల్ 26న అక్కడ జరిగే ఒక కార్యక్రమంలో విజేతగా నిలిచిన ఒకరికి లక్ష డాలర్లు (సుమారు రూ.65 లక్షలు) లభిస్తాయి.

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ADITYA SPIN. 8(8.2)80
AGRO TECH FO 631.35(617.65)1230
AISHWARYA TE 6.36(6.37)831
ALPHAGEO (I) 808.4(816.2)1320
ALU FLUORIDE 108.35(108.3)5198
AMAR RAJA BA 797.05(797.2)24167
ANDHRA BANK 45.55(45.8)170565
ANDHRA CEMEN 10.92(10.97)18271
ANDHRA PETRO 56.95(57.8)26007
ANJANI PORTL 191.8(190.05)197
ASTRA MICRO 90.45(89.9)421518
AUROB.PHARMA 587.15(570.8)642154
AVANTEL LTD 523.35(537.35)3908
AVANTI FEEDS 2310.25(2336)14404
B.N.RATHI SE 40.5(40.05)926
BALAJI AMINE 651.45(653.4)3145
BAMBINO AGRO 235.75(242.95)1888
BARTRONICSIN 12.93(12.87)3330
BHAGIRA.CHEM 293(293.15)15
BHAGYA INL 41.8(42.75)6905
BHARATFIN 977.65(972.2)19950
BNR UDYOG 32(32.4)807
CAMBRIDGE 72.4(73.85)2569
CCHHL 13.75(14.15)9728
CCL PRODUCTS 278.45(281.25)1253
CELESTIAL 17.55(17.9)4411
CIL SECURITS 29.55(29.85)1689
COROM INTER 519(508.2)2447
CUBEX TUBING 24.5(23.35)1330
CYBERMATE 3.28(3.25)6042
CYIENT 623.95(630.15)59535
DANLAW TECH. 68.25(65.35)31149
DECAN CEMENT 567.55(564.35)40
DECCAN POLYP 3(3)20
DHAN ROTO SP 55.9(53.55)13434
DIAMONPOWER 13.65(13.65)28873
DIVI'S LAB. 1018.25(1008.5)19696
DIVYA.GRANIT 105(100.4)64
DQ ENT 14.8(14.7)4440
DR.REDDY'S 2121.3(2168.8)47331
EMPEE SUGARS 4.01(4.13)1092
EVEREST ORG. 136(140.65)221
FACOR ALLOYS 3.21(3.17)102728
FIRSTOBJ 13.75(13.85)3612
GATI LTD. 112(113.3)42477
GAYATRI BIO 9(9)1271
GAYATRI PROJ 213.3(214.6)5877
GENNEX LAB 4.47(4.26)147706
GMR INFRASTR 17.6(17.35)2123750
GODAVARI DRU 35.05(36.75)517
GOLDST INFRA 194.8(198.55)8973
GOLDSTONE EN 13.65(13.85)925
GRANULES (I) 113.15(114.7)101997
GVK POWERINF 16.75(16.75)2078663
HBL P SYS 55.25(55.65)28088
HERITGFOOD 678.6(679.25)506
HIND.FLUROCA 14(14)500
I.C.S.A. IND 3.34(3.51)26069
IKF TECHNO .69(.72)163170
INCAP LTD. 88.05(92)1582
IPAPPM 311.05(312.25)4773
IVRCL LTD 4.51(4.59)80306
KAKATIYA CEM 290.35(290.1)1192
KAKATIYA TEX 2.5(2.63)200
KALLAM SPG. 30.35(30.8)86664
KAVERI SEED 460.25(468.35)19403
KCP LTD 128.1(127.3)9679
KERNEX MICRO 43.5(42.1)4377
KNR CONST 294.25(297.75)155256
KREBS BIOCHM 155(153.65)655
LANCO INFRA 1.26(1.2)952244
LOKESH MACH 68.1(65.05)19485
LOTUS CHOC 50.1(50.95)4130
MADHUCON PRJ 27.6(27.6)8919
MOLD-TEK TEC 59.5(61.65)821
MOSCHIP SEMI 33.6(33.15)25247
MSR INDIA 46(45.7)14366
N C L IND. 230.2(232.15)6857
NACLIND 42.7(43.1)12714
NATCO PHARM 766.85(776.9)24803
NCC 122.7(123.4)169330
NEHA INTER. 7.45(7.7)13240
NETTLINX LTD 84.5(82.8)14708
NEULAND LAB. 698(703.25)567
NIHAR INFO 15.35(14.8)574
NILE LTD. 828.05(822.95)1418
NTL 3.91(3.99)24805
OIL COUNTRY 42.7(43.35)562
PADMALAYA TE 4.98(4.95)11920
PALRED 92.95(95.05)1885
PANYAM CEMEN 48(48.15)13465
PENNAR STEEL 58.5(59.25)61986
PFL INFOTECH 9.24(9.72)1696
PHYTOCHEM I. 63.7(65.6)1505
PITTI LAMIN. 90.5(91.1)13367
POKARNA LTD 208.95(210.7)1482
PRAJAY ENGS. 13.5(12.9)59530
PREMIER EXPL 390.8(390.55)1561
PRISM CEMENT 124.9(124.65)62628
RAIN 372.1(383.6)409253
RAJ PACKAGIN 37.75(38.2)10512
RAJVIR IND 48.5(45)500
REG.CERAMIC 5.96(5.92)3478
RESTILE CER. 7(7)4469
SAGAR CEM. 957.45(961.15)318
SAMKRG PIST. 293.1(300)5285
SAMPRE NUTRI 51.4(53.3)2917
SANGHI IND. 111.95(112.4)42704
SATVAH.ISPAT 22.1(21.15)23167
SAVEN TECHNO 19.75(19.9)52
SMPL 1.38(1.37)11350
SMS PHARMACE 89.3(89.75)5444
SREE RAYALA 162.8(170.65)2614
STEEL EXCH 28.15(29.6)56088
SUJANA INDUS .9(.94)87942
SURANATP 5.15(5.17)10005
SURYACHAKRA 1.14(1.2)142403
SURYAVA SPIN 6.01(6.1)161
SURYLAK.COTT 80.2(80.5)3510
SUVEN LIFE S 189.4(190.45)59877
TAJ GVK HOTL 165(164)7106
TANLA 30.4(30.6)37707
TRANSCORP IN 34.25(34.7)1795
TRANSGENE BI 2.36(2.28)11301
TRANSPORT CO 286.3(286.55)53479
USHER AGRO 6.67(6.42)5340
VICEROY HOTE 15.6(15.6)16224
VIJAY TEXTIL 55.65(53)8026
VIMTA LABS 207(205.9)3628
VIRAT CRANE 51.65(50)5835
VIRINCHI 116.25(117.45)45787
VISAKA IND. 679(677.15)7269
VISTA PHARMA 42.6(41.5)7330
VIVIMED LABS 76(78.05)83510
VST INDUS. 3300.15(3199.6)121
WATERBASE 308.4(310.5)174064
XLENERGY 2.94(3)3663
YBRANTDIGI 5.35(5.43)147791
ZEN TECH 117.35(118.05)12026
ZENOTECH 45(44.3)5559

కల్యాణలక్ష్మికి 'ఆమె' అనాథ

- దిక్కుమొక్కులేని వారికి దక్కని పథకం
- కుల, ఆదాయ ధ్రువీకరణ లేదని నిరాకరణ
- 2 నెలలుగా అందని పింఛన్లు..10 శాతం మందికే లబ్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఎవరో తెలియని అనాథలకు తమ కులం ఏమిటో ఎలా తెలుస్తుంది? అనాథ శరణాలయాల్లో బతుకుతున్న వారికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎలా వస్తాయి? అయినా సరే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 'సాయం' దక్కాలంటే అనాథలు.. తమ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిందేనంటున్నారు! ఫలితంగా రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఉద్దేశించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు.. అనాథ యువతులకు ఆసరా కావడంలేదు. ఈ పథకాల కింద పెళ్లి ఖర్చుల కోసం లబ్ధిదారులకు రూ.75వేలను అందజేస్తున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రా



లను సమర్పిస్తేనే కల్యాణలక్ష్మి పథకానికి అర్హులు అనేది ప్రభుత్వ నిబంధన. అయితే ఏ కులమో తెలియని తాము అనాథ శరణాలయాల్లో బతుకుతున్నామని.. అలాంటిది తమకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు ఎలా వస్తాయని అనాథలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనాథలను బీసీ-బీ కింద పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఉత్తర్వులు విడుదల కాలేదు. దీంతో పెళ్లిళ్లు చేసుకుంటున్న అనాథ యువతులకు ఈ పథకాలు వర్తించడం లేదు. అనాథ యువతులను పెళ్లాడేందుకు ముందుకొస్తున్న అబ్బాయిలు దిగువ మధ్యతరగతికి చెందినవారే ఉంటున్నారని.. అలాంటిది వారికి ప్రభుత్వం సాయం అందజేస్తే కొంతైనా అసరాగా నిలిచినట్టవుతుందని అనాథ శరణాలయాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. పేదింటి ఆడపిల్లలను ఆదుకుంటున్న ప్రభుత్వం దిక్కూమొక్కులేని ఆడపిల్లలపై మాత్రం కనికరం చూపడంలేదని పద్మావతి అనాథ శరణాలయం నిర్వాహకురాలు సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. తమ దగ్గర 26 మంది అనాథ పిల్లలు ఉన్నారని, వారిలో 9 మందికి పెళ్లిళ్లు చేశానని, వారిలో ఒక్కరికి కూడా కల్యాణలక్ష్మి పథకం కింద ప్రయోజనం దక్కలేదని చెప్పారు. ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేనపుడు కనీసం అనాథ అని ఇచ్చే సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ఆడపడుచులు కోరుతున్నారు.

400 కోట్ల పింఛను బకాయిలు

వృద్ధులు, వింతంతువులు, దివ్యాంగుల కోసం ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు సైతం 2 నెలలుగా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. గత రెండు నెలల్లో కేవలం 10% మంది పింఛను తీసుకున్నారు. బయోమెట్రిక్ లోపాలు, నగదు కొరత వంటి సాకులు చెబుతూ లబ్ధిదారులను తిప్పి పంపుతున్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. తమకు డబ్బు అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతినెల ఇదో సమస్యగా మారిందని అఖిల భారత దివ్యాంగుల హక్కుల సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆరోపించారు.

లెక్చరర్లపై వేటు

ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ లెక్చరర్లకు కష్టకాలం.. కొలువుల నుంచి తొలగిస్తున్న యాజమాన్యాలు

- ప్రధానాస్త్రంగా మారిన ఏఐసీటీఈ నూతన నిబంధనలు
- ఏడాదిలోనే రోడ్డున పడనున్న 10వేల మంది
- సీవీఆర్ కాలేజీలో 70 మందికి నోటీసులు.. 16 మందికి ఉద్వాసన
- సీబీఐటీ, ఎంజీఐటీ కాలేజీల్లో 150 మందిపై వేటుకు సన్నాహాలు
- నిబంధనలకు విరుద్ధంగా తొలగింపు: లెక్చరర్ల సంఘం



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల్లోని లెక్చరర్ల నెత్తిన అనుకోని పిడుగు. ఏళ్లుగా విద్యార్థులకు పాఠాలు చెప్పుకొంటున్న లెక్చరర్లు రాత్రికి రాత్రే రోడ్డునపడుతున్నారు. మొన్నటిదాకా ఐటీ ఉద్యోగుల్ని వెంటాడిన 'ఉద్యోగాల కోత' ఇప్పుడు ప్రైవేటు లెక్చరర్లపైకి మళ్లింది. ప్రత్యేకించి ఇంజనీరింగ్ కాలేజీల్లోని లెక్చరర్లపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. 'మీ సేవలు ఇక చాలు' అంటూ వారిని కాలేజీ యాజమాన్యాలు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. ఇందుకు వారికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) కొత్త నిబంధనలు ప్రధానాస్త్రంగా మారాయి. ఇప్పటిదాకా ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో ఫ్యాకల్టీ- విద్యార్థుల నిష్పత్తి 1:15గా ఉండేది. అంటే.. 15 మంది విద్యార్థులకు ఒక లెక్చరర్ ఉండాలి. వచ్చే విద్యాసంవత్సరం (2018-19) నుంచి ఈ నిష్పత్తిని 1:20గా మార్చుతూ ఏఐసీటీఈ ఇటీవల నిబంధనలను జారీ చేసింది. దీంతో కళాశాలల యాజమాన్యాలు తమ ఫ్యాకల్టీ సంఖ్యను తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాయి.

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో సుమారు 40వేల మంది లెక్చరర్లు విధులు నిర్వహిస్తున్నారు. నూతన నిబంధనల సాకుతో ఈ కాలేజీల యాజమాన్యాలు ఇప్పటికే లెక్చరర్ల తొలగింపు ప్రక్రియను మొదలుపెట్టాయి. ఇందులో భాగంగానే ఫ్యాకల్టీకి నోటీసులు ఇస్తున్నాయి. దీంతో భారీ సంఖ్యలో లెక్చరర్లపై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం సుమారు 70 మంది లెక్చరర్లతో ఇప్పటికే తొలగింపు జాబితాను సిద్ధం చేసినట్టు సమాచారం. వీరిలో 16 మందిని తొలగించినట్టు కూడా తెలిసింది. దీంతో మిగిలిన వారు.. తమపై ఏ క్షణంలో వేటు పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీబీఐటీ, ఎంజీఐటీ కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్టు సమాచారం. ఈ రెండు కాలేజీల్లో సుమారు 200మంది లెక్చరర్లు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నట్టు సమాచారం. వీరిలో సుమారు 100-150 మందిపై వేటు పడే అవకాశం ఉందని ఆ కళాశాలకు చెందిన ఓ సీనియర్ ప్రొఫెసర్ తెలిపారు. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో సుమారు 8వేల నుంచి 10వేల మంది లెక్చరర్లపై వేటు పడే అవకాశం ఉందని అంచనా. ఊహించని ఈ పరిణామం లెక్చరర్లను హతాశులను చేస్తోంది. ఇన్నాళ్లు తక్కువ వేతనాలు ఇస్తూ తమ సేవలను వినియోగించుకున్నారని, ఇప్పుడు హఠాత్తుగా తొలగించడం ఎంత వరకు న్యాయమని లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. ఉన్నపళంగా ఉద్యోగాలు ఊడిపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యాకల్టీ తొలగింపును ఆపాలి..

"ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో ఫ్యాకల్టీ తొలగింపును వెంటనే విరమించుకోవాలి. ఇన్నాళ్లు వెట్టిచాకిరి చేయించుకొని ఇప్పుడు ఒక్కసారిగా ఉద్యోగులను తొలగించడం అన్యాయం. దీంతో వేల మంది ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది. ఏఐసీటీఈ నిబంధనలను మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. వాస్తవాలను పరిశీలించకుండా నిబంధనలు రూపొందించారు. వీటికి వ్యతిరేకంగా ఇప్పటికే న్యాయ పోరాటం ప్రారంభించాం. తొలగింపును ప్రశ్నించాలని ప్రతి లెక్చరర్‌ను కోరుతున్నాను"

ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు

నియామకం అలా.. తొలగింపేమో ఇలానా?

ఇంజనీరింగ్ కాలేజీల్లో లెక్చరర్ల నియామకం పూర్తిగా విశ్వవిద్యాలయాల పరిధిలో ఉంటుంది. ఈ ప్రక్రియ కూడా అంత సులువైంది కాదు. ఇందుకోసం జేఎన్‌టీయూ, ఓయూ వర్సిటీల అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటారు. ఏటా ఫిబ్రవరి, మార్చిలో లెక్చరర్లను నియమించేందుకు 'ర్యాటిఫికేషన్' నిర్వహిస్తారు. అర్హతను తేల్చేందుకు విద్యార్హత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. సబ్జెకులో పరిజ్ఞానం తెలుసుకునేందుకు అభ్యర్థులను స్వయంగా యూనివర్సిటీ అధికారులు ఇంటర్వ్యూ చేస్తారు. ఈ ప్రక్రియలో ఎక్కడ తేడా వచ్చినా వారిని తిరస్కరిస్తారు. ఈ విధంగా లెక్చరర్లను నియమించే అధికారం పూర్తిగా వర్సిటీ అధికారులదే. ఇంత కఠినంగా నియామక ప్రక్రియ ఉంటే.. తొలగింపు ప్రక్రియ మాత్రం పూర్తిగా యాజమాన్యాల చేతుల్లోనే ఉంది. యూనివర్సిటీ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఫ్యాకల్టీని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తుండడం గమనార్హం. వాస్తవానికి ఒక కాలేజీలో ఓ లెక్చరర్‌ను తొలగించాలంటే సాంకేతిక విద్యాశాఖకు సమాచారం ఇవ్వాలి. తొలగించేందుకు గల కారణాలేమిటో తెలపాలి. ఈ ఫిర్యాదుపై సాంకేతిక విద్యాశాఖ అధికారులు విచారణ జరిపిన తర్వాత వారు ఇచ్చిన నివేదిక మేరకే నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం జరుగుతున్న తొలగింపు ప్రక్రియలో ఇవేమీ జరగడం లేదు. ఫ్యాకల్టీ-విద్యార్థుల నిష్పత్తిని 1:20కి మార్చుకునే క్రమంలో కాలేజీలు నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. తమను తొలగించడంలో బెదిరింపు ధోరణిని అవలంబిస్తున్నట్టు లెక్చరర్లు వాపోయారు. 'నీ అంతట నీవే మర్యాదగా వెళ్తావా... లేదంటే మమ్మల్నే వెళ్లగొట్టమంటావా' అంటూ బెదిరిస్తున్నారని వారు వాపోయారు. అకడమిక్ ఫలితాలు సరిగా లేవనో.. ఫ్యాకల్టీగా పనికి రారనో.. నైపుణ్యాలు లేవనో.. కారణాలు చూపుతూ లెక్చరర్లను తొలగిస్తున్నారు. తొలగింపు పద్ధతిని ప్రశ్నించిన వారిపై మరీ దారుణంగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను దగ్గర పెట్టుకుని లెక్చరర్లను బెదిరిస్తున్నట్టు సమాచారం.



తమ సమస్యల గురించి ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేశ్ తివారీకి వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్ఏ సంఘం ప్రతినిధులు

వీఆర్ఏల క్రమబద్ధీకరణ ఎప్పుడు?

- ఏడాది దాటినా అమలుకాని సీఎం హామీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏల) ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామన్న ప్రభుత్వ ప్రకటన ఏడాది దాటినా అమలు కావడంలేదు. వీఆర్ఏల జీవితాల్లో ఆర్నెల్లలోపు వెలుగులు నింపుతామని సీఎం కేసీఆర్ గత ఏడాది శివరాత్రి రోజు స్వయంగా ప్రకటించారు. కానీ, ఆర్నెల్లు కాదు కదా.. ఏడాది పూర్తయింది. మరో శివరాత్రి వచ్చింది.. పోయింది. అయినా వారి జీవితాల్లో మాత్రం వెలుగులు రాలేదు. సీఎం హామీని అమలు చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఏడాది కాలంగా వీఆర్ఏలు రోజూ సచివాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,796 వీఆర్వో పోస్టులకు అనుమతి ఉంది. 2017-18 బడ్జెట్‌లో ఆ మేరకు నిధులూ మంజూరయ్యాయి. కానీ, ప్రస్తుతం 5,847 మంది వీఆర్వోలే పనిచేస్తున్నారు. మొత్తం 10,796 పోస్టుల్లో 30% పోస్టులను వీఆర్ఏలకు కేటాయిస్తే చాలా మందికి పదోన్నతులు లభిస్తాయి.

రేపు 'మన ప్రగతిభవన్': సంఘం

వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తామన్న సీఎం హామీకి ఏడాదవుతున్న సందర్భంగా ఈనెల 24న 'మన ప్రగతిభవన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) అధ్యక్షుడు బహదూర్ తెలిపారు. శాంతియుతంగా సీఎం కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ హామీని గుర్తు చేస్తూ గురువారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ రాజేశ్వర్ తివారీని టీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబు నేతృత్వంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కాగా, గ్రామపరిపాలన అధికారులు (వీఏవో)లుగా పనిచేసి, రిటైర్డ్ అయిన వారికి పింఛన్ ఇవ్వాలని మాజీ వీఏవోల సంఘం ప్రతినిధులు సంఘం నర్సింహారావు, మోహన్‌రావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 492 మందికి పింఛన్లు అందించాలని వారు కోరుతున్నారు.

పర్యాటకంలో చేతివాటం!

- హోటల్స్ బుకింగ్‌ల్లో దొంగ బిల్లులు
- టీఎస్‌టీడీసీ నిధులు సొంత జల్సాలకు
- టూరిజం హోటల్స్ నిధులు పక్కదారి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖలోని కొంతమంది ఉన్నతాధికారులపై అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఫర్నిచర్, వాహనాల కొనుగోళ్లు, హోటల్ బుకింగ్స్‌లో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. బేగంపేట పర్యాటక భవన్‌లో అనుమతి లేకుండా ఆఫీస్ తెరిచారని, అందులో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఫర్నిచర్‌కు రూ.1.26 లక్షలు, ఎల్ఈడీ టీవీకి రూ.5 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారనే ఫిర్యాదులు వచ్చాయి. టూరిజం కార్పొరేషన్ ఆదాయం తగ్గుతోందని సాకులు చెబుతూ ఉద్యోగులను ఏకపక్షంగా విధుల నుంచి తొలగిస్తున్నారు. వారి పొట్ట కొడుతున్నారు. అదే సమయంలో, టూరిజం కార్పొరేషన్ నిధులను తమ జల్సాలకు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేనా, రాష్ట్రంలోని వివిధ సందర్శనీయ ప్రదేశాలకు వెళ్లే టూరిస్టుల కోసం కార్పొరేషన్ ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో 6 ఇన్నోవా వాహనాలు కొన్నారు. వాటిని ఉన్నతాధికారులు తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే, టూరిజం శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హోటళ్ల బుకింగ్‌ల్లోనూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో చరిత్రాత్మక కట్టడమైన తారామతి బారాదరి పర్యటనకు వచ్చే పర్యాటకులు బస చేసే రూముల బుకింగ్స్ తక్కువ చేసి రికార్డులు చూపిస్తున్నారనే ఆరోపణలు



న్నాయి. ఉదాహరణకు, ఓ కుటుంబం ఒకరోజు రూమును బుక్ చేసుకుని.. పూర్తి కాలం బస చేయకుండా మధ్యాహ్నమే ఖాళీ చేస్తే అదే రూమును మరొకరికి ఇస్తున్నారు. మొదటి దానిని టూరిజం శాఖ ఖాతాలో వేస్తూ రెండో బుకింగ్ డబ్బులను మాత్రం అధికారులు తమ జేబుల్లో వేసుకుంటున్నారని తెలుస్తోంది. అలాగే, తారామతి బారాదరి హోటల్‌లో సినిమా షూటింగ్స్ జరుగుతాయి. ఇందుకు బార్ అండ్ రెస్టారెంట్, ఆడిటోరియం, హోటల్ ఉన్నాయి. ఆడిటోరియం, హోటల్ రూమ్ బుకింగ్‌ల సంఖ్య తగ్గించి చూపించడంతోపాటు దొంగ బిల్లులు ఇస్తూ నిధులు నొక్కేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే, ఫొటో షూట్‌కు సంబంధించి కూడా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా ఇందుకు 4 గంటలకు రూ.4 వేలు వసూలు చేస్తారు. అయితే, ఒక ఫొటో షూట్ ముగియగానే మరొకరికి కేటాయిస్తారు. కానీ, బిల్లు మాత్రం మొదట ఫొటో షూట్ చేసిన వారి టోకెన్‌పైనే చేసినట్లు చూపిస్తారు. రోజంతా రెండు మూడు ఫొటో షూట్‌లు జరిగితే, ఒకటి రెండు మాత్రమే బిల్లులో చూపిస్తారని, మిగిలిన వాటి డబ్బులను జేబులో వేసుకుంటారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా తారామతి బారాదరి బిల్లు పుస్తకాలను టీఎస్‌టీడీసీ నుంచి ముద్రించి హోటల్స్‌కు పంపిణీ చేస్తారు. కానీ, వాటికి అదనంగా దొంగ బిల్లు పుస్తకాలు ముద్రిస్తున్నారు. కస్టమర్లకు వాటి బిల్లులు ఇస్తూ నిధులు కాజేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. టూరిజం శాఖలో అక్రమాలపై విజిలెన్స్ విభాగం దృష్టి సారించింది.

ఆరోగ్యశ్రీ కార్డులు చెల్లవ్!

- తిరస్కరిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రులు
- ఈహెచ్ఎస్ కార్డులదీ అదే పరిస్థితి
- ఆందోళనలో లబ్ధిదారులు



సుందర్‌రాజు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాసాబ్‌ట్యాంక్‌లో ఉంటున్న ఇతడి పేరు రాజు సుందరం. వయస్సు 47. పదిహేను రోజుల క్రితం బైకు నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. తలకు దెబ్బతగిలింది. కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. తమకు ఆరోగ్యశ్రీ కార్డు ఉందని చెప్పినా.. ముందు ఔట్ పేషెంట్‌గానే చేరి పరీక్షలు చేయించుకోవాలని అక్కడి సిబ్బంది సూచించారు. అనంతరం 'ఆరోగ్యశ్రీ' కార్డు తమ ఆస్పత్రిలో పనిజేయదని నిర్మోహమాటంగా చెప్పేశారు. అత్యవసర పరిస్థితి కావడంతో చేసేది లేక అక్కడే సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌కు డబ్బు చెల్లించారు. ఆపరేషన్ సమయంలో కూడా ఆరోగ్యశ్రీ కార్డు చెల్లదంటూ.. అక్షరాలా రూ. 1.60 లక్షలు బిల్లు వేసి మరీ దండుకున్నారు.

రెవెన్యూ శాఖలో పనిజేస్తోన్న ఓ ఉద్యోగి తన భార్య అనారోగ్యానికి గురైతే.. సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి సిబ్బంది ఈహెచ్ఎస్ కార్డుకు వైద్యం చేయమని చెప్పడంతో చేసేది లేక మరో ఆస్పత్రికి వెళ్లాడు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డును ప్రధానంగా రెండు కార్పొరేట్ ఆస్పత్రులు అంగీకరించడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ కార్డులకు కార్పొరేట్ ఆస్పత్రులు వైద్యం అందించడం లేదు. ఈ కార్డులు సర్కారీ దవాఖానాలో తప్ప తమదగ్గర పనిచేయవంటూ తిరస్కరిస్తున్నాయి.ప్రభుత్వం మాత్రం.. ఎం-ప్యానెల్ చేసుకున్న ఆస్పత్రులన్నీ కూడా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలు అందిస్తున్నాయని చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతోంది.

అత్యవసర పరిస్థితుల్లోనూ అంతే..

అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు జరిగి ఆస్పత్రికి వచ్చినపుడు ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే వెంటనే చేర్చుకోవాలి. కానీ.. కొన్ని ఆస్పత్రులు చేర్చుకోవడం లేదు. కొన్ని ఆస్పత్రులు అయితే అడ్మిట్ అయ్యే సమయంలో క్యాషా, సర్కారీ వైద్య బీమా కార్డో తెలుసుకుని మరీ జాయిన్ చేసుకుంటున్నాయి.

అన్ని ఆస్పత్రుల్లో పనిచేస్తాయి: మంత్రి

'కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డులు అనుమతించడం లేదన్నది వాస్తవం కాదు. అటువంటి సమస్యలేవీ మా దృష్టికి రాలేదు. ఒకవేళ అటువంటివి ఏవైనా మా దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా స్పందిస్తాం. ఎం-ప్యానెల్‌లో ఉన్న ఆస్పత్రులన్నీ ఆరోగ్యశ్రీ కార్డులపై వైద్యం చేస్తున్నాయి.' అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు.

అవినీతి కొండల్!

- మున్సిపల్ డీఈకి రూ.10 కోట్ల అక్రమాస్తులు
- ఒకేరోజు 4 జిల్లాల్లో ఏసీబీ దాడులు
- అధికారుల అదుపులో అవినీతి అధికారి
- వరంగల్లో కొనసాగుతున్న సోదాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు దశాబ్దాలపాటు సుదీర్ఘకాలం పనిచేసి, అక్కడ అవినీతిని వ్యవస్థీకృతం చేసిన మున్సిపల్ ఈడీ కొండల్‌రావు అక్రమాస్తులను ఏసీబీ అధికారులు తవ్విపోస్తున్నారు. ఆదిలాబాద్, వరంగల్, కొత్తగూడెం, హైదరాబాద్‌లలోని ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నివాసాలపై గురువారం ఉదయం ఏకకాలంలో దాడులు చేశారు. సాయంత్రం వరకు దాదాపు రూ. పది కోట్ల అక్రమాస్తులను కనుగొన్నారు. కొండల్‌రావును అదుపులోకి తీసుకొన్నారు. సోదాలు కొనసాగుతున్నందున అక్రమాస్తుల విలువ మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. వరంగల్ కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడిన కొండల్‌రావును 2016లో సస్పెండ్ చేయగా, ఆయన ఆదిలాబాద్‌లో పోస్టింగ్ దక్కించుకొని ప్రస్తుతం అక్కడ పని చేస్తున్నారు. ఉదయం నుంచి ఎనిమిది గంటల పాటు ఆదిలాబాద్‌లోని ఆయన అద్దె ఇంట్లో సోదాలు జరిగాయి. దాడిలో ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్, కరీంనగర్, వరంగల్‌కు చెందిన ముగ్గురు సీఐలు పాల్గొన్నారు. రెండున్నర లక్షల రూపాయల నగదు, 13 తులాల బంగారం, ఇతర ఆదాయ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కొండల్‌రావుపై చాలాకాలంగా ఆరోపణలు వస్తున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడి చేశామని డీఎస్పీ తెలిపారు. కొండల్‌రావు కొత్తగూడెం మున్సిపాలిటీలో ఏఈగా కొంతకాలం పనిచేశారు. ఆయన అత్తమామలు ఊటుకూరు సువర్ణాలాదేవి, అంజనానందం అక్కడే ఉంటున్నారు. వారి ఇంటిపైనా ఏసీబీ దాడులు చేసి, ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, స్థిరాస్తులు, వాటికి సంబంధించిన కాగితాలు, బ్యాంకు ఖాతాలు, బ్యాంకుల్లో ఉన్న నగదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరంగల్లోనూ కొండల్‌రావు బంధు మిత్రుల ఇళ్లలో సోదాలు జరిపారు. వరంగల్ శివనగర్‌లోని కొండల్‌రావు ఫ్లాట్‌కు తాళం వేశారు. ఆదిలాబాద్ నుంచి ఆయన్ను తీసుకువచ్చిన తర్వాత రాత్రి ఆ ఫ్లాట్‌లో సోదాలు మొదలెట్టారు. క్రిస్టియన్‌కాలనీలోని కాంట్రాక్టర్ మధు ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ఆర్థిక విషయాల్లో కొండల్‌రావుకు మధు అత్యంత సన్నిహితుడని చెబుతున్నారు. రెడ్డికాలనీలోని కొండల్‌రావు తమ్ముడు కోటేశ్వర్‌రావు ఇంట్లో, అద్దెకు ఉండేవారి ఇళ్లలోనూ సోదాలుజరిపారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా మొదలై..

డీఈ కొండల్‌రావు వరంగల్ నగరం గిర్మాజీపేటకు చెందినవాడు. వరంగల్‌కార్పొరేషన్‌లో 1982లో నామినల్ మస్టర్‌రోల్ పద్ధతిలో ఉద్యోగంలో చేరాడు. దినసరి వేతనంపై ఐదేళ్లు పనిచేసి, ఏఈ అయ్యాడు. 13ఏళ్ల తర్వాత డీఈగా పదోన్నతి పొందాడు. 35 ఏళ్ల ఉద్యోగ జీవితంలో 30ఏళ్లు వరంగల్ కార్పొరేషన్‌లోనే పనిచేశాడు. సస్పెన్షన్లు, క్రమశిక్షణ చర్యలతో ఒకటి రెండేళ్లు ఇతర ప్రాంతాల్లో పనిచేసి, తిరిగి తన అవినీతి కంచుకోట వరంగల్‌కు రావడం కొండల్‌రావుకే చెల్లింది.

ఫోర్జరీ చేసిన ఘనుడు

"కొండల్‌రావు కాంట్రాక్టర్లను తన అదుపులో ఉంచుకొంటాడు.



కొండల్‌రావుతో మాట్లాడుతున్న ఏసీబీ అధికారులు

వారికి టెండర్లు దక్కేలా చేస్తాడు. పనుల మరమ్మతుల నిధులను పంచుకొంటాడు. కాంట్రాక్టర్ మధుకు వసూళ్ల బాధ్యత అప్పగించాడు. కాంట్రాక్టర్లకు తానే డబ్బులు సమకూర్చి పనులు చేయిస్తాడు. త్వరగా బిల్లులు చేయించుకొంటాడు. వచ్చిన దానిలో కాంట్రాక్టర్లతో సగభాగం పంచుకొంటాడు" అని బల్దియా సిబ్బంది చెబుతారు. పలు చోట్ల భవనాలు, తోటలు, భూముల కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. 2012లో ఏకంగా ఫోర్జరీకి పాల్పడ్డాడు. అభివృద్ధి పనుల సంఖ్య, నిధులను పెంచేసి ఉన్నతాధికారులకే షాక్ ఇచ్చాడు. ఫోర్జరీ బయట పడడంతో అప్పటి కమిషనర్ వివేక్ యాదవ్ డీఈ కొండల్‌రావును సరెండర్ చేశారు. 2016లో వరంగల్ బొందివాగు నాలాకు రెండు అంచనాలు రావడానికి కారకుడైన కొండల్‌రావును అప్పటి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సస్పెండ్ చేస్తూ సరెండర్ చేశారు. ఈ క్రమంలో అదిలాబాద్ మునిసిపాలిటీకి వెళ్లాడు. ఉన్నతాధికారులను ఇట్టే బుట్టలో వేసుకొని పనులు చక్కబెట్టుకునేవాడు.

లైసెన్స్ ఇవ్వడానికి 5 వేల లంచం

- ఏసీబీకి దొరికిపోయిన షాద్‌నగర్ ఎంవీఐ

షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎంవీఐ శ్రీకాంతచక్రవర్తి ఏసీబీకి దొరికిపోయాడు. గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు.. ఒక వ్యక్తి నుంచి రూ.5 వేల లంచం తీసుకున్న శ్రీకాంతచక్రవర్తి డ్రైవర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎంవీఐ శ్రీకాంతచక్రవర్తి, అతని డ్రైవర్ బాలయ్యలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణపొందిన వారికి లైసెన్సు ఇవ్వడానికి ఎంవీఐ శ్రీకాంతచక్రవర్తి తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాడంటూ షాద్‌నగర్‌లోని తిరుమల మోటార్ డ్రైవింగ్ స్కూల్ యజమాని విజేందర్‌రెడ్డి ఏసీబీని ఆశ్రయించారు. డీఎస్పీ సూర్యనారాయణ సూచన మేరకు గురువారం సాయంత్రం లైసెన్సు పత్రాలతో ఎంవీఐని కలిసి రూ.5వేల లంచం ఇవ్వబోగా డ్రైవర్‌కు ఇవ్వాలని సూచించాడు. వెంటనే విజేందర్ డ్రైవర్ బాలయ్యకు లంచం అందజేశారు. విజేందర్‌రెడ్డి తెచ్చిన ఫైల్స్‌ను పరిశీలిస్తూ ఎంవీఐ లైసెన్సులు జారీచేస్తున్న క్రమంలో డీఎస్పీ సూర్యనారాయణ దాడిచేసి పట్టుకున్నారు. ఎంవీఐ డ్రైవర్‌కు ఇచ్చిన రూ. 5వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేశారు. డ్రైవర్‌వద్ద మరో రూ. 16వేలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

మా వాటా మాకివ్వాల్సిందే!

జనాభా లెక్కన సీట్లు కావాలి.. 34 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

- బీసీలకు న్యాయమే లక్ష్యం
- 'బస్సు యాత్ర'కు భిన్నంగా కాన్వాయ్
- కాంగ్రెస్ బీసీ సాధికారత కమిటీ భేటీలో నిర్ణయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి రెండు అసెంబ్లీ సెగ్మెంట్లను బీసీలకు కేటాయించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ బీసీ సాధికారత కమిటీ ముందుకు వెళుతోంది. రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరగాలని, అది కాంగ్రెస్ పార్టీ నుంచే ప్రారంభమవ్వాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఈ కమిటీ.. ఎన్నికల్లో తమ వాటా సీట్లు తమకు దక్కాలన్న పట్టుదలతో ఉంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి బలమైన బీసీ నేతలను గుర్తించి వారి పేర్లను అధిష్ఠానానికి సూచించనుంది. అ సెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 34ఎమ్మెల్యే సీట్లు కావాలని కోరనుంది. బీసీల స్థానాలను ఇతర వర్గాలు లాక్కున్న వైనాన్ని కూడా నివేదించనుంది. గాంధీభవన్‌లో గురువారం జరిగిన బీసీ సాధికారత కమిటీలో ఈ మేరకు సభ్యులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. కమిటీ చైర్మన్ నాగయ్య అధ్యక్షతన కో కన్వీనర్ మహేష్‌కుమార్ గౌడ్, సభ్యులు దాసోజు శ్రవణ్ కుమార్, అనిల్ కుమార్, ఆకుల లలిత, నగేష్ తదితరులు పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకా రం.. కాంగ్రెస్‌లో అన్ని సామాజిక వర్గాలకు వారివారి జనాభా నిష్పత్తి ప్రకారం సీట్ల వాటా ఉండాలని రాహుల్ కోరుకుంటున్నారని, ఇందుకు అనుగుణంగా పనిచేసి నివేదిక ఇవ్వాలని కమిటీని కోరారని నేతలు అంటున్నారు. సామాజిక న్యాయానికే ప్రాధాన్యమివ్వాలని రాహుల్ గాంధీ స్పష్టం చేశారని, తమకు 90 రోజుల సమయమిచ్చారని, ఆ లోపే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వివిధ అంశాల ఆధారంగా ఎనిమిది సబ్ కమిటీలు వేసుకొని ఎవరి పని మీద వారు ఉంటారని, ఇందు కోసం తక్షణమే జిల్లా యాత్రలు చేపట్టనున్నామని కమిటీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. కాంగ్రెస్‌పార్టీ చేపట్టనున్న బస్సు యాత్రతో సంబంధం లేకుండా సాధికారత కమిటీ విడిగా 100-200 వాహనాల కాన్వాయ్‌తో విభిన్న మార్గాల్లో జిల్లాల పర్యటన చేయనుందని తెలిపారు. వాహనాల వరుస కేవలం బీసీల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకేనన్నారు. తమ పర్యటనలో భాగంగా ఏయే ప్రాంతాల్లో బీసీ జనాభా అధికంగా ఉంది? ఏయే బీసీ సామాజిక వర్గం ఎక్కడ ఎక్కువగా ఉన్నారో గుర్తించడానికి సబ్ కమిటీ వేశామన్నారు. కుల సంఘాలు, వాటి సమస్యలు, డిమాండ్లపై ఓ కమిటీ; టీఆర్ఎస్ ఇచ్చిన హామీల వల్ల ఏ మేరకు న్యాయం జరుగుతుందో, ఎంత ప్రయోజనం కలుగుతుందో, బీసీలు తమకు ఏం కావాలనుకుంటున్నారో తెలుసుకునేందుకు మరో కమిటీ; బీసీ మేధావులను ఒక్క తాటి మీదకు తెచ్చి వారి ఆలోచనలను తెలుసుకునేందుకు మరో కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. బీసీ ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకునేందుకు ఇంకో కమిటీ వేశామన్నారు. ఈ కమిటీల సభ్యులంతా ఏకకాలంలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ ఎవరి నివేదిక వారు రూపొందిస్తారని చెప్పారు. వీటిని క్రోడీకరించి టీపీసీసీకి, ఏఐసీసీకి సమర్పిస్తామని తెలిపారు. మొత్తం మీద సామాజిక మార్పునకు నాంది పలకాలనే లక్ష్యంతో పనిచేస్తామని కమిటీ చైర్మన్ నాగయ్య తెలిపారు.

కృష్ణా ట్రైబ్యునల్‌లో మొదలైన క్రాస్‌ఎగ్జామినేషన్


న్యూఢిల్లీ, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల నీటి కేటాయింపులపై ట్రైబ్యునల్ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభమైంది. ప్రతి నెలా జరిగే విచారణలో భాగంగా జస్టిస్ బ్రిజేశ్ కుమార్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఎదుట గురువారం ఏపీకి చెందిన వ్యవసాయరంగ నిపుణుడు పీవీ సత్యనారాయణను తెలంగాణ తరపు న్యాయవాది వి.రవీందర్‌రావు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దాదాపు రెండు గంటలపాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన 27 ప్రశ్నలు వేశారు. ఆయన సమర్పించిన అఫిడవిట్లోని కొన్ని అంశాలను తెలంగాణ లేవనెత్తడంతో... వాటిని సరిచేయాల్సి ఉందని సాక్షి సమాధానం చెప్పడం గమనార్హం. సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ హాజరుకాకపోవడంతో తెలంగాణ అభ్యర్థన మేరకు ఉదయం మాత్రమే క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. శుక్రవారం కూడా మధ్యాహ్నం నుంచి రెండు గంటలపాటు క్రాస్ ఎగ్జామినేషన్ జరిగే అవకాశం ఉంది.



సోఫియాకు.. ప్రేమతో మీ షారుఖ్

ముంబై, ఫిబ్రవరి 22: ప్రముఖ బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ హ్యూమనాయిడ్ రోబో సోఫియా ప్రేమకు ఫిదా అయిపోయాడు. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ ఐటీ సదస్సులో సందడి చేసిన సోఫియాను.. తనకు ఇష్టమైన నటుడు ఎవరు అని అడిగితే ఠక్కున షారుఖ్ ఖాన్ పేరు చెప్పేసింది. సోఫియా అభిమానానికి కరిగిపోయిన షారుఖ్ ట్విటర్ వేదికగా స్పందించారు. 'నా దేశానికి వచ్చిన మహిళకు బహిరంగంగా ప్రేమను వ్యక్తం చేస్తున్నాను. అణువణువునా నువ్వు నన్ను అనుకరించావు సోఫియా' అంటూ సందేశాన్ని పోస్ట్ చేశాడు.

క్రైస్తవ ప్రచారకుడు బిల్లీ గ్రాహం కన్నుమూత



వాషింగ్టన్, ఫిబ్రవరి 22: ప్రఖ్యాత క్రైస్తవ మత ప్రచారకుడు బిల్లీ గ్రాహం బుధవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా ప్రొస్టేట్ క్యాన్సర్, నిమోనియా, పార్కిన్సన్ వ్యాధులతో బాధపడుతున్నారు. ఆయన ఆరు దశాబ్దాలకు పైగా మత ప్రచారం నిర్వహించారు. 12 మంది అమెరికా అధ్యక్షులకు మత బోధనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల మందికి పైగా ఆయన సువార్త సభలకు హాజరై ఉంటారని అంచనా. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌లు గ్రాహం పార్థివ దేహానికి నివాళులర్పించారు.

అమృత.. జయలలిత బిడ్డ కాదు: దీప పిటిషన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జయలలితకు బెంగుళూరు యువతి అమృత కుమార్తె కాదని జయ మేనకోడలు దీప పేర్కొన్నారు. కేవలం ఆస్తి కోసమే అమృత ఈ నాటకమాడుతోందంటూ మద్రాస్ హైకోర్టులో గురువారం దీప పిటిషన్ దాఖలు చేశారు. మోసపూరితంగా ఉన్న అమృత పిటిషన్‌ను విచారణకు స్వీకరించవద్దని కోర్టును కోరారు.

ఆహారానికి బదులు డబ్బులు ఇవ్వలేం: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహార పదార్థాలు అందించడానికి బదులు నగదు బదిలీ చేయడంపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది.

ఆస్పత్రి నుంచి నేరుగా అసెంబ్లీకి పర్రీకర్

ముంబై/పణజి, ఫిబ్రవరి 22: అనారోగ్యంతో కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవా సీఎం మనోహర్ పర్రీకర్ గురువారం అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ముంబైలోని లీలావతి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన కొద్ది గంటల్లోనే ఆయన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి వృత్తిపై తన నిబద్ధతను చాటుకున్నారు. క్లోమ సంబంధిత వ్యాధితో ఈ నెల 15న ఆయన ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. కాగా అత్యవసర పని ఉండడంతో పర్రీకర్ వెళ్లారని.. త్వరలో వచ్చి మళ్లీ ఆయన చికిత్స కొనసాగిస్తారని లీలావతి ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

సివిల్ సర్వెంట్లకు 'డిజిటల్' పురస్కారాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే సివిల్ సర్వెంట్లకు ఏటా అందజేసే ప్రధాన మంత్రి పురస్కారాల కోసం దేశవ్యాప్తంగా 2,010 దరఖాస్తులు అందినట్లు కేంద్రం ప్రకటించింది. ఈసారి డిజిటల్ చెల్లింపుల అంశాన్ని ప్రత్యేకంగా అవార్డుల జాబితాలో చేర్చారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఎందరో సివిల్ సర్వెంట్లు కృషి చేస్తున్నారని, ఈ విభాగంలో కూడా పురస్కారాలు ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌసల్య యోజన విభాగాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈసారి కేంద్ర ప్రభుత్వంలోని అడిషనల్ సెక్రటరీ/జాయింట్ సెక్రటరీ స్థాయి, డైరెక్టర్/డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారులను కూడా పురస్కారాల కోసం ఎంపిక చేయనున్నారు. ఏప్రిల్ 21న సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఈ అవార్డులను ప్రధాని నరేంద్రమోదీ అందజేస్తారు.

అసోంలో ముస్లింల పాగా: ఆర్మీ చీఫ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బంగ్లాదేశ్ నుంచి ఈశాన్య భారతంలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయని, దీనికి కారణం పాకిస్థాన్ అని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆరోపించారు. చైనా సాయంతో పాక్ పక్కా ప్రణాళికతోనే వలసలను ప్రోత్సహిస్తోందన్నారు. ఈశాన్య భారత సరిహద్దు ప్రాంతాల్లో భద్రత, అభివృద్ధి అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. అసోంలోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా పెరిగిపోతోందన్న నివేదికలను ప్రస్తావిస్తూ.. అసోంలో బద్రుద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని ఏఐయూడీఎఫ్ పార్టీ బీజేపీ కంటే వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏఐయూడీఎఫ్, ఆప్, మజ్లిస్ పార్టీలు తీవ్ర విమర్శలు గుప్పించాయి.

ఎవర్ని పెళ్లి చేసుకోవాలో మేం నిర్ణయించలేం

- హదియా కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఇద్దరు మేజర్ల పరస్పర అంగీకారంతో జరిగిన వివాహాన్ని తాము రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎవర్ని పెళ్లి చేసుకోవాలో.. ఎవర్ని చేసుకోవద్దో తాము నిర్ణయించలేమని పేర్కొంది. 'ఒక వివాహ బంధంలో నిజాయితీ లేదని కోర్టు చెప్పగలదా? భార్యాభర్తల సంబంధంలో నిజాయితీ లేదని పేర్కొనగలదా? వివాహ బంధాన్ని మేమెలా రద్దు చేయగలం?' అని వ్యాఖ్యానించింది. కేరళకు చెందిన 25-ఏళ్ల హదియా కేసు విచారణను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం గురువారం విచారించింది. మేజర్ అయిన వ్యక్తి తన నిర్ణయం ప్రకారం వివాహం చేసుకోవచ్చని తెలిపింది. వారు ఎంపిక నిర్ణయం సరైందా? కాదా? అనేది కోర్టు తీర్మానించలేదని పేర్కొంది. కేరళకు చెందిన అఖిల అశోకన్ అనే మెడికో మతం మార్చుకుని, హదియాగా మారిన విషయం తెలిసిందే. ఆమె షఫీన్ జహా అనే వ్యక్తిని పెళ్లిచేసుకుంది. ఇది లవ్ జిహాద్ అంటూ.. ఆమె తండ్రి అశోకన్ కేరళ హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆ వివాహాన్ని రద్దు చేసింది. దీన్ని సవాలు చేస్తూ.. ఆ దంపతులు గత ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు గురువారం ఈ కేసును విచారించింది. అశోకన్ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదిస్తుండగా.. షఫీన్ జహా, హదియాల తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ మంత్రి కపిల్ సిబాల్ వాదనలను వినిపిస్తున్నారు.




యూకేలో భారతీయుల ఆందోళన

- 'ఇమ్మిగ్రేషన్ పాలసీ'ని వ్యతిరేకిస్తూ దక్షిణాసియన్ల నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: వీసాల జారీ ప్రక్రియలో యూకే ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ భారత్ సహ దక్షిణాసియా దేశాలకు చెందిన నిపుణులు ఆందోళన చేపట్టారు. టైర్-1 వీసాల మీద వచ్చిన తమను వెనక్కి పంపించేందుకే ఇమ్మిగ్రేషన్ పాలసీల్లో మార్పులు తెచ్చారని ఆరోపించారు. ఈ విధానం ద్వారా వివిధ కారణాలతో తమ వీసాల రెన్యూవల్‌ను అడ్డుకుంటున్నారన్నారు. యూకే ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ అక్కడి పార్లమెంటు ఎదుట పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. తమ హక్కులను సాధించుకునేందుకు చట్టపరమైన చర్యలతో పాటు నిరాహార దీక్షలకు దిగాలని భావిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు లేబర్ ఎంపీ తన్మన్‌జీత్ సింగ్ కోసం బ్రిటన్ పార్లమెంటు ఆవరణలోని పోర్ట్‌కుల్లిస్ వద్ద ఎదురుచూస్తున్న రవ్‌నీత్‌సింగ్(37)తో ఓ శ్వేత జాతీయుడు దాడికి దిగాడు. 'ముస్లిం గో బ్యాక్' అంటూ అతనిపై దాడి చేయడమే కాకుండా తలపాగా లాగేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రవ్‌నీత్ సింగ్ గట్టిగా అరవడంతో అక్కడి నుంచి శ్వేత జాతీయుడు పరారయ్యాడు.


వాచ్‌టవర్



బొగతకు కొత్త అందాలు

జయశంకర్ జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం కొత్త అందాలను అద్దుకుంటోంది. చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న ఈ జలపాతం అనతికాలంలో విశేషంగా పర్యాటకులను ఆకట్టుకుంది. ఈ తరుణంలో కేంద్రం స్వదేశ్ దర్శన్ పథకంలో బొగత జలపాతాన్ని చేర్చింది. ఈ పథకంలో భాగంగా చేపట్టిన పనులు ఏడాది కాలంగా జరుగుతున్నాయి. పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, వాచ్‌టవర్, పగోడాల నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. రాత్రివేళల్లో సైతం బొగత అందాలను వీక్షించేందుకు సోలార్ లైట్లను కూడా ఏర్పాటు చేశారు.

- వాజేడు



పగోడాలు

సబ్సిడీ గొర్రెలకు మేత కరువు!

- పెంపకందారుల వలసబాట
- జగిత్యాల జిల్లాలో 2లక్షలకు పైగా గొర్రెల పంపిణీ
- అందని గడ్డి విత్తనాలు.. ఎక్కడా కనిపించని పచ్చగడ్డి
- మేత లేక విలవిల్లాడుతున్న మూగజీవాలు



జగిత్యాల జిల్లాలో గొర్రెలకాపరులకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ గొర్రెలు

జగిత్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గొల్ల, కురుమ కులస్థులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ గొర్రెలకు ఇప్పుడు కొత్త సమస్య వచ్చింది. ఒక్కో గొర్రెలకాపరికి 21 గొర్రెలు అందించాలన్న ఆదేశాల మేరకు అధికారులు గొర్రెల పంపిణీని పూర్తి చేసినా.. ఆ గొర్రెలకు స్థానికంగా మేత లభించడం గగనమవుతున్నది. దీంతో పెంపకందారులు వలసబాట పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో 9,739 మంది గొర్రెలకాపారులకు 2,04,519 గొర్రెలను పంపిణీ చేశారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల చాలా భూములు బీడుబారిపోవడంతో గొర్రెల మేతకు పచ్చగడ్డి కరువైంది. గతంలో 20,861 కిలోల గడ్డి విత్తనాలను 29 ప్రదేశాల్లో పెంచినట్లు అధికారులు పేర్కొంటున్నా.. ఇప్పుడు ఎక్కడా పచ్చగడ్డి కనిపించడం లేదు. సబ్సిడీ విత్తనాలు అందించామని వారు చెబుతున్నా ఈసారి ఇంకా ఆ విత్తనాలు రాలేదు. దీంతో జిల్లాలోని చాలా మంది గొర్రెలకాపరులు ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు వలస వెళ్తున్నారు. మూడురోజుల క్రితం బీర్‌పూర్ మండలంలో కొందరు పెద్ద ఎత్తున గొర్రెలను వ్యాన్‌లో ఎక్కించుకుని సరిహద్దులు దాటుతుండగా స్థానికులు పట్టుకున్నారు. అయితే తాము గొర్రెలను అమ్మకానికి తీసుకెళ్లడం లేదని, స్థానికంగా మేత లేక ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు వారు చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేసింది. షెడ్ల సమస్య కూడా గొర్రెలకాపరులకు తలనొప్పిగా మారింది. జిల్లాలో 1275 షెడ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటివరకు 1035 షెడ్లకు మంజూరు లభించింది. అయితే 110 చోట్ల మాత్రమే ఆ షెడ్ల పనులు సాగుతున్నాయి.

మేత లేక వలస బాట..



నాకు ప్రభుత్వం సబ్సిడీపై 21 గొర్రెలు అందించింది. పాత గొర్రెలతో కలిపితే 40 గొర్రెలు అయ్యాయి. వాటిని పెంచుకుందామంటే ఇప్పుడు మేత లేదు. ఆదిలాబాద్ జిల్లాకు గొర్రెలతో కలిసి వలస వెళ్తున్నాం. 3 నెలలపాటు అటే ఉండి వస్తాం.

- ఎక్కల్‌దేవి గంగమల్లు, గొర్రెల పెంపకం దారుదు, లక్ష్మీదేవిపల్లె, జగిత్యాల జిల్లా

విత్తనాలు రాలేదు



పెద్దసార్లు గడ్డి విత్తనాలు ఇస్తామంటున్నారు. ఇప్పటికైతే రాలేదు. విత్తనాలు ఇచ్చినా ఎక్కడ పెంచుకోవాలో తెలియదు. అందుకే నా భర్త గొర్రెల మేత కోసం మంచిర్యాల ప్రాంతానికి వలస పోయిండు.

- పుల్లె గంగవ్వ, గొర్రెల పెంపకందారుడి భార్య, లక్ష్మీదేవిపల్లె, జగిత్యాల జిల్లా

కూలీగా మారిన సర్పంచ్

- దినసరి వేతనంపై మట్టి పనులు. భక్తళాపురం ప్రథమ పౌరుడి పరిస్థితి



కూలీ పని చేస్తున్న సర్పంచ్ లింగానాయక్

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22: ఒక్కసారి ఎన్నికల్లో గెలిస్తే చాలు.. ఐదేళ్లపాటు అడ్డంగా సంపాదించవచ్చనుకునే నాయకులున్న ఈ కాలంలో.. ఆ సర్పం చ్ మాత్రం అందుకు భిన్నం. సర్పంచ్‌గా గెలిచిన ఆయన గ్రామ అభివృద్ధిపై దృష్టిసారించారు. కుటుంబాన్ని పోషించేందుకు కూలీపని చేస్తున్నారు. ఇదీ.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తళాపురం గ్రామ సర్పంచ్ ధారావత్ లింగానాయక్ కథ. పేదరికంతో పెద్దగా చదువుకోని లింగానాయక్.. పాలేరుగా.. రోజు కూలీగా పనిచేసేవాడు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ గ్రామాన్ని ఎస్టీ రిజర్వ్‌గా ప్రకటించడంతో.. పార్టీలకు అతీతంగా స్థానికులు లింగానాయక్‌ను స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టారు.. గెలిపించుకున్నారు. ఆ నాటి నుంచి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారాయన. గ్రామాభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయించాలనే ఉద్దేశంతో.. అధికార పార్టీలో చేరారు. అనుకున్నది సాధిస్తున్నారు. భార్య దుర్గ కూడా భర్త బాటలోనే నడుస్తోంది. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ గ్రామంలో పైప్‌లైన్‌లు వేసేందుకు చేపట్టిన మట్టిపనుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు.



అద్దం పగిలిన బస్సు, గాయపడిన డ్రైవర్ మతీన్

పాల్వంచలో భానుడి భగభగ

- ఎండ తీవ్రతకు పగిలిన బస్సు అద్దం

పాల్వంచ, ఫిబ్రవరి 22: వేసవి ఇంకా రానేలేదు.. భానుడి భగభగలు మొదలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రాంతంలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. బుధవారం ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న భద్రాచలం డిపో బస్సు కొత్తగూడెం క్రాస్‌రోడ్డు సమీపంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో నిలిచిపోయింది. దీంతో బస్సులోని 52మంది ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎండ ప్రభావంతో డ్రైవర్ కూర్చున్న ముందుభాగం అద్దం పగిలిపోయింది. డ్రైవర్ మతీన్‌కు గాజు పెంకులు తగలడంతో కంటి భాగం వద్ద స్వల్పంగా గాయమైంది.



కుటుంబసభ్యులతో రవి

తల బరువు.. జీవితం భారం

- కబళిస్తున్న లిపోసార్కోమా కేన్సర్
- దినదిన గండంగా బతుకీడుస్తున్న రవి
- కేసీఆర్ సారూ ఆదుకోండి.. బాధితుడి వేడుకోలు

భద్రాచలం, ఫిబ్రవరి 22: రెక్కాడితే డొక్కాడని బతుకులు ఆ కుటుంబానివి.. ఒక్క పూట తిండి కోసం రోజంతా కష్టపడాలి. అలాంటిది ఆ కుటుంబాన్ని పోషించే వ్యక్తే 'లిపో సార్కోమా' అనే అరుదైన రోగంతో బాధపడుతున్నాడు. తల నిండా కణితి వ్యాపించి నరకయాతన అనుభవిస్తున్నాడు. భద్రాచలంలోని కొర్రాజులగుట్ట కాలనీకి చెందిన మామిడాల రవి(28) ఐస్‌క్రీంలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం తలపై గడ్డ రావడంతో వరంగల్ ఎంజీఎంలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. మూణ్నెళ్ల తర్వాత తల నిండా కణితి వ్యాపించింది. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల సూచనతో.. హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లాడు. కణితి మెదడంతా వ్యాపించిందని, శస్త్రచికిత్స చేస్తే బతికే అవకాశాలు లేవని వైద్యులు చేతులెత్తేశారు. తలలో నరాలు చిట్లిపోతున్నట్లుగా ఉందని బాధితుడు రవి 'ఆంధ్రజ్యోతి'తో గోడు వెళ్లబోసుకున్నాడు. బాధితుడికి భార్య విజయ కుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సర్జరీకి రూ.15లక్షల వరకు ఖర్చవుతుందని.. సీఎం కేసీఆర్ ఆదుకొని తనకు అండగా నిలవాలని ప్రాధేయపడుతున్నాడు. తమకు సాయం చేయాలనుకుంటే 6281863157 ఫోన్‌లో సంప్రదించాలని, దాతలు ఏపీజీవీబీ బ్యాంకు.. భద్రాచలం శాఖలోని ఖాతా నంబరు 7307699319లో నగదు జమ చేయాలని కోరుతున్నాడు.

ఎక్కడమ్మా నువ్వు?

- పాపను వదిలేసి సహజీవనం చేస్తున్న జంట బలవన్మరణం



ఈ పాపను చూడండి. ఒంటరిగా కూర్చుంది. అమ్మ ఎక్కడికి వెళ్లిందో తెలియక బేల చూపులు చూస్తోంది! తనను రైల్వేఫ్లాట్‌ఫాంపై ఒంటరిగా వదిలేసిన కన్నతల్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని పాపం ఆ పాపకేం తెలుసు? మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ వద్ద గురువారం తెల్లవారుజామున పెను విషాదం చోటుచేసుకుంది. కొన్నాళ్లుగా సహజీవనం చేస్తున్న ఓ జంట రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతులను కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజీవాడకు చెందిన కాశీరాం, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రామలక్ష్మీపల్లికి చెందిన దేవేంద్రగా గుర్తించారు. ఇద్దరిదీ బావామరదళ్ల వరుస. భార్యతో గొడవలతో కాశీరాం విడాకులు తీసుకున్నాడు. దేవేంద్ర భర్త దుబాయ్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో కాశీరాం-దేవేంద్ర మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. కులపెద్దలు పంచాయితీ నిర్వహించి దేవేంద్ర ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఆమె భర్త తరఫు బంధువులకు.. 8 నెలల పాపను దేవేంద్రకు అప్పగించారు. ఉన్నట్లుండి బుధవారం కామారెడ్డి నుంచి కాశీరాం, దేవేంద్రలు పాపతో కలిసి బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. రాత్రంతా అక్కడే ఉన్న వారు.. పాపను స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై వదిలేసి, రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. - తూప్రాన్

ఇద్దరు బాలికలపై అత్యాచారం

పరిగి, వైరా, ఫిబ్రవరి 22: రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలికలు అత్యాచారానికి గురయ్యారు. పొలం వద్ద ఒంటరిగా ఉన్న 15 ఏళ్ల గిరిజన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి తెగబడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాలో ఈ దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. తండాకు చెందిన బాలిక నాలుగు రోజుల క్రితం పొలం వద్ద బట్టలు ఉతుకుతుండగా.. అదే తండాకు చెందిన నెనావత్ శ్రీనివాస్, సునీల్ ఆమె నోట్లో గుడ్డలు కుక్కి ఈ దారుణానికి ఒడిగట్టారు. బాధితురాలి తల్లి బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఏడేళ్ల బాలిపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. వైరా మండలం విప్పలమడక గ్రామంలో ఈ ఘోరం వెలుగుచూసింది. నిందితుడిని 21 ఏళ్ల ప్రేమ్‌కుమార్‌గా గుర్తించారు.

ప్రేమించలేదని హత్యాయత్నం

బోనకల్, ఫిబ్రవరి 22: ప్రేమిస్తున్నానంటూ వెంటపడి వేధించిన యువకుడిపై కేసు పెడితే.. బెయిల్‌పై వచ్చి హత్యాయత్నానికి పాల్పడ్డ ఉదంతమిది. ఈ ఘటన ఖమ్మం జిల్లా బోనకల్‌లో గురువారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన యువతి స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమె ఇంటికి సమీపంలో ఉంటున్న సోలా రామలింగం(20) తనను ప్రేమించాలని వేధించేవాడు. విషయం తెలిసిన యువతి తల్లిదండ్రులు ఆమె చదువు మాన్పించారు. 3 నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రిమాండ్‌కు తరలించగా.. బెయిల్‌పై వచ్చి మళ్లీ వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో 'నన్ను ప్రేమిస్తావా? లేదా?' అంటూ కత్తితో రెండుచోట్ల పొడిచి గాయపరిచాడు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో కోలుకుంటోంది. నిందితుడు పరారీలో ఉన్నాడు.

నీవు లేక నేను లేను!

- 12 గంటల వ్యవధిలో వృద్ధ దంపతుల మృతి



వృద్ధ దంపతులు శౌరెడ్డి, ఇన్నాసమ్మ(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 22: యాభై ఏళ్లు కష్టసుఖాల్లో పాలుపంచుకున్న ఆ దంపతులు.. మరణంలోనూ ఒకటయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం శాంతినగర్‌కు చెందిన అల్లం శౌరెడ్డి (75), ఇన్నాసమ్మ (72) దంపతులు. శౌరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇన్నాసమ్మ అన్నీ తానై భర్తను చూసుకుంటోంది. బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా తీవ్ర మనోవేదనకు గురైన శౌరెడ్డి తానూ కన్నుమూశాడు.

27న సింగరేణికి సీఎం కేసీఆర్

- కారుణ్య నియామకాలపై కీలక ప్రకటన?
- శ్రీరాంపూర్‌లో ఒకే చోట ఆరు గనులు ప్రారంభం



మంచిర్యాల, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 27న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు రానున్నారు. సింగరేణి వ్యాప్తంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆరు బొగ్గు బావులను సీఎం ప్రారంభించి బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఈ వేదికపై కారుణ్య నియామకాల విషయంలోనూ కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. అదేవిధంగా బొగ్గు గని కార్మికులకు సీఎం కేసీఆర్ వరాలు కురిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. హైదరాబాద్‌లో గురువారం గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కెంగర్ల మల్లయ్య, రాజిరెడ్డి, కనకరాజు తదితరులతో డైరెక్టర్ పర్సనల్ పవిత్రన్‌కుమార్ ఈ విషయమై చర్చలు కూడా జరిపినట్లు సమాచారం.



మేళ్లచెర్వులో శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ఉదయం శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. శివలింగాన్ని సూర్యకిరణాలు తాకడం చాలా అరుదు. ఇక్కడ మాత్రం ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి వారం రోజుల ముందు కాని తర్వాత కాని సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతాయి. శివలింగానికి సూర్యకిరణాలు తాకడం వలన పంటలు బాగా పండి, ప్రజలందరికీ మంచి జరుగుతుందని పూజారి కొంకపాక శివవిష్ణువర్ధన్ శర్మ తెలిపారు. -మేళ్లచెర్వు

పీఎస్ఎల్‌ది రెండో స్థానమే : రమీజ్

కరాచీ: పాకిస్థాన్ సూపర్ లీగ్ విజయవంతమైనప్పటికీ దానికి ఇండియన్ ప్రీమియర్ లీగ్ తరువాతి స్థానమే దక్కుతుందని పాకిస్థాన్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ రమీజ్ రాజా వ్యాఖ్యానించాడు. స్టార్లతో కూడిన ఐపీఎల్‌తో పోల్చితే పీఎస్ఎల్‌కు ఆదరణ తక్కువేనన్నాడు. గురువారం దుబాయ్‌లో ఆరంభమైన పీఎస్ఎల్ గతంలో కంటే ఘనంగా, మెరుగ్గా నిర్వహిస్తున్నారన్నాడు.

సెమీస్‌కు మేరీ కోమ్



సోఫియా (బల్గేరియా): ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ కోమ్ స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. 48 కిలోల విభాగం క్వార్టర్స్ బౌట్‌లో రొమేనియా బాక్సర్ స్టెలుటా డుటాపై మేరీ విజయం సాధించింది. పురుషుల 64 కిలోల విభాగంలో ధీరజ్ రంగీ మొదటి రౌండ్‌లో లూయిస్ కొలిన్ రిచార్నో చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

కోహ్లీని చూసి నేర్చుకున్నా !

సిడ్నీ: విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చూసి కొంత నేర్చుకున్నానని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తెలిపాడు. అలాగే దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిల్లీర్స్, న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ ఆటను కూడా అనుకరించానని చెప్పాడు. స్మిత్ గతేడాది 24 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఏడు సెంచరీలతో మొత్తం 1,754 పరుగులు చేశాడు. 2017 సంవత్సరానికి 'ఐసీసీ టెస్టు ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా కూడా ఎంపికయ్యాడు. ఒక వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్మిత్ తన అంతరంగాన్ని ఆవిష్కరించాడు. భారత కెప్టెన్ కోహ్లీ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనే తీరును, ఆఫ్‌సైడ్‌కు బంతిని ఆడే విధానాన్ని క్షుణ్ణంగా గమనించానని, అందులోని కొన్ని అంశాలను గ్రహించానన్నాడు. అంతేగాక డివిల్లీర్స్, కేన్ బ్యాటింగ్‌ను కూడా అనుకరించానన్నాడు. కొన్నాళ్ల క్రితం విలియమ్సన్‌లా ఆడేందుకు ప్రయత్నించానని, డివిల్లీర్స్ షాట్లను ప్రయత్నించానన్నాడు. ప్రస్తుత ఆటగాళ్లలో కోహ్లీ, డివిల్లీర్స్, విలియమ్సన్ ఉత్తమ ఆటగాళ్లని ప్రశంసించాడు. వారినుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని కితాబిచ్చాడు.



భారత బ్యాడ్మింటన్‌కు స్వర్ణ యుగం

- నెం:1 గురించి ఆలోచించడం లేదు
- ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్

న్యూఢిల్లీ: సరికొత్త స్టార్లతో భారత బ్యాడ్మింటన్ స్వర్ణ యుగంలోకి అడుగిడుతోందని ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ అన్నాడు. ఈ ఏడాది కామన్వెల్త్, ఆసియా క్రీడలు జరగనున్న నేపథ్యంలో ఎంతో మంది యువ షట్లర్లు పతకాల వేటకు సిద్ధమయ్యారంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపాడు. ప్రపంచ టాప్-15 ర్యాంకింగ్స్‌లో చైనాతో సమానంగా భారత ప్లేయర్లు కూడా ఉన్నారు. శ్రీకాంత్ 3, హెచ్ఎస్ ప్రణయ్ 11, సాయి ప్రణీత్ 14వ ర్యాంకులు సాధించారు. ఇక మహిళల విభాగంలో 4వ ర్యాంక్‌లో పీవీ సింధు, 11వ స్థానంలో సైనా నెహ్వాల్ ఉన్నారు. 'పురుషుల సింగిల్స్‌లో ఐదారుగురు ఉత్తమ ఆటగాళ్లు



ఉన్నారు. సైనా, సింధు అద్భుతంగా ఆడుతున్నారు. వీరికి తోడు డబుల్స్ ప్లేయర్లు కూడా సత్తాచాటుతున్నార'ని శ్రీకాంత్ చెప్పాడు. గత పదేళ్లతో పోల్చితే ఇప్పుడు ఎక్కువ మంది ప్రతిభగల ప్లేయర్లు అందుబాటులో ఉన్నారన్నాడు. 'ఒలింపిక్ పతకం నెగ్గడం చిరకాల కోరిక. కానీ ఇప్పుడే టోక్యో క్రీడల గురించి ఆలోచించడం లేద'ని కిడాంబి చెప్పాడు. మెగా టోర్నీల్లో నిలకడగా రాణించి పతకాలు కొల్లగొట్టడమే తమకు ఎంతో ముఖ్యమన్నాడు. ర్యాంకుల గురించి తాను పట్టించుకోవడం లేదని చెప్పాడు. రిటైర్మెంట్ తర్వాత వాటి గురించి ఆలోచిస్తానేమోనని సరదాగా అన్నాడు. దూకుడు, సుదీర్ఘ సమయం ఆడగలగడం తన బలమని శ్రీకాంత్ చెప్పాడు. 1980ల్లో ప్రకాష్ పదుకోన్, ఆ తర్వాత పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ హీరోలుగా నిలిచారు. కానీ ఇంత మంది ప్రతిభావంతులైన ఆటగాళ్ల బృందం గతంలో ఎప్పుడూ లేదు. గత ఏడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన కిడాంబి పురుషుల ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. ఆస్ట్రేలియాలో జరిగే కామన్వెల్త్, ఇండోనేసియాలో జరిగే ఆసియా క్రీడలపైనే శ్రీకాంత్ ప్రస్తుతం దృష్టి నిలిపాడు.

ఓయ్...ఎటు చూస్తున్నావ్

- మనీష్‌పై మహీ మండిపాటు



సెంచూరియన్: క్రికెట్‌లో మిస్టర్ కూల్‌గా మహేంద్ర సింగ్ ధోనీకి పేరుంది. ఎంత ఒత్తిడి ఉన్నా సహచరులకు మార్గదర్శనం చేస్తూ ప్రశాంతంగా తన పని తాను చేసుకుపోతాడు. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో ఒకానొక సమయంలో ధోనీకి ఆగ్రహం వచ్చింది. సహచర బ్యాట్స్‌మన్ మనీష్ పాండేను ఒక్కసారిగా గద్దించాడు. ఇప్పుడు ఆ వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది. ఆరంభంలోనే వికెట్లు కోల్పోయిన భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. భారత ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో పాండే మిడ్‌వికెట్ దిశగా ఆడి ఓ సింగిల్ తీశాడు. కానీ ధోనీ డబుల్ కోసం చూశాడు. ఆ సమయంలో పార్ట్‌నర్‌ను గమనించాల్సిన మనీష్.. బంతివైపు చూస్తుండడం ధోనీకి చిరాకు తెప్పించింది. దీంతో స్ట్రయిక్ తీసుకునే ముందు 'అటు కాదు ఇటు చూడు అంటూ' మనీష్‌పై గట్టిగా అరిచి అతడిని అప్రమత్తం చేశాడు. స్టంప్ కెమెరాలో రికార్డయిన ఈ దృశ్యం నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

భువీ, బుమ్రాలకు విశ్రాంతి?



ముంబై: వచ్చే నెలలో శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు టీ-20 సిరీస్‌కు భారత పేసర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతి కల్పించే అవకాశముంది. దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ పర్యటనతోపాటు తీరికలేని సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని జాతీయ సెలెక్షన్ కమిటీ ఆదివారం జరిగే సమావేశంలో దీనిపై ఒక నిర్ణయానికి రానున్నది. ఈ భేటీలో ఆటగాళ్లపై పెరుగుతున్న పని భారాన్ని ప్రధానంగా చర్చించనున్నారని బీసీసీఐ అధికారి ఒకరు స్పష్టంచేశారు. దక్షిణాఫ్రికా పర్యటనలో భువీ, బుమ్రా ముఖ్యపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ పర్యటనలో వారు దాదాపు అన్ని మ్యాచ్‌లలో ఆడారు. ఇక కెప్టెన్ విరాట్ కోహ్లీకి కూడా విశ్రాంతి కల్పించే అవకాశముంది. అయితే అది కోహ్లీ స్వయంగా నిర్ణయించుకుంటాడని, కావాలంటే అతనికి విశ్రాంతి కల్పిస్తామని బోర్డు అధికారి ఒకరు చెప్పారు. ఈ విషయమై వ్యాఖ్యానించడానికి ఎమ్మెస్కే నిరాకరించాడు. రానున్న సీజన్‌లో భారత జట్టు 30 వన్డేలు సహా 63 అంతర్జాతీయ మ్యాచ్‌లలో పాల్గొనాల్సి ఉంది. దానిని దృష్టిలో ఉంచుకునే భువీ, బుమ్రాలకు విశ్రాంతి కల్పిస్తారని భావిస్తున్నారు.

ఇలా ఫ్లాపయితే ఎలా?



'ఆల్‌రౌండర్‌గా పరిగణించబడడం అతని అదృష్టం. అతను బ్యాట్‌తో ఏ మాత్రం రాణించడం లేదు. కేవలం బంతితోనే కాస్తో కూస్తో మెరుస్తున్నాడు. అందుకే జట్టులో చోటు నిలబెట్టుకుంటున్నాడు' ఇదీ భారత యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గురించి మాజీ ఆల్‌రౌండర్ రోజర్ బిన్నీ చేసిన కామెంట్. తొలి టెస్టు మినహా సౌతాఫ్రికా పర్యటనలో హార్దిక్ బ్యాటింగ్‌లో నిరాశాజనక ఆట తీరు చూస్తుంటే ఒక్క బిన్నీకే కాదు...చాలా మందికి ఇలాంటి అనుమానమే కలుగుతోంది. బంతితో మాత్రమే రాణిస్తూ బండి లాగేస్తున్న పాండ్యాను భారత్ ఆశిస్తున్న నిజమైన ఆల్‌రౌండర్ అనుకోవచ్చా?

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నిజానికి ఈ టూర్‌కు ముందు హార్దిక్ పాండ్యాపై భారీ అంచనాలున్నాయి. కొన్ని నెలల కిందట శ్రీలంక గడ్డపై అతని ఆల్‌రౌండ్ ప్రదర్శన చూసి మరో కపిల్ దేవ్ కోసం ఎంతోకాలంగా చూస్తున్న నిరీక్షణ ఫలిస్తున్నట్టేనని అంతాభావించారు. సౌతాఫ్రికా గడ్డపై అతను సత్తా చాటుతాడని కెప్టెన్ కోహ్లీతో పాటు మాజీలు.. విశ్లేషకులు భరోసాతో ఉన్నారు. ఈ టూర్‌కు ఎంపికచేసేందుకుగాను స్వదేశంలో లంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆడించకుండా పాండ్యాకు విశ్రాంతి ఇచ్చారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కేప్‌టౌన్ తొలి టెస్టులో భారత బ్యాటింగ్ విఫలమైన చోట.. పాండ్యా కౌంటర్ అటాకింగ్ ఆటతో 93 పరుగులు చేసి జట్టును కుప్పకూలకుండా కాపాడాడు. విదేశీ గడ్డపై.. అత్యంత పటిష్ఠమైన బౌలింగ్‌ను ఎదుర్కొంటూ పాండ్యా ఆడిన ఇన్నింగ్స్ చూసి ఫిదా అయ్యారంతా. క్రికెట్ పండితులు సైతం హార్దిక్‌ను మరో కపిల్ అంటూ పొగిడేశారు.

కానీ, రెండో టెస్టుకు వచ్చేసరికే విమర్శకులు అభిప్రాయాన్ని మార్చుకున్నారు. కనీసం బ్యాటును క్రీజులో ఉంచకుండా అత్యంత నిర్లక్ష్యంగా రనౌట్ కావడాన్ని... స్లిప్ మీదుగా అడ్డంగా షాట్ ఆడి అవుటైన తీరును తీవ్రంగా ఆక్షేపించారు. పాండ్యా రనౌట్‌ను చూసి అలాంటి తెలివితక్కువ తప్పులు చేస్తే అతణ్ణి తనతో పోల్చకండి అంటూ కపిల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. హార్దిక్ వైఫల్యం రెండో టెస్టుతోనే ఆగలేదు. తర్వాతి ఐదు ఇన్నింగ్స్‌ల్లో 1, 15, 6, 0, 4 స్కోర్లతో తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, వన్డేల్లో అయితే అత్యంత దారుణమైన ఆట తీరును కనబరిచాడు. ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయిస్తూ భారత్ 5-1తో కైవసం చేసుకున్న ఈ సిరీస్‌లో పాండ్యా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 8.66 సగటుతో 26 పరుగులే చేశాడు. ఇలాంటి ఆటతీరుతో మరో ఆటగాడిపైనైతే వేటు పడివుండేది. కానీ, సీమ్ బౌలింగ్‌తో మెరుస్తూ.. చురుకైన క్యాచ్‌లు అందుకోవడంతో అతను తుది జట్టులో కొనసాగుతున్నాడు. కెప్టెన్ కోహ్లీ ఉంచిన విశ్వాసం కూడా అతనికి లాభిస్తుందనొచ్చు. అయితే, కేవలం బంతితో మాత్రమే రాణిస్తున్న పాండ్యాను ఆల్‌రౌండర్ కోటాలో కొనసాగించడం ఎంత వరకూ సమంజసం? అనే ప్రశ్న రోజర్ బిన్నీ నుంచే కాదు ఇప్పుడు అన్ని వర్గాల నుంచి ఎదురవుతోంది. అందుకే పాండ్యాను కపిల్‌తో పోల్చడం ఆపాలని రోజర్ డిమాండ్ చేస్తున్నాడు. 'ఒక బ్యాట్స్‌మన్‌గా కపిల్‌తో పాండ్యా ఎంతమాత్రం సరితూగలేడు. టెస్టు జట్టులోకి వచ్చేముందు కపిల్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఎన్నో సెంచరీలు చేశాడు. కానీ, అత్యున్నత స్థాయి క్రికెట్ ఆడే ముందు పాండ్యా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రాణించనేలేదు. టీ-20 క్రికెట్‌లో మెరుపులను చూసి అతణ్ణి టెస్టు జట్టులోకి తీసుకున్నారు. టెస్టులు వేరు పరిమిత ఓవర్ల ఆట వేరు. షార్ట్ ఫార్మాట్‌లో పరుగులు చేయడం చాలా తేలిక. కానీ టెస్టుల్లో అలా కాద'ని రోజర్ పేర్కొన్నాడు. ఫస్ట్‌క్లాస్‌ల్లో బరోడా తరఫున బరిలోకి దిగి నిలకడగా పరుగులు చేస్తే తప్ప పాండ్యా భారత్ తరఫున రాణించలేడని, టెస్టు క్రికెట్‌లో కుదురుకోలేడని సూచించాడు. అయితే, దేశవాళీల్లో ఎక్కువగా ఆడే సామర్థ్యం కూడా అతనికి లేదన్నాడు. బ్యాట్స్‌మన్‌గా పాండ్యా అతి దూకుడు.. వచ్చీరాగానే షాట్లు ఆడాలన్న ఆత్రుతే అతణ్ణి దెబ్బతీస్తోందని చాలా మంది భావిస్తున్నారు. బిన్నీ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు. 'అతను ప్రతీ బంతిని షాట్ కొట్టాలని చూస్తున్నాడు. అది అసాధ్యం. పాండ్యా ఎక్కువగా స్ట్రోక్స్ ఆడడంపైనే దృష్టి పెడుతున్నాడు తప్పితే.. క్రీజులో కుదురుకునే ఆలోచనే చేయడం లేద'ని రోజర్ విశ్లేషించాడు. పాండ్యా రాకతో తన కుమారుడు, ఆల్‌రౌండర్ అయిన స్టువర్ట్ బిన్నీ టీమిండియాకు దూరం కావాల్సివచ్చిందన్న కోపంతోనే రోజర్ ఇలా అంటున్నాడని కొంత మంది భావించే అవకాశం లేకపోలేదు. అంతెందుకు రోజర్ సహచరుడు, పాండ్యా కోచ్ అయిన మాజీ వికెట్ కీపర్ కిరణ్ మోరే.. బిన్నీతో విభేదిస్తున్నాడు. 'టెస్టుల గురించి మాట్లాడితే జట్టులో ఎంతమంది అర్ధ సెంచరీ చేశారో చెప్పాలి. కేప్‌టౌన్‌లో పాండ్యా చేసిన 93 పరుగులు 150 రన్స్‌తో సమానం' అని తన శిష్యుడిని వెనకేసుకొచ్చాడు. కానీ, ఆ ఇన్నింగ్స్ తర్వాత పాండ్యా బ్యాటింగ్‌ను చూసిన వారికి రోజర్ చెప్పేదాంట్లో నిజం ఉన్నదనిపిస్తోంది. ఎందుకంటే కేవలం బౌలింగ్ కోసమే పాండ్యాను జట్టులోకి తీసుకోవడం లేదు. ఆ మాట కొస్తే ప్రధాన బౌలర్లతో పోల్చితే అతను బంతితో కూడా ఆశించినంత ఆకట్టుకున్నదీ లేదు. మూడు టెస్టుల్లో తీసినవి మూడు వికెట్లే. అదే సమయంలో బుమ్రా 14, రెండేసి టెస్టులే ఆడిన భువనేశ్వర్ 10, ఇషాంత్ 8 వికెట్లు తీశారు. ఆరు వన్డేల్లో హార్దిక్ నాలుగు వికెట్లు మాత్రమే తీశాడు. ఒక్క పర్యటనలో ఆటను చూసి పాండ్యా భవిష్యత్‌ను అంచనా వేయడం తొందరపాటే అవుతుంది. కానీ, భావి ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకొని.. కెప్టెన్ కోహ్లీ ఎంతో భరోసా ఉంచిన అతను ఇలా వరుసగా ఫ్లాపవడం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. అలా అయితే అతను జట్టులో ఎక్కువ కాలం కొనసాగడం కూడా కష్టమే. పాండ్యా ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి రెండు విభాగాల్లోనూ రాణిస్తేనే అతణ్ణి భారత్ కోరుకున్న ఆల్‌రౌండర్‌గా పరిగణించగలం..!

సెమీఫైనల్లో ఆంధ్ర

- క్వార్టర్స్‌లో ఢిల్లీపై ఘన విజయం

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర అప్రతిహతంగా సాగుతోంది. లీగ్ దశలో ఓటమి ఎరుగని ఆంధ్ర జట్టు క్వార్టర్‌ఫైనల్లోనూ బలీయమైన ఢిల్లీ జట్టును చిత్తుగా ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో తొలుత ఢిల్లీని 32.1 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ చేసిన ఆంధ్ర 28.4 ఓవర్లలో 4 వికెట్లను మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. శివకుమార్ (4/29), భార్గవ్ భట్ (3/28) ధాటికి ఢిల్లీ బ్యాట్స్‌మెన్ తలవంచారు. ఉన్ముక్త్ (4), గౌతమ్ (8), హితేన్ దలాల్ (11), నితీష్ రాణా (2) విఫలమయ్యారు. 9 ఓవర్లలో 33 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన స్థితినుంచి రిషభ్‌పంత్ (38), ధ్రువ్ షోరె (21) జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేశారు. ఐదో వికెట్‌కు 36 పరుగులు జోడించిన అనంతరం ధ్రువ్‌ను భార్గవ్ అవుట్ చేసి ఆ జోడీని విడగొట్టాడు. ఈ తరుణంలో రిషభ్ ఒంటరిపోరు సలిపాడు. మరో 20 ఓవర్లు మిగిలిఉండగా రిషభ్ అవుటవడంతో ఢిల్లీ ఒక్కసారిగా కుప్పకూలింది. ఢిల్లీ జట్టు కేవలం 35 పరుగులకు ఆరు వికెట్లను కోల్పోయింది.



ఆంధ్ర జట్టు

అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర ఆరంభంలో తడబడినా లక్ష్యాన్ని చేరుకుంది. 11 పరుగులకే భరత్ (0), విహారి (6) వికెట్లను కోల్పోయిన దశలో రికీ భుయ్ (32), అశ్విన్ హెబ్బర్ (38) మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. లక్ష్యం ముంగిట ఈ ఇద్దరూ అవుటైనా సుమంత్ (24 నాటౌట్), రవితేజ (3 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ నెల 25న జరిగే సెమీస్‌లో సౌరాష్ట్రతో ఆంధ్ర తలపడనుంది.

బరోడాపై సౌరాష్ట్ర గెలుపు:

మరో క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర మూడు వికెట్లతో బరోడాను ఓడించింది. తొలుత క్రునాల్ పాండ్యా (61) రాణించడంతో బరోడా 8 వికెట్లకు 247 పరుగులు చేసింది. బరోత్ (82) మెరుపులతో సౌరాష్ట్ర 48.4 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

తైక్వాండో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

- జాతీయ అకాడమీ ఏర్పాటుకు ప్రయత్నం
- మంత్రులు హరీష్, పద్మారావు హామీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన ఆటగాళ్లకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు మంత్రులు టి. హరీష్‌రావు, పద్మారావు గౌడ్ ప్రకటించారు. ఈనెల 10, 11న అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన ఈ పోటీల్లో అబ్దుల్ ఖలీల్ రెండు స్వర్ణాలు, కొండా సహదేవ్, సింధు రెండేసి స్వర్ణ, రజతాలతో సత్తా చాటుకున్నారు. గురువారం జలసౌధలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పద్మారావు, హరీశ్ రావు విజేతలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా తైక్వాండో జాతీయ అకాడమీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చిస్తామని మంత్రులు చెప్పారు. మరోవైపు తెలంగాణ తైక్వాండో క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో రాణిస్తున్నందున ప్రభుత్వం కూడా తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించాలని 'ఇన్‌ఫినో తైక్వాండో వరల్డ్' సంస్థ ఛైర్మన్ ఎం.జయంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



కపిల్, అజర్‌తో క్రికెట్ ఆడిన ట్రూడో

న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పిల్లలతో కలసి సరదాగా క్రికెట్ ఆడుతూ కనిపించారు. గురువారం ఢిల్లీ మోడ్రన్ స్కూల్ గ్రౌండ్‌లో టీమిండియా మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, అజరుద్దీన్‌తో కలసి క్రికెట్ ఆడారు. అజర్‌తోపాటు మరి కొందరు ఫీల్డింగ్ చేయగా.. ట్రూడో కుమారుడికి కపిల్ బౌలింగ్ చేశాడు.





2.6 కోట్ల చేతి గడియారం

స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ లగ్జరీ వాచ్ బ్రాండ్ 'చొపార్డ్' హైదరాబాద్ మార్కెట్లో మెరిసింది. మణికట్టుకు మణిపూసలాంటి ఈ వజ్రాల చేతి గడియారం ధర అక్షరాలా రూ.2.6 కోట్లు. జూబ్లీహిల్స్‌లోని కమల్ వాచ్‌కో లో ఈ లిమిటెడ్ ఎడిషన్ వాచ్‌ను నటి శ్రద్ధాదాస్ ఆవిష్కరించారు.



'సివిల్స్' మార్కులను వెల్లడించడం కుదరదు

ఆర్టీఐ దరఖాస్తుదారులతో సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్స్ పరీక్షల మార్కుల వెల్లడి కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లో ఎంపిక కాని కొందరు యువకులు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరుపుతూ సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఢిల్లీకి చెందిన కొందరు యువకులు 2010 ప్రిలిమ్స్‌లో ఎంపికవ్వకపోవడంతో.. ఆర్టీఐ ద్వారా తమ మార్కుల వివరాలు, కటాఫ్ వివరాలు, ప్రామాణిక మార్కులు, ఎంపికైన ఇతర అభ్యర్థులకు వచ్చిన మార్కుల వివరాలివ్వాలని అభ్యర్థించారు. అది సాధ్యంకాదని యూపీఎస్సీ చెప్పడంతో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారికి మార్కుల వివరాలివ్వాల్సిందేనని హైకోర్టు చెప్పడంతో.. యూపీఎస్సీ సుప్రీంలో అప్పీల్ చేసింది. ఈ కేసు విచారించిన జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్‌లు మార్కులు వెల్లడి చేయడం సాధ్యం కాదంటూ తీర్పునిచ్చారు. అలా చేయడం యూపీఎస్సీ నిజాయితీని ప్రశ్నించినట్లు అవుతుందని పేర్కొన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మార్కులను వెల్లడించాల్సిందేనని.. అయితే.. ఈ కేసుకు అవి వర్తించవని వివరించారు.



ముఖ్యమంత్రి నా ఇంట్లో దెయ్యాలను వదిలారు

అందుకే బంగ్లా ఖాళీ చేశా: తేజ్ ప్రతాప్

పట్నా, ఫిబ్రవరి 22: 'సీఎం నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ నా ఇంట్లో దెయ్యాలను వదిలారు.అవి నన్ను వేధిస్తున్నాయి.అందుకే బంగ్లా ఖాళీ చేయాల్సి వచ్చింది.' అని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు, బిహార్ మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ ఆరోపించారు. తేజ్ ప్రతాప్ మంత్రిగా ఉన్నప్పుడు దేశ్‌రత్న్ మార్గ్‌లోని భవనాన్ని కేటాయించారు. మొదట్నుంచి వాస్తు, మతపరమైన విషయాలపై నమ్మకం ఉన్న తేజ్ ప్రతాప్ ఆ బంగ్లాను తన సెంటిమెంట్‌గా భావించారు. అప్పట్లో ఈ బంగ్లా ప్రధానద్వారం మూసేసి, పలు మార్పులు కూడా చేయించారు. కానీ మంత్రి పదవి నుంచి దిగిపోయాక ఆ భవనాన్ని ఖాళీ చేయాలని తేజ్‌ప్రతాప్‌కు నితీశ్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. బంగ్లా ఖాళీ చేయాలని పలువురు నేతలూ తేజ్ ప్రతాప్‌పై ఒత్తిడి తెచ్చారు. అయినా బంగ్లాను ఖాళీ చేయని తేజ్ పట్నా హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వ నోటీసులపై స్టే విధించింది. హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగానే దెయ్యాలు ఉన్నాయంటూ తేజ్‌ప్రతాప్ బంగ్లా ఖాళీ చేయడం ఓ జిమ్మిక్కని జేడీయూ ఆరోపించింది.

బాలికను మింగిన డెంగీ.. ఆస్పత్రి బిల్లు 18 లక్షలు

గురుగ్రామ్ కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాకం

గురుగ్రామ్, ఫిబ్రవరి 22: తమ బిడ్డను కోల్పోయిన బాధలో ఉన్న తల్లిదండ్రులకు ఆ ఆస్పత్రి యాజమాన్యం ఓ 20 పేజీలతో కూడిన బిల్లును చేతిలో పెట్టింది. ఆస్పత్రిలో 15 రోజులపాటు చికిత్స పొందినందుకు రూ.18 లక్షల బిల్లు అయిందన్నది అందులోని సారాంశం. బిల్లును చూసిన ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి? హరియాణా గురుగ్రామ్‌లోని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆస్పత్రి నిర్వాకమిది. ఈ విషయాన్ని బాధిత తల్లిదండ్రుల బంధువులు ట్విటర్ ద్వారా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆస్పత్రి యాజమాన్యంపై విచారణకు మంత్రి ఆదేశించారు. ఆద్యాసింగ్ అనే ఏడేళ్ల బాలికను తీవ్రజ్వరంతో గత ఏడాది ఆగస్టు 31న తల్లిదండ్రులు ఫోర్టిస్ మెమోరియల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె డెంగీతో బాధపడుతోందన్న వైద్యులు ఆస్పత్రిలో చేరిన మరుసటి రోజే బాలికను వెంటిలేటర్‌పై ఉంచారు. వివిధ అవయవాల పనితీరు మందగించడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. 15 రోజుల పాటు ఆమెను వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ కూడా నిర్వహించారు. తల్లిదండ్రులకు మాత్రం బాలిక 24 గంటల్లో కోలుకుంటుందని నమ్మించారు. తర్వాత నాలుగు రోజులు సాగదీశారు. ఎంఆర్ఐ తదితర పరీక్షలేవీ నిర్వహించకుండానే బాలిక మెదడు సంబంధమైన వ్యాధితో బాధపడుతోందని తల్లిదండ్రులను నమ్మించారు. తీరా 15 రోజుల తర్వాత బాలిక ప్రాణాలు కోల్పోయింది. బిడ్డను కోలోయిన బాధలో ఉన్న తల్లిదండ్రుల చేతిలో రూ.18 లక్షల బిల్లును పెట్టారు. చికిత్సలో భాగంగా బాలికకు 660 ఇంజక్షన్లు ఇచ్చామని.. 2,700 గ్లవ్స్ వాడామని అందులో పేర్కొన్నారు.

అవినీతి గొంగళి అక్కడే!

భారత్‌లో తిష్టవేసిన భ్రష్టాచారం.. నీతివంతమైన దేశాల్లో 81వ ర్యాంకు

- 2016 కన్నా దిగజారిన స్థానం
- మాల్దీవులు, ఫిలిప్పీన్స్‌కు తీసిపోం
- ఫలించని అవినీతి వ్యతిరేక పోరాటం
- మెరుగైన స్థానంలో భూటాన్, చైనా
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ర్యాంకుల వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం భ్రష్టాచారంపై తిరుగులేని యుద్ధం ప్రకటించినట్లు చెప్పుకొంటున్నప్పటికీ.. అవినీతి నిరోధంలో భారత్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 2017 సంవత్సరానికి అవినీతి నిరోధంపై ప్రకటించిన ర్యాంకుల్లో భారత్‌కు 81వ స్థానం దక్కింది. 2016 ఏడాదితో పోలిస్తే 2 ర్యాంకులు దిగజారింది. సున్న నుంచి వంద వరకూ స్కోరు కార్డులో భారత్‌కు 40 మార్కులే దక్కాయి. 2016లోనూ 40 మార్కులే వచ్చాయి. ర్యాంకు మాత్రం దిగజారింది. 2015లో భారత్ 38 మార్కులతో 76వ ర్యాంకులో ఉంది. 2016లో నోట్ల రద్దు, 2017లో జీఎస్టీ అమలు లాంటి చర్యలు మన అవినీతి తల రాతను మార్చలేక పోయాయి. పొరుగున ఉన్న భూటాన్ 67 మార్కులతో 26వ ర్యాంకులో వెలిగిపోతోంది. చైనా 41 మార్కులతో 77వ ర్యాంకుతో మనకన్నా మెరుగైన స్థానంలో ఉంది. చుట్టూ ఉన్న దేశాల్లో శ్రీలంక (91), పాకిస్థాన్ (117), బంగ్లాదేశ్ (143), మయన్మార్ (130) మనకన్నా వెనుకబడి ఉన్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రిక్స్ దేశాల్లో భారత్, చైనాను మినహాయిస్తే.. దక్షిణాఫ్రికా 71, బ్రెజిల్ 96, రష్యా 135 ర్యాంకులను సాధించాయి. మొత్తం 180 దేశాలకు ర్యాంకులు ఇచ్చారు. ఇవి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తేల్చిన ర్యాంకులు. వీటికి ఇతర గణాంకాల ప్రాతిపదిక లేదు. సున్నా మార్కులు వస్తే అత్యంత అవినీతి దేశమని, 100 మార్కులు వస్తే అత్యంత నీతిమంతమైన దేశమని భావించాలి. యాభై మార్కులు కూడా రాని దేశాలను అవినీతిమయమైన దేశాలుగా పరిగణిస్తున్నారు. అన్ని దేశాల సగటు 43 మార్కులు కాగా, భారత్‌కు 40 మార్కులే వచ్చాయి. సగటు మార్కుల కన్నా తక్కువ వచ్చినవి అత్యంత అవినీతిమయమైన దేశాలుగా పరిగణిస్తున్నారు. ఇంకా..

- అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన జర్నలిస్టులు, అధికారులను బెదిరించడం, చంపడం భారత్, ఫిలిప్పీన్స్, మాల్దీవుల్లో ఎక్కువగా ఉందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఆసియా పసిఫిక్ దేశాల్లోనే ఈ 3దేశాల్లో అవినీతి వ్యతిరేక ఉద్యమకారుల పరిస్థితి దారుణంగా ఉందని హెచ్చరించింది.
- గత ఆరేళ్లలో 15 మంది జర్నలిస్టులు అవినీతిపై పోరాటంలో అంతం అయ్యారని వెల్లడించింది. ఆరేళ్లలో మరణించిన 90% జర్నలిస్టులు 45మార్కుల కన్నా తక్కువ స్కోరు సాధించిన దేశాల్లోనే మరణించారని తెలిపింది.
- భారత్‌లో వ్యక్తులుగా అవినీతికి ఎదురొడ్డి నిలిస్తే ప్రాణాలకే ముప్పని పేర్కొంది.
- అవినీతి వ్యతిరేక ర్యాంకింగ్‌లో అగ్రభాగాన న్యూజిలాండ్ (1-89), డెన్మార్క్ (2-88) నిలవగా, సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా అట్టడుగున ఉన్నాయి.
- పశ్చిమ యూరప్ దేశాలన్నీ 66 సగటు మార్కులు సాధించి, ఉత్తమ అవినీతి రహిత ప్రాంతంగా మన్ననలు అందుకున్నాయి.

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సూచనలు

- అవినీతిని నిలువరించే చట్టాలు చేయండి. వ్యవస్థలు ఏర్పాటు చేయండి.
- అవినీతిపరులపై రాజకీయ ప్రతీకారేచ్ఛ వద్దు. న్యాయమూర్తులు, పోలీసుల ద్వారా సాంకేతికంగా పరిష్కరించండి.
- పౌర సమాజానికి భయం లేకుండా అభిప్రాయాలను వ్యక్తీకరించే అవకాశమివ్వండి.
- పాఠశాల స్థాయి నుంచే వ్యక్తి సమగ్రత మీద దృష్టి పెట్టండి.



దేశంలో అవినీతి ఎక్కడ ఎంత?

పోలీస్ స్టేషన్లు, దర్యాప్తు సంస్థలు, కోర్టుల్లో లంచగొండులు	62%
భూ లావాదేవీలల్లో	38%
లారీలు, ఆటోవాలాలు, టాక్సీలు చెల్లించే లంచాలు	61%
అవినీతి కేసుల్లో ఇరుక్కున్న ఎంపీలు	31%
అవినీతికి పాల్పడుతున్న ఇతర నేతాగణం	78%
పేదలకు అందాల్సిన ఆహార ధాన్యాల్లో అందుతున్నది	40%

11 రకాల సేవల్లో ఏటా అవినీతి విలువ

రూ. 3,19,72,50,00,000

జీడీపీలో 15% సంపద 101 మంది వద్దే: ఆక్స్‌ఫామ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భారతదేశంలో గడిచిన మూడు దశాబ్దాల్లో అసమానతలు మరింత పెరిగాయి. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 15 శాతానికి సమానమైన సంపద కొద్దిమంది సంపన్నుల ఖాతాలో జమపడే స్థాయికి అంతరాలు విస్తరించాయి. ప్రభుత్వాల తప్పుడు విధానాలే ఇందుకు కారణమని 'ఆక్స్‌ఫామ్' తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలో 2017లో 101 మంది శతకోటీశ్వరులు ఉన్నారని, ఐదేళ్ల క్రితం జీడీపీలో 10 శాతంగా ఉన్న వారి సంపద ఇప్పుడు 15 శాతానికి చేరగా, మరోవైపు పేదలు మరింత దారిద్ర్యంలోకి కూరుకుపోయారని 'పెరుగుతున్న అగాధం: భారతదేశంలో అసమానతల నివేదిక-2018'లో ఆక్స్‌ఫామ్ వెల్లడించింది.

అర దండాలు కాదు.. శతకోటి దండాలు

- నిరుద్యోగం అవినీతిని పెంచుతోంది. ఉద్యోగం కోసం లంచం ఇస్తున్న వారు దాదాపు 45 శాతం మంది
- గట్టి శిక్షలు లేకపోవడం వల్ల అవినీతి పెరుగుతోంది.
- ప్రజలు అవినీతిని నిరసిస్తారు కానీ అవినీతిని నిరోధించే విషయంలో వారి మధ్య ఐక్యత లేదు.
- టేకిట్ ఈజీ పాలసీ వల్ల అవినీతిపరుల దందాలు ఎక్కువవుతున్నాయి.
- ఉద్యోగుల ఆదాయపు చిట్టాలో పారదర్శకత లేదు.
- సమాచార హక్కు చట్టం వచ్చినా అది అవకతవకలను నిరోధించలేకపోతోంది.
- స్వతంత్ర నేర పరిశోధన, దర్యాప్తు సంస్థ లేకపోవడం
- కోర్టులు, ఎలక్షన్ కమిషన్ సహా చాలా రాజ్యాంగ సంస్థలకు గట్టి అధికారాలు లేవు.
- కంపెనీల మధ్య అనారోగ్యకర పోటీ.

తుపాకీకి తుపాకితోనే సమాధానం!

టీచర్లకు ఆయుధాల కేటాయింపుపై ట్రంప్



వాషింగ్టన్, ఫిబ్రవరి 22 : తుపాకీకి తుపాకీతోనే సమాధానం ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. టీచర్లకు ఆయుధాలిచ్చే విషయమై ఆలోచిస్తామని ఆయనచెప్పారు. ఇకపై ఆయుధాలు కొనుగోలు చేసే వారి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుంటామన్నారు. గత వారం ఫ్లోరిడాలోని మెర్జరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్ పాఠశాలలో ఉన్మాది కాల్పుల్లో బయటపడిన విద్యార్థులు,టీచర్లతో ట్రంప్ వైట్‌హౌస్‌లో మాట్లాడారు. ప్రమాదాలు నివారించడానికి ఆయుధాల వినియోగంపై టీచర్లకు శిక్షణ ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. టీచర్ల వద్ద తుపాకులు ఉన్న విషయాన్ని తెలియనివ్వమని, వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ప్రమాదకర పరిస్థితి వస్తే ఎదుర్కొనేలా వారిని సన్నద్ధం చేస్తామన్నారు. ప్రపంచంలో ఇలాంటి భయానక, విషాదకరమైన పరిస్థితి ఎవరికీ రాకుండా చూడాల ని విద్యార్థిని జూలియా కోర్వేడర్ అధ్యక్షుడిని కోరింది. ఇటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని ఆమెతోపాటు చాలామంది విద్యార్థులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. గతవారం మెర్జరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి నికోలస్ క్రజ్ విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 17 మంది మరణించిన విషయం తెలిసిందే.

ఒక బెంచ్ తీర్పుపై మరో బెంచ్ స్టే

సుప్రీంలో మరో రగడ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మధ్య తాజాగా మరో వివాదం చెలరేగింది. భూ సేకరణ బిలు లోని కొన్ని అంశాలపై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ వెలువరించిన తీర్పును పట్టించుకోవద్దని జస్టిస్ మదన్ లోకూర్ నేతృత్వంలోని మరో బెంచ్ ఉత్తర్వులివ్వడం కొత్త వివాదానికి కారణమైంది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకున్నా భూ సేకరణలో స్వాధీనం చేసుకున్న భూమిపై కేంద్రానికి అధికారం ఉంటుందని- 2013 నాటి భూసేకరణ, నష్టపరిహార చట్టం సెక్షన్ 24ను ప్రస్తావిస్తూ- జస్టిస్ అరుణ్ మిశ్రా బెంచ్ ఇటీవల పుణె మున్సిపాలిటీకి చెందిన ఓ కేసులో తీర్పు ఇచ్చింది. డబ్బులు ప్రభుత్వ ఖజానాలో ఉన్నా నిర్వాసితులకు డబ్బులు చెల్లించినట్లే పరిగణించాలని, నిర్దిష్ట సమయంలో నిర్వాసితులకు చెల్లిస్తారు కాబట్టి ఇక ఆ భూమి ప్రభుత్వ పరమైనట్లేనని బెంచ్ అభిప్రాయపడింది. ఆ తీర్పు చట్ట విరుద్ధమని జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో కూడిన మరో బెంచ్ వ్యాఖ్యానించింది.. ఆ తీర్పును పట్టించుకోవాల్సిన అవసరం లేదని హైకోర్టులకు రూలింగ్ ఇచ్చింది. దీనిపై విస్తృత ధర్మాసనం వేయాలా వద్దా? ప్రధాన న్యాయమూర్తి పరిశీలనకు పంపాలా వద్దా అన్న విషయమై మార్చి 7వ తేదీన నిర్ణయిస్తామని ప్రకటించింది. ఇది అరుణ్ మిశ్రా బెంచ్‌కు ఆగ్రహం తెప్పించినట్లు సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. నిర్ణయించాల్సింది ప్రధాన న్యాయమూర్తి గానీ లోకూర్-కురియన్‌లు కాదని అంటూ భూసేకరణ చట్టంలోని అంశాలపై విస్తృత ధర్మాసనం వేసే అంశాన్ని పరిశీలించాలని సీజే జస్టిస్ దీపక్ మిశ్రాను కోరింది. సమ స్థాయి కలిగిన వేరే బెంచ్ తీర్పును తప్పుపట్టడం క్రమశిక్షణా రాహిత్యమా కాదా? సీజే నేతృత్వంలోని విశాల ధర్మాసనం నిర్ణయిస్తుందని జస్టిస్ అరుణ్ మిశ్రా వ్యాఖ్యానించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ మధ్య సీజేపై తిరుగుబాటు చేసిన నలుగురు జడ్జీల్లో జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు ఉన్నారు. ఈ వివాదం పుణె మున్సిపాలిటీ, ఇండోర్ డెవలెప్‌మెంట్ అథారిటీ, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీలకు సంబంధించిన 3 విడివిడి కేసులివి. ఒక బెంచ్‌లో జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ గోయల్, జస్టిస్ మోహన్ శంతన్ గౌడార్‌లు సభ్యులు, మరొక బెంచ్‌లో సీనియర్ జడ్జీలు మదన్ లోకూర్, కురియన్ జోసెఫ్‌లు సభ్యులు.

రోటోమాక్ అధినేత అరెస్టు

- విక్రమ్ కొఠారీ కుమారుడినీ అరెస్టు చేసిన సీబీఐ అధికారులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బ్యాంకుల నుంచి రూ.వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన రోటోమాక్ యజమాని విక్రమ్ కొఠారీని, ఆయన కుమారుడు రాహుల్‌ను సీబీఐ అధికారులు గురువారం అరెస్టు చేశారు. మొత్తం ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకుల (బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓవర్సీస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్) నుంచి రూ.2919 కోట్ల మేర రుణాలను విక్రమ్ కొఠారీ తీసుకున్నారని, వడ్డీతో కలిపి అది రూ.3695 కోట్లకు చేరిందని ఆ సొమ్ము చెలిల్లించకుండా కొఠారీ మోసం చేశారని సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కొఠారీ తమ వద్ద తీసుకున్న రుణాన్ని చెల్లించడంలేదంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీనిపై ప్రశ్నించేందుకు విక్రమ్ కొఠారీని, రాహుల్‌ను సీబీఐ అధికారులు ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి పిలిపించారు. విచారణలో సహకరించనందున వారిని అరెస్టు చేశామని ఒక అధికారి తెలిపారు.

నీరవ్ మోదీ గీతాంజలి సెజ్ జప్తు

- దాని విలువ రూ.1200 కోట్లు: ఐటీశాఖ
- 100 కోట్ల డిపాజిట్లు, షేర్లు, కార్లు సీజ్

హైదరాబాద్, ముంబై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంకును నిలువునా ముంచి దేశం నుంచి పరారైన నీరవ్ మోదీ గీతాంజలి గ్రూపునకు చెందిన.. హైదరాబాద్ శివార్లలోని ప్రత్యేక ఆర్థిక మండలిని ఆదాయ పన్ను శాఖ గురువారం అటాచ్ చేసింది. ఈ సెజ్ విలువ రూ.1200 కోట్లు ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. నీరవ్ మోదీ పన్ను ఎగవేతకు సంబంధించి చేస్తున్న దర్యాప్తులో భాగంగా ఈ సెజ్‌ను అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు.. నీరవ్ మోదీ, ఆయన మామ మేహుల్ చోక్సీ సంస్థలకు చెందిన రూ.100 కోట్ల డిపాజిట్లు, షేర్లు, లగ్జరీ కార్లను ఈడీ సీజ్ చేసింది. రూ.11,400 కోట్ల పీఎన్‌బీ స్కాంలో వారిపై మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించి దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో ఈ చర్యకు ఉపక్రమించింది. చోక్సీ అధినేతగా ఉన్న గీతాంజలి గ్రూపునకు సంబంధించిన రూ.86.72 కోట్ల విలువ చేసే షేర్లు, మ్యుచువల్ ఫండ్లను.. నీరవ్ గ్రూపునకు చెందిన రూ.7.80 కోట్ల డిపాజిట్లను స్తంభింపజేశామని ఈడీ అధికారులు తెలిపారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ నెల 15న నీరవ్, చోక్సీ ఆఫీసులు, నివాసాల్లో సోదాల సందర్భంగా 9 విలాసవంతమైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ కేసులో జప్తుచేసిన ఆస్తుల విలువ రూ.5,826 కోట్లకు చేరింది. ఇక, నీరవ్ పాస్‌పోర్టును ఎందుకు ఉపసంహరించకూడదో తెలియజేయాలంటూ ఆయనకు ఈమెయిల్ ద్వారా నోటీసు పంపినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. దీనిపై ఆయనే తమను పరోక్షంగా సంప్రదించారని, ఒక మెయిల్ ఐడీని ఇచ్చి నోటీసులను దానికి పంపాల్సిందిగా కోరారని రవీష్ వివరించారు. తాము ఇచ్చిన నోటీసుకు నిర్ణీత సమయంలో స్పందించకుంటే చర్యలు తీసుకుంటామని రవీష్ స్పష్టం చేశారు. కాగా, ఈ కేసుకు సంబంధించి తమ ముందు హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసినప్పటికీ ఆయన రాకపోవడంతో.. 26 లోపు హాజరు కావాలంటూ తాజాగా సమన్లు జారీ చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు. తన పాస్‌పోర్టును సస్పెండ్ చేసినందు వల్ల, ఇతరత్రా వ్యాపార కారణాల వల్ల రాలేకపోతున్నట్టు నీరవ్ మోదీ.. ఈడీ దర్యాప్తు అధికారికి తెలిపినట్టు వారు వివరించారు. నీరవ్ మామ చోక్సీ కూడా శుక్రవారం ఈడీ ముందు హాజరు కావాల్సి ఉంది.



కెనడా ప్రధాని ట్రూడో భార్య సోఫీతో జస్పాల్ అత్వాల్

కెనడా ప్రధాని విందుకు ఖలిస్థాన్ ఉగ్రవాది!

- ఆహ్వానాన్ని వెనక్కి తీసుకున్న కెనడా హైకమిషన్
- అధికారులపై చర్యలు తీసుకుంటామన్న ట్రూడో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో విందుకు ఖలిస్థాన్ ఉగ్రవాది జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం అందడంపై వివాదం చెలరేగింది. దీంతో కెనడా హైకమిషన్ ఆహ్వానాన్ని వెనక్కి తీసుకుంది. భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని ట్రూడో ముంబై, ఢిల్లీలో అధికారిక విందులో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ రెండింటికి జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం పంపారు. ముంబై విందులో పాల్గొన్న అత్వాల్.. ట్రూడో భార్యతో ఫొటోలు కూడా దిగడం తో వివాదం చెలరేగుతోంది. దీంతో ఢిల్లీ విందుకు జస్పాల్‌కు పంపిన ఆహ్వానాన్ని కెనడా హై కమిషనర్ నాదిర్ పటేల్ వెనక్కి తీసుకున్నారు. 'అత్వాల్‌కు పంపిన ఆహ్వానాన్ని రద్దు చేశాం. ప్రధాని భద్రతకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయబోము' అని నాదిర్ అన్నారు. 1986లో కెనడాలో పర్య టించిన పంజాబ్ మంత్రిని ఇంటర్నేషనల్ సిక్కు యూత్ ఫెడరేషన్‌లో కీలక సభ్యుడిగా ఉన్న జస్పాల్ అత్వాల్ చంపేందుకు ప్రయత్నించాడు. ఈ కేసులో అతనికి జైలు శిక్ష కూడా పడింది. సిక్కు వేర్పాటువాదులకు, ఖలిస్థాన్ ఉద్యమ కారులకు కెనడా ప్రభుత్వం మద్దతిస్తోందని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ సహా పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు జస్పాల్‌ను ఆహ్వానించడంపై ట్రూడో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కాగా, జస్టిన్ ట్రూడో తన కుటుంబసభ్యులతో కలిసి ఢిల్లీలోని జామా మసీదును గురువారం సందర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

సొగసు

గ్రాండ్ లుక్

వేడుక చిన్నదైనా, పెద్దదైనా సల్వార్‌కమీజ్, చుడీదార్లు వేసుకోవడమే సౌకర్యంగా భావిస్తారు ఎక్కువమంది. కాకపోతే ఆ డ్రెస్‌లు కాస్త గ్రాండ్‌లుక్‌తో స్పెషల్‌గా కనిపించాలని జల్లెడ పట్టి వెతికి మరీ కొంటారు. లేదా తమకు నచ్చిన డిజైన్లను స్పెషల్‌గా డిజైన్ చేయించుకుంటారు. అలాంటి కొన్ని స్పెషల్ డిజైన్‌లు మీ కోసం...



లేత గులాబీ రంగు ఆర్ట్ సిల్క్ అనార్కలి ఎంబ్రాయిడర్డ్ సూట్ ఇది. నేలను తాకేంత పొడవు ఉన్న కమీజ్‌కు జరీ ఎంబ్రాయిడరీ, స్టోన్‌వర్క్, లేస్ అంచులు కొత్త అందాన్ని తెచ్చాయి. ఈ కమీజ్‌కు అదే రంగులో అంటే లేత గులాబీ రంగులోనే షాంతూన్ చుడీదార్ కుట్టారు. నెట్ దుపట్టాకు లేస్ డిటెయిల్స్ ఇవ్వడంతో గ్రాండ్ అండ్ స్పెషల్ లుక్ వచ్చేసింది.
ధర : 7,221 రూపాయలు.

ఫాక్స్ జార్జెట్ పార్టీవేర్ అనార్కలి సల్వార్ కమీజ్. ఆవపిండి రంగులో ఉన్న ఈ డ్రెస్ పార్టీలకు వేసుకుంటే వెలిగిపోవడం ఖాయం. కమీజ్ లోపల, బాటమ్‌లకు సంతూన్ ఫ్యాబ్రిక్ వాడారు. బాటమ్ రంగు పసుపు. దుపట్టాకు వాడిన ఫ్యాబ్రిక్ నంజ్‌నీన్. సెల్ఫ్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రెస్‌ను మొదటి ఉతుకు డ్రైక్లీనింగ్‌కు ఇవ్వాలి. పండుగలకు, పార్టీలకు, పెళ్లి వేడుకలకు వేసుకుంటే సెంటరాఫ్ అట్రాక్షన్ మీరే.
ధర: 1,799 రూపాయలు.

నీలం, ఎరుపు రంగుల అనార్కలి డ్రస్ ఇది. జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో స్టిచ్ చేసిన ఈ డ్రెస్‌ను రిసెప్షన్, సంగీత్, పెళ్లి వేడుకలకు వేసుకుంటే బాగుంటుంది. జార్జెట్ మెటీరియల్ వాడారు కాబట్టి డ్రైక్లీనింగ్ చేయించాలి. ఈ అనార్కలి స్టయిల్ కమీజ్‌కు చుడిదార్ బాటమ్ అయితేనే బాగుంటుంది. దుపట్టా వేసుకోవాలి అనిపిస్తే వేసుకోవచ్చు. లేకపోయినా స్టయిలిష్‌గానే ఉంటుంది.
ధర : 1,500 రూపాయలు

జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన స్ట్రెయిట్ సల్వార్ కమీజ్ ఇది. ఈ డ్రెస్ మీదంతా హ్యాండ్ వర్క్ చేశారు. పార్టీలు, పెళ్లిళ్ల వంటి వేడుకలకు వేసుకునే ఈ సల్వార్ కమీజ్‌ను డ్రైక్లీన్ చేయించాలి. ఇన్నర్, బాటమ్‌లకు వెల్వెట్ మెటీరియల్ వాడారు. దుపట్టాగా షిఫాన్ ఫ్యాబ్రిక్‌ను ఇచ్చారు.
ధర: 2,275 రూపాయలు.

కశ్మీర డిజైనర్ స్ట్రెయిట్ సల్వార్ కమీజ్‌ను జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో కుట్టారు. ఈ డ్రెస్ ఇన్నర్, బాటమ్‌లు కూడా జార్జెట్ మెటీరియల్‌వే. దుపట్టా మాత్రం సంతూన్ ఫ్యాబ్రిక్ వాడారు. కమీజ్ పైన ఎంబ్రాయిడరీ వర్క్ ఇవ్వడంతో గ్రాండ్‌లుక్ వచ్చేసింది. పార్టీ, పెళ్లిళ్ల వంటి వేడుకలకు వేసుకుంటే స్పెషల్ అట్రాక్షన్ మీరే అవుతారు. ప్రత్యేక సందర్భాల్లో వేసుకునే ఈ డ్రెస్‌ను డ్రైక్లీన్ మాత్రమే చేయించాలి.
ధర: 1,765 రూపాయలు

కౌన్సెలింగ్ కార్నర్

ఈ బంధం నిలిచేదెలా?

నా పెళ్లయి మూడేళ్లు. ఒక పాప. మేము కలసి ఉన్నది ఆరునెలలే. అంటే విడిపోయామని కాదు. చదువు కోసం అతను దూరం వెళ్లడంతో, నేను పాపతో అమ్మవాళ్ల దగ్గరే ఉంటూ పీజీ పూర్తి చేశా. ఇటీవల నా భర్త చదువు పూర్తి చేసి వచ్చాడు. పై చదువుల కోసం అమెరికా వెళుతున్నాడు. నేను, పాప కూడా అతనితో వెళుతున్నాం. కానీ ఏదో భయం. మొదటి నుంచీ మా ఇద్దరి మధ్య చిన్న చిన్న గొడవలు! ఇన్నాళ్లూ పెద్దగా కమ్యూనికేషన్ లేదు. నాకేమో ఉద్యోగం చేయాలని కోరిక. అంత దూరం వెళ్లాక అతను నేను ఉద్యోగం చేయడానికి అంగీకరించకపోతే? ఈ ఆలోచనలు నన్ను వెంటాడుతున్నాయి. ఈ బంధాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలో తెలియడం లేదు.

- షామిలి



వివాహమైన తొలి రోజుల్లో ఎంతగా ప్రేమానురాగాలు ఉంటాయో, అంతే కోపతాపాలూ ఉంటాయి. వాటినే భూతద్దంలో చూసి భయపడుతున్నారేమో ఆలోచించండి. మూడేళ్ళలో ఇద్దరి మధ్య మాటలు, ఉత్తరాలు అసలు లేకుండా ఉండవు కదా! అందులోనూ... పాప కూడా ఉందంటున్నారు. మీరన్నా, పాపన్నా అతనికి నిర్లక్ష్యం ఉంటే తనతో పాటు అమెరికా తీసుకెళ్ళడు. మీరు కూడా ఇన్నేళ్ళలో అతనికి దగ్గర కావడానికి ఏమీ ప్రయత్నించినట్లు లేదు. బహుశా ఇద్దరూ చదువులతో బిజీగా ఉండి ఉంటారు. ఇప్పటికైనా కలసి ఉండే అవకాశం వచ్చింది. లేనిపోని భయాలతో అది పోగొట్టుకోకండి. వెళ్లేలోపే ఇద్దరూ కూర్చొని మాట్లాడుకోండి. పోట్లాట ఇద్దరి మధ్య అగాధం సృష్టిస్తే, మంచి మాటలు వంతెనలా కలుపుతాయి. మీకు కూడా ఈ బంధం నిలవాలని ఉంది కాబట్టే తాపత్రయపడుతున్నారు. మీ భర్త ఉద్దేశం తెలియకుండా నిందించడం, భయపడటం అనవసరం. చదువు విలువ తెలిసిన వ్యక్తి కాబట్టి, ఆయన మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టరు. హాయిగా మీ భర్తతో వెళ్లి ఇద్దరి కలలూ సాకారం చేసుకోండి. ఆల్ ది బెస్ట్!

• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

ఫిట్‌నెస్

ఆ టైములోనూ చేయొచ్చు!

బహిష్టు సమయంలో వర్కవుట్లు చేయకూడదని చాలామంది అనుకుంటుంటారు. కానీ ఇది పూర్తిగా అపోహ మాత్రమే. క్రమం తప్పకుండా రోజూ చేసే వ్యాయామాలనే ఆ టైములో కూడా చేయవచ్చంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. పైగా ఇలా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్తున్నారు. బహిష్టు సమయంలో వ్యాయామాలు ఆడవాళ్లకు ఇబ్బంది కలిగిస్తాయనేది కేవలం అపోహ మాత్రమేనని స్పష్టంచేస్తున్నారు. అయితే రుతుస్రావం ఎక్కువగా ఉన్నప్పుడు హై ఇంటెన్సిటీ ట్రైనింగ్ లేదా హెవీ లిఫ్టింగ్‌లను చేయవద్దంటున్నారు.

ఎందుకంటే కొంతమంది మహిళలు ఆ టైములో కడుపులో తీవ్ర నొప్పితో బాధపడుతుంటారు. అసౌకర్యంగా ఫీలవుతుంటారు. కొందరు ఆడవాళ్లయితే ఆ సమయంలో వాటర్ రిటెన్షన్ సమస్యతో, గ్యాస్ సమస్యతో బాధపడుతుంటారు. అయితే వీటి కారణంగా బహిష్టు సమయంలో వ్యాయామాలు ఆపాల్సిన పని లేదు. రోజూ చేసే వ్యాయామాలనే ఆ టైములో చేసేటప్పుడు అలసటగా అనిపించినా, కడుపులో నొప్పిగా అనిపించినా... యోగా, రన్నింగ్, క్రీడలు ఆప్షన్స్‌ను అనుసరించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఆ సమయంలో వ్యాయామాలు చేయడం వల్ల బ్లడ్ లాస్ ఏమీ ఉండదంటున్నారు. ఒకవేళ వర్కవుట్ చేసేటప్పుడు కళ్లు తిరిగినట్టు ఉన్నా, నీరసంగా అనిపించినా తలను నేలకానిచ్చి పడుకుని, కాళ్లను పైకి పెట్టి కాసేపు అలాగే ఉంటే సాధారణ స్థితికి వస్తారని చెప్తున్నారు.

అయితే ఆ టైములో శరీరానికి అలవాటైన వ్యాయామాలను మాత్రమే చేయాలి. అంతేతప్ప చేసే వ్యాయామాల్లో తీవ్ర మార్పులు మాత్రం చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు.



స్ఫూర్తి

నింగిలో నిప్పుకణిక!

పైకి ఎగిరేటప్పుడు, దిగేటప్పుడే ఆ యుద్ధ విమానం వేగం గంటకు 340 కిలోమీటర్లు. అంతకంతకీ వేగం పెంచుకుంటూ, రాకెట్‌లా ఆకాశంలోకి దూసుకెళ్లి, గిరికీలు కొట్టే 'మిగ్ - 21 బైసన్' ఫైటర్ జెట్ నడపటం అంటే ఆషామాషీ కాదు. అలాంటిది ఆ విమానాన్ని 30 నిమిషాలపాటు...ఒంటరిగా నడిపి చరిత్ర సృష్టించింది అవనీ చతుర్వేది. ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ని నడిపిన మొట్టమొదటి భారతీయ మహిళగా గుర్తింపు పొందిన అవని విశేషాలు చాలానే ఉన్నాయి.



ఎప్పటికైనా ఆకాశంలో ఎగరాలనేది మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాకు చెందిన అవనీ చతుర్వేది చిన్నప్పటి కల. ఆ కల ఆమెతోపాటే పెరిగి పెద్దయింది. అయితే ఆ కల నిజమయ్యేదెలా? చదవాలనుకుంటున్నది కంప్యూటర్ ఇంజనీరింగ్. కానీ ఫైటర్ జెట్ నడపాలనేది కల. ఆ రెండు కోరికలు తీరాలంటే ఆ రెండు ప్రయత్నాలు సమాంతరంగా సాగాలి. అందుకే, రాజస్థాన్‌లోని బనస్థలి యూనివర్సిటీలో బిటెక్ చదువుతూనే, ఫ్లయింగ్ క్లబ్‌లో మెంబర్‌గా చేరింది. అలా శిక్షణ తీసుకుంటూనే, బిటెక్ ముగించి, 2014లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పరీక్ష పాస్సై, భారతీయ వైమానికదళంలో చేరిపోయింది.



అవని తండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తల్లి గృహిణి. అవని అన్నయ్య కూడా ఆర్మీ ఆఫీసరే! చిన్నప్పటి నుంచీ అన్నను ఆర్మీ దుస్తుల్లో చూసిన అవనికి అతనిలా ఆర్మీలో స్థిరపడాలనే కోరిక కూడా కలిగేదట. ఆ విషయం గురించి చెబుతూ...'మా అన్నయ్యే నాకు స్ఫూర్తి. తనని చూసినప్పుడల్లా ఆర్మీ వృత్తిలో స్థిరపడాలని అనిపిస్తూ ఉండేది. మరోపక్క, ఆర్మీలో వైమానికదళంలో చేరితే, విమానాలు నడపాలనే నా కలనూ నిజం చేసుకోవచ్చు. అందుకే, చదువు పూర్తవగానే ఆర్మీలో చేరిపోయాను' అంటూ చెప్పుకొచ్చింది అవని. ఫైటర్ జెట్ నడిపిన తొలి మహిళా పైలట్‌గా పేరు తెచ్చుకున్న వేళ ఆమె మాట్లాడుతూ....'ఫైటర్ పైలట్లను బట్టే ఏ వైమానికదళానికైనా పేరొస్తుంది. అలాంటి మంచి ఫైటర్ పైలట్ కావాలనేది నా కల. అన్నిటికంటే మంచి ఎయిర్‌క్రాఫ్ట్ నడపాలనేది నా ఆశయం' అంటూ చెప్పింది. అవనికి విమానాలు నడపటమే కాదు, బొమ్మలు గీయటం, వయొలిన్ కూడా వచ్చు. ఖాళీ సమయాల్లో చెస్ ఆడుతుందట. తన చిన్ననాటి కలను సాకారం చేసుకున్న అవనీ చతుర్వేది, 'ది బెస్ట్ ఫైటర్ పైలట్‌'గా గుర్తింపు పొందాలని కోరుకుందాం!

నవజీవనవేదం

లోపం లేని వారెవరు?

అసంతృప్తిని మనం మొదట్లోనే తుంచేయాలంటే ఎదుటి వ్యక్తిలో ఒక లోపం కనిపిస్తే, ఒక సంస్థలో ఎక్కడైనా లోపం కనిపిస్తే ఒక్కలోపంతోనే దాన్ని సరిపెట్టుకోవాలి. దానికి ఇంకొన్ని జోడించి పెంచొద్దు. అలా జోడించుకుంటూ వెళితే కొన్నాళ్లకు అవతలి వాడు నెత్తురు తాగే కసాయివాడిలా కనిపిస్తాడు. మనం ఏ ప్రదేశానికి వెళ్లినా, ఎవరింటికి వెళ్లినా, ఏ సంస్థలో పనిచేస్తున్నా, ఏ వ్యక్తితో కాపురం చేస్తున్నా అనేక విషయాల్లో ఇలాగే ఆలోచిస్తే చాలా బాగుంటుంది. 'ఆ ఒక్క లోపమే కదా, సరిచేసుకుంటాడులే! మిగతా విషయాల్లో రత్నం అని అనుకుంటే చాలు. భార్య-భర్త, ఉద్యోగి-యజమాని ఇలా దోషాన్వేషణ మానేసి, ఇన్ని సుగుణాలు ఉన్నప్పుడు ఆ ఒక్క దోషాన్ని తట్టుకోలేమా! అని సర్దుకోవాలి.

**అనన్త రత్న ప్రభవస్య యస్య హిమం న సౌభాగ్య విలోపి జాతమ్
ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీన్దోః కిరణేష్వివాఙ్కః (కాళిదాసు 'కుమారసంభవం' 1-3)**

'కిరణాలతో వెన్నెల కురిపించే చంద్రుని అనేకానేక సుగుణాల ముందు అతనికున్న చిన్న మచ్చ లెక్కలోకి రాదు. అలాగే ఎంతో విలువైన రత్నరాశులెన్నిటికో నెలవైన హిమవంతుడి గొప్పతనానికి, అతనిపైనున్న మంచు అడ్డుకాదు.'

సృష్టి రహస్యాన్ని తెలుసుకుంటే దోషాన్వేషణ అనే భావన మనలో తొలగిపోతుంది. సంపూర్ణంగా దుర్మార్గుడు అనే మనిషిని మనం చూడలేం. అలాగే సంపూర్ణంగా గుణవంతుడైన వ్యక్తినీ చూడలేం! ఎంతటి మహాపురుషుడినైనా చూడండి! ఎంతటి అవతార పురుషుడి పేరైనా చెప్పండి! వారికి వ్యతిరేకంగా గ్రంథాలు రాసిన వారు కూడా ఉన్నారు. శ్రీరామచంద్రుణ్ణి అంగీకరించలేకపోయిన వారూ ఉన్నారు. గాంధీ సిద్ధాంతాలను ఒప్పుకోలేక పోయిన వారూ ఉన్నారు. లోపం లేని వాడు లోకంలో ఉండడు. ఎందుకంటే - సృష్టి రహస్యమే అది. దాన్ని కూడా కాళిదాసు 'కుమారసంభవం'లో ఇలా చెబుతాడు.

పార్వతి తపస్సు చేయడానికి వెళుతుంటే ఆ వనంలో పుష్పాలన్నీ వికసించి ఉన్నాయట. రకరకాల వర్ణాలతో ఆ ప్రాంతమంతా వెలిగిపోతోందట. అందులో కొండగోగు పువ్వు చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. అందులోనూ ఒక లోపం కనిపించిందట.

**వర్ణప్రకర్షే సతి కర్ణికారం దునోతి నిర్గన్ధతయా స్మ చేతః
ప్రాయేణ సామగ్ర్యవిధౌ గుణానాం పరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః (3-28)**

'ఈ కొండ గోగు పువ్వును చూస్తుంటే ఎంత ఆనందం కలుగుతోందో, అంత దుఃఖం వస్తోంది. దాని రంగు చూస్తే చాలా ఆకర్షణీయంగా ఉంది. కానీ వాసన లేదు. బ్రహ్మదేవుడు సుగంధం కూడా పెడితే బాగుండేది కదా!'

భర్తలో ఒక లోపం కనిపించింది. ఎన్నో మంచి సుగుణాలున్నాయి. కోపమొక్కటే ఆయనలో ఉన్న లోపం. ఏం సర్దుకోలేవా? సృష్టిలో లోపం లేనిది లేదు. వ్యక్తుల మధ్య ఉండే అసంతృప్తులు, ఉద్యోగాల్లో ఉండే అసంతృప్తి, సంసారంలో ఉండే అసంతృప్తి పోవాలంటే ఈ విషయం అవగాహన చేసుకోవాలి. లోకమంతా ఎలా ఉంటుందీ అంటే ఒక యోగి ఆత్మకథలో మహాశయుడు ఇలా చెబుతాడు. ఈ మధ్యనే చదివాను. ఇసుక, పంచదార కలిసి ఉంటాయి. చీమ పంచదారను తీసుకుంటుంది. ఇసుకను వదిలేస్తుంది. నువ్వు చీమ నైపుణ్యాన్ని అలవాటు చేసుకో. ఇసుకను దొర్లిద్దామని ప్రయత్నం చేయకు. ప్రతి వ్యక్తి ఇసుక, పంచదార మిశ్రమంలాగే ఉంటాడు. మనకు కావాల్సిన పంచదార మనం తీసుకోవాలి. మనం భవనమే కట్టాలి అనుకుంటే ఇసుకే తీసుకోవాలి, పంచదార వదిలేయాలి. కాఫీ తాగాలంటే పంచదారే తీసుకోవాలి. ఇసుకతో తాగలేం. ఈ విషయాన్ని గ్రహిస్తే జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.



● డా. గరికిపాటి నరసింహారావు

శ్రీరమణకథామృతం

భగవాన్ సాక్షాత్కారం

(గత సంచిక తరువాయి)

[illegible]

● పింగళి సూర్యసుందరం

విజ్ఞానసారం



మంత్రం మననం

'మననాత్ త్రాయతే ఇతి మంత్రః'- మననం చేస్తూండడం వల్ల రక్షించేది మంత్రం. మంత్రం అనేది ఒక దేవతకు శబ్ద రూపం. మననం అంటే అదే పనిగా మంత్రాన్ని మానసికంగా వల్లె వేసుకోవడం! మంత్రాన్ని స్మరించుకోవడం కూడా మననమే! మంత్ర మననాన్ని భావంతో చెయ్యాలి. 'భావే చోప లబ్ధేః' అని బ్రహ్మసూత్రం. అంటే 'భావంలోనే దొరుకుతుంది' అని అర్థం. మంత్ర మననం, మంత్ర జపం మంత్ర యోగం అవుతాయి. మంత్ర యోగం దేవతతో సమన్వయాన్ని (సింథసిస్) ఇస్తుంది. 'తతు సమన్వయాత్' అని 'బ్రహ్మసూత్రం' చెబుతోంది. ఇక్కడ 'తత్' అని అన్నది పరమాత్మ అయిన బ్రహ్మన్‌ను ఉద్దేశించే అయినా, ఈ సమన్వయం (కో-ఆర్డినేషన్ కాదు) అన్నది ఉద్దేశించబడిన ఏ దేవతకైనా పొసుగుతుంది.

మూడు రకాల జపం!

మంత్ర జపాన్ని మాలతో చేస్తారు. లేదంటే చేతి వేళ్ల కణుపులతో లెక్కించుకుంటూ చేస్తారు. మంత్ర జపం మూడు రకాలు. 1. మానసిక జపం 2. ఉపాంశు జపం. 3. వైఖరీ జపం. మంత్రాన్ని మానసికంగా జపించడం 'మానసిక జపం' అవుతుంది. మంత్రాన్ని శబ్దించకుండా నోటితో అనుకుంటూ జపించడం 'ఉపాంశు' అవుతుంది. మంత్రాన్ని బయటకు వినిపించేట్లుగా ఉచ్చరిస్తూ జపించడం 'వైఖరీ జపం' అవుతుంది. [illegible]

మంత్రాలలో లింగ భేదాలు

నిజానికి [illegible]

సరిగ్గానే జపిస్తున్నామా?

[illegible]


● రోచిష్మాన్

మీకు తెలుసా?



సప్తాశ్వాలు ఇవీ!
సూర్యుడి రథానికి ఏడు గుర్రాలుంటాయి. వాటి పేర్లు గాయత్రి, బృహతి, ఉష్ణిక, జగతి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి. ఇవి వేదాలకు సంబంధించిన ఛందస్సుల పేర్లు కూడా.

ఉపదేశం



మనం సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే, పరిష్కారం దాని నుంచే వస్తుంది. ఎందుకంటే పరిష్కారం అనేది సమస్య నుంచి విడిగా ఉండదు.

● జిడ్డు కృష్ణమూర్తి

ధర్మపథం

కరుణతో సరిదిద్దాలి!

క్రూరంగా ప్రవర్తించిన వారిపై కూడా తన సహజ కారుణ్యాన్ని చూపించి, వారిలో మార్పు తీసుకువచ్చేవాడు బుద్ధుడు. జేతవనంలో ఎక్కువ కాలం నివసించాడు బుద్ధుడు. కోసల రాజధాని శ్రావస్తి నగర శివారులో జేతవనం ఉంది. బుద్ధ ప్రబోధాల ఫలితంగా రాజు ప్రసేనుడు, మిగిలిన రాజ ప్రముఖులు యజ్ఞయాగాది క్రతువుల్ని మానారు. దీనితో తమకు భుక్తి పోయిందని ఆగ్రహించిన పండిత పురోహితులు బుద్ధుణ్ణి అవమానపరచాలని పథకం వేసుకున్నారు.

దానికి చించిత అనే ఒక గణిక (వేశ్య లాంటి వనిత) సహాయం కోరారు. "కావలసినంత ధనం ఇస్తాం!" అని చెప్పి, ఏం చేయాలో అంతా చెప్పారు. ఇక, ఆ రోజు నుంచి చించిత జేతవనం వైపు ఉదయం, సాయంత్రం పోసాగింది. తెల్లవారుజామునే వెళ్ళి, ఉదయం పొద్దెక్కాక జేతవనం ముందు నుండి బయటికి వస్తూ ఉండేది.



[illegible]

● బొర్రా గోవర్ధన్

విశ్వాసానికి అదే సాక్ష్యం!

"మీరు చెడును చూస్తే చేతితో ఆపే ప్రయత్నం చేయండి. చేతితో ఆపే శక్తి లేకపోతే నోటితోనైనా దానిని ఆపే ప్రయత్నం చేయండి. నోటితో కూడా ఆపే శక్తి మీలో లేకపోయినట్టయితే కనీసం మనసులోనైనా ఆ చెడును అసహ్యించుకోండి. ఇది విశ్వాసానికి చివరి మెట్టు. కనీసం చెడును చూసి మీలో అసహ్యమైనా కలగకపోతే మీలో రవ్వంత కూడా విశ్వాసం లేనట్టే" అన్నారు మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహివసల్లం).

వివేకవంతుల లక్షణం

ప్రస్తుత సమాజంలో ఎటు చూసినా అసంఖ్యాకమైన చెడులు రాజ్యం చేస్తున్నాయి. అవినీతి, అక్రమాలు, హింసా దౌర్జన్యాలు, మద్యపానం, జూదం, వ్యభిచారం, భ్రూణహత్యలు, మానభంగాలు, డ్రగ్స్, అశ్లీల కార్యకలాపాలు సర్వసాధారణమైపోయాయి. నేల నలుచెరగులా [illegible] వ్యక్తం చేయాలి. చింత, విచారం కలగాలి కానీ 'ఈ సమాజం ఏమైపోతే నాకెందుకులే' [illegible]

సందేశం



హదీసు బోధ

చుట్టూ [illegible] దుర్వాసన రా[illegible]

● మహమ్మద్ ఉస్మాన్‌ఖాన్

దేవుడు... మన వెంటే!

తదుపరి అడుగు ఎక్కడ పడనున్నదో కూడా తెలియనంత కారుచీకటిలో నడవడానికి పూనుకోవడం దుస్సాహసమే!! అదీ తెలియని ప్రదేశంలో లేదా కారడవిలోనైతే ఎంతో ప్రమాదం కూడా! అలాంటప్పుడు ప్రయాణం ముందుకు సాగకపోవచ్చు. సాగినా గమ్యం చేర్చని తప్పుడు మార్గమూ కావచ్చు. మరో ప్రమాదం ఏంటంటే, ఈలోగా ఏ క్రూర జంతువో, విషనాగు బారినో బాటసారి పడవచ్చు. కానీ దావీదు చక్రవర్తి రాసిన 119వ కీర్తన- ఈ పరిస్థితుల్లో దేవుని సాయం ఏ విధంగా అందుతోందన్నది ప్రతి వచనంలోనూ వివరించే అతి సుదీర్ఘమైన బైబిలు భాగం. 'నీ వాక్యం నా పాదాలకు దీపం, నా తోవకు వెలుగై ఉంది' అంటాడు దావీదు (119:105). ఈ ఒక్క వాక్యంలో దావీదు చాలా కాలం పాటు కారుచీకటి లాంటి ప్రతికూలతలో సాగిన తన జీవితాన్ని, అంతటి ప్రతికూలతల[illegible]

దైవమార్గం



[illegible]

● సుశీల్ సందేశ్

నవ్య సకల

పేరెంటచ్

ఆసుపత్రుల భయం పోగొట్టాలి



కొంత మంది పిల్లలకు రక్తం అంటే భయం..... ఇంజెక్షన్ అంటే భయం. అందుకే ఆసుపత్రులను చూస్తే వాళ్లకు అంతులేని భయం. ఇలాంటి పిల్లలు రోగుల వద్దకు గానీ, ఆసుపత్రుల పరిసరాలకు గానీ వెళ్లాలంటే గడగడా వణికిపోతారు. తలిదండ్రులు కూడా, తమ పిల్లలకు అవంటే భయమని ఎప్పటికీ వాటికి దూరదూరంగానే ఉంచేస్తారు. ఎంత భయపడితే మాత్రం, ఏదైనా గాయమైనప్పుడో, మరేదైనా అనారోగ్యం చేసినప్పుడో ఆసుపత్రికి వెళ్లక తప్పదు కదా! నిజానికి రక్తాన్ని చూస్తేనో, సిరంజిని చూస్తేనో భయం కలగడం పూర్తిగా అర్థం లేనిది. ఎందుకంటే గాయపడటం లేదా అనారోగ్యం పాలుకావడం వంటివి ఎప్పుడో ఒకప్పుడు అందరికీ ఎదురయ్యేవే కదా! అందువల్ల పిల్లలను ఆ వాతావరణానికి ఎప్పటికీ దూరంగానే ఉంచాలనుకోవడం పెద్ద అపరాధమే అవుతుంది. ఒకవేళ అయిన వాళ్లెవరైనా ఆసుపత్రిలో పడితే, వెళ్లకుండా తప్పించుకోవచ్చేమో గానీ, తనే ఆసుపత్రిలో పడే పరిస్థితి వస్తే అప్పుడింక తప్పదు కదా! అనివార్యమై పోయి అప్పుడు గుండెలు బాదుకుంటూ వెళ్లడం కన్నా, అప్పుడో ఇప్పుడో ఆసుపత్రికి వెళ్లి రావడం అలవర్చుకుంటే మేలు కదా! కొంత మంది తలిదండ్రులేమో, ఆరోగ్యసూత్రాలన్నీ పక్కాగా పాటిస్తాం కదా! ఆసుపత్రులతో మాకేం పని?" అంటూ మాట్లాడతారు. కానీ, అనుకోని ప్రమాదాలు, ప్రత్యేకించి రోడ్డు ప్రమాదాలు ఇలాంటి వాటిల్లో ఎదుటి వారి తప్పులకు కూడా మనం బలి అయిపోతాం కదా! అప్పుడైనా వెళ్లాల్సిందే కదా! అయినా, ఆరోగ్యాన్ని చక్కదిద్ది, ఒక్కోసారి ప్రాణాలే నిలబెట్టే ఆసుపత్రులంటే గౌరవం, ప్రేమ కలగాలి గానీ, భయపడే పరిస్థితి ఎందుకు ఉండాలి? రక్తాన్ని చూస్తే భయం కలగడం ఏమిటి? రక్తమే కదా మనిషి ప్రాణాల్ని నిలబెట్టేది! అర్థం లేని ఇలాంటి నెగెటివ్ భావాల్ని పిల్లల మనసుల్లోంచి తొలగించి, వాటి పట్ల పాజిటివ్ భావన ఏర్పడేలా చేయడం తలిదండ్రుల బాధ్యత అవుతుంది. అందులో భాగంగా అప్పుడప్పుడు ఆ భయపడే ప్రదేశాల వద్దకే తీసుకు వెళుతుండాలి. ఈ విషయమై తలిదండ్రుల ప్రయత్నాలేవీ ఫలించకపోతే, ఎవరైనా మానసిక నిపుణుడి వద్దకు తీసుకు వెళ్లడమైనా చేయాలి.

మీకు మీరే డాక్టర్

మోదుగతో ఆరోగ్యం భేష్



- మోదుగ గింజలను నూరి లేపనంగా వేస్తే తెల్ల మచ్చలు (ల్యూకోడెర్మా), తామర (రింగ్‌వార్మ్) వ్యాధి తగ్గిపోతాయి.
- తాజా మోదుగ చెక్క రసాన్ని పూస్తే తెగిన గాయాలు తొందరగా మానతాయి.
- మోదుగ పూలను రాత్రివేళ చల్లటి నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఆ నీటిలో పటిక బెల్లం కలిపి తాగుతూ ఉంటే, మూత్రం మార్గం వెంట రక్తం పడటం తగ్గిపోతుంది.
- మోదుగ పూలను మెత్తగా నూరి పట్టిస్తే, దెబ్బలు, వాపులు తగ్గుతాయి.
- మోదుగ పూలను ఉడికించి గోరువెచ్చగా ఉన్నప్పుడు బొడ్డు పైన లేపనంగా వేస్తే మూత్రం సాఫీగా వెళుతుంది.
- మోదుగ వేరు పట్టను దంచి పాలతో కలిపి ప్రతి రోజూ తాగుతూ ఉంటే, లైంగిక శక్తి పెరుగుతుంది.
- మోదుగ గింజలను మెత్తగా నూరి ఆ ముద్దను బియ్యం కడిగిన నీళ్లతో సేవిస్తే పొట్టలోని పలురకాల క్రిములు నశిస్తాయి.

కౌన్సెలింగ్

మట్టి తినడం వల్లేనా ఇవన్నీ?



నా వయసు 24. నాకు 14 ఏళ్లు వచ్చేదాకా మట్టి తినే అలవాటు ఉండేది. అయినా ఏడాది క్రితం దాకా నాకు ఏ ఇబ్బందీ అనిపించలేదు. కాకపోతే ఇటీవలే ఒక్కొక్కటిగా పలు రకాల సమస్యలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, అప్పుడప్పుడు రెండు మూడు నిమిషాల పాటు, తల తిరుగుతున్నట్లు, చీకట్లు కమ్మినట్లు అనిపిస్తుంది. కాళ్లూ చేతులు లాగడంతో పాటు తిమ్మిర్లు కూడా వస్తాయి. ఈ మధ్య వెన్ను నొప్పి కూడా ఉంటోంది. వీటితో పాటు కడుపు ఉబ్బరం, మూత్ర విసర్జనలో మంట ఉంటున్నాయి. ఒళ్లంతా నొప్పిగానూ నీరసంగానూ ఉంటోంది. ఏ పని చేయడానికీ ఉత్సాహం ఉండడం లేదు. ఈ సమస్యలు మట్టితినడం వల్ల వచ్చినవేనా? మరేదనైనా కారణం ఉందా? నా సమస్యకు పరిష్కారం చెప్పండి.

- కె. రాజేశ్వర్, జగిత్యాల

ఏళ్ల పర్యంతం మట్టి తినే అలవాటు ఉన్న వాళ్లల్లో ఈ సమస్యలు తలెత్తడం సహజమే. మట్టిలో ఉండే సూక్ష్మక్రిములు, వీళ్ల కాలేయంలో, పేగుల్లో నివాసం ఏర్పరుచుకుంటాయి. ఇవి కాలేయంతో పాటు జీర్ణకోశం పైన కూడా దుష్ప్రభావాన్ని చూపుతాయి. ఈ స్థితి రక్త హీనతకు కూడా దారి తీస్తుంది. ఈ క్రమంలో కడుపు ఉబ్బరం సమస్య కూడా మొదలవుతుంది. మరికొందరిలో ఇది వెన్ను నొప్పికి కూడా కారణమవుతుంది. రక్త హీనత వల్ల సహజంగానే నీరసం, నిస్సత్తువా ఆవరిస్తాయి. ప్రస్తుతం వాయు విడంగ చూర్ణం, కరక్కాయ చూర్ణం సమపాళ్లలో కలిపేసుకుని, ఉదయం ఒకటిన్నర చెంచా, సాయంత్రం ఒకటిన్నర చెంచా నీటితో తీసుకోవాలి. దీనికి తోడు నవాయస చూర్ణం ఉదయం పావు చెంచా, సాయంత్రం పావు చెంచా మజ్జిగలో కలపి తాగాలి. ఇవి రక్తహీనత ను తగ్గించడం వల్ల నీరసం, నిస్సత్తువ కూడా తొలగిపోతాయి. అయినా ఒకసారి మల పరీక్ష, రక్త పరీక్ష చేయించండి ఆ రిపోర్టుల ఆధారంగానే పూర్తి స్థాయి చికిత్స సాధ్యమవుతుంది.

● **డాక్టర్ డి. విఠల్ రావు**
రిటైర్డ్ ప్రొఫెసర్
ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, హైదరాబాద్

త్రీ సుడోకు - 114

3				2	5	4		6
							3	
	6	4	9					
	2					7	6	
5			2		1			9
	1	9					2	
					4	9	5	
	5							
8		7	5	9				2

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 113 సమాధానం

[illegible]











విజయవంతమైన 3వ వారం MEMORABLE HIT...



దేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.15,5.45,9.15
Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
ఈశ్వర్ - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00
సంగీత - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

ప్రతిమ - కరీంనగర్
దేవి - జనగాం
రామకృష్ణ - షాద్‌నగర్
నటరాజ్ - నల్గొండ

వరంగల్
రాధిక 70 ఎ/సి - వరంగల్
అమృత ఎ/సి - హన్మకొండ
లక్ష్మి - మహబూబాబాద్
జయశ్రీ ఎ/సి - నర్సంపేట
ఊర్వశి ఎ/సి - భూపాలపల్లి
తిరుమల ఎ/సి - ములుగు
మెహర్ రంగ - పసర
లక్ష్మీశ్రీనివాస - ములుగు ఘన్‌పూర్

ఖమ్మం
వినోద 70 - ఖమ్మం
దుర్గ 70 - కొత్తగూడెం
ఉదయభాస్కర్ - భద్రాచలం
సాయి బాలాజీ - సత్తుపల్లి
వెంకటేశ్వర - పాల్వంచ
కళాంజలి ఎ/సి - ఇల్లందు
శాంతి - మధిర
రఘు పిక్చర్ ప్యాలెస్ - చర్ల
జగదాంబ - వెంకటాపురం

కరీంనగర్
తిరందాజ్ - కరీంనగర్
న్యూఅశోక - గోదావరిఖని
బాలాజీ ఎ/సి - జగిత్యాల
విమల్ 70 ఎ/సి - సిరిసిల్ల
సంగీత 70 ఎ/సి - పెద్దపల్లి
మురళీ డీలక్స్ - జమ్మికుంట
శ్రీ రాజరాజేశ్వరి - వేములవాడ

నిజామాబాద్
విజయ - నిజామాబాద్
రాంప్రతాప్ - నాగిరెడ్డిపేట్
ప్రియా 35 - కామారెడ్డి

మహబూబ్‌నగర్
తిరుమల కాంప్లెక్స్ - మహబూబ్‌నగర్
శ్రీనివాస ఎ/సి - వనపర్తి
శ్రీనివాస ఎ/సి - గద్వాల్
బాబా 70 - నారాయణపేట
శ్రీనివాస 70 ఎంఎం- జడ్చర్ల
శ్రీసాయిరాం - అచ్చంపేట

రవి ఎ/సి - నాగర్‌కర్నూలు
నేషనల్ ఎ/సి - కల్వకుర్తి
శివసాయి 70 - ఐజ
వెంకటేశ్వర - కొల్లాపూర్
పరమేశ్వరి - కొత్తకోట
రాఘవేంద్ర ఎ/సి - మక్తల్
రాఘవేంద్ర ఎ/సి - దేవరకద్ర
సత్యనారాయణ - మద్దూర్

నల్గొండ
వెంకటేశ్వర - మిర్యాలగూడ
కిషోర్ ఎ/సి - సూర్యాపేట
రంగ 70 ఎ/సి - కోదాడ
వసుంధర - భువనగిరి
శ్రీనివాస - హుజూర్‌నగర్
వెంకటేశ్వర - దేవరకొండ
సత్యనారాయణ - చండూర్
సాయిరాం - పోచంపల్లి
వెంకట్రామ - నేరేడుచర్ల

ఆదిలాబాద్
మహేశ్వరి - ఆదిలాబాద్
శ్రీనివాస ఎ/సి - మంచిర్యాల
నారాయణ 70 - నిర్మల్
బాలాజీ 70 - బెల్లంపల్లి

మెదక్
సినీమాక్స్ 70 ఎ/సి - మెదక్
సీతారామ - సిద్దిపేట
రుక్మిణి ఎ/సి - సంగారెడ్డి
మహేశ్వరి - జహీరాబాద్
సంతోష్ 70 ఎ/సి - గజ్వేల్
సాయిరామ్ - రామాయంపేట
సువర్ణ 70 - నారాయణఖేడ్
వెంకటేశ్వర - తూప్రాన్

రంగారెడ్డి
చంద్ర ఎ/సి - తాండూర్
భవాని 70 ఎ/సి - పరిగి

విజయవంతమైన 2వ వారం

విశ్వదాభిరామ ప్రేక్షకులు గెలిచారురా మామ



సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00

భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
రాజధాని కాంప్లెక్స్ దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00


PRASADS 10.30,3.20,8.30,11.00	దిల్‌సుఖ్‌నగర్ 11.30,8.30,11.00
PVR మాదాపూర్ 10.55,1.30,7.35,10.10	ఇ.సి.ఐ.ఎల్ 2.15,6.00,9.15
PVR బంజారాహిల్స్ 11.10,4.40,11.00	ASIAN ఉప్పల్ 10.40,1.40,7.35,10.05
PVR పంజాగుట్ట 11.20,5.20,7.45,10.20	మూసాపేట్ 1100,2.15,6.00,9.30
PVR 11.40,2.15,4.50,7.25,10.00	ASIAN కూకట్‌పల్లి 10.50,1.50,7.40,10.30
PVR ఐకాన్ 12.15,7.15,10.00	ASIAN అత్తాపూర్ 1.50,7.50,10.20
PVR పంజాగుట్ట 11.15,2.20,4.55,7.25,11.00	ASIAN RADHIKA కాప్రా 1.40,7.40,10.25
INOX బంజారాహిల్స్ 12.05,2.30,7.45,10.10	ASIAN దిల్‌సుఖ్‌నగర్ 11.00,6.00,9.00
INOX కాచిగూడ 11.45,2.10,7.25,9.50	Cinetown మియాపూర్ 11.30,6.15,9.30
Cinemas AMEERPET అమీర్‌పేట్ 11.10,4.50,10.25	MULTIPLEX ఎల్బీనగర్ 11.00,3.45,7.15,8.35
Cinemas శామీర్‌పేట్ 11.10,2.00,7.40	ASIAN చింతల్ 11.15,6.15,9.15
Cinépolis కూకట్‌పల్లి 11.15,1.50,7.30,10.00	ASIAN హన్మకొండ 1.40,7.25,10.15
Cinépolis మల్కాజ్‌గిరి 11.30,2.00,7.00,9.30	GEETHA ASIAN నిజామాబాద్ 11.00,1.50,7.40
Cinépolis అత్తాపూర్ 11.25,2.15,8.05	ప్రతిమ ఎ/సి - కరీంనగర్
TIVOLI సికింద్రాబాద్ 1.15,7.15,10.00	వరంగల్ 12.45,3.50,7.30,10.15
Cine Planet కొంపల్లి 10.40,1.15,7.20,10.10	

రామ్ 70 - వరంగల్
అశోక - హన్మకొండ
కృష్ణ కళామందిర్ - జనగాం
తిరుమల ఎ/సి - కరీంనగర్
ఊర్వశి ఎ/సి - గోదావరిఖని
దుర్గ కెఎం - జగిత్యాల
నటరాజ్ - సిరిసిల్ల
(2 రోజులు మాత్రమే)
నటరాజ్ డీలక్స్ - నిజామాబాద్

విఆర్‌డిఆర్ ఎ/సి - సూర్యాపేట్
వెంకటేశ్వర ఎ/సి - నల్గొండ
(2 రోజులు మాత్రమే)
శకుంతాల ఎ/సి - కోదడా
శ్రీనివాస ఎ/సి - ఖమ్మం
గోపాలకృష్ణ - భద్రాచలం
లక్ష్మి ఎ/సి - మంచిర్యాల
వెంకటేశ్వర ఎ/సి - మహబూబ్‌నగర్

KFC ENTERTAINMENT RELEASE

విజయవంతమైన 4వ వారం



శాంతి 70 - నారాయణగూడ
11.00.2.00,6.00,9.00

శివపార్వతి 70 ఎ/సి - కూకట్‌పల్లి 2.30,6.15,9.30
వెంకటాద్రి ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీలత 70 ఎ/సి - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15
సూపర్ ఎ/సి - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00

CINEPRIDE 6.15.9.45	PVR పంజాగుట్ట 4.20 PM	ASIAN ఉప్పల్ 10.30 PM
T 6.15,9.15	Cinépolis అత్తాపూర్ 5.05PM	ASIAN కూకట్‌పల్లి 4.30PM
PRASADS 11.00AM	Cine Planet కొంపల్లి4.45PM	MULTIPLEX 10.00 PM
PVR కూకట్‌పల్లి1.10PM	GLOBAL CINEMAS RELEASE	GLOBAL CINEMAS

Super Hit ! Super Hit !!

విజయవంతమైన 50వ రోజు



సప్న 35 ఎంఎం ఎ/సి అబిడ్స్ 11.30AM
శివశక్తి 70-తాండూర్

నేడే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00

అర్జున్ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
కోణార్క్ 70 ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
మంజు 70 ఎ/సి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00


PRASADS ఎ/సి - 12.05,11.10	INOX కాచిగూడ - 11.30,7.45	దిల్‌సుఖ్‌నగర్ - 2.30,10.30	Cinetown మియాపూర్ 11.15,6.15
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	Cinemas అమీర్‌పేట్ 2.00,7.40	T ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 11.15,6.15	MULTIPLEX 11.15,1.50,4.30,10.00
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	Cinemas శామీర్‌పేట్ 4.50,10.30	ASIAN ఉప్పల్ 10.35,7.25,10.15	ASIAN చింతల్ 11.30,2.30,6.30
PVR పంజాగుట్ట - 11.00,7.40	Cinépolis కూకట్‌పల్లి - 11.25,4.15	CINEPRIDE మూసాపేట్ 11.15,2.30,6.15,9.15	ASIAN హన్మకొండ 10.10,1.25,7.15
PVR పంజాగుట్ట - 11.10,5.05,10.50	Cinépolis మల్కాజ్‌గిరి - 11.30,7.00	ASIAN కూకట్‌పల్లి 10.40,1.30,7.20	GEETHA ASIAN నిజామాబాద్ 10.50,1.40,7.20
PVR కూకట్‌పల్లి - 10.10,4.10,10.40	Cinépolis అత్తాపూర్ - 11.30,7.40	ASIAN అత్తాపూర్ 10.30,4.35,7.40	కరీంనగర్ - 2.10,7.40,10.30
PVR హైటెక్‌సిటి - 12.15,7.45	TIVOLI సికింద్రాబాద్ - 11.00,4.20	ASIAN RADHIKA కాప్రా 10.45,4.30,7.20	12.50,4.00,6.50,10.10
INOX బంజారాహిల్స్ - 12.10,5.40,10.10	Cine Planet కొంపల్లి 10.30,7.45,10.40	ASIAN దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.00,6.15	

మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
శ్రీకృష్ణ - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
ఇంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
జ్యోతి - ఆర్సీపురం 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.15,2.15,6.15,9.15
స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,2.15,6.00,9.00
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.15,2.15,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30
శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
లక్ష్మి కళామందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
శ్రీరామ - బహదూర్‌పుర 11.30,2.30,6.30,9.30
సాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00

సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి - ఐడిఎ బొల్లారం 11.00,2.00,6.00,9.00
రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
శివరంజిని డీలక్స్ - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
శారద 70 ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00
కళ్యాణి - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
గణేష్ - శంషాబాద్ 11.15,2.15,6.00,9.00
కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00
వెంకటసాయి 70 - కీసర 11.00,2.00,6.00,9.00
రంగా 70 - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00

జెమిని కాంప్లెక్స్ - వరంగల్	ప్రియ - కామారెడ్డి	వెంకటేశ్వర - వనపర్తి	సుజన - చిట్యాల	ఆనంద్ - భూపాలపల్లి	లక్ష్మీశ్రీనివాస - మధిర
వెంకటరామా - వరంగల్	తిరుమల - నిర్మల్	లక్ష్మి 70 - శంకర్‌పల్లి	వెంకటేశ్వర - వలిగొండ	వెంకటేశ్వర - కమాన్‌పూర్	తారా సినిమా - మొత్కూరు
విజయ - హన్మకొండ	వెంకటేశ్వర - సిద్దిపేట	సాయికృష్ణ - పరిగి	లక్ష్మి - యాదగిరిగుట్ట	శివరామకృష్ణ - వేములవాడ	నారాయణ - హసన్‌పర్తి
ఆదిత్య 70 - ఖమ్మం	సితార - సంగారెడ్డి	మోహన్ - జహీరాబాద్	మల్లేశ్వరి - తిరుమలగిరి	శ్రీనివాస - చొప్పదొండి	పద్మనాభ - రాయచూర్
వెంకటేశ్వర - కరీంనగర్	శ్రీనివాస - కోదాడ	యాదగిరి - గజ్వేల్	లక్ష్మి 70 ఎ/సి - మాల్	రామకృష్ణ - బెల్లంపల్లి	సందీప్ - గంగావతి
శ్రీదేవి - నిజామాబాద్	మనోజ్ - దేవరకొండ	స్వర్ణ కెఎం - జనగాం	శ్రీనివాస - సత్తుపల్లి	తిరుమల - సిసి నర్సాపూర్	వెంకటేశ్వర - ఏటూరినాగారం
నటరాజ్ - ఆదిలాబాద్	పరమేశ్వరి - కొత్తగూడెం	కాకతీయ - పరకాల	సీతారామ - ఇల్లందు	లక్ష్మి - ఖానాపూర్	మనోహర్- నారాయణపేట్
బాలాజి - మహబూబ్‌నగర్	విజయభాస్కర్ - భద్రాచలం	భవాని - కాజిపేట	శాంతి - పాల్వంచ	లక్ష్మి 70 - సిరిసిల్ల	సత్యలక్ష్మి - అచ్చంపేట్
సాయిదత్త కాంప్లెక్స్ - మెదక్	లక్ష్మి 70 - తాండూర్	వెంకటరామ - మహబూబాబాద్	శ్రీదేవి 70 - చెర్ల	కిన్నెర 70 - కోరుట్ల	సినీమ్యాక్స్ - వికారాబాద్
తిరుమల - నల్గొండ	శ్రీరామ - జగిత్యాల	మహేశ్వరి - సదాశివపేట	సత్యభాస్కర్ - మణుగూరు	వెంకటేశ్వర - గద్వాల్	శరణబస్వేశ్వర - సింధనూర్
శ్రీనివాస - మిర్యాలగూడ	సాయికృష్ణ - మెట్‌పల్లి	సంతోష్ - రామాయంపేట	రామకృష్ణ - తొర్రూర్	వెంకటేశ్వర - నకిరేకల్	అపర్ణ చిత్రమందిర్ - మాన్వి
నవ్య - సూర్యాపేట	హరిహర మహల్ - జమ్మికుంట	సాయి డీలక్స్ - నర్సాపూర్	సూర్య కెఎం - నెక్కొండ	వెంకటేశ్వర - నారాయణఖేడ్	కనకాంచల్ - కొప్పల్
శ్రీనివాస - గోదావరిఖని	సాయిబాబా - షాద్‌నగర్	మణికంఠ - చేవెళ్ళ	శాంతి - మరిపెడ	ఓంకార్ - భువనగిరి	పద్మావతి ఎ/సి - కర్టగి
వెంకటేశ్వర - మంచిర్యాల	వెంకటరామ - జడ్చర్ల	శ్రీనివాస - చౌటుప్పల్	అరవింద్ కెఎం - నర్సంపేట	వెంకటదుర్గ - అశ్వారావుపేట	బస్వరాజ్ - కుస్తగి

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00

CINEPRIDE లక్ష్మీకళ సినీప్రైడ్ మల్టీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్ 2.45PM
MULTIPLEX BVK L.B.NAGAR BVK విజయలక్ష్మి మల్టీప్లెక్స్ ఎ/సి - ఎల్.బి.నగర్ 4.40PM
లక్ష్మి 70 ఎంఎం ఎ/సి - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30

PRASADS ఎ/సి - 10.00AM,5.45PM	Cinépolis KUKATPALLY కూకట్‌పల్లి 4.35PM	ASIAN MULTIPLEX ఎ/సి - కూకట్‌పల్లి 7.30PM
PVR మాదాపూర్ - 2.10PM	Cinépolis మల్కాజ్‌గిరి 1.20PM	ASIAN ఎ/సి - అత్తాపూర్ 1.45PM
PVR బంజారాహిల్స్ - 11.00AM	Cinépolis ATTAPUR అత్తాపూర్ 5.10PM	ASIAN RADHIKA రాధికా - కాప్రా 1.30PM
PVR ఎ/సి -పంజాగుట్ట 1.55PM	TIVOLI ఎ/సి-11.15AM,5.00PM	ASIAN - హన్మకొండ 4.50PM
PVR L&T - పంజాగుట్ట 8.00PM	Cine Planet ఎ/సి - కొంపల్లి 1.45PM	GEETHA ASIAN నిజామాబాద్ - 4.20PM
PVR కూకట్‌పల్లి - 10.30PM	దిల్‌సుఖ్‌నగర్ - 7.45PM	- కరీంనగర్ 5.00PM
PVR ICON - మాదాపూర్ 3.15PM	T ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ - 6.15PM	ఎ/సి వరంగల్ - 12.15PM
INOX బంజారాహిల్స్ - 5.10PM	ASIAN సినీస్క్వేర్ - ఉప్పల్ 1.45PM	
INOX ఎ/సి కాచిగూడ - 4.55PM		
Cinemas AMEERPET ఎ/సి - అమీర్‌పేట్ 1.50PM		

నర్తకి 70 - ఖమ్మం	అన్నపూర్ణ - హుజూరాబాద్	దేవి 70 ఎ/సి - జడ్చర్ల	వెంకటేశ్వర - నిర్మల్	భవాని - కొత్తకోట
సాయికృష్ణ - కరీంనగర్	బృందావన్ - ఆర్మూర్	పార్థసారథి - కల్వకుర్తి	అనురాగ్ - జహీరాబాద్	వెంకటేశ్వర - చేవెళ్ళ
జయ డీలక్స్ - పరకాల	రంగ 70 - వనపర్తి	కృష్ణప్రియ - కోదాడ	శారద 70 - పరిగి	గణేష్ - ఆదిలాబాద్
వెంకటేశ్వర - తొర్రూర్	నవరంగ్ - గద్వాల్	కేజేఆర్ సినిమా - భువనగిరి	లక్ష్మి 70 - అచ్చంపేట	గోపాలకృష్ణ - భద్రాచలం
లక్ష్మి 70 - మరిపెడ				



ధన్సిక

సినిమా ధన్సికది.. అవార్డులు ఎనిమిది!

ఒకమ్మాయి తమిళనాడు నుంచి పశ్చిమబెంగాల్‌కి వెళ్తుంది. అక్కడ గత్యంతరం లేని పరిస్థితుల్లో వేశ్యగా మారుతుంది. ఆ క్రమంలో ఏం జరిగింది? అనే కథతో రూపొందిన చిత్రం 'సినమ్'. ధన్సిక కీలక పాత్రలో నటించారు. 'కబాలి'లో రజనీకాంత్ కుమార్తెగా నటించిన నాయిక ధన్సిక. ప్రస్తుతం తెలుగులో 'వాలుజడ'తో పాటు మరో చిత్రంలో నటిస్తున్నారు. ధన్సిక నటించిన 'సినమ్' చిత్రాన్ని నేసన్ క్రియేషన్స్ పతాకంపై తిరునేసన్ రూపొందించారు. జీవీ ప్రకాశ్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రానికి కోల్‌కతాలో జరిగిన అంతర్జాతీయ సంప్రదాయ చిత్రోత్సవాల్లో ఎనిమిది అవార్డులు వచ్చాయి. వారం రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన సంప్రదాయ అంశాలతో రూపొందిన వందలాది చిత్రాలు పోటీపడ్డాయి. తమిళం నుంచి 'సినమ్' పోటీలో నిలదొక్కుకుని ఎనిమిది అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం.



చెన్నైలోని ఓ హోటల్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో పిల్లలతో మీనా, రంభ సరదాగా గడిపారు. ఆ ఫొటోలను ఫేస్‌బుక్‌లో మీనా పోస్ట్ చేశారు.



కల నెరవేరింది

- లారెన్స్

"తల్లి జన్మనిస్తుంది. గురువు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. నా జీవితంలో గురువులకు నేను అత్యంత ప్రాధాన్యమిస్తాను" అని అన్నారు రాఘవ లారెన్స్. చెన్నై తిరుముల్లైవాయల్‌లో ఆయన రాఘవేంద్రస్వామి బృందావనం కోవెలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఆ గుడిలో గురువారం సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీనికి సంబంధించి లారెన్స్ మాట్లాడుతూ "నాకు సాయిబాబా, రాఘవేంద్రస్వామి అంటే భక్తి ఎక్కువ. రాఘవేంద్రస్వామి గుడిలో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఈరోజుతో నా కల నెరవేరింది. ఇద్దరు గురువులను ఒకేచోట చూస్తుంటే ఆత్మసంతృప్తి చెందుతోంది" అని తెలిపారు.



ఆ తేడా గమనించండి

- సోనాక్షి సిన్హా

"టీనేజ్‌లో ఉండగా నా బరువు 90 కేజీలు. చాలామంది ఏడిపించేవారు. ఇండస్ట్రీలోకి వచ్చాక 60 కిలోలకు తగ్గాను. బాడీ షేమింగ్ చెయ్యడం నాకు నచ్చేది కాదు. అందుకే సీరియస్‌గా తీసుకుని వెయిట్ తగ్గా" అని బాలీవుడ్ బ్యూటీ సోనాక్షిసిన్హా అన్నారు. తన ఫిట్‌నెస్ గురించి ఆమె మాట్లాడుతూ "గతే ఏడాది రెండు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటం వల్ల వర్కవుట్స్ జోలికి వెళ్లలేదు. రెగ్యులర్ డైట్‌తోపాటు ఇష్టమొచ్చినట్లు తినేసేదాన్ని. ఆ సినిమాల్లో పాత్రలకు తగ్గట్టు బాడీ మెయిన్‌టెన్ చేశా. ఇప్పుడు అలా కాదు. స్లిమ్ అవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఏది పడితే అది తినడం తగ్గించా. జంక్ ఫుడ్ జోలికి అస్సలు వెళ్లడం లేదు. అమ్మ తయారు చేసిన ఆహారం మాత్రమే తీసుకుంటున్నా. ఇప్పుడు నేను చాలా స్లిమ్‌గా ఉన్నా. 'దబాంగ్' సినిమాకు ఇప్పటికీ నాలో తేడా గమనించవచ్చు" అని తన ఫిట్‌నెస్ గురించి తెలిపింది.

పోటీ తప్పింది!

ఏప్రిల్ 20న మహేశ్... మే 4న అల్లు అర్జున్


మహేశ్‌బాబు


అల్లు అర్జున్

మహేశ్ నటిస్తున్న 'భరత్ అనే నేను'. అల్లు అర్జున్ నటిస్తున్న 'నా పేరు సూర్య' చిత్రాలు ఎట్టిపరిస్థితుల్లో ఒకేరోజున .. అంటే ఏప్రిల్ 26న విడుదలవుతాయన్న వార్త ఆయా హీరోల అభిమానుల్లో ఉత్సాహం నింపినా, ఈ వార్త విని పరిశ్రమలోని పెద్దలు మాత్రం ఆందోళన చెందారు. ఇది పరిశ్రమకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదనీ, దీని వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ అనే అభిప్రాయంతో ఈ పోటీనీ నివారించడానికి దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు రంగంలోకి దిగారు. ఈ రెండు చిత్రాల నిర్మాతలతో సమావేశమై వారికి నచ్చజెప్పారు. ఈ రెండు చిత్రాల మధ్య కనీసం 15 రోజుల గ్యాప్ ఉండేలా చూడమని కోరడంతో చివరకు నిర్మాతలు అందుకు సరేనన్నారు. హీరోలిద్దరూ ఈగోలకు పోకుండా నిర్మాతలు తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పడంతో మహేశ్, అల్లు అర్జున్ మధ్య పోటీ తప్పింది. నిజంగా తెలుగు చిత్రపరిశ్రమలో ఇది శుభ పరిణామమే. ఈ సందర్భంగా నిర్మాతలు డి.వి.వి. దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు మాట్లాడుతూ 'మా రెండు చిత్రాల మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలన్న ఉద్దేశ్యంతో 'ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను' , మే 4న 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని విడుదల చేయడానికి నిర్ణయించాం. పరిశ్రమలో ఆరోగ్యకరమైన వాతావర ణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకొన్న ఈ నిర్ణయానికి సపోర్ట్ చేసిన మా హీరోలకు, దర్శకులకు కృతజ్ఞతలు' అని తెలిపారు. పోటీ నివారించడానికి రంగంలోకి దిగిన పెద్దలు దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు మాట్లాడుతూ 'రెండు భారీ చిత్రాలు ఒకేసారి విడుదలకు సిద్ధమైనప్పుడు వాటి మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండటం పరిశ్రమకు చాలా మంచిది. సంక్రాంతి సీజన్‌ను మినహాయిస్తే మిగిలిన అన్ని సందర్భాల్లోనూ ఇలా రెండు వారాలు గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చేయడం వల్ల పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది' అన్నారు.

'దాగుడు మూతలు' తర్వాత
'సీటీ మార్'...



అల్లు అర్జున్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'దువ్వాడ జగన్నాథమ్' సినిమా ఎంత హిట్టో... అందులోని 'సీటీ మార్.. సీటీ మార్... సీటీ మార్' పాట కూడా అంతే హిట్! థియేటర్లలో మాస్ ప్రేక్షకుల చేత స్టెప్పులు వేయించిన ఆ పాటలోని పదాలు 'సీటీ మార్' టైటిల్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో ఒక చిత్రం రానుంది. ఇటీవల 'జవాన్' చిత్రాన్ని నిర్మించిన అరుణాచల్ క్రియేషన్స్ అధినేత కొమ్మలపాటి కృష్ణ ఈ చిత్రానికి నిర్మాత. ఇందులో వరుస విజయాల్లో ఉన్న అగ్ర కథానాయకుడు నటించనున్నారట! అయితే... ఈ చిత్రం కంటే ముందు హరీశ్ శంకర్ 'దాగుడు మూతలు' చేస్తారు. 'దువ్వాడ జగన్నాథమ్' తర్వాత ఆయన చేయనున్న చిత్రమిదే. ప్రస్తుతం 'దాగుడు మూతలు' చిత్రపనుల్లో నిమగ్నమైన హరీశ్ ఆ తర్వాత 'సీటీ మార్' వివరాలు ప్రకటించనున్నారు.

వంశధార క్రియేషన్స్ చిత్రం షురూ


నవీన్ శొంఠినేని, బెల్లంకొండ శ్రీనివాస్, వినాయక్

బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా శ్రీనివాస్ దర్శకత్వంలో వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని (నాని) నిర్మిస్తోన్న చిత్రం ప్రారంభోత్సవం గురువారం ఉదయం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి గుజరాల ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు, దర్శకుడు శ్రీవాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్‌నిచ్చారు. తెలంగాణ ఎఫ్.డి.సి. ఛైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు గౌరవ దర్శకత్వం వహించారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మహేందర్ రెడ్డి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. నిర్మాత మాట్లాడుతూ "మా సంస్థ నుంచి వస్తోన్న తొలి సినిమా ఇది. వైవిధ్యంగా ఉంటుంది" అని అన్నారు. హీరో మాట్లాడుతూ "నవీన్‌తో కలిసి సినిమా చేద్దామని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఇన్నాళ్లకు కుదిరింది. తెలుగు సినిమా పరిశ్రమలో ఇలాంటి కథను ఇప్పటిదాకా ఎవరూ చూడలేదు. చోటాగారితో 'అల్లుడు శీను' తర్వాత ఈ సినిమాకు పనిచేయడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "రొమాంటిక్ థ్రిల్లర్ ఇది. మార్చి 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతంది. ఇద్దరు నాయికలుంటారు" అని చెప్పారు. సినిమా పెద్ద విజయం సాధించాలని యరపతినేని శ్రీనివాసరావు అభిలషించారు. మంచి ఔట్‌పుట్ ఇవ్వడానికి కష్టపడతామని కెమెరామేన్ చోటా.కె.నాయుడు అన్నారు. ఈ చిత్రానికి మాటలు: కేశవ్ పప్పల, ఎడిటర్: ఛోటా.కె.ప్రసాద్, ఆర్ట్: చిన్నా, సంగీతం: తమన్.ఎస్, ఫైట్స్: స్టన్ శివ, వెంకట్, సహ నిర్మాత : చాగంటి శాంతయ్య.

ఇక మొహమాటాల్లేవ్!

- శ్రీకాంత్



"ఇకపై మోహమాటం కోసం సినిమాలను అంగీకరించను. స్క్రిప్ట్ పక్కాగా నచ్చితేనే సినిమాలు చేస్తాను. విలన్‌గా నటించమని చాలా మంది అడిగారు. కానీ ఇప్పటికిప్పుడే ఆ దారిలో పోదలచుకోలేదు" అని అన్నారు హీరో శ్రీకాంత్. ఆయన నటించిన 'రారా' సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దానికి సంబంధించి శ్రీకాంత్ మాట్లాడుతూ "దెయ్యాలకు, మనుషులకు మధ్య జరిగే కథ ' రా రా'. ఆద్యంతం కొత్తగా ఉంటుంది. హారర్ జోనర్‌లో సాగుతుంది. గ్రాఫిక్స్ కూడా ఉంటాయి. ఈ చిత్ర దర్శకుడికీ, నిర్మాతకు మధ్య భేదాభిప్రాయాలు రావడంతో, మరో పేరున్న దర్శకుడు చిత్రాన్ని పూర్తి చేశారు. ముందున్న దర్శకుడికి, నిర్మాతలకు మధ్య సయోధ్య కుదుర్చుదామని ప్రయత్నించాను. కానీ వీలుపడలేదు. పరిశ్రమకు నిర్మాతల అవసరం చాలా ఉంది. పైగా శ్రీమిత్ర చౌదరి, విజయ్ నాకు స్నేహితులు. చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించారు" అని అన్నారు. కుటుంబం గురించి మాట్లాడుతూ "మా పెద్దబ్బాయి రోషన్‌కి 'నిర్మలా కాన్వెంట్' తర్వాత నటన మీద ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం లాస్ ఏంజెల్స్‌లో యాక్టింగ్‌లో డిప్లమో చేస్తున్నాడు. ఇంకో అబ్బాయి రోహన్ కూడా ప్రస్తుతం త్రిభాషా చిత్రం చేస్తున్నాడు. అందులో ప్రభుదేవా కీలక పాత్రధారి. అమ్మాయి నేషనల్ లెవల్స్ బాస్కెట్ బాల్‌కి ఎంపికైంది. ఊహకి ప్రస్తుతం సినిమాల మీద ఆసక్తి లేదు" అని చెప్పారు.

దానికి.. వయసుతో పనేంటి?

- తమన్నా



"కొన్ని పనులు చేయడానికి మనసులో కోరిక ఉంటే చాలు. వయసుతో పనేంటి?" అని అంటున్నారు తమన్నా. ఈ మిల్కీ బ్యూటీకి దక్షిణాదిన ప్రస్తుతం చేతినిండా సినిమాలున్నాయి. ఈ మధ్య విక్రమ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రం 'స్కెచ్'. ఈ సినిమా పోస్టర్స్‌లో, ఫొటోల్లో ఆమె చీరకట్టుతో కనిపిస్తున్నారు. చీరకట్టు గురించి ఆమె మాట్లాడుతూ "చీర కట్టుకోవడానికి వయసుతో పని ఉండదు. కట్టుకోవాలనే కోరిక మాత్రం ఉంటే సరిపోతుంది. నా 16 ఏట నుంచి నేను చీరకట్టుకుంటున్నాను. ఇప్పటికీ ప్రత్యేక సందర్భాల కోసం చీరలనే ఎంపిక చేసుకుంటున్నాను. మహిళలకు చీర చూడముచ్చటగా ఉంటుంది. చీరకట్టును ఆస్వాదించగలిగితే సౌకర్యవంతంగానూ ఉంటుంది. వయసు మీద పడ్డవారే శారీలు కట్టుకుంటారని ఎవరైనా అనుకుంటే వాళ్లు భ్రమల్లో ఉన్నట్టే" అని చెప్పారు తమన్నా.

అడ్వెంచరస్ ట్రెక్కింగ్...


నేహ, శివ తాండేల్

శివ తాండేల్, నేహా దేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'వాడేనా'. సాయి సునీల్ నిమ్మల దర్శకుడు. మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మాతలు. కిరణ్ వెన్న సంగీతం అందించిన పాటల్ని బుధవారం ప్రసాద్స్ ప్రివ్యూ థియేటర్‌లో పాటల్ని విడుదల చేశారు. ఎన్.శంకర్ ఆడియో సీడీలను, రాజ్ కందుకూరి థియేట్రికల్ ట్రైలర్ ను ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "అడ్వెంచర్, ట్రెక్కింగ్ నేపథ్యంలో సాగే కథ ఇది. సెకెండ్ హాఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇందులో నాలుగు పాటలు రాసి కొరియోగ్రఫీ కూడా చేశా. నాకు నచ్చిన కొందరు దర్శకులు, టెక్నీషియన్ల స్ఫూర్తితో దర్శకుడిగా మారాను. అవుట్‌పుట్ చూశాక మంచి సినిమా తీశాననే నమ్మకం కలిగింది" అని అన్నారు. నిర్మాత ధృవ్ మాట్లాడుతూ.. "కిరణ్ వెన్న చక్కనిపాటలు అందించారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా క్వాలిటీగా సినిమా తీశాం" అని అన్నారు.

ప్రేమకథతో...


ప్రియాంక శర్మ

అవంతిక ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్న 'కార్తీక' చిత్రం టీజర్‌ను ఇటీవల దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. మచేందర్ నట్టాల నిర్మిస్తున్న ఈ చిత్రంలో విజయభాస్కరరెడ్డి, ప్రియాంక శర్మ, సింధు హీరోహీరోయిన్లు. కొత్త పరశురామ్ దర్శకుడు. సినిమా బాగా వచ్చిందనీ, త్వరలోనే ఆడియోను విడుదల చేస్తామనీ నిర్మాత చెప్పారు. 'ఈ సినిమాలో చిన్న పిల్ల పాత్ర ప్రధానంగా ఉంటుంది. బేబి వెన్నెల ఆ పాత్ర చేసింది. ప్రేమ ప్రధానాంశంగా రూపుదిద్దుకొన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. మా అందరికీ మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాం' అని దర్శకుడు చెప్పారు.

సుధీర్‌బాబు 'సమ్మోహనం'


అదితీరావు, సుధీర్‌బాబు

సుధీర్‌బాబు, అదితీరావు హైదరీ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి 'సమ్మోహనం' టైటిల్ ఖరారు చేశారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తోన్న సినిమా ఇది. గురువారం సాయంత్రం చిత్ర యూనిట్ టైటిల్‌ను ప్రకటించింది. దర్శకుడు మాట్లాడుతూ 'సమ్మోహనం అంటే మంత్రముగ్ధుల్ని చేసే ఒక అందమైన ఆకర్షణ. మ్యాజికల్ ఎట్రాక్షన్. ఇందులో హీరోహీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతో పాటు మిగతా పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు ప్రేక్షకుల్ని మెప్పిస్తాయి. నవతరం ప్రేమకథతోపాటు ఆద్యంతం హాస్యం, కుటుంబ బంధాలు, ఉద్వేగభరిత సన్నివేశాల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది" అని అన్నారు.